లొట్టపీసు పూలు

తెలంగాణ కథలు



శీలం భద్రయ్య

లొట్టపీసు పూలు

తెలంగాణ కథలు

శీలం భద్రయ్య

ISBN: 978-93-5566-456-3

978-93-5566-456-3

శీలం ప్రచురణలు

నల్గొండ

By Sheelam Bhadraiah

Lottapeesu Poolu

Telangana stories

తొలి ముద్రణ : జూలై 2021

రెండవ ముద్రణ : అక్టోబరు 2021

ప్రతులు : 1500

టైటిల్ & బుక్ సెట్టింగ్ : JayPee

వెల : రూ.లు 126/-

ప్రతులకు:

శ్రీమతి శీలం కరుణ

ఇంటి నెం : 8-1-510, ప్లాట్ నంబరు 25,

రైల్వే స్టేషను దగ్గర, పద్మావతి కాలని,

నల్గొండ పట్టణం, తెలంగాణ రాష్ట్రం, 508001

మొబైల్ నంబరు - 9885838288

e-mail: *badri.roses@gmail.com*

గమనిక : నవచేతన, నవోదయ, విశాలాంధ్ర మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.

ముద్రణ: **సాయిలిఖిత ప్రింటర్స్**

ఖైరతాబాద్, హైదరాబాద్- 500 004. ఫోన్: 7207045979

అక్షరాంకితం



భాష యాసను, బతుకు తరీకను

ప్రేమ, బాధ్యతతో నేర్పిన..

మా

అమ్మ – నాయిన

శ్రీమతి శీలం యాదమ్మ,

శ్రీ శీలం బుచ్చయ్య గారికి...అక్షరాంకితం.

सत्यमेव जयते

भारत के उपराष्ट्रपति

VICE-PRESIDENT OF INDIA

శ్రీ శీలం భద్రయ్య గారికి, నమస్తే

మీరు పంపించిన లొట్టపీసు పూలు పుస్తకాన్ని పరిశీలించాను. ఎంతో ఆనందం కలిగింది. తెలంగాణ ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతూ, చక్కని తెలంగాణ యాసలో ఈ పుస్తకాన్ని మీరు రాసిన తీరు అభినందనీయం.

ఇవాళ్టి మన సౌకర్యవంతమైన జీవనానికి కారణమైన, నాటి మహనీయుల జీవితాల గురించి యువత తెలుసుకోవాలన్నదే నా ఆకాంక్ష. లొట్టపీసు పూలు లాంటి పుస్తకాలు ఈ దిశగా యువతను ప్రేరేపించగలవు అని ఆశిస్తున్నాను. ఈ పుస్తకంలోని కొన్ని కథలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలాన్ని ఆవిష్కరించాయి. నాటి ప్రజల జీవన స్థితిగతులను వివరించాయి. వీటన్నింటి గురించి యువత తెలుసుకోవాలి.

తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయం, యాసల కలబోత అయిన ఈ పుస్తకాన్ని రాసిన మీ అభిరుచిని అభినందిస్తున్నాను. ఈ తరహా నేపథ్యంతో, యువతకు మన చరిత్రను తెలియజేసే విధంగా మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షిస్తున్నాను.

ముప్పవరపు వెంకయ్యనాయుడు

(ముప్పవరపు వెంకయ్యనాయుడు)

న్యూఢిల్లీ,

30 ఆగస్టు 2021.

RAMOJI
GROUP

రామోజీ రావు
చైర్మన్

18.09.2021

శ్రీ ఖద్రయ్య గారికి,

నమస్కారం.

మీ కలం నుంచి జాలువారిన 15 కథల్ని కూర్చి 'లొట్టపీసు పూలు' శీర్షికతో వెలువరించిన తెలంగాణ కథల సంకలనాన్ని ఎంతో అభిమానపూర్వకంగా నాతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు. తెలంగాణ సాయుధపోరాట నేపథ్యంతో కూడుకున్న ఇతివృత్తాలతోపాటు సమకాలీన మానవానుబంధాలకు, జీవన విధానానికి అద్దం పడుతూ మీరు రచించిన ఈ కథలు చిరకాలం పాఠకుల మన్ననలు పొందుతాయని ఆశిస్తున్నారు. మరెన్నో రచనలతో మీరు తెలంగాణ సాహితీ ప్రక్రియలో ఉన్నతశ్రేణి కథారచయితగా ప్రఖ్యాతి గడించాలని కోరుకుంటూ...

మీ

రామోజీరావు

రామోజీ ఫిలిం సిటీ, హైదరాబాద్-501 512. ఫోన్: 08415-246404, ఫ్యాక్స్: 08415-305016, ఇమెయిల్: ramojirao@ramojigroup.com

సినిమా మాధ్యమానికి అనుగుణ్యత కల్గిన కథలు లొట్టపీసు పూలు

శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసు పూలు" తెలంగాణ కథలలో 15 కథలున్నాయి. ఇవి ఆసక్తి కల్గించే నాటకీయతను, సినిమా మాధ్యమానికి అవసరమయ్యే చక్కని అనుగుణ్యతను కల్గి ఉన్నాయి. ఈ కథల్లో వాడిన " తెలంగాణ భాష, సామెతలు, సంస్కృతి, జీవన సౌందర్యం బాగున్నాయి. ఈ కథల్లో ఉన్న ప్రత్యేక లక్షణం కథా ప్రారంభాలు. ఇవి కథా గమనానికి సంబంధించిన సన్నివేశాన్ని సృష్టించే నాందీ ప్రస్తావనలా ఉంటాయి. "నాందీ, ప్రస్తావన, భరత వాక్యం" అనేవి నాటక లక్షణాలు. వీటిని ప్రాచీనకాలంలోనే భరతముని "నాట్యశాస్త్రం" లో పేర్కొన్నారు. ఇవి నేటికీ ప్రపంచస్థాయి ప్రామాణికతను కలిగి ఉన్నాయి. ఒక నాటకం ప్రదర్శించేటపుడు ప్రేక్షకుడిని తనవైపు లాక్కోడానికి, ఆసక్తిని కల్గించడానికి కథా ప్రదర్శన ప్రారంభానికి ముందు సూత్రదారుడు నాందీవాక్యం చెబుతాడు. నాందీ తరువాత ప్రదర్శించే సన్నివేశాలు, పాత్రలు ఆ నాందీవాక్యాన్ని సమర్థిస్తూ నాటకమంతా పరచుకుంటాయి. తద్వారా ప్రేక్షకుడు నాటకంలోకి సంలీనం చెందుతాడు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నవలా రచయితలు సైతం తమ రచనల్లో ఇదే సూత్రాన్ని పాటించారు. "హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్" చదివితే ఈ విషయం అర్థమవుతుంది. అరుంధతీరాయ్ రాసిన "గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్", షిడ్నీ షెల్డన్ "పాపులర్ నావెల్స్ , జేమ్స్ హార్లీ చేజ్ నవలల్లో, ఇయాన్ ఫ్లెమింగ్ "నెవర్ సే డై' లేదా "జేమ్స్ బాండ్" నవలలు చదివినా, "సన్నివేశం ఒక ఆసక్తికర వాక్యంతో ఆరంభమవుతుంది. కథా ప్రారంభాలతోనే పాఠకుల దృష్టిని తమవైపు మరల్చుకుంటారు. తరువాత పాఠకునికి ఆసక్తిని కొనసాగించడంలో నాటకీయత" (Dramatization)ను వాడుకుంటారు. మన తెలంగాణ కథల్లో జీవన సంఘర్షణ, బతుకులోని వైవిధ్యం, బహుముఖీయత, జీవన పోరాటం, ఆరాటం, తండ్లాట సహజంగా వ్యక్తమవుతాయి. "లొట్టపీసు పూలు"కథల్లో మొదటి కథ "ఇసపురుగు". మొదటి వాక్యం ఇలా మొదలవుతుంది. "పొద్దుగూకాల్ల నుండి కుండబోతగా, ఇద్వని వాన కురుస్తుంది. అద్దరాత్రి వానకు తెరిపి లేదు..." ఈ వాక్యంతోనే పాఠకుని మస్తిష్కంపై ఒక దృశ్యం పడుతుంది. ఈ వాక్యంతోనే కథ కాల నియమంతో బాటు అక్కడి ప్రకృతి అంతా దృశ్యమానమవుతుంది. కథా గమనమంతా ఈ మొదటి వాక్యానికి కొనసాగింపుగా నడుస్తుంది. ఈ కథ

చదువుతున్నప్పుడు "ప్రాకృతిక ధర్మాన్ని, మానవ జీవన సంఘర్షణకు సామ్యం" చూపించే విధంగా కథ నడుస్తుంది.

రెండవ కథ "కేంపు చెర్వు" లో ప్రారంభ వాక్యం ఇలా ఉంటుంది. "పశుపతులు, భూపతులు పోయి పెత్తనానికి జాగిర్ధార్లు, రుసుం దొరలొచ్చింద్రు. వాళ్ళు పైకం గట్టి ఊర్లను మనుషలను అంగడిల కొన్నట్టు కొంటరు...." ఇలా కథ ప్రారంభంతోనే నాందీవాక్యంలో చెప్పినట్టుగా "భూమికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధం, సంబధాలు, జమిందారులు, భూస్వాములు మధ్య జరుగుతున్న భూ సంఘర్షణ తాలూకు జీవన చిత్రాన్ని తాను ఈ కథలో చెప్పబోతున్నట్టు పాఠకునికి అర్ధమవుతుంది. ఇక్కడే ఒక కథకుని యొక్క పరిణితి తెలుస్తుంది. రచయిత తన మొదటి వాక్యంతోనే పాఠకుల కళ్ళు, రచయిత వేలు పట్టుకొని అక్షరాల వెంట పోయే "కథన శిల్పం" శీలం భద్రయ్య కథల్లో ఉంటుంది. "కర్తవ్యం"కథలో కూడా ఇలాంటి కథా ప్రారంభమే కనపడుతుంది. పాఠకుడి రెటీనా, అక్షరాలపై ప్రవహిస్తున్నప్పుడు, మెదడు కూడా వేవ్ లెంత్ ట్యూన్ అయి సన్నివేశాన్ని ఊహిస్తూ దృశ్యమానం జరుగుతుంది. కథపై ఏకాగ్రత కుదురుతుంది.

"లొట్టపీసు పూలు" పుస్తక శీర్షిక కథలో మొదటి వాక్యం "ఎల్లయ్య పంతులు ఊరికి పెద్ద మనిషి..." ఈ ఒక్క వాక్యంలోనే ఆ ఊరు సామాజిక, ఆర్ధిక, సాంస్కృతిక పరిస్థితులు మనకు అర్ధమవుతాయి. ఇలా ముందే ప్రారంభవాక్యంతోనే కథలోని విషయాన్ని సూచ్యార్ధంతో భావగర్భితంగా చెప్పే టెక్నిక్, మరియు అలతి అలతి పదాలను వాడి మనవైన జీవ పదాలతో రచయిత కథలను అద్భుతంగా రాశాడు.

తెలంగాణలో ప్రేమగా తిట్టుకునే అలవాటు ఉంది. "అగ్గువ బతుకులు" కథలో మొదటి వాక్యం ఇలా ఉంటుంది. " తూ...నీయమ్మ. చెప్తే ఇనక పోతివి. ఇగ నీ సావు గీడనే రాసి పెట్టుందే రాములా..?" ఇలా ఆరంభ వాక్యంతోనే కథపై ఆసక్తిని కలుగజేస్తాడు రచయిత. ప్రపంచ కథ, నవలా సాహిత్యంలో పాఠకులను కథలోకి పరిగెత్తించే ప్రసిద్ధి పొందిన ఈ టెక్నిక్ అసాధారణమైనది. ఇది ప్రఖ్యాత రచయిత అరవింద్ ఆడిగ "వైట్ టైగర్" లో కూడా కన్పిస్తుంది. ఈవిధంగా కథా రచనలో ఉత్తమ శైలి, టెక్నిక్ కలిగి దానికి తెలంగాణ బతుకు, తండ్లాట, పోరాటం, జీవం తోడైన కథలు "లొట్టపీసు పూలు". శీలం భద్రయ్యకు అభినందనలు.

- మామిడి హరి కృష్ణ

సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కార్యదర్శి, సాహిత్య అకాదమి

కథా క్రమం

అనుబంధం - వ్యాసాలు

ఇస పురుగు

పొద్దుగూకాల నుంచి కుండబోతగా ఇద్వని అన కురుస్తుంది. అద్దరాత్రి వానకు తెరిపిలేదు. నర్సమ్మ పసిబిడ్డనెత్తుకొని దబ్బదబ్బ ఇంట్లనుండి బయటికి నడిసింది. బిడ్డ తడవకుండా నెత్తిన కొప్పెర పెట్టింది. ఒళ్ళు తడుస్తున్నా లెక్కజేయక వడిగా అడుగులేసుకుంట దవాఖానకు బయల్దేరింది. నిండుపున్నమయినా మబ్బులువట్టి గూడెంనిండా శిమ్మసీకటి కమ్ముకుంది. సినుకు కాలం. ఆటంగా కురుస్తుందిఆన.

ఊరవతలున్న పెద్ద రాకాసి చింతచెట్టు దాటి ఉప్పలమ్మగుడి దాటింది. అట్నుంచి మడికట్లెంబడి ఒరాలపై నడుస్తుంది. కాళ్ళకిందగడ్డి సర్రున జారుతుంటే, 'అమ్మో బిడ్డా !" అనుకుంట చేతుల్నించి బిడ్డజారకుండ పైలంగ పొదివిపట్టుకుంది. ఒరాలపై ఒడుపుగా గబగబా అడుగులేస్తుంది. అడుగుల సప్పుడుకు ఒరాలపై ఉన్న ఇసపురుగులు, కప్పలు బురదమడిల గబుక్కున దుంకుతున్న నీళ్ళసప్పుడు ఇన్పడుతుంది. మడికట్లు దాటింది. దబ్బదబ్బ నడ్సుకుంట ఊరవతలున్న ఏటొడ్డుకాడికొచ్చింది. ఏటవతల నాలుగుమైళ్ళు పోతేగాని సర్కారు దవాఖాన రాదు. జెరమొచ్చిన బిడ్డను అందుల షరీక జేస్తందుకు ఆదరబాదరగ ఉరుకుతుంది. బాటే లేని ఆ గూడేనికి వైద్యుడేమొస్తడు.

***

వారం సంది ఏదో మాయరోగమొచ్చి గూడెమంతా ఏడజూసినా ఒకటే జెరాలు. ఆ రాకాసి జెరానికి పసిబిడ్డలంతా పిట్టల్లా రాలుతుండ్రు. రెండు దినాలసంది బిడ్డ మెతుకును ముడతలేదు. పొద్దుగాల్ల నుంచి ఆపకుండా ఒకటే ఏడ్పు. నర్సమ్మ తెలిసిన

వైద్యమంతా సేసింది. గూడేనికి ఆకువైద్యం చేసే బంగారన్న కాడికి సుత పోయింది. గూడెమంతా ఇదే కతనాయె. బంగారన్న ఏదో మందిచ్చినా జరం తగ్గలేదు. లతీబ్‌సాబ్‌కాడ మొగుల్ల మంత్రం ఏపిచ్చింది. గడియ గడియకు బిడ్డ తడారిన రోగమొచ్చిన జొన్నఎంటులాగ ఏలాడిపోతుండు. ఒళ్ళు సలసల కాలిపోతుంది.

ఇటుకబట్టి కాడొచ్చినట్టు ఒళ్ళు అగడు తగుల్తుంది. గిప్పుడయితే "బిడ్డా...! "అని పిల్చినా, ఏడ్చినా ఉలుకు లేదు. పలుకు లేదు. నర్సమ్మ ఎన్నులో వణుకు పుట్టింది. ఎమ్మట్నే పిలగాడ్ని తీసుకుని ఆసుపత్రికని ఆనల్నే బయల్దేరింది.

***

పొద్దుగాల నుంచి కురిసే ఆనతో ఏరు రువ్వడిగా ఆనాకాలం జోరుతో పొర్లుతుంది. ఏట్లో దుంకే నీళ్ళనూ, కండ్లెమ్మట కారే నీళ్ళనూ ఆపలేక చీకట్లోకి అప్పుడప్పుడు తన దుఖాన్ని గుమ్మరిస్తుంది. ఆ తల్లి గుండెదైర్నంపై నల్లటి ఆకాశం అప్పుడప్పుడూ ఉరుముతూ, భయంకరంగా పిడుగులను వానగా కురిపిస్తుంది. "ఈ ఆన పాడుగాను...నా ఎంటబడ్డది. నన్నిడిశేటట్టు లేదు" అని ఆనను తిట్టుకుంటుంది. ఏటి తానకు చేరింది. అది దర్లను కోత పెడ్తూ పొర్లుతుంది. ఆడ చూస్తే ఏరు దాటే ఎవ్వారం లేదు. ఏట్లె అడుగుపెడితే సాలు, మనిషి మాయమవుడు కాయం. అది ఎన్నడూ లేనంత రువ్వడుంది. చిన్నప్పట్నుండి ఏరు ఇంతగా పొర్లడం తానెప్పుడు చూడలె. అంతానలో కూడా నర్సమ్మకు దిగచెమటలు పట్టినై. ఏరు రువ్వడి చూసినంక నర్సమ్మ ఇంకా నీరయింది. మాటిమాటికి పిలగాడి నుదురుసూస్తుంది. అది సలసల కాల్తుంది.

గబుక్కున ఇస్త్రారి పెద్దయ్య యాదిలకొచ్చిండు. పెద్దయ్య ఏటివతల రాంబాయిపటేల్ బాయికాడ జీతగానిగా పన్జేస్తడు. పెద్దయ్య సాయంతోని ఏరు దాటుతనని ఆయన గుడిసెవైపుకు గబాగబా అంగలేసింది. చీకట్ల తిరుగుతున్న ఇసపురుగులు ఆమెకాళ్ళకు అడ్డం పడుతూనే ఉన్నయి. అలవాటయిన కాళ్ళు వాటిని దూరం తంతూనే ఉన్నై.

***

"తెల్లారితే దేసమంతా ససంత్ర సంబురాలు జర్పుతరు. ససంత్ర మొచ్చి

ఇన్నేల్లైంది. అయినా ఈగూడేనికి, ఈడి మడుసులకు తెల్వి రాకపాయే. ఇంక ససంత్రమెక్కడిది? తెల్లోడు పోయిండన్న మాటేగని తెల్వైన మనోడే మనల్ని బానిసల చేసి ఆడిస్తుండు. హు...కష్టమొకడిది. సుఖమొకడిది... ఛా...కాలం మారినా మనుషులు మారకపాయే గదరా?'....“ససంత్రం తెచ్చిన నెహ్రూనే గీల్లను మార్సలేకపాయే. గిప్పుడు గాయన బిడ్డొచ్చిందట, ఆడబిడ్డ! గామె జేస్తదా?””అనుకుంట గుడ్డెల్తుర్లో అన్నేయాన్ని,పాతరోజుల్ని నెమరేసుకుంటుండు ఇస్త్రారి పెద్దయ్య.

చుట్టపొగతో బాటు, మదిలనున్న మాటల్ని బయటకొదుల్తూ తనలో తనే గునుగుతుండు. గుడిసె తానకొచ్చిన నర్సమ్మ సెవినామాటలు పడ్డె.. పెద్దయ్య మాటినంగనే కొండంత దైర్నమొచ్చింది. పెద్దయ్య ఎట్టైన ఏటిని దాటిస్తడని,బిడ్డను కాపాడుకోవచ్చని ఆశ పుట్టింది.

***

ఇస్త్రారి పెద్దయ్యకు ఆ గూడేన మంచి పేరుంది. రజాకార్ల తుపాకులకు రొమ్ము సూపి, పోరుచేసి ససంత్రం తెచ్చినోడని ఇలువిస్తరు. ఇస్త్రారి పెద్దయ్యకొక కొడుకు. ఓ బిడ్డ. పెద్దమ్మ లొంగని మాయదారి జబ్బుతో కాలంజేసింది. కొందరు శర్తుబాటన్నరు. పాపం పుణ్యం దేవునికెర్కగని మంచిమనిషి మాయమైందని అందరు అనుకున్నరు. బాలెంల కాడ జరిగిన రజాకార్లపోరులో అయ్యతోబాటే పోయిన పెద్దయ్యకొడుకు ఆ పోరులోనే పోయిండు. ఆయన్న ఎదురొమ్ముకు చేటలు కట్టుకొని జంగుజేస్తే తూటాతగిలి జీవిడిశిండని అయ్య బతికున్నప్పుడు గాముచ్చట్లన్ని చెప్పేటోడు. పెద్దయ్య ఒక్కగానొక్కబిడ్డ పెండ్లికాకముందే బాయిలో దుంకి సచ్చింది. కారణమేందొ తెల్వదు. నడమంత్రాన ఆలిబిడ్డలను పోగొట్టుకున్నడు. ఇగో ఆడ్నించి పెద్దయ్య ఊరొదిలిండు. రాంబాయిపటేలు బాయికాడ పనికికుదిరి, నాలుగు తాటికమ్మలేసుకుని గొడ్డుగోదా చూసుకునే పనిల ఒంటరిగ బతుకుతుండు. బిడ్డ సచ్చిన పదేళ్ళకాడ్నించి మనసిరిగి ఏనాడు గూడేనికి రాలేదు. డెబ్బయి దాటినా మనిషి, మాటలెక్కనే గట్టి. మనసెంత మెతకనేది అయ్యచెప్పేది.

***

'పెద్దయ్యా...ఓ.. పెద్దయ్యా..ఉన్నావా !' అని గుడిసె దగ్గరకి వచ్చి పిల్సింది నర్సమ్మ. ఆ గుడిసెల చూస్తే అప్పుడప్పుడొచ్చే మెరుపులు తప్ప, అది పెద్దయ్య బతుకులెక్క ఎలుగు లేకుండుంది. లోపల్నుంచి పెద్దయ్య చిత్రబోతూ "ఎవలమ్మా! ఇయ్యాల్లప్పుడు పిలిసేది.ఎవలూ?.." అన్నడు. పెద్దయ్య గుడిసెనుండి బయటకొచ్చి జూసిండు. చూపు ఆననట్టు నుదిటిమీద చేయిపెట్టి జూసిండు. ఆకాసం మెరిసినప్పుడు ఎవలో ఆడమనిషి బిడ్డనెత్తుకున్న నిశానా గనపడింది.

"పెద్దయ్యా ! నేను... పెద్దయ్యా ! గండికోట శంకరయ్య బిడ్డను...." "అయ్యో బిడ్డా నువ్వా ! ఏం కష్టమొచ్చే తల్లీ.. ! ఈయాల్లప్పుడు వచ్చినవ్" అనంగనే, అప్పటిదాక అదుముకున్న దుఖం నర్సమ్మకు ఒక్కసారిగా కంటికి వరదై పొంగింది." ఊకో బిడ్డా !జర నిమ్మలపడు .. మా తల్లి కదా, ఏమైందో ముందుగాల జెప్పు. ఏడ్వకు నిమ్మలబడు" ఊకుంచిండు పెద్దయ్య.

"కారే ముక్కుతీసి దూరంగా ఏసి, చీర కొంగుతో తుడుసుకొని, "పిలగానికి ఇడవకుండా రెండ్రోజుల నుంచి జెరం తగ్గుతలేదు పెద్దయ్యా, గిప్పుడయితే ఉలుకు లేదు పలుకు లేదు. ఏటవతల దవఖానకి జల్ది పోవాల. ఏరు చూస్తే రువ్వడిగ పోతుంది. ఎట్ల దాటాల్నో తెల్వక ఇటొచ్చినంది" నర్సమ్మ. పెద్దయ్యకు సంగతర్థమై "ఆన ఎక్కువయితుంది. మొదగాల గుడిసెలకు రా బిడ్డా!"అన్నడు. పిలగాడ్ని నులక మంచంపైన పండబెట్టి నుదురు, నాడి జూసిండు. పిలగాడిపై గొంగడి కప్పి గుడిసె బయటకు ఒక్క అంగలో ఉరికిండు. వానలో తడుసుకుంటబోయి దబ్బున తిరిగొచ్చిండు. చేతిలో ఏదో ఆకుపసరు పిండుకుంటొచ్చి, గుడిసెలో సూరుకున్న సిలక్కొయ్యకు కట్టిన మూలికలల్ల ఒకటి తీసి పసరుతో కలిపి పిలగాడికి తాపిచ్చిండు.

ఇస్తారి పెద్దయ్యను చిన్నప్పటినుంచి చూస్తున్నది గని, వైద్యం తెలుసని నర్సమ్మకు తెల్వదు. పిలగాడికి జెరం తగ్గుద్దన్న ఆశ గూడ కలిగింది. పెద్దయ్య నిమ్మలపడమని చెప్పి ఉట్టిముంతలో ఉన్న జొన్నగటక తీసి "తాగుబిడ్డా..అని.." నర్సమ్మకిచ్చిండు. నర్సమ్మ ''వద్దని'' అన్నా, పావురంతో ''తాగు బిడ్డా!.. పిలగాడికి తగ్గుతదిలే..గాబరాపడకు" దైర్నం చెప్పిండు. అరచేతిల ఎన్న బెట్టుకొని నేతికేడ్సినట్టు"

ఊరంతా తిరిగింది. నాటు వైద్యం పెద్దయ్యకు తెలుసని నాయిన తనకెన్నడన్న చెప్పకబాయే అని ఆలోచనల పడ్డది.

***

నర్సమ్మ మొకంల గాబరా తగ్గిద్దామని పెద్దయ్య ముచ్చట మొదలెట్టిండు. "రజాకార్లతో పోరు చేస్తున్నప్పుడు అడవిలో ఉండగ నేర్చుకున్న బిడ్డా ! ఈ నాటు వైద్యం.' చిన్ననాటి నుంచి మీనాయిన నేను అన్నదమ్ములోలె కలిసున్నం. తమ్ముడు అపత్కి సాపత్కి ఉండేటోడు. నీ పిలగానికి కష్టమొస్తే నాకొచ్చినట్టే బిడ్డా. నాపానం అడ్డమేసైన నీ పిలగాడ్ని కాపాడుతగని పరేశానుగాకు' అన్నడు. పెద్దయ్య మాటలతోటి కొంత మది నిమ్మలమైంది నర్సమ్మకు. అర గడియలో పిలగాడికి జెరం పురాగ తగ్గింది. ఒళ్ళంతా సల్లగ చెమటలు కారినై. పిలగాడు కండ్లు తెరిసిండు. ఆకాసం తేటగయ్యింది. బయట పిండోలె ఎన్నెల కాస్తుంది.

"ఇక నేను పోత పెద్దయ్య!" అని దండంబెట్టి, ఆడ్నించి ఇంటిబాట పట్టింది. ఆపతినుంచి బయట పడేసిన పెద్దయ్యకు మనసునిండా దారంతా దండాలు పెడుతూనే ఉంది. ఏటిపక్క పొంటి నడుస్తుంటే, ఏటి నీళ్ళపై పడ్డ ఎన్నెల ఆమె ముఖంపైపడి తెల్లగ మెరుస్తుంది.

***

నర్సమ్మ మొగనిపేరు సైదులు. నర్సమ్మ లగ్గమయినంక ఏడాదిన్నరకి నీళ్ళు బోసుకుంది. దోసపండంటి కొడుకు పుట్టిండు. పిలగాడు పుట్టినాక సైదులుకు ఆలోచన పెరిగింది. "మనకు గంటెడు భూమి లేకపాయె. ఇద్దరికి తోడు ఇంకోలయింద్రు. పావులో పర్కో సంపాయిత్తని" నర్సమ్మకుచెప్పి మస్కట్కి బోయిండు సైదులు. మూడేల్లయింది. బోకరుగాని మాటలు నమ్మి,మస్కటుకు పోయినంక శానాళ్ళు పనిలేక ఆగమయిండు. ఆకరికి అదేగూడేనికి చెందిన పెద్దమ్మకొడుకు శేఖరం ఒంటెల్ని చూసుకునే పనిల జీతానికి పెట్టిండు. ఆ పనిలకూడా తక్కువ పైకమొస్తుందని లబోదిబోమనె సైదులు. "నువ్వు పోవడానికి అప్పుకు తెస్తిమి. వచ్చిన పైకం మిత్తికట్టడానికి సరిపోతల్లేవ్, అదెపాయె ఈడ్నే ఏదన్నా పని చేసుకుని బతుకుదాం

రారాదయ్యా ! ” అని నరసమ్మ మొత్తుకున్నా, సెవినపెట్టలేదు సైదులు. ఈ మధ్యే "మంచి జీతానికి,ఇంకోపనికి కుదిర్నని” చెప్పిండు.

***

ఏమైందో ఏమోగని నెలరోజుల్నించి సైదులుకాంచి కబురులేదు. నర్సమ్మకు మొగుడు కండ్లల్లమెదలి మదిల గుబులు పట్టింది. ఈమద్యే మస్కట్ నుండి వచ్చిన శేఖరం కబురు సెప్పిండు. అక్కడేదో దొంగతనం నెపంయేసి సైదులును ఖైదు చేసింర్రని. ఇల్లు సిన్నబోయింది. డీలాబడ్డ నర్సమ్మకు ఏంజేయాల్నో తెల్వక దినాం బువ్వబుగ్గిలేక కొడుకునుబట్టుకొని ఏడుస్తుంది. మనసు నిమ్మలం లేదు. చుట్టుపక్కలమ్మలక్కలు ఊకుంచినా ఆగుతలేదు. శేఖరానికి ఆ ముచ్చట తెల్సింది. నర్సమ్మ ఇంటికొచ్చి నిమ్మలపరిసే మాట చెప్పిండు.” పైసలు ఖర్చుబెడితే బయటకు తీసుకురావచ్చని,పైకం సిద్ధం చేయమన్నడు”. నర్సమ్మకు కొంత దైర్నమొచ్చింది. ఎట్టనన్న పైసలు జేసి సైదులుని ఇడిపించాలని గట్టిగనుకుంది. శేఖరానికి పైసలు ఉపాయంచేస్తనని చెప్పింది.

***

యాడడిగినా పైకం పుడతలేదు. డబ్బులెట్లా జేయాల్నో తెలవక కాల్జేయి ఆడుతల్లేదు నర్సమ్మకు. శేఖరం గూడ మస్కట్కి పోయేరోజు దగ్గరబడ్డది.” నర్సక్కా గంత పైకం గావాలంటే నోట్లె తడిలేనోల్లం. మనదగ్గరెక్కడియక్కా? గా..నారాయణ పటేల్ కాళ్ళు పట్టుకుంటేనే పనైతది” ఉపాయం చెప్పింది గంగమ్మ. అననైతే అన్నది గని, నర్సక్క వాన్ని డబ్బులడగడం గంగమ్మకు కూడా సుతారమిష్టం లేదు. చుట్టూ పదిగూడేలల్ల నారాయణపటేల్ కండ్లబడ్డాడది తప్పించుకున్నది లేనేలేదని అందరనుకుంటరు. మొగుడి ముందే పెళ్ళాన్ని చెరబట్టే నీచుడు. ఆనికెదురు బోతే పీనిగ కూడా మాయంజేస్తడని అందరంటరు. గంగమ్మ చెప్పిన ముచ్చటిన్న నర్సమ్మ బెదిరిపోయింది. వాడిని తలుచుకోంగనే తోడేలు కలలకొచ్చిన మేక పిల్లోలె గజగజ వణికింది. ఆలోచనలో పడ్డ నర్సక్కను జూసి గంగమ్మ, “అక్కా బావను బయటకుతేవాల్నంటే, ఆడికాడకి పోక తప్పదనేసరికి”, నారాయణ్పటేల్ గడప తొక్కక తప్పలేదు నర్సమ్మకు.

నర్సమ్మ కులానికేమోగని, నియతికి తక్కువగాదు. అందానికసలే మందారపువ్వుకు తీసిపోదు. సైదులుతో మనువు ఖాయంకాక ముందే, చివ్వెంల కాంచి ఎదురుకట్నం మిస్తమనొచ్చిన్రు. మగదిక్కు లేని సంసారం. అయినోడని అవ్వసైదులుకిచ్చిచేసింది. సైదులు మంచి ఆజంకల్లోడు. నర్సమ్మకు కూడా నచ్చిండు. మొగుడు మస్కట్కిపోయినంక ఆమెకు గుడిసిచ్చిన రక్షణ మనుసులియ్యలేక పోయిండ్రు. మానవతోడేళ్ళనుండి మాటపదునుతో మానం కాపాడుకుంటుంది.

***

నారాయణపటేల్ మంచోడుకాదు. ఆడుచూపులకు ముల్లేసుకుని సూస్తడు. వాని కళ్ళు వేటకుక్కల్లెక్క ఆకలికి సొంగకారుస్తయి. పెండ్లాన్ని అనుమానంతో సంపిండు. వాయివరసలు వదిలేసి ఊరుమీద ఆంబోతులెక్క పడ్డడు. వాని దగ్గరకు ఎంతవసరమున్నా తెలివున్న ఏ ఆడదిపోదు. గిప్పుడు అప్పుపైసలకు ఆ పటేలు తానకుపోయి వానివలలో చిక్కుకోబోతుంది. నర్సమ్మను చూడంగనే పటేల్ ముఖంలో ఇసపునవ్వు మెరిసింది. "ఏందే నర్సమ్మా గిట్టొచ్చినవ్ .." అడిగిండు నారాయణ్ పటేల్. "అప్పుకు పైసల్ కావాలె పటేలా" అడిగింది నర్సమ్మ. "దేనికే అని.." అడిగిన పటేల్కు నిజమేచెప్పింది. నర్సమ్మ అవసరం పటేల్కు అర్థమైంది. ఆకలున్నపెద్దపులికి అలిసిపోయిన జింక దొరికినట్టు "బకాయి ఎట్లా తీరుస్తావో..?" చెప్పమని అడిగిండు. నర్సమ్మ నోట మాట రాకముందే "ఇయ్యాల పొద్దుగుంజాల బాయికాడికొచ్చి పట్టుకబో.." అన్నడు.

పటేల్ కండ్లల్ల ఆశ, బాయికాడకు పిలిశిన మతలబుకని, నిప్పుల మీద కూసున్నట్టనిపించి ఆడ్నించి గబగబా బయటకునడ్సింది నర్సమ్మ. మొగడిని జైలు నుంచి ఇడిపించాలన్నా, తిరిగిగూడేనికి తీసుకురావాలన్నా పైసల్ కావాలి. వేరే దారిలేదు. వెనుకకు బోయి పటేల్తో "పొద్దుగుంజాల బాయికాడికి వస్తగని, పైసలు చూడుపటేలా" అంది.

నర్సమ్మకు పొద్దుగుంజాల పటేల్తానికి పైసలకు పోవాలంటే మనసొప్పుతలేదు. అట్లని సైదులుకు అన్నేలం జేయబుద్దికాట్లేదు. "మానం పోయినంక మడిసికి పానం

ఎందుకని” అనుకుంది. ఏదైతే గదే అయితదని మనసుగట్టిచేసుకొంది. అందంగ తయారయి నారాయణపటేల్ బాయికాడికి అడుగులేసింది.

***

పొద్దుగాల్ల పాలుపిండేటాల్లకు ఊరిబయటున్న నారాయణపటేల్ బాయికాడికి జనాలంతా ఆదలబాదల ఉరుకుతుంద్రు. గంగమ్మ ఇంటిబయట ఆకిట్లసాన్పి జల్లుతుంది. నారాయణపటేల్ బాయికాంచివచ్చే సిద్దన్నను ఆపింది గంగమ్మ. “ఏమయిందన్నా! జనంగట్ల ఎగబడి పోతుంద్రు యాడికి” అడిగింది. నీకు తెల్వదా?నారాయణపటేల్‌కు ఇసపురుగు కరిసి, నోటినిండ నురగలు కక్కుకుంట సచ్చిండట” అన్నడు సిద్దన్న. “ఊరికిపట్టిన పీడబోయింది. ‘ఇసపురుగు, ఇసపురుగు కాటుతోనే బోయిండ”ని గంగమ్మ మనుసుననుకుంది. గంగమ్మ కసికి కూడా కారణం ఉంది.

***

ఆగూడెనికిపట్టిన శనిగాడు నారాయణపటేల్ సచ్చిండు. దాంతో పెద్దయ్యకు సంబురమయింది. తనబిడ్డతోబాటు ఎందరోఆడబిడ్డలను బలిమిచేసి, ఆళ్ళచావుకు కారణమయిండు నారాయణపటేల్. నాటువైద్యం తెలిసిన పెద్దయ్య కాడికి నర్సమ్మబోయి గోడు యెల్లబొసుకుంది. పెద్దయ్యకు నర్సమ్మ మొకంల తనబిడ్డ కనబడింది. ఇసపురుగుకు“ఇసముష్టి”చెట్టువేరు బదలాయిచ్చి వాజీబు సేసిండు పెద్దయ్య. మనిషికాటుకు మందులేదు. పెద్దయ్య వైద్యానికి తిరుగులేదు. ఇసపురుగుకాటు మర్మం ఆల్లిద్దరికి తప్ప మూడోకంటికి తెల్వదు.

కొన్నాళ్ళకు సైదులు మస్కట్నుంచొచ్చిండు. రాంగనే నర్సమ్మ జరిగిన ముచ్చటంతా చెప్పింది. ఆలుమగలు పెద్దయ్యకాడికిపోయి కాళ్ళు మొక్కిను. పెద్దయ్యను తమతోబాటే తీసుకొని గూడేనికి పయనమయింద్రు. దేవుడిచ్చిన బిడ్డ నర్సమ్మనుకుని పెద్దయ్యకూడా వాళ్ళతోనడిసిండు.

వెలుగు – దర్వాజ, 23.05.2021

కేంపు చెర్వు

పశుపతులు, భూపతులుపోయి పెత్తనానికి జాగిర్దార్లు, రుసుం దొరలొచ్చిండ్రు. వాల్లు పైకంగట్టి ఊర్లను, మనుషులను అంగడిలకొన్నట్టు కొంటరు. దాంతో భూమి, మనుసులు ఆళ్ళ సొంతమవుతరు. భూమిపై లేబిగల్ల, మనుసుల నుండి వెట్టిసాకిరి వసూలు చేసెటోల్లు. ఆడ.. మనుషుల ఆకలి కడుపులో కాదు, వాళ్ళ కండ్లల్లో ఉండేది. కష్టానికొచ్చే కూలికంటే కడుపుకయ్యే ఆకలెక్కువ. సేన్లల్ల కూలిజేసినంక జల్లలపడ్డ గింజలు, తట్టికెప్పుడూ సరిపోవు. అది బిచ్చపు బతుకు. పీనిగను పీడించుకతినే రాబందులుండే ఊరుకథే ఇది.

***

ఊరంతా కొత్తలు పెడుతుండ్రు. నర్సమ్మ పొద్దుపొడవక మునుపేలేసి ఆకిలుడ్సి, సాన్పిచల్లి, ఇండ్లలికి ముగ్గుబెట్టింది. మొగుడు ఇస్తారి గొడ్డుగోద కడిగిండు. ఇంట్లె పిల్లపెద్ద తలమీంచి తానాలు జేసిండ్రు. ఏరాండ్లతో నర్సమ్మ రోటికాడికి జేరి రోలుకడిగి, రోలు చుట్టూ జాజుతో అలికి,రోకలిని కడిగి బొట్లు బుదించి,ముగ్గువెట్టింది. రోట్లో కొత్తొడ్లు బోసి ఏరాండ్లతో దంచుకుంట నరసమ్మ పాటందుకుంది...

"కొత్తొడ్ల బియ్యమ్ము ....కోడి మాంసమ్ము
కోమాటి ఎంకయ్య ....మా ఇంట్లే ఇందు
పాతొడ్ల బియ్యమ్ము...పంది మాంసమ్ము

బాపని నర్సయ్య ......మా ఇంట్లే ఇందు
ఎర్రటి అన్నలకు....... ఎత్తు భుజాలందం
ఎత్తు భుజాల మీద ....ఎర్రని దుప్పటందం....."

అని పాడుకుంట వడ్లు దంచుతుంది. దంచినంక ఆ కొత్తొడ్ల బియ్యంతో బువ్వొండి దాంతోబాటు నీసుకూరొండి పెద్దలకు, దేవతలకు నీల్లారబోసి పెడతరు. ఎప్పటితీర్గనే మాదిగమల్లన్నిచ్చె కొత్తొడ్లు బర్కతని ఆఊరంతా ఆయన తానకు పోతరు. అయ్యాల మల్లన్నిచ్చె పిడికెడొడ్లు తీసుకొచ్చి ఎవ్వలిగుమ్మిల వాళ్ళు బోసుకుంటరు.

దినాం పజ్జొన్నగటకతాగే పిల్లగాండ్లంతా,అయ్యాల వడ్లబువ్వ కడుపార తింటమని ఎదురుజూసుకుంట కుశాలుగ బయటాడుకుంటుండ్రు.ఆళ్ళ మనసంతా ఆటమీదకంటే అవ్వొండే తియ్యటి బువ్వ మీదుంది.ఇంట్లె పొయ్యిమీద ఎసరు సలసల కాగుతుంది.పొయ్యికింద నిప్పుల ఏడి, పిల్లగాల్ల ఆకలోలె ఆరకుంట మండుతుంది.ఇంట్లే కూరాడుకు కొత్త కలొచ్చింది.అది కొత్తగంజినీళ్ళు కలుస్తయని సంబురపడుతుంది.పోరగాండ్ల ఆకలిజూసి అమ్మల చేతులల్ల రోకల్లు జోరుపెంచినై. "హుస్...హుస్" అనుకుంట,కష్టం తెలవకుండ పాటపాడ్తు పాటకు దరువులాగ రోకటి పోటేస్తుండ్రు.

అయ్యాల ఒక్కో రోలులో ఒక్కో రకం వడ్లు దంగుతున్నై. ఎర్రగా ఉండే మైలసన్నలు,సారకలున్న గంట మొలకలు,పొట్టిగుండే పొట్టొడ్లు రోలు నిండుగున్నై. అయి ఏడాదికోపాలి వాళ్ళ ఆకలి తీర్చటాన్కి ఒచ్చినట్టు రోకటి పోటును ఆనందంగా ఓర్సుకుంటున్నై.అవి అమ్మలక్కల పాటల గొంతుకు రోటిలో ఎగిరెగిరిపడుతున్నాయో, వాళ్ళచేతుల రోకటి దెబ్బలకు తట్టుకోలేక ఎగురుతున్నాయో, దెబ్బదెబ్బకు మసకలుబోయి వాటికి తెల్లని అందమొస్తుంది పిల్లల ముఖాల్లో సంబురంలాగ.

***

సాకలి రాములు పెండ్లాం రామక్క ఆత్రంగ ఉరుక్కుంటొచ్చి "నర్సక్కా! ...ఓ నర్సక్కా...!" ఎగబోస్తూ ఆడ్నించే పిల్సుకుంటొచ్చింది. రోకటి దంచుడు ఆపి నరసమ్మ ...! "ఏందే రాములమ్మ! అంత వడిగొచ్చినవ్,ఒగరుస్తున్నవ్.. ఏందే

ముచ్చట?” అంది చిత్రబోతూ !.రాములమ్మ అలిపిరి తీసుకుంట,మొకం నిండా భయంతో “నర్సక్కా...హ..,ఊరవతల కేంపు ఏశ్రిను ...!” వస్తున్న ఆయాసానికి దమ్ముతీసుకుంది.అప్పటిదాంకున్న ఆనందం “గాలికి ఒడ్ల పొట్టులాగ” అందరిలో ఎగిరిపోయింది.

కండ్లముందు అందరికీ గతం గుర్తొచ్చింది. ఒక్కసారిగ గడగడ వణికిపోయిన్రు. “ఆ ముదనాష్టపోళ్లు మల్లొచ్చిన్రా యేం! వాళ్ళ దౌడలు దగ్గర పడ!రజాకార్లొచ్చిన్రంటే వయసుమీదున్న మగపోరగాళ్ళను,సమర్తాడిన ఆడపిల్లలను,చీరకొంగులల్ల పానాలు అడ్డేసేటోల్లు.కోడిపిల్లల్ని ఏడ్సించో చూసి గద్దలెత్తుకుపోయినట్టు,రాబందుల్లాంటి రజాకార్లు ఎత్తుకుబోయేటోల్లు. ఒడ్డు పొడవున్న మగపోరగాళ్ళను చెట్లకుకట్టేసి తుపాకితో కాల్చిచంపేటోల్లు. ఆడపిల్లల్ని చెరిచేటోళ్ళు. ఇదేమనడిగితే చిత్రహింసల రుచిచూపే టోళ్ళు”. నర్సక్క నోట బాధ,భయం,అనుభవం మాటలుగా బయటపడ్డై.రజాకార్లవల్ల ఆఊర్లె, గాయపడని ఇల్లు లేదు.దెబ్బతినని మనిషి లేడు.అసుంటి రాక్షసుల కేంపు కాడికి పోవడానికి ఎవలుమాత్రం దైర్నంజేస్తరు?

నర్సక్కకు ఇద్దరుకొడుకులుంటే ఒకడు రజాకార్లచేతుల్లోనే పోయిండు. మనుండిన శివుడు మనుసుల్ల లేడు. జంగల్‌కు పోయిండన్నరు. ఇగ ఉన్న బిడ్డను ఉన్నూరికే ఇచ్చింది. పండుగకో పబ్బానికో ఆబిడ్డ ఇంటికి వస్తది.

గతంల కూడా రజాకార్లు ఆ ఊరిబయట ఎన్నోమాట్లు కేంపులేసిండ్రు. కమ్యునిస్టులుకూడా కేంపు ఏసిండ్రు. ఆడ కేంపు ఏసిన ప్రతి తేపా ఏటిలో రక్తంబారేది. ఊళ్లో కన్నీటేర్లు పొంగేయి. రజాకార్ల కేంపుపడ్డ ప్రతితేప నరకాసురునికి బలైనట్టు ఈడు మీదున్న ఆడ,మగపోరగాల్లు బలయ్యేది. ‘గిప్పుడు ససంత్రమొచ్చింది కదా,ఎవలేసిండ్రు అంటావ్ పిచ్చన్న.. కేంపు ?’ అడిగింది నర్సమ్మ.

కమ్మరోల్ల పిచ్చన్న ఆ కండ్లతోటే రజాకార్ల దాష్టికాలు చూసి, ఆల్లు కొట్టినదెబ్బలకు నులకమంచం సమస్తంగా, సత్తువలేక ఎముకలగూడుతో బతకలేక, సావలేక సబూతులా ఉండు.

***

కేంపు ఎవ్వారమేందో తెల్సుకోవాలని అందరుకల్సి పొద్దుగుంజాల కులపెద్దలను

మర్యాదకు పిలిసింఁడ్రు. దావతు ఏర్పాటు జేసింఁడ్రు. దొరకాడికి కులపెద్దలే పోవాలె. వేరేటోల్లు పోవడానికి లేదు. ఆల్ల కోసంకాసిన ఇరవై రెండు జాడిల ఇప్పసార అంతదూరంల కమ్మగాసనొస్తుంది. రెండొందల కడువల కల్లు తెల్లటినురగలు కక్కుతుంది. పదిపొట్టేళ్లకూర పొయ్యిమీద గుమగుమ లాడుతుంది. దావతయినంక అసలుసంగతి జెప్పి, అయ్యా ఎట్టనన్న దొర కాడ్కి ఈ ముచ్చట తీసుకుపోయి మాకష్టం తీర్చుండయ్యా అన్నరు. అంతే గదా, కష్టమొస్తే ఎక్కువతక్కువలు ఏడుంటై. ఒక్కటయ్యేది గప్పుడే,బాధలన్నీ మరిసేది మరిపించేది గా కులమర్యాదే. కులపెద్దలు తాగినరు. కడుపునిండా తిన్నరు. రేప్పొద్దున కబురుసేస్తమని జెప్పిపోయింఁడ్రు.

ఆ రాత్రి ఊరంతా జనానికి బువ్వతో బాటు, పండగ సంబురం, కంటిమీద నిద్దురకరువైంది. కేంపుదేనికిబడ్డదో తెల్వక ఒక్కోలుఒక్కోతీర్గ అనుకుంటున్నరు. కమ్యునిస్టులు కేంపు ఏసిన్రని కొందరు, లేదు మల్లా రజాకార్ల రాజ్జెమొచ్చెనని కొందరు అనుకుంట అయ్యాల ఎవలూ నిద్రలుపోలేదు. కేంపు దిక్కుపోయే దైర్నం ఎవలూ చేయలే. వయసు మీదున్న పోరగాళ్ళను గంపకింద కోడిని కమ్మినట్టుకమ్మి కళ్ళల్లో ఒత్తులేసుకొని నిద్రలుగాసింఁడ్రు.

***

కండ్ల మీద తెల్లారింది.బువ్వాల్లకు పనులన్నీ బంజేసి బోడ్రాయికాడికి ఊరంతా ఒచ్చింది. కాని పెద్దమనుసులు ఇంకారాలేదు. ఊరిజనాల శిత్తం శంకిస్తుంది. “అడుగబోయినోల్లను దొర ఏమన్నాజేసిండా?ఆళ్ళ పీనుగలన్నా దొరుకుతయో లేదోనని’ గుబులు చెందుతుంఁడ్రు. ఇంతట్లే పెద్దమనుషులు రానే వచ్చింఁడ్రు. జనం కొంత తేలికపడ్డరు. పెద్దమనుషులు నిమ్మలంగ వచ్చింఁడ్రంటే మంచి ముచ్చట తెచ్చి ఉ ంటరని ఆశపడ్తుంఁడ్రు.

‘‘ఈడ కాలువకు కతువ కడతరట.దానికే ఆడ కేంపేసిన్రు.అయితే మరొకముచ్చట. ఈ కతువకడితే మనూరుతో బాటుగ ఇంకా పదహారూర్లు నీళ్ళల్ల బోతై. కాబట్టి మనందరం జల్ది ఈజాగ కాల్జేసిపోవాలెనని ప్రభుత్వం హుకుంజారిజేసిందని దొరజెప్పిండన్నరు”. సావుకబురు సల్లగ చెప్పింఁడ్రని అందరు గుబులు పట్టింఁడ్రు. అందరి కండ్లు బైర్లు కమ్మినై.

అప్పుడే ఆడకొచ్చిన డెబ్బైఏళ్ళ ముత్తమ్మ, “ఈళ్ళ మీద మన్నుబడ. మన

బతుకుమనల్ని బతకనిస్తల్లేరు...పున్దాకోరు ముండాకొడుకుల"'ని తిడుతుంది. ముసల్దింకా ఆడ కేంపుఏసింది రజాకార్లనే అనుకుంటుంది. చెప్పాలనిపించలె అక్కడేవరికి. ఎవలి దుఖం వాళ్ళది. "రజాకార్లంత కష్టపెట్టనే ఏడపోవాల్నో తెల్వకజనం ఈడ్నే జీవిడిశిర్ను" గిప్పుడేడ పోవాలె..మా బతుకులేందిరా భగమంతుడా ! అని అనుకుంట పైకి మొక్కుతుంర్రు." బానిసల గోడు దేవుడెక్కడ ఇన్నడని, ఇక్కడ ఇనడానికి" ఈరయ్య అన్నడు. పిడికిళ్ళు బిగించుకున్నె. ఇంతట్లనే పెండ్లాంపిల్లలు, గొడ్డు గోదా మదిల మెరిసి చల్లబడ్డె.

ఆడున్నోళ్ళ కండ్లల్ల జీవకల సచ్చిపోయింది. పావురంగా సాదుకున్న గొడ్డుగోదా ఆగమైతై. చెట్టూ,మట్టీ,పుట్టా అంతా ఇడిచిపెట్టిపోవాల్సిందేనా? ఈడ రుడం తీరిపోయిందా. ఈ నేలె బలం,బతుకనుకున్నం. కాని గిప్పుడిట్లాయెనని కుడుగ్గ పట్టింర్రు జనాలు. "ఇన్నాళ్ళు ఈఇలాకాలో ఎవలెన్ని బాధలుపెట్టినా పడ్డం. ఎందుకంటే ఈడనే పుట్టినం, ఈడనే చస్తమని అనుకున్నం. ఈడ ముందు సచ్చినోల్లె భాగ్యమంతులు. పుట్టినకాడనే సచ్చే అదృష్టం మాకు లేదాయే. మనుండి చేసేదేముంది. సర్కారుకి ఎదురుబోతమా? పోలేం. ఇక మనరెక్కలకష్టం గంగపాలయినట్టే. మనబిడ్డలనోట్లె మన్నువడ్డట్టే. సేసినకష్టం అక్కరకు రాదాయే. ఇన్నాళ్ళు ఆల్లతో నెగల్లేక పోయినం. గిప్పుడు గీల్లతో ఏగాల్నా" అనుకుంట నెత్తి మీద చేతులేసుకున్నడు యాదయ్య.

"మన అయ్యలు సంపాయించిన వందలెకరాలేమన్న బోతున్నయారా? మన ఆస్తులేమున్నయిరా? గట్టయిర్రంతా..ఇగ లేండి. తలోదిక్కు పోదాం. మన బతుకెట్టుంటే గట్టనే అయితది. "చెట్టుకిసిరిన రాయికి పిట్టలోలిగ ఎగిరి తలోదిక్కూ పోదమని" సాకలీరయ్యన్నడు. ఎదురుతిరిగి కొట్లాడికొట్లాడి అలసిపోయి సర్వంకోల్పోయినోళ్లకు సత్తువేడుంది? ఆల్ల గొంతుల మాటను ఆకలి ఏనాడో మింగేసింది. భాగ్యమనుకున్న ఏరుగిప్పుడు బిడ్డలనోటికాడ బువ్వను మింగింది" సాకలీరయ్యన్నడు.

***

"ఇయ్యాల పొద్దుగుంకాల మొగోల్లంతా సావాట్లకాడికి రావాలహో.." అంటూ

ఎల్లన్న ఊరంతా డప్పుసాటింపు ఏస్తుండు. ఎప్పటిలాగే సాటింపున్నా... ఊరంతటికీ అది "చావుడప్పులా" ఇన్పిస్తుంది. అదేది తెల్వని పిల్లగాండ్లంత ఎల్లన్న కొట్టే డప్పు చిటికె ఎనుక జోరుగ అడుగులేస్తూ ఎల్లన్నతోబాటే నడుస్తుండ్రు. "ఎల్లన్న ఇగురంగ చెప్పమని"బక్కమ్మ అడిగింది. 'నాకు తెల్వదు... దొర గంతే చెప్పిండన్నడు"ఎల్లన్న. ఊరుజనాల కండ్లల్ల అవుసు పోయింది. ఆ దినానపొద్దు తొందరగ వంగినట్టైంది. ఆళ్ళబతుకుల్ల ఆఊరితో వాళ్ళకున్న రుడంమాపడానికి. ఇండ్లల్లనుండి మొగోల్లంతా సావాట్లకు బయల్దేరుతున్నరు. సావాట్లకుపోయే మొగోల్లను ఆడోల్లు దొరమాటకు ఎదురుపోవద్దని బతిలాడుతుండ్రు. మాట్లాడితే ఏమైయిద్దో వాళ్లకనుభవమే.

అందరు సావాట్లకాడ గద్దె కెదురుంగ కూసుండ్రు. గడియసేపయినంక దొర మందిమార్బలంతో కల్సి ఆడికొచ్చిండు. తక్తుమీద కూసోని "అందరొచ్చిండ్రార పెంచలయ్య?"అనడిగిండు. పెంచలయ్య కులపెద్దలందరిని నడిపించే దొరకు నమ్మకమైన మనిషి. "బాంచెన్ దొర.. వచ్చిండ్రయ్యా .." తలకున్న రుమాలు నడుంకుకట్టి, వంగిదండాలు పెట్టిండు పెంచలయ్య. జనం ఇంకా దింపుడు గల్లమాశతో దొర చల్లనిసూపుకు ఎదురుచూస్తుండ్రు.

"పొద్దుపొడిసేలోగా మీరంతా ఈఊరొదిలి పెట్టిపోవాలె. అట్టనే ఈడ దస్త్రాలలో మీ ఏలిముద్రలేసిపోండి." హుకుం జారీచేసిండు. జనాల మొకాన నెత్తురు సుక్కలేదు. వాళ్ళబతుకుల్ల చీకట్లు ముసిరినై. మానొష్ట రాతింతే అనుకున్నరు. దొరచెప్పినట్టె చేసిండ్రు. దించిన తలకాయలు, మూసిననోళ్ళు ఎత్తలేదు.

***

సందెకాడ ఊరు కన్ను మూయలె. ముసలి, ముతక సుక్కపొడవంగనే బయలెల్లిన్రు. ఆల్లెనుకే ఊరు కదిలింది. ఊరి జనం చీమలదండులాగ బ్రహ్మం గారిగుడి దాటినంక,దొరగడి వచ్చింది. ఆడికి రాంగానే అలవాటుపడ్డ తలకాయలు కిందికి వంగినై. అది దాటినంక ఊరిబయట కమ్మరోల్ల ఇండ్లు దాటిండ్రు. అట్నుంచి కొలిమర్రిచెట్టుకూడా దాటిండ్రు. దొరగడీ ఎక్కి చూస్తుండు. బాటపొంటి దీపాలు ఊరొదిలి పోతున్నాయి. తృప్తిగామీసాలు దువ్వుకుండు.

***

దేవుడు రాలేదోమోగని అక్కడికి దేవుడిలా శివుడు మందిమార్బలం, ఆయుధాలతో ఎదురైండు. శివుడిని చూడగానే జనాల కండ్లల్లఆశ మెరిసింది. శివుని చేతిలో కాగడా దేదిప్యంగా ఎలుగుతుంది. ఎల్తురులో జనం పోగయ్యింండ్రు. "ఆడ మూసినదికి కతువ (ఆనకట్ట) కడుతుండ్రు. ఇండ్లు,భూములు పోయినోల్లకు ప్రభుత్వంపైకం చెల్లించడమో లేదా జాగలివ్వడమో చేస్తది." శివుడు నిజమనే కుండను బద్దలు కొట్టిండు.

"మీ భూములను అగ్గువకు మల్పుకునేందుకు దొరోడు మిమ్మల్నిడోక జేసిండు. దస్త్రాలల్ల మీకాడ ఏలిముద్రలు తీసుకుండు". శివుడు దొర అన్నేయానికి, ఆరిపోయిన కాగడాలకు, వారిబానిసత్వానికి ఒకేసారి నిప్పంటించిండు.

అందరి కాగడాలు పెద్దఎలుగుతో ఎలిగినై. ఆ కాంతి అందరి మొఖాలలో కొత్తగా కనబడింది. గడికాడ దించిన తలకాయలు లేచినిలబడ్డై. అప్పటిదాంక ఆకలి మాత్రమే తెలిసిన కండ్లు ఎరుపెక్కినై. నిలబడలేని కాళ్ళు మర్లవడ్డై.. బతుకులేకుండ జేద్దామనుకునేటోని గడీల గుండెలు పగలగొట్టడానికి గడ్డపారలు,గొడ్డళ్ళు వెనక్కి ఉరికినై. ఈగడ్డ నెత్తురుకుడుకెక్కువ గదిసూసి దొరతనం అడ్డదారిగుండా పొలిమేరదాటి పట్నందారిన పారిపోయింది. అప్పటిదాకా ఎర్రబడ్డ ఆకాశం మెల్లగా తెల్లబడ్డది.

***

'ఆకలికి చైతన్యానికి శివుడుకట్టిన వంతెనలాగా మూసివంతెన చరిత్రయింది. భాగ్యదాయినని మాత్రమే ఇప్పటితరానికి తెలుసు. ఆ నదీగర్భంలో తరాల జ్ఞాపకాలతోబాటు బానిసత్వాన్ని దాచుకుందని కొద్దిమందికే తెలుసు'. నాడుకట్టిన కేంపుచెర్వు(మూసి జలాశయం)ఆనకట్టపై కారునడుపుతున్న మనుమడు నిశాంత్‌తో యాదికున్న ముచ్చట్లను నెమరేసిండు బుచ్చయ్య.

నమస్తేతెలంగాణ – బతుకమ్మ, 11.10.2020

బంచెర్రాయి

కాసోల్లగూడేన రాజిరెడ్డిబిడ్డ లచ్చువమ్మ పెండ్లి జరుగుతుంది. దర్వాజ పచ్చనాకులు తొడుక్కుంది. గడపలు పసుపు పూసుకొని ముస్తాబయినై. ఇంటెన్కున్న నిత్తెమల్లెసెట్టు లచ్చువమ్మసిగలో పూసిందన్నట్టు కొప్పునిండా మల్లెపూలు నవ్వుతున్నై. లచ్చువమ్మ పెండ్లిబట్టల్ల ముద్దుగుంది. అదిచూసి లింగమ్మ అమ్మమ్మ దిష్టిపూసలుతెచ్చి పిల్లమెడలేసింది. లచ్చువమ్మ వన్నెలు చూసి పెండ్లికొడుకు మురిసిపోతుండు. లచ్చువమ్మకు తగిన పిలగాడు నర్సిరెడ్డి.బంగారానికి ఎలిగార మద్దినట్టుండు.

రాజిరెడ్డికి నర్సిరెడ్డి సొయాన మేనల్లుడు. ఆరడుగులుంటడు. సదువుకున్నోడు. బిడ్డను మంచిగ సాదుకుంటడని సెల్లెనొప్పిచ్చి లగ్గం సేస్తండు రాజిరెడ్డి. మేల్లగాల్లతో రాజిరెడ్డి గుండెనిండుగా మంగలాయిద్యాలు మార్మోగుతున్నై. లగ్గం,నాగవెల్లి అయినంక పిల్లపిలగాడు పెద్దలకాడ దీవెనార్తులు తీసుకుండ్రు. పిలగాండ్ల తరపున అక్కజెల్లెండ్లు మంగలార్తులు బట్టింద్రు. ఒచ్చిన చుట్టాల సదివింపులతోబాటు బంతిసాగింది.

మాగి పొద్దు. పొద్దు నిలుస్తలేదు. నిద్రజేయ బయల్దేరండని పిలగాండ్ల తర పోళ్లు ఓమాటనేసరికి, మల్లెపూలు మొఖం మాడ్చినై. గట్టిగుండె ఉన్న రాజిరెడ్డి కూడా దిగాలు వట్టిండు. ఆడబిడ్డను ఓ అయ్య చేతిలో బెట్టడమంటే ఆ ఇంటి సంబురాన్ని పిలగానింటికి పంపడమేనని రాజిరెడ్డికప్పుడు తెలిసొచ్చింది. అయ్యా బిడ్డ సోకం కల్సి రెండింతలయింది. కాసేపటికి మల్లిగాని తమాషా ముచ్చటతోని

మనుషులు తేలికయింద్రు. సోకం పోయినా బిడ్డను సాగనంపిన బాధ ఆ ఇంట్లో ఇంకా మిగిలే ఉంది. అంతే గదా పగలు పోయిందంటే మిగిలేది రాత్రేనాయె. రాజిరెడ్డి మనసుబరువైతుంటే బిడ్డను సాగనంపడానికి సిద్దం అయిండు. ధైర్నంకోసం బిడ్డకు తోడుగా ఇద్దరన్నలు, వదినలను ఇచ్చి నాలుగుబండ్లల్ల సాగనంపిండు.

***

నాలుగుఎడ్లబండ్లకు సరిపడా ఇరవైమందికి పైగ బయలుదేరింద్రు. మొదటిబండ్లె రాజిరెడ్డితల్లి హనుమమ్మ, లింగమ్మ ఉన్నరు. రెండో బండ్లె నర్సిరెడ్డి,ఎల్లమ్మ ఉన్నరు. వరసయినోల్లె కావడంతో పరాశికాలు ఆడుకుంటున్నరు. ఎడ్లబండి తొట్లో కూసొని తోలే జీతగాడి చేతిలో సెర్నాకోల కోడేడ్లపై అప్పుడప్పుడు మెత్తగా ఆడుతుంది. ఎడ్ల మెడలున్న గంటల సప్పుడు, ఎల్లమ్మ నవ్వులతో కలిసిపోయినై.

కోడెడ్లబండ్లు ఉషారుగా ఉరుక్కుంట గూడెందాటినాక వచ్చే దేవతలమర్రిని చేరుకున్నై. ఆయేల్ల లింగమ్మకు దేవతలమర్రి ఏదో చెబుతున్నట్టన్పిచ్చింది .

***

పొద్దుగూకడాన్కి ముందే కాసోల్లగూడేన్ని సీకటితో కప్పడానికి కార్నలుపు మబ్బులు, రజాకార్ల గుంపులు నక్రేకల్నుంచి బయల్దేరినై. రాజ్జెంపోతుందని ఆల్లకు కబురందిందట. పోలేరమ్మ గుడిదాట్నాంక బంచెర్రాయికాడ రజాకార్లకు ఎడ్లబండ్లు ఎదురైనై. అహంకారంతోఉన్న వాళ్ళ తుపాకులు మోగినై. లొట్ట బందూకులు డాం.. డాం...మ్మని పేలినసప్పుడు గూడెం గుడిసెలదాక చేరింది. గూడెం అదిరి ఉలిక్కి పడింది. ఆ రాత్రి ఆళ్ళ కండ్లల్ల బెదురు, కంటిరెప్పలను మూయనియ్యలే. గుడిసెలన్నీ గుబులుపట్టినై. గుడిసెలు తమ భయానికి, దర్వాజలకు తడికలను, బండలను అడ్డేసుకుంద్రు.

***

సుక్క పొడవంగ తెల్లారి ఊరంతా బంచెర్రాయి కాడికి కదిలింది. ఆడ్నే రాజిరెడ్డి

గుండెపగిలేలాఏడ్చి నాలుక పిడ్సకట్టకపోయి సోయితెల్వక పడుండు. నల్ల రేగడంతా ఎర్పెక్కింది. మట్టుగుడి ముత్యాలమ్మకాడ జాతరకు పొట్టేలు నెత్తురులాగ ఆ సోటంతా నెత్తురేరై గడ్డకట్టింది.

పసుబట్టల మీదున్న నర్సిరెడ్డి, బండ్లల్లున్న పదిమంది మొగోల్లను కిందికి గుంజి, వాళ్ళ కండువాలు, తువ్వాల్లతో చేతులు ఎనక్కి ఇరిసి చెట్టుకుకట్టి ఆడోళ్ళను చీరకొంగులతో కట్టేసింద్రు. ఒళ్లంతా కుల్లబొడిసింద్రో యేమో, దెబ్బలతో నెత్తురుగడ్డకట్టి చచ్చిపడి ఉంద్రు.

పావురంగ సాదుకున్న బిడ్డ లచ్చువమ్మ అసువులు బాసినై. రాజిరెడ్డి నవ్వులూ బాసినై. పెండ్లిపిల్ల లచ్చువమ్మ గాజులు పగిల్నై. పెనిమిటి పేనాలతో బాటు అయికూడా బంచెరాయి మట్టిల్నేకలిసినై. లచ్చువమ్మ నాయిన కాళ్ళు మొక్కినప్పుడిచ్చిన బొడ్లె సంచినున్న పైకం, బొందిల పాణం, మనుండంగ మానం అన్నీ దోసుకుపోయింద్రు. కచ్రాలకున్న పసులుకాన్రాలే. ఆటి తలకాయలు, కాలి గెట్టెలు, పొట్టపేగులు, తోలు దూరంగా కనబడ్డె.

రాజిరెడ్డి కడుపుకోత, కన్నీటి ఎత ఎవలు తీర్చగలరు. ఆడనీళ్ళు నింపుకొనని కండ్లులేవు. ఊరంతా సోకసంద్రం అయింది. బంచెర్రాయి వల్లకాడుగా మారింది. పీనిగలను ఆ బంచరాయికాడనే మంట్లె కల్పింద్రు. బంచెరాయిపై కన్నీటాన కురిసింది.

***

మజ్జెరాత్రి దొంగలొచ్చినట్టు రజాకార్లు ఒక్కపాలిగ ఊరిమీద మల్లా ఇరగవడ్డరు. మదమెక్కి మతితప్పిన్రు. పుస్తెలుతెగి నల్లపూసలు నేలరాల్తున్నై. గుడిసె గుడిసెపై ఈతబరిగెలు నాట్యమాడుతున్నై. కొన్ని గుడిసెలకు నిప్పు పెట్టింద్రు. గూడెమంత దోపకాలయినై. మడుసుల దోసుడు,ఇండ్లదోసు డైంది. శివునిగుడికాడ వయసుపోరగాళ్ళను తుమ్మజెట్టుకు కట్టేసి కొట్టి చంపింద్రు. రేయంత గాయాలతో పచ్చిపుండయింది. రజాకార్లు పోతపోత బాయిలకాడ నాగళ్లమీది గొడ్లను తీసుకుబోయి కోసుకుతిని, బాయికి కట్టే మోట మోకులు కోసి, బొక్కెన్లకుండే ఆలిపైసలు ఖరీదుజేసే

తొండాలనుతెంపి బాయిలేసిన్రు. (ఆలి పైసలు అంటే దాదాపు ఇప్పటి రూపాయి,నాటి 96 పైసలు)

***

రజాకార్లను చుట్టూ యూనియన్ ఫౌజ్ కమ్మింది. రజాకార్లంత దురాజ్ పల్లి గుట్ట ఎక్కింన్రు. యూనియన్ సైన్యం ఇటువైపు రావొద్దని దానికి ముందే రజాకార్లు టేకుమట్ల బ్రిడ్జి కూలగోట్టింన్రు. అయినా పట్టిడవకుండా సైన్యంగుట్ట మీద గాలిమోటరు తోటి బాంబులు ఇసిరింన్రు. పాపాల పుట్ట పగిలింది.సగానికి మించి పాములు మాడిమసైనై. కొన్ని నాగుపాములు పుట్టలోంచి తప్పించుకున్నై. అవి కసిగా బుసలు కొడుతూనే ఊల్లె దిక్కుకు ఉరికినై. పదిమంది రజాకార్ల గుంపు కాసోనిగూడెం వస్తుంన్రని రాజిరెడ్డికి మత్లబు అందింది. అల్లుడు దోస్తు రాంబాబు ఆ కబురిచ్చిండు. కొట్లాడితే ఈలోపు మనకు ఫౌజ్‌సాయం అందుతుందని భరోసిచ్చిండు. ఊరి మడుసులకు దైర్నంతోబాటు కాక పుట్టింది.

రాజిరెడ్డి కండ్లు నిప్పులు కక్కినై.దుఖం కట్టలు తెంచుకుంది. బంచెర్రాయి యాదికొచ్చింది. కండ్లల్ల బిడ్డలు, అయినోళ్ల పీనుగలు కనపడ్డై. ఉడికిండు. తమసం ఆపుకోవడం కష్టమైతంది. ఊరి పెద్దిర్కమున్న రాజిరెడ్డికి,సర్వం పోగొట్టుకున్న ఊరు తోడయింది. పిల్లతోవ నుండి పెద్దదారివైపు పిల్లా పెద్ద నడిసింన్రు. ఆళ్ళబాట పోరుదెస మళ్ళింది.

***

బంచెర్రాయి(బంజరు భూములు)కాడ కాసేగూడెం జనపిడుగు, రజాకార్లగుంపుకు ముకాబులైంన్రు. రజాకార్లమొకంలో నెత్తురుసుక్క లేదు. నల్లమొకమయింది. మల్లోదమ్మ బంచెర్రాయి రణరంగమయింది. ఆళ్ళ చేతులల్ల ఉన్న బందూకు ఈతాప భయంతో పేలింది. ఆళ్ళ దింపుడు కల్లం ఆస అడియాసయింది. సువ్వం(నాల్గో తర్గతి) సదువుతున్న పన్నెండ్లేల్ల సిన్న పోరడు అంజయ్యగుండెలోకి సూటిపెట్టినట్టు గుండు గుచ్చుకుంది. గుండు భారాన్ని గుండెలో ఎక్కువసేపు మోయలేకపోయిండు

బిడ్డ. అల్లాడుకుంట తన్లాడుతండు. బాద తాన్లేక జీవిడిశిండు. జనం ఎర్ర బారింగ్రు. కాశె కట్టి గోశి బిగిన్చింగ్రు. రాజిరెడ్డి తొవ్వ తీసిండు. ఆ తొవ్వ తొక్కుడు బడ్డది. బుసకొడుతున్న రజాకర్ల పడగల కొట్టిసంపిర్రు. బంచెర్రాయి నెత్తుటి ముద్దయింది. రాజిరెడ్డి తనబిడ్డల పూడ్సిన కాళ్ళకాడనే గోతులుతీసి రజాకర్ల పీనిగల పాతిపెట్టిండు. రజాకార్ల పీడ ఇరగడయినందుకు బంచెర్రాయిపై సంబురాలు మిన్నంటినై.

***

రాజిరెడ్డికి బిడ్డల పీనుగలకాడ దొరికిన షెర్నకోల రాత్రికి రాత్రే పద్నాలుగూర్ల జనాలను నడిపి చెట్లుకొట్టి ఆటితో కతువకు పాణం పోసింగ్రు. జనం సైన్యాన్ని ఇవతలివైపుకు పిలిచి మంగళారతులు పట్టిర్రు. ఆల్లొచ్చి మిగిలిన కాలనాగులను ఎరేసింగ్రు. కొట్టేసిన చెట్లన్నీ కొత్త సిగుర్లేశినై... కొన్నాళ్ళకు.

తెలుగు వెలుగు మాసపత్రిక –ఫిబ్రవరి 2021

కర్తవ్యం

ఆ రోజు ఆదివారం. ఊరి బయటున్న గవర్నమెంటు బడిలో పిల్లలంతా ఓచోట జేరి కేరింతలతో పొద్దట్నుంచి బువ్వబుగ్గి లేక ఆటలాడుకుంటుండ్రు. సర్కారు బడిలో ఓ మూల పెద్ద మఱ్రిచెట్టుంది. దాని వూడలు పట్టి యేలాడుతూ కొందరు ఉయ్యాలలూగుతుండ్రు. మరికొంత మంది పిలగాండ్లు గుట్టగా పోసిన ఇసుకలో ముక్కుపుల్లలాటాడుతుండ్రు. కొంత మంది పోరగాండ్లు జిల్లగోన, పిచ్చిబంతి, గోటీలు, దాగుడుమూతలు, దొంగ పోలీసు ఆడుతుండ్రు.

అప్పటిదాంక పిల్లలతో సందడిగున్న ఆచోటు ఒక్కపాలి నిశ్శబ్దంగా మారిపోయింది. ఆరోతర్గతిచదువుతున్న రాముడు మఱ్రిచెట్టుఊడబట్టిఉయ్యాలూ గుతుండు. ఊడపట్టుకున్న చేతులు చెమటపట్టి జారి,ఆడ్నేఉన్న బండరాయిమీద పడి తలపగిలింది. ఆగకుండా నెత్తురుకారుతుంది. రాముడు మూసిన కండ్లు తెరుస్తల్లేడు. దోస్తుగాళ్ళకు ఏంచేయాల్నో తెల్వక ఆటలన్నీ ఆడికాడ్నే ఆపేసి,భయంతో పెద్దగ ఏడవడం మొదలుపెట్టిండ్రు.

***

రాముడుకు అమ్మఅయ్య లేరు. అన్నీ నాయనమ్మే. పుట్టిన పిలగానికి ఏడాదితిరక్కముందే అమ్మఅయ్య రాముడిని నాయినమ్మకాడ వదిలేసి బత్కుదెరువుకు కాలువకిందికి పోయిండ్రు. లారిటక్కరయి ఆడ్నే జీవిడిశిండ్రు. ఊల్లె ఇల్లు లేదు.

ఊరి బయట చేనులేదు. ఉన్నొక్క కొడుకు బోయిండని కడుపు తీపికి, ముసల్ది ఎంకమ్మ ఏడ్చి ఏడ్చి కండ్లల్ల తడిపోయింది. కొడుకు మీద దిగుల్తోటి ఇంటాయన పచ్చవాతమొచ్చి మంచం పట్టిండు. ఆయనకిప్పుడన్నీ మంచంలోనే. ఏ దిక్కూలేని ఎంకమ్మకు నా అన్నవారంత, ఎవరునువ్వ అనేశింద్రు.

గిప్పుడు ఎంకమ్మకు కండ్లుమస్కలైనై. ఊరు దూరమైతంది కాడు దగ్గరైతంది. వంట్లో ఆశతప్ప సత్తువ లేదు. ఇంట్లో ఆకలితప్ప మెతుకులు లేవు. ఎప్పుడు పోతదో జీవి తెల్వదు. కన్నపేగుబంధం గుర్తుగున్న గా నలుసుకోసం బతుకునీడుస్తూ, బడిబయట పిలగాల్లకు రేగుబళ్ళు,జామపళ్ళు, ఇంటికాడజేసిన అప్పలు అమ్ముతూ ఎల్లదీస్తుంది. రాముడు సదువుల మహా సురుకని రాఘవయ్యసారు ఎప్పుడూ జెప్తడు. అంగట్లో అరువు తలమీద బరువు అన్నట్టు బతుకీడిస్తూ ఎంకవ్వ, రాముడిని పనికి పంపకుండ సర్కారుబడిల సదివిస్తుంది.

***

ఆదివారం కావడంతో ఎంకవ్వ ఇంటికాడ అప్పలు చేస్తుంది. ఎవలో బయట "ఎంకమ్మమ్మో ....ఓ ఎంకమ్మమ్మా !..." అని ఆగకుండా పిలుస్తుంద్రు." ముసల్దానికి వయసుమీద పడ్డది. ఇనబడట్లేనట్టుందని", విసుక్కుంట తడక తీసుకుని గుడిసెలకొచ్చి, రాముడికి దెబ్బతగిలిన సంగతి చెప్పిండు శంకరయ్య. ఆ ముచ్చట చెప్పంగనే ఎంకమ్మకు గుండె సెరువయింది. దుఖం ఒక్కసారిగ కట్టలుదెంచుకొని, 'ఓ కొడుకా.. 'అని గుండెలు బాదుకుంట, ఏడ్పు బజారంతా పరుస్కుంటూ ఆయాసంతో ఉరుక్కుంట బడిదాంక బోయింది. ఎంకమ్మతోటి శంకరయ్య సుత బోయిండు. ఆడ రాముడు లేడు. ఆడ్నించి ఎవలో పుణ్యాత్ముడు ఎడ్లబండిల రాముడును పండబెట్టి ధర్మాసుపత్రి తీసుకెల్లింద్రు. గది తెలిసి లబోదిబోమంటున్న ఎంకవ్వను దవాఖానాకు తీసుకుబోయిండు శంకరయ్య.

***

రాముడి తలకాయకు దెబ్బబలంగా తగిలింది. నెత్తురు చానా పోయింది. దాంతో మనసోయిలో లేడు. బడికాడ మూసిన కండ్లు ఇప్పటిదాంక తెరవలే.

మనుమడిని చూసి తట్టుకోలేక కుప్పకూలింది. గుండెలు బాదుకుంటూ ఎంకమ్మ ఏడ్చి ఏడ్చి ఆయాసంతో రొప్పుకుంట కండ్లు తుడుసుకుంటుంది. ఆమె నిర్గుండె పడ్డది. వయసుడిగినాంక బాధల్ని తట్టుకోలేకపోతుంది. మాసిన చీర కొంగంత తడిసిముద్దయింది. మధ్యమధ్యలో "భగవంతుడా!నా పాణం తీసుకొని నా మనుమడిని బతికియ్యమని" కంటికి పుట్టెడు ఏడుస్తుంది. బిడ్డ బతికి బయటకొస్తే ముడుపు కడతనని గుర్తుకొచ్చిన దేవుల్లందర్కి మొక్కుతుంది. ఎంటొచ్చిన మనుషులు ఒక్కొక్కరుగా ఆడ్నించి జారుకుంద్రు . అవ్వెంట శంకరొక్కడే మిగిలిండు. డాక్టరొచ్చిండు అమ్మమ్మా..!" అన్నడు శంకరయ్య.

ఆ మాటకు ప్రాణంలేసొచ్చింది. వెంకమ్మకు చూపు ఆనలే. దగ్గరకు బోయింది. ఒక్కసారిగ డాక్టరు కాళ్ళమీద కూలిపోయింది. బోరున తనగోడుతో ఆయన పాదాలను తడిపింది. డాక్టరు చలించిపోయిండు. ఆయన మనిషే కదా. కాని 'మెరుపు దీపమవుతుందాన్నట్టు' ఆ ధర్మాసుపత్రిలో పెద్దవైద్యం చేయడానికి సౌకర్యాలు లేవాయే. ఏంచేయాల్నో శంకరయ్యకు వివరంగా చెప్పిండు. 'ముసల్దానికి ఇనబడదని' శంకరయ్యే చొరవ చూపిండు. ఆ తరువాత డాక్టరు వినపడేటట్టుగా అవ్వకు చెప్పిండు. "ఈడ ఉన్నపరీక్షలన్నీ చేసిన.నెత్తురు కారకుండ తలకాయకు పెద్దకట్టు కూడా కట్టిన. వెంటనే పెద్దాసుపత్రికి తీసుకపోకపోతే బిడ్డప్రాణానికి ప్రమాదం." అని చెప్పడంతో రాముడిని అట్నించటే పెద్దాసుసుపత్రికి తీసుకెల్లిండు శంకరయ్య. వద్దంటున్నా వినకుండా అవ్వ ఎంబడొచ్చింది.

***

శంకరయ్య ఇరవయ్యేళ్ళ యువకుడు. కూలినాలికి పోతడు. ఉంటే తినాలి లేకపోతె ఎండాలి. అతనిబతుకు చెట్టు లేని చేను, చుట్టం లేని ఊరయినా అందరితో తలలో నాలుకలెక్కుంటడు. ప్రేమగా "శంకరి" అని పిలుస్తే ఏపనయినా తనపనిలాగే చేస్తడు. పైసకాశ పడడు. మంచి పేరుంది.

శంకరయ్య దురదృష్టవంతుడు. పుట్టుకల్నే తల్లిబాలింతరోగ మొచ్చిబోయింది. సక్కని తల్లి. పిలగాన్ని ఒదిలి చిన్నప్పుడే నాయిన ఏడనో దేశాలు బట్టుకబోయిండు.

ఆడ్నించి శంకరికి అమ్మలెక్క ఎంకమ్మవ్వ సొంత బిడ్డలా ఆకలికి, ఆపతికి ఆదుకునేది. అందుకే శంకరయ్యకు ఎంకవ్వ మీద నెనరుంది. ఆ పిలగాడు బతకకపోతే రెండుముసలిప్రాణాలు నిల్వవని తెలుసు. ఎట్లైన పిలగాడ్ని కాపాడాలని కన్నగల్లోల్ల కాళ్ళుపట్టుకొని అడుగుతుండు. ఏడ అడిగిచూసినా అప్పు బుడ్తల్లేదు. శంకరయ్యకాడ ఏముందని జూసి అప్పిస్తరెవరైన. ఆడఈడ అడిగి కొన్నిపైసలు జేసి ఎంకవ్వకు దైర్నంజెప్పి పిలగాడ్ని పెద్దాసుపత్రిల షరీక జేసిండు.

***

పెద్దాసుపత్రిల డాక్టరు వైద్యపరీక్షలు జేసిండు."తలకాయకు దెబ్బపెద్దగా తగిలి మెదడులో నెత్తురు గడ్డకట్టింది. వెంటనే ఆపరేషన్కు లక్షరూపాయలను తయారుజేసుకోమని చెప్పిండు." ఎంకమ్మతోబాటు శంకరయ్యకు ఏంజేయాల్నో తోచక కాళ్ళుచేతులు ఆడతలేవు. ఎంకమ్మ అల్లడం తల్లడం అయితుంది. ఎట్లైనా తన మనువడిని బతికించమని, కళ్ళు కనబడక ఆడికొచ్చేటోల్లందరినీ డాక్టరనుకుని కాళు ్ళ మొక్కుతుంది.

***

కాలంగడిచింది. రాముడు సదువుకోసం ఊరొదిలి పదిహేనేళ్ళు దాటింది. చదువైపోయి సొంతజిల్లాలనే ఉద్యోగమొచ్చింది. పట్నంనుంచి సొంతూరుకు కారుల బయల్దేరిండు . ఎమ్మటి శంకరన్న ఉండు. ఉద్యోగంలో జేరటానికి ముందు గురువు రాఘవయ్యసారుకు పాదాభివందనంజేసి ఆశీస్సులు తీసుకుందామని బయలుదేరిండు. ఊరు దగ్గరికి వచ్చింది.బడి దాటుతుండగా జ్ఞాపకాలు కదిలాయి. ఇంతలోనే కారు రాఘవయ్యసారింటి ముందాగింది. రాముడు కంటే ముందే డ్రైవరు కారుదిగి, డోరు తీసిండు. రాముడు వినయంతో కారుదిగి పూలదండ తీసుకొని సంతోషంతో రాఘవయ్యసారు ఇంట్లోకి నడిసిండు.

***

పాదాలకింద భూమి కదిలినట్లైంది. రామునికంటే ముందే అతని దురదృష్టం రాఘవయ్యసారింటికాడ ఎదురైంది. నేలమీదేసిన గడ్డిమీద సారున్నడు. తన ప్రపంచమంతా మసకబారింది. అంధకారంలో పడిపోయిండు. దుఃఖం కట్టలు తెంచుకుంది. కన్నీటివరద తన్నుకొస్తుంది. గుండె చెరువయ్యింది. "రాఘవయ్యసారు రాత్రిభోజనం చేశాక నిద్రల్నే గుండె పోటొచ్చి కన్నుమూశారని" అక్కడెవరో వివరం చెబుతుండ్రు.

పెద్దఉద్యోగంతో వచ్చి కన్నతండ్రిలాంటి రాఘవయ్యసారును ఇకమీద సుఖంగా చూసుకుందామనుకున్న రాముడుకు మరోసారి భగవంతుడు అన్యాయం జేసిండు. గురువుకాళ్ళమీదపడి కన్నీరుమున్నీరుగ ఏడ్చిండు. రాముని భుజంతట్టి, నిమ్మలపరిశిండు శంకరన్న. రాముడు రాఘవయ్య సారుకు కన్నకొడుకులాగ దగ్గరుండి అంత్యక్రియలను పూర్తిచేశిండు. సారు ఓ ప్రమాదంల అయిన వాళ్ళందరిని పోగొట్టుకుండు. తనను సొంతబిడ్డలా చూసుకుండు. రేయంతా జ్ఞాపకాలతో తనివితీరా ఏడుస్తూనే ఉన్నడు. మర్నాడు పొద్దున్నే పయనమవుదామని అనుకుంటుండగనే, ఇంట్లో పన్జేసే వెంకయ్య పిలిసి సారు డైరీని తెచ్చిచ్చిండు. రాముడు డైరీని ఆత్రంగా చదవడం మొదలుపెట్టిండు.

***

'నా జీవితంలో గెలిచిన జ్ఞాపకం రాముడు. ఏకాకిగున్న నాకు విధిని జయించి, ప్రయోజకుడయి వస్తున్న రాముడి గెలుపులో నా గెలుపు దాగుంది" అని సంతోషంగా రాసుకున్న విషయం చివరిపేజిలో ఉంది. ముందు పేజీలను తిప్పేస్తున్నప్పుడు అసలు విషయం అర్థమయింది. ఈమధ్యే వివిధకారణాలతో అనాథలయిన ముగ్గురు పిల్లలను చేరదీసిండు. వారి ఆలనాపాలనకు తన పెన్షన్‌డబ్బులు సరిపోతల్లేవని బాధపడ్తూ, పెన్షన్‌డబ్బులు సరిపోక వైద్యాన్ని కూడా వాయిదా వేసుకున్నట్టు అందులో రాసుంది. తనకు ప్రాణాపాయం ఉందని తెలిసినా, ఆరోగ్యాన్ని లెక్కజేయకుండా ఆ పిల్లల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇచ్చిండు.

వెంటనే రామునికు గతం గుర్తుకొచ్చింది. ఆ రోజు ఆసుపత్రిలో తలకు దెబ్బతగిలి ఇంకాసేపట్లో చచ్చిపోయేట్టున్న తనతో బాటు, ఏడ్చి ఏడ్చి ఆసుపత్రిలోనే నాయనమ్మ

జీవిడిశింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ముసల్దాని శవంతో ఏం జేయాలో తెల్వని దిక్కుతోచని స్థితిలో శంకరన్న వుండు. అదేసమయానికి రోడ్డు ప్రమాదంలో బార్యను, బిడ్డల్నిద్దరిని కోల్పోయి, పుట్టెడు దుఃఖం, ఒంటినిండా గాయాలతో రాఘవయ్యసారు అంబులెన్సులో అదే ఆసుపత్రికి వచ్చిండు. అంత బాధలో గూడా ఆడ శంకరయ్యను జూసి, సంగతి అడిగి తెలుసుకుండు. అప్పటికప్పుడు తనప్రాణాలు కాపాడడానికి డబ్బిచ్చి, నేనున్నానని చేరదీసి, కన్నబిడ్డలా జూసుకొని వృద్ధిలోకితెచ్చిండు. తన జీవితానికి ఒక విలువనిచ్చి, కన్నతండ్రిలాఉన్న గురువుగారి ఆఖరిచూపుకు నోచుకోని తన దురదృష్టానికి బాధపడ్తూ, ఆడైరీ మొత్తం చదవడం పూర్తిజేసిండు.

డైరీ తిరగేస్తుంటే కదిలే ప్రతి పేజీల వారునడిచిన త్యాగపు గుర్తుల అడ్గులజాడ ఉంది. పీటమీద పెట్టిన రాఘవయ్యసారు దండేసున్న ఫోటో ముందు దీపం ఎలుగుతుంది. ఆ దీపపు కాంతిలో రాఘవయ్యసారు నవ్వులలో నిస్వార్థపు అడుగుల ఎలుగులున్నట్టనిపించింది. ఆ ఎలుగులల్ల తనచుట్టూ ఉన్న అందరి కర్తవ్యం మనసుల మెదిలింది. నాయనమ్మ పెంపకం, శంకరయ్య సామజిక బాధ్యత, గురువుకు శిష్యుల ఎదుగుదల మీదున్న గురుతర బాధ్యత,ఉద్యోగంలో తన భావికర్తవ్యాన్ని ప్రబోధించినట్టుగా అన్పించింది. ఆ ఎలుగు దారిలో పోవాలని నిశ్చయానికొచ్చి రాముడు పిల్లలను తీసుకొని కర్తవ్య నిష్టతో కారెక్కిండు.

నవతెలంగాణ – సోపతి , 09–05–2021

లొట్టపీసు పూలు

ఎల్లయ్య పంతులు ఊరికి పెద్దమనిషి. మొగుడిపెండ్లాల కొట్లాటకాంచి కులపంచాయితీలు, గెట్టు పంచాయితీల దాంక తీర్మానం జేస్తడు. అయినోనికి ఆకుల్ల కానోనికి కంచాల్లేసేరకంకాదు. మొన్నామధ్య అడివమ్మ మొగుడిపెండ్లాల పంచాయితీ కూడా ఆయనే తీర్మానం జేసిండు. అడివమ్మ మొగుడు శివుడు. దినాం పెద్దచెర్ల లొట్టపీసుచెట్లను కొట్టుకొచ్చి ఇండ్లకు తడకలల్లుతడు. అల్లినందుకిచ్చిన పైసలుబెట్టి దినాంతాగొచ్చి ఇంటికాడ రచ్చజేస్తుండని పంతులుతానకొచ్చి అడివమ్మ ఫిరాదయింది. "రాళ్ళజేనుకు గుంటుకకు పోయినట్టయితుంది" సంసారమని మొరబెట్టుకుంది. ఎల్లయ్యపంతులు పెద్దరికం మందులాగ పనిజేస్తది. భయంజెప్పేకాడ భయంజెప్తడు. బుజ్జగించేకాడ బుజ్జగిస్తడు. శివునికి భయం జెప్పిండు. అడివమ్మ సంసారం బాగుపడ్డది. ఆడ్నించి శివుడు తాగుడు,వాగుడు రెండు బంద్జైనై. సంసారం బుద్ధిగజేసుకుంటుండు.

***

సలువమ్మ ఎల్లయ్యపంతులు పెద్దబిడ్డ . ఆమెకు పదేళ్ళ బిడ్డ యమున, ఐదేళ్ళ కొడుకు అశ్విన్ ఉన్నారు. బొడ్డెమ్మ బతుకమ్మపండుగకు అమ్మగారింటికి పిల్లలతో వచ్చింది. యమునకు తాతంటే శానా ఇష్టం. తాతకు యమున మాటలు తరగని మూటలే. ఇంటి బయట ఎడ్లబండాగింది. పనిమనిషి పాపయ్య సామాన్లు లోపలికి తెచ్చిండు. ఎల్లయ్యపంతులు యమునను ఆమాంతం చేతుల్లోకి తీసుకొని, రెక్కలాశానికెత్తి భుజాలమీద కూర్చోబెట్టుకుండు. తాతమనుమరాలి ముచ్చట ఓపట్టాన ఒడ్వదు. తాతతో

చేనుకాడికి బయల్దేరింది. తాత ఎర్రసంచిని భుజానేసుకుండు. అదెప్పుడు తాత దగ్గరే ఉంటుంది. యమున నవ్వుకుంట తాత సంచిలచేయి పెడితే అందులో శానా డబ్బులున్నై. తాత నవ్వుకుంట ఆ సంచిని యమున మెడల ఏసిండు.

***

చెల్కలకుపోయి తిరిగి పెద్దజెర్వుకట్టమీంచి ఇంటికొస్తుంటే, యమున చెర్లున్న లొట్టపీసుపూలు చూసింది. "తాతా! అయికావాలని" పట్టుబట్టింది. "వద్దమ్మా.. అయి ఇసమంటే"ఇనదు. మొండిఘటం. ఊకొలె. తాత జీబిలి తీసింది. తాతకు తప్పలేదు. చేతికిందున్న పాపయ్యకు చెప్పి, లొట్టపీసుపూలు తెంపుకరమ్మన్నడు. యమున మురుసుకుంట ఆపూలను ఇంటిదాంక పట్టుకొచ్చింది. వాటిని "బొడ్డెమ్మకు పెట్టడాన్కి తెచ్చినని"అమ్మతో జెబితే, అవి పనికిరావని అమ్మంది. దాంతో లొట్టపీసు పూలుముఖం మాడ్చినయి.

***

పెత్తరమాసముందు ఎనిమిదిరోజులు ఎల్లయ్య పంతులు ఇంటి ముంగల బొడ్డెమ్మల పండుగ ఆడ్తరు. ఊల్లె ఆ ఒక్క ఆడకట్టున్నే బొడ్డెమ్మలు ఆడ్తరు. పండుగరోజు సలువమ్మ సెల్లెండ్లు పుట్టమట్టితెచ్చి బొడ్డెమ్మను జేస్తరు. బొడ్డెమ్మకు కావాల్సిన తీరొక్కరంగులల్లపూసే బొడ్డుమల్లె, రుద్రాచ్చ, కనకాంబరాలును దొరవారిగడీల తెంపుకొస్తరు. ఊర్లెఉన్న పెండ్లికాని ఆడ పిల్లగాడ్లంతా వారందినాలసంది బొడ్డెమ్మ ఆడిపాడింద్రు.

***

తెల్లారితే సద్దులబతుకమ్మ. కోడికూత ముందేలేచి అందరూ పండుగ పనిలబడ్డరు. తలమీంచి తానాలుచేసింద్రు. పొయ్యిమీద బువ్వలుడికినై. సాంబువ్వాసనకు బయటకుపోతున్న ఎల్లయ్యపంతులు గల్మకాడనే ఆగిండు. సలువమ్మ అయ్యకు తపుకుల సాంబువ్వ బెట్టింది. అయ్యతృప్తిగా తిని, బాకీ వసూలు చేసుకొస్తనని ఎర్రసంచి భుజానేసుకొని యెలుగుపల్లికి పోయిండు.

బొడ్డెమ్మాడే యాల్లయింది. ఆ దినం బొడ్డెమ్మాడి నిమజ్జనం చేయాలి. పెండ్లీడుకొచ్చిన ఆడపిల్లలంత బొడ్డెమ్మాడడానికి సలువమ్మ కాడికొచ్చింద్రు. చెల్లెండ్లు

ఇంటిముంగల ఆకిట్ల ఊడ్సిన్రు. సాన్పి జల్లి,బొడ్డెమ్మ పెట్టేకాడ జాజుతో అలికి, ముగ్గుబెట్టి, పీటేసింర్రు. ఆ ఆడకట్టున ఆడొచ్చినోల్ల కంటే చూడొచ్చినోళ్ళు ఎక్కువుంటరు. ఊరంతాడ్నే ఉంర్రు.

ఆడపిల్లలు బొడ్డెమ్మ చుట్టూచేరింర్రు. సలువమ్మ పాటందుకుంది. పాపమ్మ గొంతుకోయిల గొంతు, చెక్కెర పోసినట్టుంటది. సలువమ్మ పాటకు పడుచుపిల్లలు,అమ్మలక్కలు గొంతు కలిపింర్రు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.... కోల్
బిడ్డాలెందారు ....కోల్
నీ బిడ్డ నీలగౌరి........ కోల్

అని పొద్దు పోయిందాక, ఇంకోపాట.. ఇంకొక్క పాటని అడుగుతుంటే ఓపికగా పాడింది సలువమ్మ.

పూజయిపొయింది. అయిపోయినంక అందరూ పెద్దజెర్వు కట్టకిందికి బయలుదేరింర్రు. యమునకు సంతోషమైతంది. చెర్ల లొట్టపీసుపూలు మదిల మెదుల్తున్నై. యమునను చూసుకోమని సలువమ్మ చెల్లెకు చెప్పింది. యమున సూపంతా దూరంగున్న లొట్టపీసు పూల మీదుంది. అయికూడా యమునలాగే గాలికి అందంగా నవ్వుతున్నై. వాటి తలలుగాలికి ఊపుతూ పిలుస్తున్నట్టు అన్పించింది. ఒంటేలుకు పోతనని సాకుతోటి పదేళ్ళయమున లొట్టపీసు పూలకాడికెల్లింది. సలువమ్మ చెల్లె పాటమీద మోజుతో పిల్లసోయి మర్సింది.

ఏంకొంపలు మునిగిపోతుందో తెల్వదు.పొద్దుతొందరగా వంగిన్నట్టైంది. ఆడోల్లకు. చీకటి పడుతుంది. అందరూ పెద్దచెరువు నీళ్ళతానకు చేరింర్రు. సలువమ్మ హారతి పాటందుకుంది. గొంతు కలిపింర్రు.

"నిద్రబో బొడ్డెమ్మ..... నిద్రబోవమ్మ
నిద్రకు నూరేండ్లు.... నీకు వెయ్యేండ్లు
నిన్నుగన్న తల్లికి నిండ నూరేండ్లు
పాలిచ్చు తల్లికి బ్రహ్మ వెయ్యేండ్లు

పాలు అన్నం పెట్టి,పాపడ కాయ
నెయ్యి అన్నంబెట్టి,నేరేడు కాయ
పెరుగు అన్నంబు.... పెద ఉసిరికాయ
ఆరగించు గౌరి,అన్నమమృతంబు...”

బొడ్డెమ్మకు చేతులు జోడించి సల్లగ సూడమ్మా ! అని నిమజ్జనం చేసింగ్రు. ఇంతలో ఒకపిల్ల అడిగింది‘అక్కా ! బతుకమ్మకు బొడ్డెమ్మకు తేడా ఏందని? దానికి సలువమ్మ “గంగా గౌరిలలో గంగను కొలిసేది బొడ్డెమ్మపండుగ. గౌరిని కొలిసేది బతుకమ్మ పండుగ” అని చెప్పుకుంట, అందరూ గట్టుకు చేరింగ్రు. సలువమ్మ “పిల్లేదని’ చెల్లెను అడిగింది. చెల్లె బిక్కమొగమేసింది. అందరి ముఖాల్లో సంతోషం కనుమరుగైంది. సలువమ్మ మనసుకీడు శంకిస్తుంది. ఆందోళన పెరిగింది. చీకటి కమ్ముకుంది. అమ్మలక్కలు చెర్వుకట్టపొంటి వెతుకులాటలో పడ్డరు. సలువమ్మ సెల్లెను తిట్టుకుంట పిల్లను కూతేసుకుంట వెతుకుతుంది. ఎవలో గట్టిగరిసింగ్రు. లొట్టపీసుచెట్లల్ల శవం తేలుతుందని. సలువమ్మ పైప్రాణాలు పైనే పోయినట్లైంది.

***

అడివమ్మ పండుగకు గూడెంలున్న పెద్దమ్మింటికొచ్చింది. ఇద్దన్న తీసుకొచ్చిండు. ఒక్క కడుపుల పుట్టకున్నప్పటికి సొంత అన్నచెల్లెల్ల కంటెక్కువగుంటరు. చిన్నప్పుడే అడివమ్మ అవ్వ సచ్చింది. పెద్దమ్మే అడివమ్మను సాకింది. శివుడుకిచ్చి లగ్గం జేసింగ్రు. ఈతాప పండక్కిరావాలని బావ శివుడునడిగితే, ”నేను పండుగనాడొస్తగని, మీ చెల్లెను తోలుకబోమని ” చెప్పిండు. చెల్లెను,పిల్లగాండ్లను పండుగకు తీసుకొచ్చిండు ఇద్దన్న.

అడివమ్మ పెద్దమ్మతోకలిసి సద్దలు ఇసుర్రాయిలేసి ఇసురుతుంది. ఇసుర్రాయి మెత్తగ తిరుగుతుంది. ఇసుర్రాయి సప్పుడుకు అడివమ్మ గాజుల సప్పుడు కలిసింది. సప్పుడుకు పిలగాడు మంచిగ నిద్రబోతుండు. ఇసుర్రాయికున్న పిడినిబట్టి పెద్దమ్మ కాసేపు, అడివమ్మ కాసేపు ఇసురుతుంగ్రు. అడివమ్మ బిడ్డ అప్పుడప్పుడూ అమ్మమ్మ చేయిబట్టిలాగుకుంట పరాచికాలాడుతుంది. పిల్ల కిలాకిలా నవ్వుతుంది. అప్పుడప్పుడూ ఇసుర్రాయికున్న పిడి వదులైతంది. పక్కనె పెట్టుకున్న గుండ్రాయి తీసుకుని అడివమ్మ మధ్యమధ్యల పిడిమీద గట్టిగ కొడుతుంది. ఇసుర్రాయి కింద సెద్దర్ల, బిడ్డ నవ్వులాగే తెల్లటి పిండి పడుతుంది.

నేత్రికాడ ఇద్దన్న పిడుగులాంటి కబురుజెప్పిండు. నిన్న ఎల్లయ్యపంతులు పెద్దచెర్ల లొట్టపీసుచెట్ల మద్య శవమయి దొరికిండని చెప్పిండు. ఆగమయిన తన సంసారాన్ని చక్కదిద్దిన దేవుడు ఎల్లయ్యపంతులని పెద్దమ్మతో చెప్పింది. చూసొద్దామని ఇద్దన్నతోటంటే, శవం పంచనామాకు పోయింది. "వచ్చినంక పోదాం చెల్లే . గొడ్లకు నీళ్ళుతాపి వత్తనని" కొట్టంకాడికి పోయిండు.

***

గసపోసుకుంట ఇద్దన్నొచ్చిండు. చెల్లెతోని "నువ్వు ఆగమాగం కాకు సెల్లే ..ఒక ముచ్చట చెబుతనని, "ఎల్లయ్యపంతులు ఖునీకేసుల శివయ్య బావను పోలీసోల్లు కచ్చీరుకు పట్టుకబోయింద్రని" చెప్పిండు. అడివమ్మ చేతిలున్నఇసుర్రాయి పిడివదులై ఊడిపోయింది. లబోదిబోమని పెద్దమ్మను పట్టుకొని ఏడ్పందుకుంది. చుట్టుపక్కల ఇండ్లల్ల ఉన్న అమ్మలక్కలు అంతా కూడింద్రు.

***

పంచనామ అయినాంక ఎల్లయ్యపంతులు శవాన్ని ఇంటికి దెచ్చింద్రు. ఎల్లయ్యపంతులు బిడ్డలు కంటికిపుట్టెడు ఏడుస్తుంద్రు. వాళ్లకు తల్లిలేదు. ఉన్న తండ్రిబోయిండు. పెండ్లీడుకొచ్చిన ముగ్గురాడపిల్లలు అట్టనే ఉన్నరు. యమున "తాతా…తాతా…."అని గదుమ బట్టి,"లే…తాతా" "లే…తాతా ! ఆడుకుందాం..లే" అంటుంటే చూడొచ్చినాడోల్ల కండ్లల్ల నీళ్ళు ఉప్పెనై దుంకుతున్నై. యమున వాడిపోయిన లొట్టపీసుపూలుతెచ్చి తాతయ్య కాళ్ళకాడ బెట్టిదండం బెట్టింది. ఊరంతా కన్నీటి సంద్రమయింది.

జనాల నోట్లె అవగింజే దాగదు. శివుడు సంపిండన్న పుకారు ఊరంతా గుప్పుమంది. ఊరుకూరంతా అగ్గిబుక్కినట్టు శివుడి గుడిసెమీద ఇరుసకబడ్డరు. గుడిసెను తగలబెట్టింద్రు.

పడనిజనం నోరు తెరిసింద్రు. "ఎంచబోయినోనికి మంచమంత కంతలు దొరికినట్టు" పెద్దాయన తప్పులు లెంకుతుంద్రు. "నరంలేని నాలుక ఎటైనా మల్తది". కొందరు అడివమ్మకలవాటైండన్నరు. రంకుతెలిసి శివుడే చంపిండన్నరు. కొందరు

“ఎల్లయ్య పంతులు చేతిసంచిల పైకంకు ఆశపడి ఖూనీ చేసిండు” అన్నరు. మరికొందరు “రంకు బయటపడుతదని భయానికి చెర్లదుంకి సచ్చిండన్నరు”.

***

రోజూ అయ్యగారితో వెంట తిరిగే పాపిగాడు అయ్యాల అయ్యగారితో లేడు. ఆ దినం లేనందుకు పాపిగాడు తుండుగుడ్డ ముఖానికి అడ్డంబెట్టుకొని చిన్నపోరనిలా కన్నీరు మున్నీరైతుండు. ఆడికి చూడొచ్చినోల్లంత పాపయ్య ఏడ్పుకు కరిగిపోతుంద్రు. కన్నతండ్రి బోతే ఏడ్చినట్టేడుస్తుండు.

పాపిగాని అయ్య తాగుబోతు. అవ్వపోంగనే, మరో మనువు చేసుకుండు. అప్పట్నించి ఎల్లయ్యపంతులుకాడ నమ్మకంగుంటూ ఇంట్లెమనిషి లెక్క కలిసిపోయిండు. పాపిగాని పెండ్లికూడా ఎల్లయ్యపంతులే జేసిండు. ఆయనతో పోయిరావాల్సిన పాపిగాడు, పొద్దున్న “పెండ్లాం మల్లమ్మకు వంట్లే బాలేదని, దవాఖానల సూపిచ్చాల”ని, పంతులుకాడ పైసలు అడుక్కొని బోయిండు. పొద్దుననంగ బోయిన ఎల్లయ్యపంతులు అదేపోకడ పోయిండు. బొడ్డెమ్మను నిమజ్జనం చేసిన తరువాత పిల్లనెతకబోతే పెద్దచెర్వుల లొట్టపీసు చెట్లమధ్య శవమై దొరికిండు.

***

శివుడిని టేషన్కు తీసుకుబోయింద్రని ఇద్దన్ననంగనే అడివమ్మ గుండెలు బాదుకుంటూ తలకొట్టుకుంటూ ఏడ్చియేడ్చి సోక్కిపోయింది. తెప్పరిల్లినంక, అదలాబాదల పిలగాడ్ని ఎత్తుకొని ఇద్దన్నతో టేషనుకు చేరింది. సంకన బిడ్డ ఆకలికేడుస్తుండు. పాలివ్వాలని మర్సినట్టుంది. శివుని సంగతి ఇద్దన్న కనుక్కుందమని టేషన్లకు బోయిండు. అమీన్‌సాబు లేడు. బయట కూసోమని జమ్దారు సాబ్ గద్దాయించి చెప్పిండు.

***

అడివమ్మ టేషను బయట యాపచెట్టుకింద కూసుంది. ‘ఈ ముదనాష్ట పోడు ఏంజేసిండో....ఏం కతోనని’ అడివమ్మకు మదిల గుబులైతంది. ఏం జేయాల్నో

కాల్జేయి ఆడుతలేదు. ఇద్దన్నను మాటిమాటికి లోపలికి బోయిరమ్మని పంపుతుంది. సెల్లె బాధ చూడలేక టేషన్లకు బోతే వాల్లు కసురుకుంటుండ్రు. అయినా సెల్లెమీద పావురంతోని లోపలికిబోయి ఆల్లను ఇసిగిస్తుండు. బువ్వాల్లదాటి ఎండనెత్తిమీదకొస్తంది.

ముచ్చట తెల్వంగనే ఏగిలిబారంగ టేషనుకొచ్చిండ్రు. నోట్లె ముఖంపుల్ల కూడేయలె. పొద్దట్నుంచి పచ్చి గంగన్న ముట్టలేదు. సంకన పిలగాడు ఆకలిసోయి మర్సినట్టయింది. ఏడ్సిఏడ్సి ఏడ్పాపిండు. నిద్రలపడ్డడు.

***

"అమీన్సాబొచ్చిండు, రమ్మంటుండ"ని చెప్పంగనే, సంకన పిలగాన్ని పైకి ఎగేసుకొని, ఇద్దన్నతో దబదబ లోపలికురికింది అడివమ్మ. పోంగనే అమీన్సాబ్ కాళ్ళమీద పడ్డది. 'నీ కాల్మొక్తయ్యా, నా పెనిమిటటువంటోడు కాదు. ఇడుసురి. ఏ పాపం తెల్వదు. నీ బాంచన్ కాల్మొక్త....' గోడుగోడున ఏడుస్తంది అడివమ్మ.

ఆ గోలకు లేచిన సంకన పోరనికి ఆకలి గుర్తొచ్చింది. ఇద్దరేడ్వబట్టిండ్రు. ఇద్దన్న కూడా అమీన్సాబు కాళ్ళు బట్టుకుండు. అమీన్సాబు చికాకులుండు. సైగ జేయంగనే, జమ్దారుసాబ్ వాళ్ళను బయటకు తోలుకబోయిండు.

'పీనిగ దొరికినకాడ శివుడి చెప్పులు, రుమాలు దొరికినై. పంచనామా రిపోర్టులకూడ ఎల్లయ్యపంతులును కుతికబిసికి సంపిండ్రనొచ్చింది' ఇవరం చెప్పిండు జమ్దారు.' నమ్మకం లేనట్టుజూసి అడివమ్మ బోరుమంది.

నిమ్మలపడ్డంక "శివుడికి ఎల్లయ్యపంతులుకి మద్య మొన్న పంచాయితీ అయ్యిందటగదా?' అడిగిండు జమ్దారుసాబు. అడివమ్మ ఇవరంగా చెప్పింది. శివుడు అట్టాంటి మనిషికాదని ఇద్దన్న జమ్దారుకు జెప్పజూసిండు. పోలీసోల్లకు సబూతు కావాలి. అడివమ్మ ఏడ్పు అరణ్యరోదనయింది.

"ఉరికేటోన్ని జూస్తే తరిమేటోన్కి లోకువన్నట్టు' కోర్టుకుబోయి ఇమాన్దారితనం నిరూపించుకోమనిచెప్పి ఆడ్నుంచి తరిమిండ్రు పోలీసోల్లు. అడివమ్మకు ఏంతోస్తల్లేదు. ఇద్దన్నా..! ఇద్దన్నా...ని దారంతా శోకండాలు బెడ్తూనే ఉంది. ఆ పొళ్ళను జూసి

ఇద్దన్నకు ఆగమాగమయితంది. ఇంటికి తీసుకుబోయి ఇంతెంగిలి బడేదాక ధైర్నం జెప్పిండు. రేపు పట్నానికిబోయి వకీలుతో మాట్లాడుతాగని ఏడ్వకని సముదాయించిండు.

***

ఎల్లయ్య పంతులు హత్యకు పెద్దచెర్వు మూగసాక్ష్యమయింది. చెర్వుకు నోరుంటే ఆ గోరాన్నాపేది. ఊల్లె బతుకమ్మపండుగ సంబురం లేకుంటయింది. పీనుగ బోతుంటే ఊరికన్నీటితో పెద్దచెర్వుల నీళ్ళు రెండింతలయ్యింది. పెద్దచెర్వు కట్టమీద ఇసుకబోసినట్టు జనం కదిలింగ్రు. చెర్వుకట్టచివర్న దానమయింది. సలువమ్మ కొడుకు తలగోరి పెట్టిండు. దానమయినంక అందరిల్లు జేరింగ్రు. చావుకొచ్చిన చుట్టాలు నిద్రజేయొద్దని నిలవలే. సలువమ్మ పెనిమిటి, దగ్గరోల్లు నలుగురైదుగురున్నరు.

***

తెల్లారమ్మటాల్లకు సలువమ్మ నాయన యాదిలపడి చెల్లెండ్లపట్టుకొని ఏడుస్తుంది. దోరోరి గడిల బతుకమ్మకు పూసిన పూలన్నీ ఏడుస్తున్నయి. పాపని పెండ్లామొచ్చింది. మద్యమద్యల కండ్లు వత్తుకుంట కొద్దిసేపేడ్చింది. సలువమ్మ మడిసి మడిసికేడుస్తుంది. అదిజూసి చిన్నపిల్ల యమున బెదిరిపోతుంది. ఆడ్నించి పాపని పెండ్లాము చినపిల్లను వాళ్ళింటికి తీసుకబోయింది. యమున సురుకున్న పిల్ల.పాపయ్య ఇంటితాన పిలగాండ్లతో సెండాట ఆడ్తుంటే, సెండు గాబుల పడ్డది. సెండుతీస్తుంటే తాత ఎర్రసంచి కన్పడింది. ఆ సంచిల చేయిబెట్టింది. డబ్బులు లేవు. లొట్టపీసుపూలున్నయి. అవి వాడిపోయినై. ఆటిని పట్టుకొని ఇంటికి బోయింది.సలువమ్మ చూసి “ఆ పూలెక్కడియి, మళ్ళా ఆ చెర్వుకాడికి పోయినవా ...?” అని ఈపిన రెండుదెబ్బలు బలంగా సరిసింది. “అయి ముట్టుకోవద్దని చెప్పిన కదా..” అని కన్నెర్ర జేసింది. పిల్ల ఏడ్పందుకుంది.

యమున ఏడ్పు తగ్గినంక, తాత ఎర్రసంచిల దొరికిన ముచ్చట తల్లికి జెప్పింది. సలువమ్మకు విషయం అర్ధమైంది. ఎంటనే సలువమ్మ మొగనితో పాపయ్య ఇంటికి బోయింది. గాబుల నీళ్ళల్ల ఎర్రసంచి, పాపని పాపంలా తేలుతూ కన్పించింది.

***

"పాపయ్య ఏడబోయిండని" సలువమ్మ పాపయ్య పెండ్లాన్నడిగింది. పాపయ్య పెండ్లాము కోపంతో 'వాడు పాడుగాను ... ఈ మద్యపట్టరాని సావాసాలు పడుతుండు. రాసోని తోటల చీట్లపేకాడుతుండు. అయ్యగారికి ఈముచ్చట చెప్దామనుకునేలోపే గిట్ల జరిగిందని' అన్నది. నిన్ననువ్వు యాడున్నవనడిగింది సలువమ్మ. 'పెద్దమ్మబిడ్డ సమర్తాడితే బోయినంది' పాపని పెండ్లాం. దానికితెల్వదు పాపడు దానిపేరుచెప్పి ఎల్లయ్యపంతులు తాన పొద్దుగాల్ల పైసలు అడుక్కపోయింది.

పనికి రావనుకున్న లొట్టపీసుపూలు అతిరహస్యాన్ని పట్టించాయి. పైసకు ఆశపడిన పాపని పాపం బట్టబయలైంది. పాముకు పాలుబోసినట్టయిందని నెత్తినోరు కొట్టుకొంది సలువమ్మ. పక్కలో బల్లెమయితడని ఊర్లె ఎవలూ అనుకోలేదు. ఆ నోటా ఈనోటా ఊరంతా తెలిసి, అంతా బుగ్గలొత్తుకుంద్రు.

***

బతుకమ్మ పేర్చడానికి పనికిరాని లొట్టపీసుపూలు పాపని పాపాన్ని బయటపెట్టినై. అమీన్సాబు రాసోనితోటకు జేరిండు. ఆయన్ను చూడగానే పాపిగానికి నోటమాటరాలె. "నీళ్ళు నమిలిండు". పాపిగాడి పాపం పోలీసుల ముందెక్కువసేపు దాగలేకపోయింది. నల్లికుట్ల పాపిగాడి పాపం లోకమంతా తెలిసింది. ఎల్లయ్యపంతులును చంపిన పాపిగానికి ఇనుపకడాలు పడ్డై .

పెదచెర్వు నీళ్ళు, అడివమ్మ, సలువమ్మ కన్నీళ్ళు వరదలై కడలకు తగిల్నాయి. గట్టుకున్న బురదలో మురికిపట్టిన లొట్టపీసుపూలు నీళ్ళుతగిలి తేటగయినై. ఏపాపం తెల్వని శివుడు కటకటాలకు నమస్కారంపెట్టి బయటపడ్డడు. ఇన్నాళ్ళు బువ్వ పెట్టిన లొట్టపీసు చెట్లు గిప్పుడు తన బతుకును కూడా కాపాడినై. తెల్లారిచెర్లకు బోయి లొట్టపీసు పూలకు దండం బెట్టిండు.

వెలుగు - దర్వాజ, 18.10.2020

తెలంగాణలో లొట్టపీసు పూలకు గల ఇతర పేర్లు : తూటి పూలు (సిద్ధిపేట, జనగామ, మెదక్), సలేంద్ర పూలు (ఉమ్మడి వరంగల్), గడ్డ గరుగుడు పూలు(వరంగల్), లబ్బరు పూలు (ములుగు), పాలసముద్రం పూలు (ధర్మపురి, పెద్దపల్లి, జగిత్యాల, రాయికల్, ఆదిలాబాదు), బేశరం పూలు, బద్మాష్ పూలు, సిగ్గు మాలినపూలు, సిగ్గు మల్లెపూలు, సొంగ పూలు(కామారెడ్డి).
సేకరణ : "తెలంగాణ పదాలు, ఇసిరెలు, సంస్కృతి (గడిగోలు)" ముఖపుస్తక సమూహం సాయంతో...

టముకు

"ఇయ్యాల పొద్దాక బుచ్చయ్య గుంపు సవాట్ల చిడతలరామాయణం యేస్తుండ్రని" ఊల్లె టముకేసిండ్రు. బుచ్చయ్య గుంపు చిడ్తల రామాయణం ఆడుట్ల చుట్టుపక్కల ఊర్లల్ల పేరెల్లింది. సందెకాడ ఊరి జనమంతా బువ్వతాగి, దానికోస మెదురుజూస్తుండ్రు. చేతుల్ల పెద్దపెద్ద చిడతలు పట్టుకొని, ముప్పై ముగ్గురు యువకులు జోరుగా పదం, పాదం కలుపుతుంటే ఓ పండుగలెక్క ఉంటది. అందునా ఇయ్యాల ఒక్కరోజే బాలకాండం, యుద్ధకాండం రెండిటిని జెప్తారంట. మరో ముఖ్యవిషయం ఏందంటే యుద్ధకాండంలో భారత పద్మవ్యూహాన్ని జూపుతారటని టముకు పడ్డది. జనం ఆత్రంగ జూస్తుండ్రు. ఆ వ్యూహం జూపడం చిడ్తలరామాయణ గుంపుకు ఓ గొప్పవిషయం. చూడడం జనాల బాగ్గెం. జనాల ఆత్రం ఎక్కువయితుంది.

చిడ్తలరామాయణముల ఆడోల్ల పాత్రలు కూడా మొగోల్లే ఏస్తరు. రామాయణం లున్న పాత్రలన్ని కనబడ్తున్నె. ఆ చిత్రం చూడడానికి జనం నిద్రలాపుకొని ఎదురుజూస్తుండ్రు. ఇంకా ఆట మొదలుకాలే.

చిడ్తలరామాయణము సూత్రధారి, పాటకాడు బుచ్చయ్య పంతులు. వయసులో అందరికంటే పెద్దవాడు. మిగతా వాళ్ళంతా యువకులు. మంగలి సర్వడు మేటేశకాడు. రాములేశం. సర్వడు ఏశం కడితే మా బాగా కుదుర్తది. రాములోరి ఏశం కడితే అమ్మలక్కలంతా మంగలార్తులు పడ్తరు. బిందెలతో నీల్లారబోస్తరు. ముసలోల్లు దండంబెడ్తరు. కన్నెపిల్లలు రాముడి సూపుకు తారాడుతరు. అంతెత్తున్న సర్వన్ని రాముని ఏశంల సూసేటందుకే జనం నిద్రలు కాస్తరు. సర్వడు ఇంకా రాలె. తల్లిదండ్రిలేని

సర్వనికి, బుచ్చయ్య విద్య నేర్పిండు. వాళ్ళమధ్య గురుశిష్యుల సంబంధం కన్నా, తండ్రి బిడ్డల అనుబంధమే ఎక్కువ.

బుచ్చయ్య ఐరాన పడ్తుండు. ఇంకా సర్వడు రాలేదు. సర్వడు దినాం మంగలిపనికి కేశపురం పోతడు. అయ్యాల నాలుగు కత్తెరలెక్కువ దొరికినట్టున్నై. ఆలస్యమయింది. కాని జనం ఆత్రమెక్కువైంది. ఆగుతల్లేరు. గోలజేస్తుండ్రు. సర్వని దగ్గరి సోపతిగాడు మల్లయ్య. మల్లయ్యది సీతమ్మేశం. బుచ్చయ్య పంతులు మాటిమాటికి సర్వని గురించి మల్లయ్యను మందలిస్తుండు.

బుచ్చయ్య పంతులు ఆగమాగం అయితుండు. అంగుకు సర్వడు రాలేదని మల్లయ్యమీద చిందులేస్తుండు. 'వస్తడు పెద్దయ్య..!' అని నచ్చజెప్తుండు మల్లయ్య. సర్వయ్య రానేవచ్చిండు. అది కూడా.. రాములేశంల. చూడంగనే బుచ్చయ్య కోపమంత జనాల కేకల్లనే ఎగిరిపోయింది. చిడతల రామాయణం మొదలైంది. యువకులందరి చేతులల్ల చిడతలు గాల్లోకి లేశినై.

శ్రీరామచంద్ర మహారాజుకీ...జై...జై... బుచ్చయ్య పాటందుకున్నడు..

"రామచంద్రుడనురా...
రాజీవనేత్రుడను, శ్యామల వర్ణుడ..
రామచంద్రుడనురా...
అయోధ్యాపతిగాధీపతుండను..
రామచంద్రుడనురా..."

జనం పొద్దుందాక చేండ్లల్ల పడ్డ గొడ్డుకష్టాన్ని మరిసిండ్రు. ఆ పాట ఇనపడ్డంత దూరం చిన్నపిల్లగాండ్లు నిద్రలోకి జారిండ్రు. నడిజాము దాటింది. యుద్ధకాండం దాకా పోలేదు. ఆరోజు పద్మవ్యూహమూ వేయలేదు. తెల్లారి ఏస్తమని ఆరోజు ముగించిండ్రు. జనం కొంత నిరాశతో ఇండ్లకు పోయిండ్రు.

***

"అభ్యాసము కూసు విద్దె" అన్నట్టు తెల్లారి రాములవారి గుళ్ళ బుచ్చయ్య పంతులు గుంపుతో సాధనజేస్తుండ్రు. ఇయ్యాల ఎట్టనన్న పద్మవ్యూహం ఎయ్యాలని వాళ్లకు పదం, పాదం నేర్పుతుండు. సాధనకు సర్వయ్య, మల్లయ్య రాలేదు. సర్వడు

కూడా తనలెక్కనే ఒక్కసారి చూస్తే, వింటే నేర్చుకునే రకం. అందుకే సాధనకు రాకున్నా పంతులు బాధపడడు. "సర్వడు కేశపురంల మంగలి పనికి పోయినట్టుంద"ని అనుకుండు బుచ్చయ్య పంతులు. వాడు జేసుకుంటేనే బతుకాయే, ఈ మద్దే కొత్తగా పెండ్లైంది. ఇక మల్లయ్య జల్దొస్తానని పొద్దుననంగ బోయిండు. మల్లయ్య కూడా సాధనకు రాలేదు. తోడు దొంగలు యాడికి పోయింర్రోననుకుంట పంతులు సాధన జేయిస్తుండు.

***

బుచ్చయ్య పంతులు కొడుకొచ్చి "సర్వన్నని వీరారెడ్డి కొట్టంల గుంజకు కట్టేసి గొడ్డును బాదినట్టు బాదుతుంర్ర"ని చెప్పిండు. ఎంటనే బుచ్చయ్య పంతులుతోబాటు యువకులంతా పరుగుపరుగున ఆడికి ఉరికింర్రు. అప్పటికే సావుదెబ్బలు తిన్నడు సర్వడు. ఒళ్ళు హూనమయ్యింది. కండ్లు తేలేసిండు. ఒళ్లంతా నెత్తురు కారుతుంది. మంటమీదున్న వీరారెడ్డి, బుచ్చయ్య గుంపును జూసి మెత్తబడ్డడు. వీరారెడ్డిది పెద్దెగుసాయం. ఇరవయ్యెకరాల మామిడితోట, ముప్పై ఎకరాల పొలం, ఇరవైమంది జీతగాండ్లున్నరు. ఊల్లె ఆయన మాటకు తిరుగులేదు.

"ఎందుకు కొడుతున్నవు..పటేలా.."ని బుచ్చయ్యపంతులడిగిండు. బుచ్చయ్య పంతులు వయసుకు గౌరవం ఇచ్చిండు వీరారెడ్డిపటేలు. నిజం చెప్పాలంటే గౌరవం, పంతులు ఎనుకున్న మందబలానికిచ్చిండు. ఆ విషయం వీరారెడ్డికొక్కనికే తెలుసు. అయినా వీరారెడ్డి ముఖమంతా ఎర్రబడ్డది. "ఈ తాకతు తప్పిన.. నా కొడుకు, నా తోటకు దొంగతనానికొచ్చి, నా సెల్లెను బలిమి చేస్తుండు. ఈడ్ని ఈడనే సంపి బొందబెడతా, యాడ ఫిరాదయితరో..ఫిరాదు కంర్రి" అని కోపంతో ఊగిపోతుండు వీరారెడ్డి. వీరారెడ్డి చెల్లె ఇందిర. రూపుల ముద్దబంతిపువ్వోలె సక్కగుంటది. ఆమె అందం అడవికాసిన ఎన్నెల. లగ్గమైంది. కాని పిల్లల్లేరని మొగుడు వదిలేసిండు.

"సమయానికి పోకపొతే అన్నంత పన్జేసేటోడని"మనసుల అనుకుంటూ, బుచ్చయ్య పంతులు వీరారెడ్డి పటేలుకు నచ్చజెప్పజూసిండు. పటేలా... 'ఈతాపకి నా మొకంచూసి వదిలేయింర్రి. మల్ల ఇట్టాంటి తప్పు జరగదు. ఈసారికి తప్పుకాయండి. బాంచన్! నీ కాల్మొక్త"నని దండంబెట్టిండు. ఏ దిక్కు లేని పోరడు. మొన్నమొన్ననే పెండ్లయింది. ఈడ సస్తే ఈని పెండ్లాము ఉరిపోసుకుంటది. బతుకదని వీరారెడ్డికి

చెప్పుకుంట ఆయన కోపం తగ్గటానికి పంతులు సర్వని వైపు తిరిగి, 'పోగాలానికి పుట్టినబుద్ధ'ని తిట్టిపోసిండు. వీరారెడ్డి కొద్దిగా నిమ్మలమైండు. 'ఇంకోసారి కన్నెత్తి జూస్తే ప్రాణాలు తీస్తానని' బెదిరించి, ఆడ్నించి వీరారెడ్డిపటేలు ఎల్లిపోయిండు. తరువాత ఏంజరిగిందని బుచ్చయ్యపంతులు , సావాసగాళ్ళు ఎంత అడిగినా సర్వడు నోరిప్పలేదు.

***

మంగలి సర్వనికి అప్పటిదాంకున్న మంచిపేరు మంటగలిసింది. ఊరంతా టముకుపడ్డది. ఉన్నూర్లె ఇమడలేక పెండ్లాన్ని తీసుకొని కేశపురం పోయిండు. మంగలిపని జేసుకుంట ఆడనే బతుకుతుండు. చిడతల భజనకు, బుచ్చయ్యపంతులుకు రాముడు దొరకలేదు. ఊరిజనం మధ్యమధ్యల గుర్తుజేసుకుంద్రు. ఏడాది గడిచింది. సర్వడదే పోకడ. ఊరికి తిరిగి రాలేదు. ఒకటి రెండుసార్లు చిడ్తల భజన ఏసినా మతిలేని మాట శ్రుతిలేని పాటైంది. బుచ్చయ్య పంతులు చిడతలు అటకెక్కినై. గొంతు పడావుబడ్డట్టైంది. గుంపులో జనం ఒక్కొక్కలు బతుకుదారికి పట్నంబాట పట్టింద్రు. ఆ ఊరి జనానికి పద్మవ్యూహం జూసే బాగ్గెం పోయింది.

***

ఇందిరమ్మ సర్వనికి మరిగి, సర్వనికి మనువు బోయిందని ఊరంతా టముకుపడ్డది. బుచ్చయ్య పంతులు నమ్మలేదు. ఆలోచనలోపడ్డడు. సర్వడు దెబ్బలుతిని ఆర్నెల్లు నమిశిండు. పెండ్లాన్ని కాదని అంత దైర్నం జేస్తడని అనుకోట్లేదు. అనుమానంతోటి కనుక్కరమ్మని మనిషిని కేశపురం పంపిండు. ఇంటికాడ ఆని పెండ్లామే ఉంది. ఈలోగా జరగాల్సిన ఘోరాలు జరిగ్గినై. ముచ్చట తెలిసి సర్వయ్య పెండ్లాము గాసునూనె బోసుకుంది. సావలేదు. భూమిమీద నూకలున్నట్టున్నై. చుట్టుపక్కల అమ్మలక్కలు కాపాడింద్రు. వీరారెడ్డి ఆగలేక కేశపురంల సర్వనింటికి బోయిండు. సర్వడు దొరకకపోయేసరికి, ఇక ఏ ముఖం పెట్టుకొని ఊల్లెకు బోవాల్నని, అవమానం తట్టుకోలేక వీరారెడ్డి కొట్టంల ఉరిబోసుకు సచ్చిండు.

***

మంగలి సర్వడు దేన్నో లేపుకుబోయిండని కేశపురం ఊరంతా టముకు బడ్డది. కాని అసలు విషయం వేరే ఉంది. మంగలిపనికి అర్వపల్లికి పోయి, పొద్దూకొస్తుంటే

చీకట్ల పాముకరిసింది. అట్నుంచి అటే వెనకకుబోయి తురకాయన దగ్గర దెబ్బకొట్టించుకుండు. దెబ్బ పనిచేయనట్టుంది. నోట్లె నురగలు వచ్చినై. సోయి తప్పిండు. కండ్లు తెరిసేసరికి తెల్లారి దవాఖానాల ఉండు. ఎవలో పుణ్యాత్ములు ఆసుపత్రికి తీసుకబోయింగ్రు. చావుతప్పి కన్నులొట్టబోయి ఇంటికి తెల్లారొచ్చిన సర్వనికి సంగతంతా అర్థమైంది. ఏ పాపం ఎరుగనని, పెండ్లానికి ప్రమాణం, ఇమానం జేసిండు. అదినలె, దానిమాట దాందే. చివరికి దానినెత్తి కొట్టిండు. అనుమాండ్ల గుడికాడ ప్రమాణం జేసినంక నమ్మింది. ఆడ్నించి తట్టబుట్ట సర్దుకొని, ఈడ వుంటే లాభంలేదని దూరంగా సూర్యాపేటవతల సందుపట్లకు మకాంమార్చింగ్రు.

***

తరువాత తెలిసిన విషయం ఏంటంటే ఇందిరమ్మను మల్లయ్య లేపుకు పోయిండని. అన్న సావుకురాని ఇందిరమ్మ, కొడుకు బుట్టినాక మొగుడు మల్లయ్యతో కలిసివచ్చింది. అన్నను మింగిందని అందరూ కొన్నాళ్ళు తిట్టిపోసింగ్రు. తరువాత ఎవలి పనులల్ల వాళ్ళుపడ్డరు. నిజం తెలిసినాక బుచ్చయ్య పంతులుకు మల్లయ్యపై కోపం కలిగింది. సర్వయ్యపై జాలికలిగింది. సోపతిగాడు మల్లయ్యను కాపాడడానికి సర్వడు తిన్న సావుదెబ్బలు కండ్లముందు కదిల్నై. తనవల్ల సర్వయ్య ఊరు వదిలిపెట్టడం మల్లయ్యకు కూడా బాదేసింది.

సర్వయ్య మనిషి అందంగా ఉంటడనుకున్న జనానికి ఆడి మనసు కూడా అందంగా కన్పించింది. సర్వయ్య గురించి కేశపురంల ఎవ్వర్ని అడిగినా జాడ దొరకలే. పదేండ్లు గడిచింది. బుచ్చయ్య పంతులు వయసు పెరిగినప్పటికి గట్టిగనే ఉండు. రాంపురాన పిలగాడినిజూసి ఈ మధ్యే మనుమరాలికి పెండ్లి కూడా చేసిండు.

***

బుచ్చయ్య రాంపురానికి మనుమరాలికాడికి పోతుండు. పొద్దుగుంకింది. సందుపట్లదాటితే రాంపురం. ఒక మైలుంటది. బాగా దూపయితందని, సందుపట్ల కాడాగి ఓ ఇంట్లే మంచినీళ్ళడిగిండు. పెద్దమనిషి మంచానుండు. లేవలేక పోతుండు. కుండవైపు చెయ్యి జూపిండు. కుండలో మంచిల్లు తీసుకొని తాగుతుండగ, అవతల బజాట్ల చిడతల సప్పుడు ఇన్పడుతుంది. శ్రావ్యమైన గొంతు... చాలా దగ్గరిదే. అదే గొంతు....అవును. అదే సర్వని గొంతు. గుర్తుపట్టిండు బుచ్చయ్య పంతులు. చెంబక్కడ

పెట్టి, ఆదల బాదలగ వేగంగా అటువైపు నడిశిండు. మనసు ఆగబట్టలేక పోతుండు.

సర్వనిచూసి ఎన్నాళ్ళయిందో. అనుకుంట ఆడికిజేరిండు. ముప్పై మందికిపైగా యువకుల చేతుల్లో చిడతలు ఆడుతున్నె. వాటికనుగుణంగా అందంగా అడుగులుపడుతున్నె. వాళ్ళంతా సర్వని పాటకు వంత పాడుతుండ్రు. జనం చిక్కగున్నరు. చిత్రంగా జనం చూస్తుండ్రు. రెప్పవేయడం కూడా మరిసినట్టుండ్రు. వాళ్ళందరిని దాటుకొని ముందువరుసకు చేరిండు బుచ్చయ్యపంతులు. ఒక్కక్షణం బుచ్చయ్య పంతులు కూడా ఆశ్చర్యంతో గడ్డకట్టుక బోయిండు. కండ్లెంట ఆనందంగా ప్రేమ కురుస్తుంది. యువకులు చిడతలతో పద్మవ్యూహం యేసిండ్రు. అది చూసిన జనం చప్పట్లే చప్పట్లు. జనం చేతులతో వారిపై పూలవర్షం కురిపిస్తుండ్రు. తన వల్ల కానిది....సర్వడు చేసి చూపిండు.. చిడతల భజనలో 'పద్మవ్యూహం'. సర్వని గొంతు పాటందుకుంది..

'పంతులు బుచ్చయ్యగారు..
అడుగువేయ... నేర్పినారు..
బుచ్చయ్యగారు
చిడత కొట్టనేర్పినారు...
బుచ్చయ్యగారు
మా పంతులు...
బుచ్చయ్యగారు.."

బుచ్చయ్య పంతులును చూసిండు సర్వడు. పాట అపిండు... ఎంటనే యువకులంతా ఆగిపోయిండ్రు. సర్వడు బుచ్చయ్య పంతులు దగ్గరికొచ్చిండు. సప్పున కాళ్ళనందుకుండు. అమాంతం సర్వయ్యను గట్టిగపట్టుకొని కౌగిలించుకున్నడు బుచ్చయ్యపంతులు. అక్కడున్నవాళ్ళందరికీ మా బుచ్చయ్యపంతులని అరిచి జెప్పిండు. పూలదండలు బుచ్చయ్య పంతులు మేడలో నిండుగా పడ్డె. దాంతో ఈ ముచ్చట ఆ ఊరంతా టముకుపడ్డది.

– సబాల్టర్న్–బులెటిన్ 6– ఏప్రిల్ 2021

వెలుగు చుక్క

దేశసరిహద్దునున్న సియాచిన్, వార్షి పౌరస్థావరం. కల్నల్ ఆనందరావు తన పటాలంతో దేశరక్షణవిధులను నిర్వర్తిస్తున్నాడు. ఆ రోజు కల్నల్ ఆనందరావుకు ప్రమోషనొచ్చిందని తోటి జవానులకు దావతు ఏర్పాటుజేసిండు. అంతా మజాలో ఉంఁడ్రు. రాత్రి దాదాపు పదకొండు గంటలు ఐతంది. మత్తువాళ్లకి కొత్తకాదు. బయట చీకటి కూడా భయపడేంత వాన కురుస్తుంది. ఎట్లొచ్చింఁడ్రో, నలుగురు తీవ్రవాదులు పనోల్లమాదిరి ఆ దావతుల జొచ్చింఁడ్రు. కండ్లుకప్పి కల్నల్ ఆనందరావు పన్నెండేల్ల కొడుకును, ఇంకా ముఖ్యమైన కొన్ని ఆయుధాలను ఎత్తుకబోయింఁడ్రు. అది తెల్వంగనే ఒక్కసారిగా అక్కడ చీకటిని మించిన విషాదం, భయం అందరిలో కమ్మింది. తెల్లారేసరికి సరిహద్దుదాటి, వాళ్ళచెర నుండి తన కొడుకును, ఆయుధాలను తీసుకురావాలి. ఏమాత్రం ఆలస్యమయినా తన కొడుకు మిగలడు. తమ ఆయుధాలు కూడా దక్కవు.

ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిస్తే, ఇన్నేండ్లు చేసిన దేశసేవ, మంచిపేరు పోతది. తమ నిర్లక్ష్యానికి అందరి ఉద్యోగాలు పోవడంతోబాటు, సైనిక చట్టాల ప్రకారం కఠినశిక్షలు కూడా జీవితాంతం అనుభవించాలి. ఇప్పుడు మనకు ఒక సమర్ధవ్యూహం, సామర్థ్యంకల్గిన నాయకుడు కావాలని ఆలోచనలోపడ్డాడు కల్నల్ ఆనందరావు. దొంగదెబ్బతీసిన దుర్మార్గులను దొంగదెబ్బతో వేటాడే సింగం కావాలని

ఆలోచిస్తుండగా, తటాలున 12 మహార్ రెజిమెంటుకు చెందిన మేజర్ కిరణ్ గుర్తొచ్చాడు. ట్రైనింగ్లో కిరణ్ను చూశిండు. మెరుపు వేగం, డేగకళ్ళు, గుండెనిండా నిబ్బరం, ఆత్మవిశ్వాసం అతని సొంతం. కిరణ్ తనవూరుకు చెందినోడే. కాకపోతే వయసులో చిన్న. వాళ్ళ నాయిన కోరిక, తన ఆసక్తితోటి సైన్యంలో చేరిండు. లేకపోతే అతనికున్న తెలివికి విదేశాలు ఎర్రతివాచి పరిచి లక్షల్లో జీతం ఇస్తాయి. చుట్టుమట్టు పద్నాలుగూర్లల్ల ఆళ్ళ నాయినకు మంచి పేరుంది. పెద్దాయన సహాయం పొందినవాళ్ళలో తనూ ఒకడు. తనింట్లే కూడా దేవుని పటం పక్కన ఆల్ల నాయన ఫోటో ఉంటది. కిరణ్ను ట్రైనింగ్లోపై అధికారిగా ఏనాడుచూడలేదు. సొంత తమ్మునిగానే భావించి ఆత్మీయంగా చూసిండు. మాట్లాడిన కొద్దీ చూస్తుంటే, కిరణ్ మాట, గుణం అచ్చు ఆళ్ళ నాయినలాగే అన్పించేది. ఆ చొరవతోటి, అతిరహస్యంగా చేయాలనుకున్న ఈ ఆపరేషన్కు కిరణ్ సహాయం తీసుకోవాలనుకుండు. చెప్పిన వెంటనే అందరూ ఒప్పుకున్నరు.

ఇక మేజర్ కిరణ్ ఒప్పుకుంటడా, తమ కష్టాన్ని అతనెందుకు పంచుకుంటడని కిరణ్ గురించి తెల్వని జవానులంతా అనుమానించారు. కానీ కిరణ్ తండ్రి గురించి తెలిసిన ఆనందరావుకు మాత్రం కిరణ్ సాయంమీద నమ్మకం పోలేదు. వాళ్ళ రక్తంలోనే సాయపడే గుణం ఉంటుందని తెలుసు. ఇప్పుడు మేజర్ కిరణ్ వాళ్ళ ఉద్యోగాలకు, ఆనందరావు కొడుకు ప్రాణాలకు ఆశాకిరణమయిండు. ఆనందరావు మిలటరీ భాషలోనే "ఎమర్జెన్సి.. త్వరగా తన వద్దకు రావాలని, క్లుప్తంగా విషయం చెప్పి కాపాడాలని" కబురుపెట్టిండు. అరగంటలో అక్కడికి వస్తనని, కాపాడతనని మాటిచ్చిండు మేజర్ కిరణ్. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క కొడుకు బద్మాష్ గాళ్ళ చేతుల్లో బందీ అయినందుకు తల్లి కన్నీరుమున్నీరవుతుంది.

***

సాధారణంగా ఇలాంటి సైనికాపరేషన్లకు ప్రభుత్వ అనుమతి అవసరం. రహస్య సైనికాపరేషన్లుంటై. కాని అనధికార ఆపరేషన్లు సైన్యంలో ఉండవు. అలాంటి వాటిని

తీవ్రనేరంగా భావిస్తరు. సైనిక శిక్షలు కఠినంగా ఉంటై. తమ పటాలంకు చెందని సైనిక ఆపరేషన్లలో పై అధికారులకు తెలియకుండా పాల్గొనాలి. అదికూడా దేశసరిహద్దు దాటి చేయాల్సిన సైనిక ఆపరేషన్. ఏ మాత్రం విషయం బయటకు పొక్కినా తను ఎదుర్కోబోయే శిక్ష ఉహించడానికే కష్టం. కానీ కిరణ్ అవేవి ఆలోచించడం లేదు. ఆనందరావు కొడుకు వాళ్ళ చెరలో ఉండన్న ఒకేఒక్కవిషయం మాత్రమే ఆలోచిస్తుండు. ఎంతయినా పరోపకారగుణంలో కిరణ్ వాళ్ళ నాయిన సాలు.

దగ్గరిమిత్రుడు ధనుంజయికి చెప్పి ఆడ్నించి బయల్దేరిండు. ఎల్తుంటే ధనుంజయి జాగ్రత్తలు జెప్పి "ఎందుకు రిస్క్ తీసుకుంటున్నవు? తండ్రి తవ్వినాడని గొయ్యి దున్కితే మున్గవా. మీ ఊరని సమస్య ఎత్తుకుంటే, నీ నెత్తిమీదకి వస్తది కదా"ని శ్రేయోభిలాషిగా మంచిచెప్పిండు. కిరణ్ తన మంచిచెడులు అన్నీ ధనుంజయితోనే పంచుకుంటడు. ధనుంజయి కూడా అంతే. మిత్రుని క్షేమం గురించి తపనపడతడు. వాళ్ళ స్నేహం అన్నదమ్ముల అనుబంధంకంటే గొప్పది. దానికి కిరణ్ నవ్వుతోబాటు "తల్లి గండము పిల్ల గండముంటది కాని మంత్రసానిగండము ఉంటదా?" అని సామెతను సమాధానంగా చెప్పి బయలుదేరిండు. మిత్రులు ఇద్దరూ పెద్దగా నవ్వుకున్నరు. గతంలోనే ఇలాంటి సందర్భాలు, సాహసాలు ఎన్నో వచ్చినై. అలవాటైంది ఇద్దరికీ. మిత్రుని సాయంతో అరగంటలో యుద్ధ హెలికాప్టర్లో చేరుకుండు. మేజర్ కిరణ్ను చూడంగనే కల్నల్ ఆనందరావు కళ్ళల్లో ఆశ చిగురించింది. అక్కడున్న జవానుల్లో ఉత్సాహం రెట్టింపయింది.

***

సైన్యంలో ఇంతకుముందెన్నడు ఎవరూ ఎదుర్కోని సవాలును ఎదుర్కొంటుండు మేజర్ కిరణ్. విషయమంతా తెలిసి కిరణ్ కండ్లు చింతనిప్పులైనై. కండ్లల్ల కన్నతండ్రి ఇచ్చిన ఆత్మవిశ్వాసం మెరుపులా మెరుస్తుంది. యాభైమందితో ఆ రాత్రే కాలినడకన బయల్దేరిండు మేజర్ కిరణ్. డేగ కళ్ళతోని అందరి ప్రాణాలకు పహారాపెట్టి ముందు నడుస్తుండు. సావు ఎప్పుడు ఎక్కడ నుంచొచ్చి గద్దలాగ ఎవర్నయిన ఎత్తుకబోవచ్చు. వాళ్ళు సావుకు భయపడరు. శత్రువుల సావును మెడలేసుకొని తిరుగుతరు. సావు

ఆల్లను కూడా తలకాసుకొని ఉంటదని తెలుసు. ఇప్పుడు వాళ్ళ ఏకైక సంకల్పం తమ లక్ష్యాన్ని తెల్లారకముందే ముగించాలి. అప్పటికే నడిజామైంది. సల్లటి మంచు వర్షంలాగా కురుస్తుంది. ఊపిరి కూడా బర్ఫయితుంది. నెత్తురు గడ్డకడుతుంది. చేతివేళ్ళు తిమ్మిర్లు పడుతున్నై. జవానులు ఆయుధంపై పట్టును మరింతగా బిగిస్తుంద్రు. ఎంత మంది ఆటున్నరో తెల్వదు. గీత దాటినంక తిరిగి దేశంల అడుగుబెడతారో లేదో తెల్వదు. వాళ్లకు బందీగ చిక్కడం కంటే సావే నయం. విజయమో వీరస్వర్గమో ఇక అంతే.

***

జవానులకు జంగుధైర్యంను నూరిపోసి సత్తువనిస్తుండు మేజర్ కిరణ్. వాళ్ళ అడుగులు శత్రువులవైపు ఉత్సాహంగా ముందుకు పడుతున్నై. శత్రువుల గుండువస్తే నన్నుదాటుకొని రావాలని, వాళ్లకు నమ్మకాన్ని పోరాడే ప్రేరణను ఇస్తుండు. నాయకత్వంలో వున్న గొప్పగుణమే అది. సమయం రెండు దాటింది. సరిహద్దు సమీపిస్తుంది. మధ్యల కతువ ఉంది. కతువ గుండా కాకుండా తెలివిగా కాలువగుండా మార్గాన్ని ఎంచుకుంద్రు. అదిదాటితే వాళ్ళ బంకుల చేరొచ్చు. ఇక తమ ఆపరేషన్ గడియసేపట్లో పూర్తవుతుంది. ఆ ప్రాంతమంతా జవానులు క్షుణ్ణంగా కావలి కాస్తుంద్రు. శత్రువుల కండ్లల్ల పడకుండా కాసుకొని ఉంద్రు. మేజర్ కిరణ్ బైనాక్యులర్‌లో జూస్తూ వ్యూహం ఆలోచిస్తుండు. చేప పిల్లకు ఈతనేర్పాల్నా .

***

సరిహద్దు దాటిరాలేరనే శత్రువుల అతినమ్మకాన్ని కాసేపట్లో మేజర్ కిరణ్ వమ్ముజేసిండు. తెలంగాణ బిడ్డ తెగువ తెలివిముందు శత్రువులు నిల్వలేకపోయింద్రు. దొంగతనంగా ఎత్తుకుబోయిన పిలగాడ్ని ఆయుధాలను బాజాప్తుగా చేజిక్కించుకొని వస్తూ వస్తూ అక్కడ అర్ధరాత్రి పగటివెలుగులు చూపించి వెనుదిరిగిండు మేజర్‌కిరణ్. ఉదయం అయిదు గంటలకల్లా మిషన్ పూర్తయింది. ఏ ఒక్కరిని నష్టపోకుండా శత్రువులను పూర్తిగా అంతంజేసే వ్యూహంకి (సర్జికల్ స్ట్రయిక్) అంకురార్పణ జేసిండు.

దానిని బయటకు చెప్పుకోలేని సందర్భం అయింది. మదిల మేజర్ కిరణ్కు కల్నల్ ఆనందరావు దంపతులు, జవానులు మదిల గుడి కట్టేసింద్రు. గంధపుచెక్క పరిమళం ఇవ్వడం తప్ప, మననుంచి ఏంశించదు కదా. కిరణ్‌కూడా అంతే. వాళ్ళ అభిమానానికి ధన్యవాదాలు తెలుపుకుని ఆడ్నించి బయల్దేండు. కల్నల్ ఆనందరావు మదిల కిరణ్ తండ్రి సర్పంచి వెంకట్రాంరెడ్డి మెదిలిండు. చిన్నప్పటి సంగతి గుర్తొచ్చింది.

***

చెడు ఎప్పుడూ మంచికి శత్రువయితది. చివరికి మంచే నిలబడతది. అది చరిత్రలో నిజం. రాజకీయంగా తనకు అడ్డయితండని గిట్టని ప్రత్యర్థులు సర్పంచి వెంకటరాంరెడ్డిపటేలును నరికి సంపింద్రనే సంగతి ఊరంతా పాకింది.

గొడ్డళ్ళు, గడ్డపారలు ఎర్రబడి నిలబడ్డై. జనాగ్రహానికి భయపడి పట్నం ఉరికింద్రు. ఊర్లె ఆయన ఉపకారం పొందని మనిషిలేడు. శత్రువడిగినా సాయంజేసే గొప్పగుణం ఆయనది. ఆకాశం కన్నీరు కారుస్తుంది. ఊరు ఊరంతా హంతకులిండ్ల మీద పడ్డరు. జెంకిన హంతకులు పోలీసులకు లొంగిపోయింద్రు. తలారిపగ తలతో మాత్రమే తీరతది. చట్టం వదిలినా ధర్మం వాళ్ళను ఇడిచిబెట్టలే. కాలం వాళ్ళను కాలనాగులా వెంటాడింది. చీమకు కూడా అపకారం చేయని వెంకటరాంరెడ్డి పటేలు హత్యకు పగదీర్చుకుంది. చంపిన నలుగురిలో ముగ్గురూ కుక్కచావు సచ్చింద్రు. మిగిలినొక్కడు బతికున్న శవంలాగ బతుకీడుస్తుండు. అందరూ పెరోలుకు బోయోస్తుండగా రోడ్డుప్రమాదం జరిగింది. ధర్మం వాళ్లకు బుద్ధి జెప్పినట్లయింది.

వెంకట్రామిరెడ్డి పటేలు తనకు ఆపదని ఇంటిగడప దొక్కినోల్లకు లేదనకుండా సాయంజేస్తడు. తినేటప్పుడు ఎవలన్నా ఇంటిముందుకొచ్చి ఆకలంటే, కుండల లేకుంటే, తట్లె బువ్వ గుమ్మరిస్తడు. ఆ ఇంటి ఇల్లాలు సక్కని తల్లి. ఆమెది నిండు గుణం. పెనిమిటికి తగ్గ పెన్నిధి. అయ్య దాసండ్లకు పెడితే అమ్మ జంగాలకు బెట్టేది అన్నట్టుగా వాళ్ళ దానధర్మాలుండేవి.

ఆనందరావు నాయిన బొందలగడ్డ కాడ పన్జేస్తడు. ఊరోల్ల ఏడ్పులతో

బువ్వపెడుతున్నవని అయ్యతో ఊకె అవ్వగోల జేసేది. ఈ పని బందుజేసి ఇంకేదన్నా పన్జేసుకుబద్దామని చెప్తుండేది. ఈ పని మానేస్తే మనకు పనెవలిస్తారు. ఇంకోలెవలైన ఈ పన్జేయ్యాలి కదే. తాతతండ్రిల కాంచి వస్తుందని అనేటోడు. అయ్యాల మాత్రం అవ్వ పట్టిడవలె, అయ్యను తోలుకొని రాంరెడ్డి పటేలుకాడ ఫిరాదయింది. పటేలుకు అవ్వ దండం బెడుతూ, "అయ్యా ! బేగరోల్లుమని, పిలగాడ్ని బడికి నా పెనిమిటికి పంపుతల్లేడు. మీరన్నా చెప్పండయ్యా "అంది. మా బతుకుల్లాగే నా బిడ్డబతుకు గావాల్నా, చెబితే శెవిన పెడతల్లేదంది." కానీ అయ్య, పటేలుకుకూడా ఎప్పుడూ శెప్పిన మాటే చెప్పిండు.

రాంరెడ్డిపటేలు కొంచెంసేపు ఆలోచించిండు. అయ్యతో.. "ఏం ఐరాన గాకు. ముందు ముందన్నీ యంత్రాలైతయి. ఈ పని యంత్రాలు జేత్తయి. అప్పుడు నీ కొడుకేం పని జేయాలి ? ఆలోచించు. బిడ్డను మంచిగ సదివియ్యి. నేను బడిల పంతులుకు జెబుత, షెరీక జేసుకుంటడని" చెప్పిండు. అంతేగాకుండా బిడ్డ ముకంల అచ్చరం ఎలుగుతుందని చెప్పిండు.

అప్పటికైతే అవ్వ అయ్య ముకాల్లో ఎలుగొచ్చింది. అదంతే.. ఎంత పెద్ద చిక్కునైన రాంరెడ్డిపటేలు చిటికెలో యిప్పుతడని చుట్టుపక్కల పద్నాలుగూళ్ళల్ల పేరువడ్డది. అయ్య, అవ్వలిద్దరితోబాటు తనకూ పరిష్కారం దొరకడంతో, పటేలుకు దండంబెట్టి ఆడ్నించి ఇంటికి బయలుదేరినం. అయ్యాల రాంరెడ్డిపటేలు జెప్పినమాటే ఇయ్యాల నిజమైంది. ఈ రోజు ఇంతపెద్దస్థానంలో ఉన్నానంటే అది ఆయన చలవే. ఆనాడు రాంరెడ్డి పటేల్, గిప్పుడు ఆయన బిడ్డ కిరణ్ తన బిడ్డ జీవితానికి వెలుగుచుక్కయింద్రని మనసులోనే ఇద్దరికీ దండం పెట్టిండు ఆనందరావు.

– సూర్యాపేట టైమ్స్ 31 మే 2021

తోడు

రాత్రి రెండు దాటింది. సన్నగా వర్షం పడుతుంది. "రిక్షా.." అని పిలిచిన పిలుపుకు నిద్రమత్తు వదిలి రిక్షాలాగే కూలి రామలింగం దగ్గరకు వచ్చిండు. "ఎక్కడకు పోవాలయ్య". " సర్కారు దవాఖాన" సమాధానం ఇచ్చాడు రామలింగం. బస్త సంచితీసి రిక్షాల పెట్టి , "ఎక్కండయ్యా.."అన్నడు. "బిడ్డా ! సాయంబట్టవా జర" అని,రిక్షావాని సాయంతో పెండ్లాం విజయమ్మను రిక్షాపైకి ఎక్కించాడు. విజయమ్మ చిన్నొంటి మనిషే. రిక్షా ఆసుపత్రి ముందాగింది. డెబ్బైయేళ్ళ రామలింగం రిక్షాలోంచి కిందకు దిగిండు. బస్తసంచిని కిందబెట్టిండు. కిందబెట్టిన బస్తసంచిలో ఒక శెద్దరు, చిన్నపళ్ళెం, చెంబు బైటికగుపడుతున్నై. రామలింగం ముకాన నిద్రకాసిన గుర్తు కనపడుతుంది. అనుభవం పండిన మాసినతెల్లగడ్డం, బట్టతలకాయతో ఉండు. పైన గుండీలూడిపోయినంగితో కింద దోతిని లుంగీలా కట్టి, అది జారకుండా మొల్దారంతో గట్టిగా కట్టుకుండు. బట్టలు సుత మనిషిలెక్కనే నలిగినై. మాసిపోయినై. మురికిగున్నై. రిక్షాలో విజయమ్మ మూసిన కండ్లు తెరుస్తల్లేదు. రిక్షాలో పెండ్లాన్ని రెక్కపట్టి లేపి, భుజం ఆసరాగా రిక్షా అబ్బాయి తోడుగా మెల్లగా లోపలికి నడిసిండు. రిక్షాపిలగానికి ఇయ్యాల్సిన డబ్బులు ఇచ్చిండు. "ఇంకో భేరం తగిలింది పోయోస్త పెద్దయ్యా" అని ఎల్లిపోయిండు.

దవాఖానలో షరిక చేసుకునే బల్ల తానకు బోయిండు. విజయమ్మను గోడకానించి నేలమీద కూసోబెట్టిండు. సంచిల ముందటిఆసుపత్రి కాగితాలు బయటకు తీసిండు. తెల్లదిర్సుల్లున్న నరసమ్మ తానకుపోయి " మా ఇంటిదానికి ఒంట్లే బాగాలేదు. షరీకజేసుకొండమ్మా" అనడిగిండు. "పెద్ద డాక్టరు లేదు,తెల్లారినంక వస్తదు. అప్పటిదాంక

ఆగాలె" చెప్పింది. "అట్టంటే ఎట్లమ్మా?, మూడు దినాల సంది అది మూసిన కండ్లు తెరుస్తల్లేదు" రామలింగం బతిమిలాడుతుండు. "డాక్టరు వచ్చిందాక కుదరదు,చెప్తే అర్థం కాదా ?" విసుగుతో అంది సమాధానం . "డాక్టరు ఎప్పుడొస్తాడమ్మా?" రామలింగం రెండుజేతులా మొక్కుతూ బతిమిలాడుతుండు. జవాబులేని చూపుతో జనరల్ వార్డుకు పోయింది. అక్కడున్న ఇతర నర్సమ్మలు రామలింగం గోడుపట్టించుకుంటల్లేరు. తనసుంటోల్లు శానామందే ఉన్నరక్కడ పెద్దడాక్టరు కోసం . విజయమ్మకు నాలుక పిడ్సకట్టుకబోతున్నట్టుంది. "దూపయితంది.." చేతులతో సైగ జేసింది. రామలింగానికి పెండ్లాం విజయమ్మ మొఖంలో ఆకలి కన్నా సావుకలే కన్పడుతుంది. "జర మా ఆడమనిషిని కనిపెట్టుకొని ఉండమ్మా.." అని అక్కడున్నోల్లకు చెప్పి, వయసుపైబడిన భారంతో ఆయాసంగా బయటకురికిండు. అక్కడున్న నర్సమ్మలు విజయమ్మను చూస్తుండ్రు. కాని వాళ్ళ చూపుల్ల జాలి లేదు. అలవాటైన నిర్లక్ష్యం ఉంది. దానికి తోడు మురికి బట్టలతో ఉన్న విజయమ్మపై మానవత్వమూ లేని ఈసడింపు ఉంది. ఆ పెద్దాయనకు తెల్వని సమాజమా! కానీ చిన్నఆశ..బయటకు పోతాంటే గతమంతా కండ్ల ముందల కదలాడింది. గుండె దూపకు కండ్లు నీళ్ళు కక్కినై.

***

రామలింగానిది నల్గొండ జిల్లా వల్లాల పక్కన జాలవారిగూడెం. అమ్మకు సొమ్ములు లేకున్నా, అయ్యకు సొమ్మ ఉంది. అది చిన్నతనాన అయ్యను కాటికి తోలుకబోయింది. అమ్మ కూలినాలికి పోయి సదివిస్తే తొమ్మిదిదాంక సదివిండు. ఆ తరువాత అమ్మ కూలినాలి చేయలేకపోయింది. "ఉంటనో సస్తనో బిడ్డా! ఇగ మనుండంగ నీ పెండ్లి చూసి పోత"నుకుంట, మేనమామ బిడ్డ విజయమ్మతో లగ్గం చేసింది. అమ్మ అన్నమాట నిలబెట్టుకుంది. పెండ్లైన రెండేండ్లకు పచ్చవాతమొచ్చి మంచానపట్టిపోయింది. "ఊల్లె గుంట జాగ లేదు,ఉండడానికి గుడిసెతప్ప" ఎట్టా బత్తవు కొడుకా అని జనం అడుగుతుండ్రు."తాదూర సందు లేదంటే మెడకో డోలన్నట్టయింది" రామలింగం పరిస్థితి.

ఊర్లె పనిలేనోళ్ళు చాలా మంది తనకంటే ముందే పుట్టిండ్రు. ఇగ లాభం లేదని, "ఊరొదిలితే బాగుపడతవని" ఎవలో జెప్తే, పట్నం బాట పట్టిండు. పట్నమొచ్చి ఇరవయ్యేల్లయింది. వచ్చిన రాకడే గని ఇంటిముకం మల్ల తిరిగిచూడలేదు.

మొదట తోలుచెప్పులు తయారుజేసే కార్ఖానాల పనికి కుదిరిండు. విజయమ్మ

ఇగురం గల్లది. పట్నం సోకులను వంటబట్టించుకోలే. సంసారాన్ని గానిగెద్దులా మోస్తున్న పెనిమిటికి "సన్నీళ్లకు ఏడి నీళ్ళన్నట్టు" సంపాదనల తోడయ్యింది. ఇంటికాడ చేతిపనులతో నాలుగు రాళ్ళు సంపాయించి ఆసరయింది. కాలం కలిసొచ్చింది. వాళ్ళకు పట్టిందల్లా బంగారమయింది. పదేండ్లల్ల రాత మారి, పన్జేసిన కార్ఖానా కొన్నడు. ఇద్దరుబోయి ఇంట్లే నలుగురయ్యింండ్రు. ఒక్క గదిలున్న సంసారం మూడు గదులకు మారింది. కొంతకాలానికి సంసారం బాడుగింటి నుంచి సొంతిల్లుకు మారింది. తాను చదువుకోలేకపోతినని బిడ్డలకు గొప్ప చదువులే చెప్పిచ్చిండు.

ఆ కంపెన్ల రోజుకు మూడొందల జోళ్ళు తయారయ్యేది. కన్నతల్లి లెక్క ఏ ఆపదొచ్చినా కాపాడింది. కార్ఖానా నడిసినన్ని రోజులు సంసారం సాఫీగ సాగింది. ఇంట్లె అవసరాలు, పిల్లల సదువులు, చిన్న చిన్న సరదాలన్నీ తీరినై. పిల్లలకని వందగజాల జాగ కొనేసింండ్రు. ధర పిల్లలతో బాటే పెరిగింది. కాని ఏం లాభం? దానితో బాటే ఖర్చులు పెరిగినై. కాలం మారింది. కంపిన్ల లాభాలు తగ్గి నష్టాలు రాబట్టినై. పన్జేసేటోల్లకు జీతాలు మిగుల్తలేవు. కొత్త రుసులు కోరేటోల్లకు తోలుచెప్పులు పాత చింతకాయ పచ్చడైన్ది. జనంతోలు చెప్పులకు మొగ్గు జూపుతల్లేరు. గాలి ప్లాస్టిక్ చెప్పుల మీదకి మళ్ళింది. దాంతో వరుస నష్టాలు. కార్ఖానా మూత పడింది. ఆధారపడ్డ ఇరవై కుటుంబాలు దిక్కులేనివైనై.

"ఇల్లుకట్టి చూడు పెళ్లి చేసి చూడన్నట్టు......" ఆడపిల్లల పెండ్లిళ్ళు, పేరంటాలయ్యేసరికి రామలింగానికి తాటిపరమైంది. ఉన్నఆస్తులు పైసలన్నీ కరిగిపోయినై. అమ్మేటప్పుడు ఆస్తులు మంచి ధర పలికినై అల్లుండ్లలాగే.

చీకట్లో చిరుదివ్వెలాగున్న ఇంటికిప్పుడు ముహూర్తమొచ్చింది. బిడ్డలిద్దరు పిల్లలతో బతుకమ్మ పండుగకొచ్చింండ్రు. పెద్దల్లుడు దసరారోజొచ్చిండు. చిన్నల్లుడు రాలె. వంట్లే బాగాలేకున్నా విజయమ్మ పొయ్యి వదల్లే. బిడ్డలిద్దరు చూసుకుంట ముచ్చట్లల్ల ఉంటరు కని, తల్లి మీద నెనరు చూపియ్యరు. విజయమ్మది తల్లి మనసు. ఆమెకు ఆ సంగతే పట్టదు. సాయంత్రం పొయ్యికాడున్నవిజయమ్మ తానకు బిడ్డలిద్దరు చేరింండ్రు. పనిచేయటానికి కాదు వాళ్ళ కోరికలు జెప్పటాన్కి. "అమ్మా మీ అల్లుడు దుబాయికి పోతాడంట పైసలు కావాలె" చిన్నది. "అమ్మా..మీ పెద్దల్లుడు వ్యాపారంజేయటాన్కి పైసలు కావాలని గోలజేస్తుండు" అమ్మను కాకా పడుతుండ్రు. "మీ నాయినతో మాట్లాడుతా" మాటిచ్చిందాక బిడ్డలు లేవలేదు. లోపలి గదిలనుండి రామలింగం అదంతా వింటున్నాడు.

విజయమ్మ సందెకాడ బువ్వ తినేటప్పుడు “ఏమయ్యా ,పిల్లలకు పైసలు కావాలట” రామలింగంను అడిగింది. దానికి రామలింగం “ పొద్దుగాల్ల మీ ముచ్చటిన్నా గని యాడతేను పైసలు”. కొంచెం సేపు ఇద్దరి మధ్యల నిశబ్ధం. “ఇల్లు అమ్ముదాం?” విజయమ్మ. ఆమె అంతే . నిస్వార్ధపు మనిషి. బిడ్డల మీద ప్రేమే ఎక్కువ, ఆలోచన తక్కువ. “మనం ఇల్లమ్మి యాడుందామే” అంటే “మన ఊరుకు బోదామంది.” “ఈ వయసులో ఊల్లెకు బోయి ఏంజేస్తాం” అంటే, “ఈ వయసులోనే మన కన్నతల్లి లాంటి ఊరుకుబోయి బతుకుదామని” ఒప్పించింది. ఇల్లు రామలింగం పేరుమీదున్నా, ఇల్లులో సగం కష్టం విజయమ్మదే. కాబట్టి ఆమె కోరిక మీద ఇల్లమ్మి చెరింత యిచ్చి ఊరు జేరింద్రు.

ఊర్లున్న గూనపెంక మొత్తం ఇంటితోబాటు కూలి, సర్కారు చెట్లు మొలిసినై. చేతిల మిగిల్న పైసలు పెట్టి దాన్ని సాపు చేయించి, నాల్గురేకులు ఏయిన్చుకుంద్రు. వయసుమీద పడ్డంక కాలం కలిసిరాలేదు. పట్నానికి దూరమయినా కష్టాలు వదిలి బెట్టలే. పండుగ పండుగకు బిడ్డలు ఊరుకు వస్తనే ఉంద్రు. ఆరునెలలుగా విజయమ్మకు సుస్తుగా ఉంది. ఊల్లె ఊన్న ఆరెంపి డాక్టరుకు చూపిస్తే పట్నంల చూపియ్యమని చెప్పిండు.

విజయమ్మను పట్నం దవాఖానాకు తీసుకుబోతే గుండె గుబేల్మనే సంగతి జెప్పిండు. కేన్సరొచ్చింది , పైసలు బెడితే బాగయితదని చెప్పిండు. పైసలు లేవు. ఆడ్నించి సర్కారు దవాఖానకు బోయి మందులు తీసుకొని పొద్దూక ఇల్లుజేరింద్రు. విజయమ్మ దిగుట్ల దీపం ఎలిగిచ్చింది. అది కొద్దిసేపు ఎలిగి ఆరిపోయింది. నూనె అయిపోయినట్టుంది. ఇద్దరి మద్య చీకటి మిగిలింది.

సర్కారుమందులు దొరికినప్పుడు వాడింద్రు. లేనప్పుడు ఊకుంద్రు. రోగానికేం తెల్సు వాళ్ళ పేదరికం. కొన్ని దినాల సంది విజయమ్మ ఆరోగ్యం బాలేదని వైద్యం కోసం పట్నంలున్న పెద్దబిడ్డ తానకు పోయింద్రు. బోరబండల పెద్దదానిల్లు. “కష్టాలన్నీ ఒకేసారి చుట్టంలా వచ్చినట్టు” అల్లునికి యాపారంల వరుస నష్టాలు వచ్చాయని బిడ్డ జెప్పింది. నడిజాము కాడొచ్చినల్లుడు తాగొచ్చిండు. బిడ్డను తన కండ్లముందే గొడ్డును బాదినట్టు బాది, నానా మాటలంటుంటే ఇక ఆడ ఉండబుద్ధికాలేదు. ఆ నడిజాముకాడనే ఇంటినుంచి బయటకొచ్చేసింద్రు. చానా సేపు రోడ్డు మీద పడిగాపులగాసి ఓ రిక్షా పట్టుకొని సర్కారుదవాఖానాకు చేరింద్రు.

రిక్షాలో కూర్చున్న రామలింగానికి గోటిచుట్టుపై రోకటి పోటులాగ మనసున

బాదెక్కువయింది. “భార్య అనారోగ్యంకు తోడు బిడ్డ బతుకిట్టయిందని ఆజ్జన మొదలైంది. పెద్దబిడ్డ బాగా చదువుకునేది. ఉద్యోగం జేస్తననంటే బరువు తీర్తదని పెండ్లిజేసిన. అనవసరంగా ఈ ఆశగొట్టు సన్నాసికిచ్చి దాని జీవితం ఆగంజేస్తినని కుమిలిపోతుండు. అడిగినంత కట్నం యిచ్చి, అది సాలక ఇల్లు అమ్మినా అల్లుడి ఆశకు బిడ్డ బలయిపోవడం తట్టుకోలేక పోతుండు. భార్య అదృష్టవంతురాలు. అల్లుడు బిడ్డను కొట్టింది చూడలె. మూసినకన్ను తెరవలే. అప్పటికీ నాల్గురోజుల నుండి పచ్చిమంచి నీళ్ళు ముట్టుత లేదు. మనిషి దక్కుడు కష్టమేనని తెలిసినా, ఏదో అదృష్టం తనను కాపాడుతదని ఆశ కలిగింది రామలింగానికి. అయ్యలు సంపాదించిన ఆస్తులు లేకపాయే, అడుగు సరిగా లేకున్నా, ‘నోరుకట్టుకొని సంపాదించిన రొక్కం బిడ్డలకు సరిపోకపాయే’ అని మనసులోనే దుఖిస్తుండు. ఎట్లనన్నా బార్యను కాపాడుకోవాలని తపన పడుతుండు.” ఎందుకంటే కష్టమైన, సుఖమైన ఇన్నాళ్ళు తనకు తోడున్న ప్రాణాన్ని వదిలిపెట్టాలనుకోవట్లేదు.

***

‘ముసలయ్యా.. గీయాళ్ళప్పుడు మాగనే పాలు పుట్టిచ్చుకొచ్చినా” ఎదురైన ఒక నర్సమ్మ మాటిని ఈ లోకంల పడ్డడు రామలింగం. “డబ్బా కాడ తెచ్చినమ్మా” అనుకుంట విజయమ్మను చేరిండు. విజయమ్మ సగం ఓసుతో ఉంది. విజయమ్మ తలకాయను తొడమీద పెట్టి, గ్లాసుల పాలను నోటికాడ పెట్టి తాపుతాంటే, విజయమ్మ తాగలేకపోతుంది. బుగ్గరిచ్చినట్టు గిలాసఅంచును మూతికాడపెట్టి కాపిశ్కెడు తాగిచ్చిండు. తన్లాడుతున్న విజయమ్మ కాళ్ళు చేతులు గింజుకుంటుంది. నోట్లె పాలు నోట్లనే ఉన్నయి. రామలింగం పోసిన పాలు ‘జీవి గంజి’ అయింది. విజయమ్మ కండ్లు తేలేసింది. రామలింగం అరచేతులతో విజయమ్మ అరికాలు, అరచెయిమీద గట్టిగా రుద్దుతుండు. అవి చల్లబడ్డె. తలకొట్టుకుండు. బోరున ఏడుస్తుండు. గదంతా జూస్తున్న ఒక నర్సమ్మ అనుమానమొచ్చి చెయ్యి పట్టి నాడి చూసింది. తల అడ్డంగా ఆడిచ్చింది. “ముసల్ది ప్రాణమిడిశింది.. ” రామలింగంకు ఆ మాట బాయిలపడ్డట్టు ఇనపడింది.. అట్లనే గోడకొరిగిండు. పురాగ తెల్లారింది. దవాఖాన్ల పీనిగల దగ్గర జనం గుమికూడింద్రు. లగ్గంల పట్టిన విజయమ్మ చేతిని రామలింగం వదల్లేదు. విజయమ్మతోబాటే ఊపిరిడిశిండు.

– మూసీ మాసపత్రిక జనవరి, 2021

కోదండం

చింతలగూడెంల పీర్లకొట్టంలనడిచే కాస్గీర్‌బడిల అవ్వల్ (ఒకటవ తరగతి), దువ్వల్ (రెండవ తరగతి), సువ్వం (మూడవ తరగతి), ఛాహుం (నాలుగవ తరగతి), అంజుమ్ (ఐదవ తరగతి) వరకే ఉంది. బడిలో తురక సదువుతోబాటు తెలుగు జెప్తరు. దాంట్లో నలబైమందికిపైగ పోరగాండ్లు సదువుకుంటుండ్రు.

సాయమ్మ కొడుకు అంజయ్య. కాస్గీర్‌బడిల అంజుమ్ సదువుతుండు. అంజయ్యకు(కింక)చిన్నెలున్నయి. నొష్టన పసుపుకొమ్ముతో కాల్చిన బర్రుంటది. అంజయ్యకు అయ్యలేడు. తల్లి సాయమ్మ ఒక్కగానొక్క కొడుకు కోసం గొడ్డుకష్టం జేసుకుంట గార్బంగా సాదుకుంటుంది.

ఊరిబయట చింతచెర్వు ఉంటది. ఆడ శాన ముదిరిన చింతచెట్లుంటై. ఊరంతా పొద్దుగూకితే, గా చింతలకాడ ముందే చీకటి గాస్తది. ఆ చింతల కాడ దెయ్యాలుంటయంటరు. పెద్దోల్లె ఒంటరిగ పోవాల్నంటే భయపడతరు. ఆ ఊరుకి రావాల్నన్నా, పోవాల్నన్నా అదొక్కటే బాట.

బడికి సెలవొస్తే అంజయ్య సావాసగాళ్ళతో చింతలకాడనే ఎక్కువుంటడు. పోరగాండ్లంతా ఆ దినాన చింతలకాడికి జేరుకుంటరు. పిల్లగాండ్లకు దెయ్యం భయంకంటే ఆకలి బాదెక్కువ. చెట్లపై ఎక్కి ఎర్ర చింతకాయలు తెల్లచింతకాయలు

గుల్లేరుతో కొట్టి రాల్చుకొని తింటరు. చెట్ల మీదున్న ఊరబిషికలను గుల్లేరుతో కొట్టుకుంట, ఆట్ని కాల్చుకతింటరు. పొద్దుబోయిందాక ఆడ్నే ఆడుతరు. చెర్వుల ఈతలకొట్టుకుంట తానాలు చేస్తరు. అమ్మ అయ్య ఆడికి పోవొద్దని కొట్టినా ఆ చింతలకాడికే బోతరు.

***

దోస్తులంతా అంజయ్యను బడెగ్గొట్టి చింతలకాడికిపోదాం రమ్మని పిల్సింద్రు. అంజయ్యను జూసి వాళ్ళుకూడా గులేరు తెచ్చుకుంద్రు. తమకు గుల్లేరునేర్పడానికి రమ్మని అంజయ్యను బతిమిలాడుతుంద్రు. పెద్దసారు బాలయ్యసాబ్ కు తెలిస్తే కోదండం ఏస్తడని భయపడి అంజయ్య నేనురానన్నడు. వాళ్ళు కొత్త గులేరు ఉబ్బుల అంజయ్యనొదిలిపెట్టి పోయింద్రు.

అంజయ్య కొడితే గుల్లేరుదెబ్బకు అంతెత్తునెగురుతున్న ఊరబిసికెలు కిందకూలాల్సిందే. చింతలకాడ అంజయ్య సావాసగాళ్ళు నడినెత్తిమీదకు ఎండొచ్చినదాంక గుల్లేరుతో ఒక్కపిట్టను కొట్టలేకపోయింద్రు. యాష్టకొచ్చిన దోస్తులు గుల్లేరు బాలేదన్నరు. కొందరు మనకు కొట్టడాన్కి రాట్లేదంద్రు.

***

అంజయ్య భయపడ్డంతా అయింది. చింతలకాడ పోరగాండ్లు బడెగ్గొట్టి ఆటలాడుతుంద్రని బాలయ్యసాబ్‌కు షేక్సిందు ఎంకన్న జెప్పిండు. అంజయ్య సావాసగాల్ల ఆటసంబురం ఆడ్నే ఎగిరిపోయింది. చెప్రాసిని పంపి వాళ్ళనందర్నీ తోలుకొచ్చి గదిల గోడకుర్సి ఏపిచ్చిండు. ఒక్కొక్కడ్ని పిల్సి దూలానికి కోదండం ఏసిండు. కింద రేగ్గంప పెట్టిచ్చిండు. వాళ్లకు ఒల్లంతా దిగచెమటలు పట్టినై. రెక్కలు ఇరిగినట్టయింది. ఇగ ఆడ్నించి బడున్నన్ని దినాలు చింతల జోలికి బోలె. సెలవుదినాల్లనే చింతలకాడ గులేరుతో సాధనచేసేటోల్లు.

***

అయ్యాల జుమరాత్‌దినం. బడికి సెలవు. పొద్దుగాల్ల అంజయ్య పనిల బడ్డడు. బీరాకు, ఆనుగాకును తెంచి బొగ్గుతో మెత్తగదంచి పలకమీద పూస్తుండు. పలకకు బొగ్గుపట్టియ్యకుండ తెల్లారి బడికిబోతే బాలయ్య సాబ్ కోదండమేస్తడు. “దసరాపండుగ దగ్గరికొస్తుంది. సారెడు గింజలన్నా ఒస్తయి. నాతో కూలికి రారాదు బిడ్డా !” అని సాయమ్మ కొడుకునడిగింది. ‘సోపతిగాల్లతో చింతలకాడికి పోవాలని,నేను రానమ్మా ...! ” చెప్పిండు. సాయమ్మ బిడ్డమనసు కష్టబెట్టలేక తనే మనసుమార్చుకుంది. అంజయ్యకు మట్టి చిప్పల సల్లబోసిన గటక అందిచ్చింది.

ఇంతట్లే సోపతిగాళ్ళు బయటనుంచి “కూతేసింద్రు”. చిప్పలబువ్వ పురాగ తాగకుండ అమ్మచేతిల బెట్టి, గుల్లేరు అందుకుండు. “అంజన్నా.... తాగిపో బిడ్డా” అని రెక్కబట్టింది. ఆగలే, “మల్లొచ్చి తాగుతలే” అనుకుంట బయటకు ఉరికిండు. ‘పైలం బిడ్డా!’ వెనక నుంచి అరిసింది సాయమ్మ.

చింతలకాడకు సావాసగాండ్లు చేరింద్రు. చెర్ల కొంగలకంటే, చెట్లమీద కాకులకంటే అంజయ్యగుంపు పెద్దగుంది. అంజయ్య ద్రోణాచార్యుడు అయ్యిండు. సోపతిగాళ్ళు గులేరు విద్యలో రాటుతేలింద్రు. వాళ్ళ చేతుల్ల గులేరు సాగినప్పుడల్లా ఓ పిట్ట నేలరాలుతుంది. ఆ దినం సందెకాడ అందరిండ్లల్ల పిట్టకూరే తిన్నరు. తెల్లారి పిల్లగాండ్లంతా ఎప్పట్లాగే బడికిపోయింద్రు.

***

అక్కమ్మగుంపుతో సాయమ్మ జొన్నచేండ్లకు కూలికొచ్చింది. ‘కూలి ఎంతక్కా” అంటే ‘మానెడంది’ అక్కమ్మ. ‘ఏరెంత పారినా కుక్కకు గతికిన కాడికే నీళ్ళన్నట్టు, సోలెడు మానెడు కూలి ఎన్నాళ్ళు చేయాలక్కా, ఎంత కష్టంజేసినా మన బతుకింతేనా’ అక్కమ్మతో అంది సాయమ్మ. ‘దున్నేవానిదే భూమి రావాల సాయమ్మ‘ అనుకుంట అక్కమ్మ గుంపుకు మునుం పెట్టింది. కూలోల్లంతా నడుంవంచింద్రు. సాయమ్మ వాళ్ళతో మునుం వంగింది. ‘అక్కా ఒకరాగం తీయక్కా’ అనడిగింది సాయమ్మ. అక్కమ్మ పాట అందుకుంది. అక్కమ్మ పాటలో సాయమ్మకు సమాధానం ఉంది.

అక్కరాగం మంచిగుంటది. అక్క గొంతుల గంగరాజు కథ, పెద్దిరాజు కథ ఇనుకుంట పన్జేస్తే పొద్దు తెల్వదు, వల్లలవదు.

"ఎర్రెర్రని దారిలోనే నా సెల్లెమ్మ.....
ఎత్తరాదే ఎర్రజెండా నా చెల్లెమ్మా
స్వచ్ఛమైన దారిలోన నా సెల్లెమ్మ ....
తీయరాదే పోరుబాట నా సెల్లెమ్మ
ఆడోల్లమేకమైతే నా సేల్లెమ్మా......
అమీసాబు ఎంతటోడే నా సేల్లెమ్మా
మొగోళ్ళు ఏకమైతే నా సెల్లెమ్మ....
మొన్సాబు ఎంతటోడే నా సెల్లెమ్మ.."

గొంతుకలిపి పాటలు పాడుతుంద్రు. పొద్దూకింది కూడా యాది మర్సింద్రు. అంతా మునువెల్లింద్రు. ఏన్నించి వచ్చింద్రో గుర్రాలమీద పదిహేనుమంది రజాకార్ల గుంపు దొంగోనోత్తిగొచ్చింది. ఒచ్చుడొచ్చుడే ఆళ్ళనాయకుడు అక్కమ్మ పైటపట్టిండు. కిందబడబోయి తప్పించుకుంది. వాని పుర్రచేతిల తుపాకి వుంది. బువ్వచేతిల అక్కమ్మ పైటుంది. ఆడోల్లంతా "గండుపులిని జూసిన లేడిపిల్లల్లాగ" వణికిపోయింద్రు. వాళ్ళంత జొన్నచేండ్లల్లకురుకు దామనుకునేలోపు రజాకార్లు చుట్టుముట్టింద్రు. "ఎర్రగుడ్డను జూసిన దున్నపోతు, మనిషి మీదకెగబడ్డట్టు", కమ్యూనిస్టుపాటవిని తట్టుకోలేని రజాకార్లనాయకుడు ఆక్రోశంతో ఆడికొచ్చిండు. అక్కమ్మ ఎదన తుపాకిపెట్టిండు.

ఆమెముఖం ఎర్రబడింది. కండ్లల్ల పొద్దుగూక సూర్యుడు వెలుగుతుండు. ఒక్కదుటున బలంగా కొంగుపట్టిలాగిండు. అక్కమ్మ కిందపడ్డది. కొయ్యకాలు వంట్లోకి దిగబడుతున్నె. పొట్టమీద బూటుకాలుతో తొక్కి, ఈడ్చి ఒక్క తన్నుతన్నిండు. బోర్లాపడ్డది అక్కమ్మ. ఊపిన పడేల్మని తుపాకి మొదలుతో గుద్దిండు. అమ్మా ....అని మూలిగింది. అప్పటిదాంక అక్కమ్మ గొంతులో ఉన్న రాగం, కండ్లల్ల నీరైంది. కండ్లల్ల ఉన్న ఎర్రటిజీర నేలపై నెత్తుటి వరదైంది. "ఏటకుబోయిన పులి ఆకలితో జింకను పట్టినట్టు"

అక్కమ్మ కుతికబట్టి అంతదూరం ఈడ్సుక బోయిండు. అక్కమ్మను కాళ్ళు మొక్కమన్నరు. మొక్కితే ఇడ్సిపెడ్తమన్నరు.

అక్కమ్మ వాళ్ళకాళ్ళు మొక్కుతుంటే ఇచ్చిన మాటమీద నిలబడలే వుండాకోరు కొడుకులు. రజాకార్ల నాయకుడు బొడ్లె దాసుకున్న కత్తిదీసి ఊపిన ఒక్క వేటేశిండు. అంతే అక్కమ్మ గిలగిలా కొట్టుకుంటూ ఆ నరకంనుంచి సచ్చి బయటపడింది.

రజాకార్ల నాయకుడు మిగతావాళ్లకు సైగ జేయంగనే, వాళ్ళు ఆకలిగొన్న రాక్షసుల మాదిరి ఏటను షురు చేసింద్రు. కోతకోయని లేతకంకులు ఆకుల్లకు ముడ్సుకున్నై.

నడుం విరిగిన ఎంట్లు నిలబడలేకపోయినై. అయినా వాళ్ళు ఇడ్సిపెట్టలే. ఆ పూట ఆడున్న ఇరవైమంది ముసలి, ముతక, పసిపోరగాండ్లతో బాటు అందరాడోల్లు వాళ్ళ పశు ఆకలికి మేతయింద్రు. అక్కమ్మ "బాంచన్ కాల్మొక్త.. దొరా!" వేడుకున్నా ఇడవలె. వాళ్ల రాక్షసత్వాన్ని చూడలేని సూరీడు పడమట వాలిండు. చీకటి పడ్డది. ఆ రాకాసి బలం, దళం చీకట్లతో బాటు గూడేనికి కాకుండా, ఊరివైపు కదిల్నై. అలిసి ఓడిన బతికున్న పీనిగలు, అక్కమ్మ శవాన్ని తీసుకుని గూడెంవైపు కదిలింద్రు. అక్కమ్మ కొడుకు గూడా అంజయ్య సోపతిగాడే.

***

అక్కమ్మ శవాన్ని చీకట్లనే గూడెం చివర్న చింతలకాడ పాతిపెట్టింద్రు. పొద్దుపోయింది. సాయమ్మ మదిల అక్కమ్మ పాట, అక్కమ్మ ఏడ్పు కండ్లల్ల మెదుల్తున్నై. పిలగాడికి ఆకలయితదని యాదిలపడి సాయమ్మ గబగబ ఇంటికొచ్చింది. ఇంట్ల దంచిన జొన్నలయిపోయినై. ఇంటెనకాలకు బోయి పెద్దరోటికాడ జొన్నలు దంచుతుంది. ఇంట్లే ఆముదం దీపంగుడ్డిగ ఎలుగుతుంది. దీపంల నూనైపోయింది. దంచుతున్నప్పుడు జొన్నలు కింద బడకుండ కుదురు బెట్టింది. రోకటిపోటుకు జొన్నలు చెదిరి కుదురు జరుగుతుంది. సాయమ్మవేసే రోకటి పోటు, సాయమ్మ తలకాయలో పడుతున్నట్టుంది. అది తెల్వని అంజయ్య రోటికాడికొచ్చి "నా మెడమీద దద్దుర్లొచ్చినయమ్మా"న్నడు.

దానికి అవ్వ గొంతులో కొద్దిగ చిరాకుతో "కూరాడుకింద మట్టి తీసిపెట్టు అంజన్నా, గది కూడా నన్ను అడగాల్నా" ఇసుక్కుంది కొత్తగా. అంజన్న కూరాడుకింది మట్టితీసి పూసుకొొండు. అంతకుముందైతే ఆలుమొగలు ఒక్కపేరుతోనున్న ఇంట్లె కూరాడు మట్టి అడుక్కొచ్చిపెట్టేది. సాయమ్మ మనసేం బాగాలేదు.

పొయ్యిమీద గటక ఉడుకుతున్నంతసేపు పొయ్యికాడ కూకున్న సాయమ్మ మదిల ఆలోచనలు కాగుతున్నె. అవ్వ తలెల (కంచం) జొన్న బువ్వేసింది. ఏం మాట్లాడకుండా అంజన్న గటకతాగుతుండు. 'అంజన్నా తినేటపుడు ఆ గుల్లేరెందుకురా పారెయ్యి దాన్ని" అని ఇసుక్కుంది. అవ్వఇయ్యాల గింత గుస్సయితుంది. ఎందుకో అర్థంకాలేదు. అమ్మను సతాయించొద్దని బువ్వతాగిండు. మారుబువ్వపెట్టే అవ్వ ఆ ముచ్చటే మర్సింది. దాంతో అంజయ్య ఆకలికూడా తగ్గింది. "ఏమైందమ్మా?" అని అంజయ్యడిగినా బదులియ్యలె. ఆముదపు ఎలుతురులో అవ్వముకం దీపంతకంటే ఎక్కువెలిగేది. కాని అయ్యాల ఏమైందో అమ్మ మొకంలో చీకటి కన్పడుతుంది. రోజూ అవ్వ ఎన్నో ముచ్చట్లు చెప్పేది. ఆ దినాన మాటల్లేకుండనే, బువ్వతినకుండా సాయమ్మ పక్కమీదకి చేరింది. అంజయ్య బువ్వతిని గులేరు సరిచేసుకొని అవ్వ పక్కన పడుకుండు. అవ్వ ఒల్లు మంగలం పెంకలెక్క కాలుతుంది. కొద్దిగ ఇసుంట జరిగిపడుకుండు అంజయ్య. నిద్రపట్టినంత మాత్రాన తెల్లారదు కదా.

***

మజ్జెరాత్రి రజాకార్లు గూడెం జేరింద్రు. 'ఆపదకు పాపం లేదు'. గూడెంపై అప్పటికే చేయాల్సిన బలిమిచేసింద్రు. గుడిసె గుడిసెను కమ్యూనిస్టు లెక్కడని చిత్రహింసలబెట్టి అడుగుతుంద్రు. బయట ఏదోసప్పుడిన్పడి అంజయ్య లేసిండు. అవ్వను భుజంపట్టి "అవ్వా...ఓ అవ్వా ...!' అని లేపుతుండు. ముగ్గురితో రజాకార్ల నాయకుడు సాయమ్మ గుడిసెకురానే వచ్చింద్రు. వాళ్ళకు తడకడ్డము కాలేదు. గుడిసెలోపలికి తోసుకొని వచ్చిండు. ఆముదం ఎలుగుల పసిడిరంగుల్లున్న సాయమ్మను జూసిండు. ఆకలి గుర్తొచ్చింది. అచ్చోసిన ఆంబోతులా పడ్డడు. బొందిల పానం పోయిందాక ఒక రాబందు పొడ్సుకు తింటుంటే, ఒకదాని తరువాత మరొక

రాబందు..... పోటీపడ్డె. ఆ యింట్లో దీపం ఆరిపోయింది.

***

తెల్లారింది. గూడెం తుఫాను వచ్చిపోయింతర్వాత ఉన్నట్టు ప్రశాంతంగా ఉందనుకుంద్రు. కాని తుఫాను మల్లీ ఇరుసుకుబడుతుందని ఎవ్వలనుకోలే. రాత్రి గూడేనికి వచ్చిన పదిహేనుమంది రజాకార్లను వెతుక్కుంట ఈసారి ముప్పై మంది రజాకార్లు తుపాకులతో ఇర్సుకబడ్డరు. గూడేన్ని చింతలకాడికి తరలించింద్రు. 'నిప్పుమీద ఉప్పుయింద్రు'. మొగోల్లనంతా చింతచెట్లకు కట్టేసింద్రు. వాళ్ళ కండ్ల ముందట్నే ఆళ్ళపెండ్లాం, బిడ్డల, తల్లుల బట్టల్ని ఇప్పిచ్చి బరిబాతల కింద కూసోబెట్టింద్రు. ఆడోళ్ళవంటిపై చింతబరిగెల వాతలు ఎర్రగా కనపడ్తున్నై. వాళ్ళసిగ్గును దాచుకోలేక అవస్థపడుతుంద్రు. తమ మొగుడు, కొడుకుల చావులజూసి సచ్చేకంటే ముందే తమజీవితీయమని రజాకార్లను వేడుకుంటుంద్రు. పచ్చినెత్తురుతాగే రజాకార్ల పైశాచికానందం గడియగడియకు పెరిగింది.

గూడెం జనాలందరూ మాకు తెల్వదని బతిమిలాడుకుంటుంద్రు. 'బాంచన్ కాల్మొక్త .." విడువమని కాళ్ళు పట్టుకొని బతిమిలాడుతుంద్రు. చెట్టుకు కట్టేసిన మొగోల్ల గుండెలపై రజాకార్లు తుపాకులెక్కుబెట్టింద్రు."అరాం....కుత్తే లోగ్....మేన్...తీన్ ..గింతి కరుంగా...అగర్ ...బోలె నహీతో...కోయి భీ..ఇదర్ సే నహీ జాయేగా.." అని 'గిన్తీ జేసేలోపు జవాబ్ దేనా...నహీ తో..తుమ్హారా జాన్ నికాలుంగా..' నాయకుడు ఎచ్చరిక జేసిండు. వాళ్ళచావుకు లెక్క మొదలయింది.

ఒకడు తురకంల లెక్కమొదలుపెట్టిండు. అందరూ తుపాకులను చెట్టుకు కట్టిన గుండెలకు ఎక్కుబెట్టింద్రు. 'ఏక్...దో....తీ.....' పూర్తిగా పలకక మునుపే, పెద్దగా 'ఢాం...! ఢాం...! ' అని ఒక్కసారి పదిహేనుతుపాకులు పేల్నయి. తుపాకిగొట్టం గుండా గుండ్లు దయలేకుండా దూసుకుబోయినై. వాటికి తన, పరాయి అనే బేదం తెల్వదు. నెత్తుటి వరద పారింది. అక్కడున్న గూడెం జనం ఒక్కపాలిగా ఉలిక్కిపడ్డరు.

చిత్రం... తుపాకి గుండ్లు రజాకార్ల గుండెల్లోకి దూసుకుపోయినై... ఆ వెంటనే

మరో పదిహేనుమంది రజాకార్లు నేలకూలింగ్రు. ఆ పదిహేనుమంది రజాకార్లు ఎలా మాయమయ్యింగ్రో అప్పుడర్థమయిందక్కడి జనాలకు.

వాళ్ళ ముకాలలో బతికిపోయినమనే సంబురం కంటే, అక్కడ జరిగిన చిత్రం ముకాల్లో కనబడింది. గూడెం జనాల్లో జీవం లేచొచ్చింది. వాళ్ళు ఆనందంలో 'గట్టులేని చెరువయ్యింగ్రు'. అంతా ఏకమయ్యింగ్రు. పిల్లగాంద్లు ఆడుకునే చింతలు, రజాకార్ల బొందలగడ్డయింది. ఆ చింతలకాడ దెయ్యాలు లేవు. తమ ప్రాణాలు కాపాడే దేవుల్లున్నారని మొక్కింగ్రు. ఇనుము కరిగేచోటుకు ఈగలు వచ్చినై సచ్చినై అనుకున్నరు.

***

ముందురోజు రాత్రి గూడెమంతా అయ్యమ్మలను పోగొట్టుకున్న ఆ ఊరిపొరగాంద్లంతా చింతలకాడ జమయింగ్రు. చింతలకాడ కన్నుబొడ్సినా కానరాని చీకటి. గూడెంల రజాకార్ల ఆగడాలు హద్దులేకుండా సాగుతూనే ఉన్నయి. మూడోజాము తరువాత రజాకార్లు వెనుతిరిగింగ్రు. అప్పటికే వ్యూహం పన్నిన అంజయ్య సోపతిగాల్లతో చింతలను ఎక్కిందు. రజాకార్లు వచ్చే దారంతా జొన్నచేంద్లల్ల మంచెలమీద పోరగాంద్లు కావలికాస్తుంగ్రు. వడిసెల తిప్పలేని పోరగాంద్లు గుల్లెర్లు పట్టింగ్రు. ఒకలికొకలు తీతువు పిట్టకూతతో రజాకార్ల రాకను తెలుపుకుంగ్రు. చేయితిరిగిన దళనాయకుని లెక్క అంజయ్య పోరగాంద్లను నడిపించిందు. కాకలుతీరిన రజాకార్లతో అంజయ్యగుంపు సీకటియుద్ధం మొదలుపెట్టింగ్రు. రజాకార్ల అంతం చూడడానికి అంజయ్య గుంపు మొనదేలిన రాళ్ళను నడుమ్కుకట్టిన జోలెల బోసుకొని చింతలు ఎక్కింగ్రు. తుపాకి గుండ్లలెక్క వడిగొస్తున్న కొచ్చెటిరాళ్ళు ఎక్కడినుంచి వస్తున్నాయెూ అర్థంకాక ఆగమాగం అయ్యింగ్రు రజాకార్లు. తప్పతాగి కండ్లుమూసుకపోయిఉన్న రజాకార్లకు అడుగు తప్పితే పిడుగుతప్పుతది. కాని అవకాశం ఇవ్వలే పోరగాండ్ల గుంపు. అలిసిపోయిన రజాకార్లు అయోమయంలో ఉంగ్రు.

కలియుగ పద్మవ్యూహంలో అభిమన్యుడిలా చిచ్చరపిడుగులైనరు. మూతి మీద

మీసాలు లేకున్నా, చేతివేళ్ళకు కోరమీసాలు మొలిచినై. వడిసెల రాళ్ళవర్షం కురిపిస్తుండ్రు. రాళ్ళతో తేనెతొట్టెను కదిపితే తేనెటీగలు జిబ్బుమన్నై. దానితో గుర్రాలదుపుతప్పినై. తుపాకులు కిందపడ్డై. కొచ్చగున్న రాళ్ళు వాళ్ళ తలకాయలల్లకు దిగ్గినై. గులేరుతో ఒక్కోదెబ్బకు ఒక్కో రాబందు రాలిపడ్డది. తలలు పుచ్చకాయలలెక్క పగుల్తున్నై. చీకటిని రజాకార్లు బలం అనుకుండ్రు. అలవిమీరితే అదృష్టం విషమైనట్టు కాలం తిరగబడింది. వారి బలానికి కాలం కోదండం ఏసింది. చీమలు కూడి, పాముని సంపినట్టు పోరగండ్లు కసితో రజాకార్లను మట్టుబెట్టింద్రు. గుర్రాలతోబాటు రజాకార్లను సబూతు దొరకకుండా ఆ చింతలకిందే పాతింద్రు. మొదట వచ్చిన రజాకార్ల చంపి గుంజుకున్న తుపాకులతో రెండోరోజు వచ్చిన రజాకార్లను చంపటానికి వాడి జనాల ప్రాణాల నిలబెట్టింద్రు.

***

కంచెలేని చేనుకు కావలైనట్టు, తల్లితండ్రుల పోగొట్టుకున్న ఆ గూడెనికి అంజయ్యగుంపు పెద్ద దిక్కయ్యింది. ఇంతల్నే యూనియన్ సేన నేలంతా పర్సుకుంది. నిజాంరాజ్యంల అందరికంటే ముందే చింతలగూడేనికి రజాకార్ల పీడ విరగడయ్యింది. ఆ గూడేనికి ముందే ససంత్ర మొచ్చింది. ఎప్పుడూ దసరాకు జమ్మిచెట్టుకాడ తుపాకిపేల్చే దొర అధికారం, తుపాకి రెండూ అంజయ్య గుంపు చేతిలకొచ్చినై. అప్పటిదాంక గూడేనికి బొడ్రాయి లేకుండే. ఊరంతా ఏకమై బొడ్రాయి పాతుకుంద్రు. బానిసత్వంపోయి ఊరు ససంత్రమైంది. ఆ ఊరి చింతను చింతలు తీర్చినై.

సూర్య – ఆదివారం అనుబంధం

29 నవంబర్, 2020 మరియు 6,12,20 డిసెంబర్, 2020

కొత్త దొర

పెంటయ్య పొద్దుగూకాల దొరతానకొచ్చిండు. "దొరా మీ భూములన్నీ ఊరిజనం మల్పుకుంటుండ్రు. యూనియన్ సేన ఈ ఇలాకాల కొస్తదంట. గదే గనక జరిగితే ఈగడీలకు కూడా జనమొచ్చుడు కాయమని చెప్పిండు". గీ ముచ్చట పెంటయ్య చెప్పినకాంచి దొరకు బెంగ పట్టుకుంది.

బలంకల్ల గొడ్లన్ని దొరదొడ్లనే వుండేటియి. గట్లనే తెలివున్న పెంటయ్యను కూడా చిన్నప్పటి కాంచి దొర తనగడిల్నే పెట్టుకుండు. రాతపూత పనినేర్పిండు. పెంటయ్యని చిన్నతనం కాంచి తనపక్కనే తిప్పుకుండు. ముద్దుగున్న పిల్లను తెచ్చివానికి చిన్నప్పుడే లగ్గంజేసిండు. పెంటిగాని పెండ్లం వయసుమీదొచ్చింది. దాని మీదదొర కన్నువడ్డది. అది గడీల తోటపని జూసుకుంటది. గడీల గాసిన తీరొక్క పూలు, పండ్లనుజూస్తే అందంగా కండ్లనిండవుంటై. దాని చేయిమహిమ అది. గడీల కాసేపండ్లు ఎప్పుడైనా తినొచ్చులే అనుకుండు దొర. పెంటయ్య తోటలో ఓమూల గుడిసేసుకుండు. పెంటయ్య గుడిసె పక్కనవున్న మామిడిచెట్టు పండ్లంటే దొరకు శానా ఇష్టం. అవి తీపెక్కువని కాయుసు పడ్తడు. దొర మనసెరిగినోడు పెంటయ్య. పెండ్లాన్ని దొరకండ్లల్ల పడకుండ కాసుకునేటోడు. పెంటయ్య దొర కాడ పలుకుబడి ఉన్నోడు. కాబట్టి ఊల్లెజనం కూడ పెంటయ్యకు విలువిచ్చేది. పెంటయ్య ఊల్లె జనానికి నోట్లే నాలుకలెక్కుండేటోడు. ఆల్లకు అవసరమైతే దొరకాడ పన్జేసిపెట్టేవోడు.

***

దొరకు కంటిమీద కునుకు కరువైంది. నడిజామైంది. దొర బుర్రనిండా కారుజీకటి కమ్ముకుంది. యాడ్నించో వచ్చిన గుడ్లగూబ గడీగోడలపైన కూసోనరుస్తుంది. పొద్దుగూకాల పెంటడు జెప్పిన ముచ్చటే చెవుల్లో తిరుగుతుంది. ఇప్పటికే పసునూరు దొరను బగాయించిండ్రు. ఆడ గడీకి నిప్పుబెట్టి, దొరికినయన్నీ ఎత్తుకబోయిండ్రు. ఈడజనం గడీమీదకు రాకున్నా, భూములు దున్నుకునుడు షురు జేసిండ్రు. పెంటనిమాట నిజమయ్యేటట్టుంది. గడీలకు రోజులు దగ్గర పడ్డట్టున్నయని ఆలోచనలపడ్డడు దొర.

ఈ కత్ర (ఆపద) తప్పించుకోడం ఎట్లనో సమజయిత లేదు. ఆడున్నమెత్తని అరాంకుర్చీల కూలబడ్డడు. పైకి జూస్తూ ఆలోచిస్తుండు. గడీలగోడలు అక్కడక్కడా నెర్రెలు బాసినై. రంగులెల్సిపోయినై. గడీ అధికారం అద్దంలా కన్పించేది. గడీ గోడల్ల ఇన్నాళ్ళున్నంత రాజిర్కం పట్టులేదు. ఆ మాటకొస్తే గడీ బయటపరిస్థితి అట్లనే ఉంది. ఇన్నాళ్ళు వారసత్వంగా అనుభవించిన దొరతనం తనతోబాటే పోవాల్సిందేనా? మదిల బెంగ పట్టుకుంది. తోటలున్న పెంటిగాడి గుడిసెతానకు బోయి నిద్రలేపిండు. వాడు కండ్లునల్సుకుంట భయంతో బయటకొచ్చిండు. దొర వాడితో తన ఆలోచన జెప్పిండు.

“యునియన్ సేన ఊల్లెకొస్తుండ్రన్న మత్లబందినంక ఊరిజనానికి ముల్లు పెరిగింది. కొత్తగ నోట్లె నాలుక పుట్టుకొచ్చింది. వాళ్లకు కమ్యూనిస్టులు తోడైండ్రు. అగ్గికి గాలితోడయినట్టు జనం కన్నుమిన్ను కానట్లే. చెప్పుకింద తేళ్ళతీర్గ ఉన్న జనం, దొరన్నా దొరభూములన్నా లెక్కపెడ్తల్లేదు’ పెంటయ్యతో అంటున్నడు దొర.

“పులి ఎడ్డిదైతే ఎలుక కూడా ఎక్కిరిస్తదన్నట్టు, వీళ్ళను ఇప్పుడేమనకుండ ఊకుంటే, ఇయ్యాల భూమి దున్నుకున్నోల్లు రేపు నా గడిని దున్నుతమంటరు. కాబట్టి నువ్వు ఈ రాత్రే సూర్యాపేటకు పో.. ఆడ దొరను కలువు. దొరకు నేనిచ్చిన కాయితమియ్యి. ఆ దొరతానున్న కిరాయి గుండాలను దొర పంపమన్నడని చెప్పి, వాళ్ళను తోలుకరా. పోయి జల్ది రా...” చెప్పిండు దొర. పెంటయ్య బయల్దేరిండు. పెంటయ్య మనసంత గుడిసె కాడనే ఉంది. మది ఇగి చెదిరింది. చేసేదేం లేక దొరజెప్పినట్టు జేసిండు. దొర కంటినిండా నిద్రబోయిండు.

***

తెల్లారేసరికి రెండొందలమంది కిరాయి గుండాలు దొర భూముల కాడికి జేరింద్రు. ఆ ఊరి జనమేసిన పైర్లను గుంటకలు గొర్రేసి తోలింద్రు. కొట్టాల కట్టేసిన గొడ్లకున్న పల్పులను గొడ్డళ్ళతో నరికింద్రు. అయి భయానికి ఏడనో బోయినై. దొర భూముల్ల అడుగుబెట్టిన ఊరి జనాన్ని తరిమిగొట్టింద్రు. జనం తలకాయలను బండ్ల గడిగొయ్యలతో పగులగొట్టింద్రు. కిరాయి గుండాలు ఊరిజనాల నెత్తురు కండ్ల జూసింద్రు. ఆయంపట్టున తాకిన దెబ్బకు వెంకయ్య ఊపిరొదిలిండు. ఆ పీనిగను పొద్దూకిందాక ఇయ్యలే. పీనిగ కోసం పోయిన జనాలను, 'ఈతాప మల్లీ వస్తే, ఈడనే మట్టిల పాతిపెడతం. కబర్ధార"ని హెచ్చరించింద్రు.

తరువాత గూండాలు దొర భూముల్ల గొర్రెలను మేపుతున్న యాదయ్యను కొట్టి గొర్లనెత్తుకుబోయి కోసుకదింద్రు. యాదయ్య ఇంటితో బాటు ప్రతి ఇంట దెబ్బలు తట్టుకోలేక మొగోళ్ళుపెట్టే మూలుగులు జమైనై. గుడిసెల్లో నిద్ర కరువైంది. దాంతో గుడిసెలల్ల అమ్మలక్కలేడ్పులు మిన్నంటినై. గుడిసెల ఏడ్పుతెలిసి దొరకు ఆనందం కలిగింది. దొర కంటినిండ నిద్రబోయిండు.

***

పెద్దపెద్ద కొమ్ములున్న బలిసిన గొర్రె పొట్టేండ్లు కుమ్మినట్టు అద్దరాత్రి దొరకు కలొచ్చింది. దిగ్గునలేసి కూసుండు. కంటికి నిద్రకరువైంది. వల్లంతా చెమటలు బట్టినై. నాలుక తడారింది. చావు కండ్ల ముందు కనబడ్డట్టయింది. "ఊరికేం మాయరోగమొచ్చిందో, ఏంపోయేగాలమో..ఏమో ఊరుకూరు మర్లబడుతుంది. కట్టుబాట్లు పోయినై. ఇప్పుడంతా ఏకాపురిలైన్రు" అనుకుటుండు. గడీల దొర మేకపోతు గాంభీర్యంతో అద్దరాత్రి రంకెలేస్తుండు. "అలగా జనానికిన్నాళ్ళు నోట్లె నాలుకే లేదు. గింత దైర్నం యాడ్నుంచొచ్చె" అనుకుటుండు. భూములు మావని దొర భూమిల్నే అరక కడతరా. ఇయ్యాల ఏమనకుంట కూసుంటే, దొరోడు గాజులేసుకుండని దొరతనానికే నాదానైతది. దొర కదర్ పోద్ది. దొర భూములల్ల అరకకట్టినోడి ఆయువుతీరాలె. వాళ్ళ ఆయువుపట్టుమీద కొట్టాలని దొర మల్లీ ఆలోచిస్తుండు. వెంటయ్య గుడిసె కాడికిబోయి నిద్రలేపిండు దొర.

***

ఊర్లెజనం దెబ్బలుతిన్న సంగతి తెల్సి కమ్యూనిస్టులూరు జేరింద్రు. సందెకాడందరిని ఒకతానకు జమచేసింద్రు. దొర ఆకృత్యాలమీద పాటలు పాడింద్రు. 'దొర ఏందిరా.... అందరేకామయితే... భూములు మనవయితయి, బువ్వ మనదయితది...” అనుకుంట మాట పాటతో, నిద్రబోతున్న జనాలనులేపి మాట్లాడే దైర్నం నూరిపోసింద్రు. దాంతో జనాలకు వంట్లో రక్తం ఉరకలెత్తుతుంది.

ఇంతట్లనే పెంటయ్య సభకాడికి ఏడ్సుకుంట, ఉరుకుత వచ్చిండు. పెంటయ్య నెత్తినోరు కొట్టుకుంట “నా పెండ్లాన్ని దొర చెరిచిండు. గొంతు బిసికి బాయిలేసిండు. నా బతుకాగమయిందని” లబోదిబోమండు.

అప్పటిదాంక ఓపికబట్టిన జనాలావేశం కట్టలు తెంచుకుంది. అదే కోపంలో ఎవ్వలిండ్లకాళ్ళు బోయి చేతికేదందితే దాన్ని చేతిలబిగించి పట్టుకుంద్రు. వాళ్ళచేతుల్ల రోజాడే పనిముట్లే ఆయుధాలయినై. వల్లల్ల ఆడోల్లు కారం మూటకట్టింద్రు. కొందరు చేతుల్ల కొడవల్లందుకుంద్రు. మరికొందరు జొన్నలు దంచే రోకండ్లందుకుంద్రు. కొందరు గడగొయ్యలతో దొరగడీ కాడికి రోషంగా పరుగుదీసింద్రు.

***

పెంటయ్యకు దుఃఖంతోబాటు కడుపుల పట్టరానికసి ఉంది. దొర ఇంత దుర్మార్గానికి పాల్పడుతడనుకోలె. దొరకిందున్న పదిహేడూల్ల జనం ఆరాత్రేకమైంద్రు. ఉప్పెనలాగొస్తున్న జనాన్నిజూసి కిరాయి గూండాలు తోకముడిసింద్రు. గడీగోడలు బద్దలైనై. జనం దొరగడికి గడ్డపారలతో పొక్కలు బొడిశింద్రు. అవి వాళ్ళు కట్టిన గోడలే కదా. వారికి దారినిచ్చినై.

***

జనసందోహం దొరగడీలకు జేరింది. పెంటయ్య చేతిల గండ్రగొడ్డలుంది. వానికున్న కోపానికి దొరెదురైతే, ఒక్కవేటుతో దొర తలెగిరి నేలమీద పడుతది. ఆక్రోశం ఆపలేక పోతుండు పెంటయ్య. లోపలికి బోయి దొరోన్ని బయటకు గుంజుకొస్తనని చెప్పిండు. వానితో బాటు పదిమంది లోపలికి బోయింద్రు. ఊరంత

బయటనే కూర్చొని ఉంద్రు. పెంటయ్య దొరోని తలనరకడం కాయమని అందరికీ తోచింది. దొరోని తలకోసం బయటంతా ఎదురు జూస్తుంద్రు. అందరికీ ఇన్నాళ్ళు దోరోడు పెట్టిన కన్నమ్మ బాధలు కండ్లల్ల మెదిల్నయి. ఒక్కోడు ఉగ్రనరసింహుడిలా ఉండు. దొర దొరికితే అక్కడే పేగులు తెంపి మెడలో ఏసుకొని, రక్తం తాగుదామన్నంత కసి కండ్లల్ల మెదుల్తుంది. ప్రతి ఇల్లు దొరోని అన్నాలం రుశి చూసినోల్లె.

లోపలికి బోయిన పెంటయ్య నిరాశగా తిరిగొచ్చిండు. చేతిల దొరోడి తలకాయ లేదు. అప్పటికే దొరోడు గడిడిసి పారిపోయిండన్నడు పెంటయ్య. జనం మదిల ఒక్కపాలి నిరాశ మబ్బులు కమ్మిన్నై. “దొరోడు ఎందాక పోతడు. రాంగనే ఊరిమజ్జెల వాని తలనరికి, నా ఆలికి పిండం బెడతనని శపథం జేసిండు” పెంటయ్య. ఊరంత కలిసి పెంటయ్య శోకాన్ని నిమ్మలపరిశింద్రు. పెంటయ్య దుఃఖం ఆకాశం చేరింది. జోరుగ ఆనపడ్డది. ఊరంతా జాలితో తడిసింది. పెంటయ్య బాయిలబడ్డ పెండ్లాం శవాన్ని తీసి దానం జేసిండు. పచ్చని కాపురంల నిప్పులుబోసిన దొరోన్నితిట్టని మనిషి లేదు.

***

కాలం మారింది. ససంత్రవెుచ్చింది. బీదజనం అండతో పెంటయ్యనాయకుడయ్యిండు. జనాన్ని కాపాడుతనన్నడు. జనాలు నమ్మింద్రు. పెంటయ్యనాయకుని చేతిల అధికారం పెట్టింద్రు. పెంటయ్యకు అధికారంతోబాటు చుట్టూ మందిమార్బలం చేరింద్రు. గిప్పుడు పెంటయ్యకు కొత్తపెండ్లాం వచ్చింది. ఆమెను జూసి ఊరంతా బుగ్గలు నొక్కుకుంద్రు. గామె ఎవలో కాదు. దొరబిడ్డ.. చిన్న దొరసాని ! గామెను తీసుకొని పెంటయ్యనాయకుడు దొరగడీకి జేరుకుండు. గడీలు ఆహ్వానం పలికినై. పెంటయ్యకు గడీలు నచ్చినై. గడీల హుందాతనం తగ్గిందని, కూలగొట్టి పెద్దగ కట్టిండు. జనం ఆ గడి జూసి ఓహో! ఆహా! అన్నరు. కొత్త గడీల కూసున్న పెంటయ్యనాయకుడి వంట్లోకి గడీల కరుకుదనం చేరింది. కొన్నాళ్ళు కోటలో, మరి కొన్నాళ్ళు పట్నంల ఉండబట్టిండు.

***

ఊరిజనాలు కొట్లాడినా దొరభూములు వాళ్ళకు దక్కలేదు. నాడు భూములు దున్నుకుంటే దొరోడడ్డుపడ్డడు. ససంత్రం వచ్చినాంక చట్టమడ్డుపడింది. వాళ్ళ సొంతభూముల కల అప్పటికీ నెరవేరలేదు.

కమ్యూనిస్టులు పిలుపిచ్చిన 'దున్నేవానిదే భూమి'మాట జనాల్ల నరనరానికెక్కింది. దాన్ని తమకు నచ్చినట్టు మార్సుకుంద్రు. కులవృత్తుల కట్టుబాట్లు పోగొట్టుకుంద్రు. గిప్పుడు "చేసేటోనిది పని". ఎవ్వలే పనయినా చేసుకోవచ్చన్నరు. మొదలు అందరూ లాభంవచ్చే వృత్తి చేపట్టింద్రు. లాభాలు తగ్గినై. ఈలోగా కొన్ని వృత్తులు కనుమరుగయినై. వృత్తుల పేర వ్యాపారాలు మొదలయినై.

ఇన్నాళ్ళు కులవృత్తుల మీదనే ఆధారపడ్డ జనానికి, చేతిలున్న పనిబోయింది. ఇటు భూమి లేక, అటు వృత్తిపోయి బిక్కమొకమేశింద్రు. ఆకలయింది. భూమి గుర్తొచ్చింది. ఆక్రోశం, ఆవేశం కమ్మింది.

***

జనాల ఆవేశం తెలిసిన పెంటయ్యనాయకుడు కోటగడీకొచ్చిండు. తెలివైనోడు కదా. గడీల కూసోని తిరిగి కులవృత్తులను, కట్టుబాట్లను తేవాలని ప్రయత్నం జేస్తుండు. లేకపోతే జనం భూములు కావాలంటరు. నాడు దొరకు తిరగబడ్డట్టు గిప్పుడు భూములకు తన మీద తిరగబడుతరు. గడీల తీరికగా తోటలో తిరుగుకుంట ఆలోచిస్తుండు. గోడమీద గుడ్లగూబ వాలింది. దాని అరుపు నచ్చలేదు. కాపలావానికి జెప్పి తుపాకితో కాల్చిచంపించిండు. తోటలో తనున్న గుడిసెకాడకు జేరిండు. అది కూలిపోయింది. దానిపక్కనే మామిడిచెట్టుకున్న పండుతెంపి తిన్నడు. దాని తీపి పెరిగినట్టనిపించింది. నాడు ఆ చెట్టుపండ్లను దొరతింటే, ఆ దొరను చెట్టు తిన్న విషయం తనకు, చచ్చిన పెండ్లానికి, ఆ చెట్టుకే తెలుసు. దొరను చంపి చెట్టుమొదట్ల బొందతవ్వి పాతిపెట్టిన గుర్తును చెప్పు ఇడిసి కాలిపాదంతో తడిమిండు. ముళ్ళు తగిలింది. అది దొరోని వారసత్వం.

***

పెండ్లాన్ని బలిపెట్టి దొర భూములను, అధికారాన్ని దక్కించుకుండు. నిజం తెలియని జనం తాడోపేడో తేల్చుకుందామని అప్పుడప్పుడు కోటపైకి ఎగబడుతుంద్రు. చచ్చిన గుడ్లగూబ గోడమీదనే ఎండిపోయి ఉంది. అది జనాలకు ఎచ్చరిక జేస్తుంది. ఎత్తులకు తెగబడిన కొత్తదొర ముందు జనం ఇంకా చిత్తవుతూనే ఉంద్రు. దొరబోయినా దొరతనాన్ని పోగొట్టలేకపోయింద్రు. కొన్నాళ్ళకు పెంటయ్య నాయకునిపై పెద్ద గుడ్లగూబ గుంపు దాడిచేసింది. గాఢ నిద్ర భంగమయింది. ఉలిక్కిపడి లేశికూసుండు.

వెలుగుదినపత్రిక - దర్వాజ

27 డిశంబరు, 2020

లత్త

దీపావళిపండుగ దగ్గరికొచ్చింది. చలి పొద్దునాట్టు ఎండకెగిరిపోయింది. కోడలు ఇంటెనకాల పన్జేసుకుంటుంది. లింగమ్మ తొట్టెల్ల ఉన్న మనుమడినెత్తుకుని ఎండపొడకు కూసుంది. సలికి పిలగాడు నాయనమ్మను గట్టిగ పట్టుకుండు. పిలగాడ్ని వల్లే కూసోబెట్టుకుంది. అరచేతినావుదమొంపి, మాడున పోసి రాసింది. చీర మోకాళ్ళకాడికి పైకి మడిచి మనుమడిని కాళ్ళమీద బోర్లపండబెట్టింది. ఆముదంరాసి కాళ్జేయి సాగదీసింది. ఈపిన మెత్తగ దరువేసు కుంట పాటందుకుంది. నిద్రకొచ్చిన పిలగాడు వూ....వూ...అనుకుంట నాయనమ్మ పాటకు రాగం కలుపుతుండు.

"జో అచ్చుతానంద జో..జో..ముకుందా
రారా పరమానంద.. రారా గోవిందా
నీ పుణ్యమాయే కొడకా..నీవోక్క నిమిషంబు పవలించవేరా
అల్లదిగో బూచొచ్చెరా... గోపాల..... పవలించవేరా
బూచేల వచ్చునమ్మ నలినాక్షి..... బుద్ధిమంతుడనమ్మా
నీ పుణ్యమాయే కొడకా..నీవోక్క నిమిషంబు పవలించవేరా ...."

***

"అమ్మా ! ఆకలి.... అమ్మా....ఆకలి......" ఇంటిముంగల ఎవలో ముసలాయనొచ్చి అరుస్తుండు. కాదు..బాధగా ఏడుస్తుండు. ఇంటిముంగలెవ్వలొచ్చి చెయిసాపినా తనకంటే ముందే కోడలు ఉరుక్కుంటబోయి గింత బువ్వో, కూరో ఏస్తది. కోడలుకు ఇనబడనట్టుంది. ఇంటెన్కాలుంది.

లింగమ్మ కష్టం తెలిసిన మనిషి. ముసలాయన ఆకలిగోస లింగమ్మ మదికి తగుల్తుంది. లేచింది. నిద్రకొచ్చిన పిలగాడు కెవ్వుమన్నడు. కొడుకేడ్పువిని కోడలురుక్కుంటొచ్చింది. లింగమ్మ పిలగాడ్ని కోడలు కిచ్చి వంటిట్లకి నడిసింది. కోడలు పిలగాడిని ఎత్తుకొని తానానికి జాలారుకాడికి నడిసింది. ముసలాయన సంగతి జూసి పొయ్యి మీద ఏడినీళ్ళను తెస్తనని కోడలుకు చెప్పి వంటింట్లకు నడిసింది. గిన్నెలున్న బువ్వతీసుకొని ముసలాయనకేద్దామని బయటిదర్వాజ వైపుకు అడుగులేసింది. అతన్ని చూడంగానే గతం కండ్లల్ల కదిలింది.

***

పదేనేళ్ళ లింగమ్మ సమర్తాడింది. మేనమామలు చూడోచ్చింద్రు. సంబురమంతా అయ్యకండ్లల్లనే ఉంది. పొద్దుగుకాల అయ్య దావతు పెట్టిండు. లింగమ్మ ఇంట్లుండగనే మేనమామ సంబంధం తెచ్చిండు. అయ్యతో "బావ ! గానుగుబండ కాడ మంచి సుట్టీర్కం ఉంది. ఇద్దరన్నల్దమ్ములు. మూడెకరాల పొలం. గింత చెలకుంది. నువ్వ ఊ..అంటే సాలు, నేను మాట్లాడతనన్నడు". అయ్య సంబురపడ్డడు. మంచిరోజు జూసుకొని రమ్మని జెప్పిండు.

***

మంచిరోజున ఎడ్లబండొచ్చి ఇంటి ముందాగింది. పిల్లను చూడొస్తానికి నల్గురుమనుసులొస్తమని చెప్పి అయిదుగురొచ్చింద్రు. మగపెత్తనమున్నట్టుంది. నల్గురుమొగోల్లు,తల్లి వచ్చింది.పిలగాడు మల్లయ్య ఒడ్డుపొడుగుతో బాగుండు. లింగమ్మ మల్లయ్యలు ఒకరికొకరు మెచ్చింద్రు.చూడొచ్చినోల్లు జంటను జూసి సంబురపడ్తుంద్రు.

మల్లయ్య తల్లి లింగమ్మనెగాదిగ జూసింది. అంగడిల గొడ్డును జూసినట్టు జూసి..అనుమానమొచ్చి లింగమ్మతానకొచ్చింది. పక్కన కూసుంది. కనుబొమ్మలిరిసింది. మొగనికేదో సైగజేసింది. ఆయన పట్టిచ్చుకోలే. ముచ్చట సంబురంల ఉన్నడు. మల్లయ్య తల్లికి లింగమ్మ నచ్చలేదు. అదే ముచ్చట గట్టిగనే అన్నది. అందరూ ఒక్కపాలే చిత్రబోయింద్రు. ఏవీటికి నచ్చలేదని పెద్దమనుషులు అడిగింద్రు.

"లింగమ్మకు నొష్ట ఎగనాకుడుంది. ఎగనాకుడుంటే లత్త కొడతది.కొడుకు నడమంత్రాన పోతడంది". వచ్చిన పెద్దమనుషులు కుడితిల బడ్డ ఎలుకలయింగ్రు. నచ్చచెప్పింగ్రు. మేనమావ బుడ్లల్ల ఇప్పసార అందించిండు. మొగోల్లందరు కల్సి గొంతునసిచింగ్రు. మల్లయ్య తల్లిని ఒప్పిచ్చింగ్రు.

చూపులైనయి. మాటముచ్చట మిగిలింది. వెయ్యిరూపాలకు కుదరాల్సిన లగ్గం. ఎగనాకుడు సాకుతో రెండువేలకు కుదిరింది. పెట్టుబోతల కింద పిలగానికి భటువు,గడియారం. అయ్య సంబురంగా ఒప్పుకుండు. పిల్లకు కమ్మలు, బుట్టాలు, కాళ్ళకు పట్టాగొలుసులు, నల్లబూసల గొలుసు పెడ్తమని పిలగానోల్లు ఒప్పుకుంగ్రు.

బువ్వాల్ల దాటిందని అందరూ బువ్వకు లేసింగ్రు. నాయిన తెచ్చిపెట్టిన జాడిప్పసార సుక్కలేకుండా కతంజేసింగ్రు. అవ్వొండిన బువ్వకుండ అడుగుజూసింగ్రు. గంపకిందున్న మంచి వజనున్న కోడిపుంజు బొక్కలు కూడా మిగల్లేదు. సుట్టిరికం బాగజేసింగ్రని ఉన్నంతసేపయ్యను పొగిడింగ్రు. వరపూజకు నాల్రోజుల్ల వస్తమని తిరుగుబాట పట్టింగ్రు.

***

వరపూజకు రెండు ఎడ్లబండ్లల్లొచ్చింగ్రు. అందరికీ సాపలేసింగ్రు. సరిపోకపోతే ఇంట్ల సెద్దర్లు, గొంగడితెచ్చి ఏసింగ్రు.పెద్దమనుషులకు పీటలేసింగ్రు. ముక్కాల పీటతెచ్చి దానిమీద పసుపు, కుంకుమ బెట్టిన్రు. పిల్లపిలగానికి రెండు పీటలేసింగ్రు. మల్లయ్య,లింగమ్మను ఆటిపై కూసోబెట్టింగ్రు. ఈడుజోడు కుదిరింది. అయ్య,అమ్మ కలిసి పిల్లపిలగానికి తువాల కప్పింగ్రు.

అయ్య పెండ్లికని అప్పటికప్పుడు పటుపటని కిందిచెలక ఎకరవమ్మితే పదకొండొందలొచ్చినై. అండ్ల... వెయ్యిరూపాయలు వరదచ్చినంగ పిలగాని దండ్రి చేతుల వెట్టిండు. మిగిల్నయి లగ్గంల బెడ్తనని మాటిచ్చిండు. చుట్టుపక్కల అమ్మలక్కల మాటలకు లింగమ్మకు సిగ్గయి బుగ్గలెరుపెక్కినై. అయ్య మొకాన మురిపెం కనబడ్డది. పిలగాని సిగ్గు బయటపడలే. దాచుకుండు. పిలగాని తల్లి మదిల ఎగనాకుడే ఉన్నట్టుంది. కండ్లల్ల ఆ భయం కన్పడ్డది. తండ్రి మొకంల మాత్రం డబ్బొచ్చిన సంబురం

కనబడ్తుంది.

నెలరోజుల్లోపే లగ్గంజేయాలని కాయమయింది. పిల్లపిలగాండ్ల చూపులు కలిసినై. ఇంటెనకాల కోడికూర, వరి బువ్వాసన ముక్కులకు తగుల్తుంది. అప్పటికే ఇప్పసార ఒకదమ్ము అందరికీ వంచిండ్రు. లింగమ్మ దోస్తులంతా 'నువ్వు శానా అదృష్టమంతురాలివే..' అంటుంటే పొంగిపోయింది. లగ్గంకోటు రాసుకుండ్రు. బువ్వలయినంక వచ్చే బెస్తారంనాడు పిలగానింట్ల లగ్గమని కాయం జేసిండ్రు. పిల్లను తోలుకపోవడాన్కి బుదారం వస్తమని చెప్పిండ్రు.

***

పెండ్లిపనులకు అయ్య అయిరానపడుతుండు. లింగమ్మ ఇంట్లనే ఉంది. ఇంటిపక్కల బిచ్చమన్న వచ్చిండు. "తాత ! లింగమ్మ సిన్నమ్మ లగ్గానికి,కులబంతికి పదిజాడీల సార జెప్పాలె. నాలుగు యేటపోతులు తెగాలె" అన్నడు.నవ్వి "అట్టాగేలేరా!.." అన్నడు అయ్య. అన్నట్టే ఆయేడు పండిన పుట్టెడొడ్లు బంతికని బండమీద ఎండబోసిండ్రు .

తెల్లారితే బుధారం. పిల్లగానోల్లు పిల్లను తీసుకబోతరు. ఇంటినిండా పందిల్లేసిండ్రు. బక్కమ్మత్త ఆచారం ప్రకారం పెద్దమాదిగ మల్లన్నను దోర్నంతాడు పేనమని పిలిపించింది. మల్లన్న మంగళారం మంచిది కాదు వద్దని చెప్పిండు.అత్త ఇన్పించుకోలె. పేనతవా,పేనవా? ని మల్లన్న మీదకి ఎగబడ్డది. బలవంతంగా మంగళారం గోలిగ దోర్నంతాడు అల్లించింది.

ఇస్తరాకులు కుట్టడానికని చెలక్కాడ మోదుగాకులు తెంపుకొద్దమని లింగమ్మ అమ్మతో బాటు చెలక్కాడికి పోయింది.చెలకమ్మితే వచ్చిన మిగిలిన వందరూపాలను పట్టుకొని పెండ్లిసామాను కొనుక్కొస్తనని అయ్య అంగడికి పోయిండు.

***

మోదుగాకులు మామిడాకులు తెంపుకొని లింగమ్మ అమ్మతో ఇంటిదారి పట్టింది. దొరోరి పొలాలమీదకెళ్ళి చింతచెర్వుకట్ట మీంచొస్తుండ్రు. వగర్సుకుంటొచ్చే బిచ్చమన్నెదురైండు. "అమ్మమ్మ..! తాత సచ్చిపోయిండు. అంగడి కాంచి పీనిగేసుకొచ్చిండ్రు" అన్నడు. అంతే...! ఇద్దరి చేతుల్లున్న పచ్చనాకులు కిందపడ్డయి.

యిల్లు జేరి,ఇంటిముంగల పీనిగను జుసిందాక అమ్మకు నమ్మకం కలగలే. అమ్మకు ధైర్నం మిగల్లేదు. పెండ్లికిరావాల్సిన చుట్టాలు సావుజూసింద్రు. తెల్లారితే పిల్లను తీసుకబోవాల్సినోల్లు, సావుకొచ్చింద్రు. కాటిదాంక వుంద్రు. అటునుంచటే పోయింద్రు. మేనమావ దగ్గరుండి జరగాల్సిన కార్యం జరిపిచ్చిండు. సంబంధం ఎత్తిపోయింది. కుటుంబం తలకిందులయింది.

***

దినాలకొచ్చిన మల్లయ్య తండ్రి వెయ్యిరూపాయలిచ్చి పోయింద్రు. అమ్మ ఎండిగాజులేసుకొని ఓ మూలనకూసోని ఏడుస్తుంది. అమ్మేడ్వాపుదమని దగ్గరకు బోతే బిడ్డనుపట్టుకొని ఎక్కిక్కి ఏడుస్తుంది. అంతయేడ్పు దేనికో పిల్లలకర్ధం కాలేదు. బిక్కమొకమేశింద్రు. తనెనుక పుట్టిన తమ్ముండ్లకు,చెల్లెండ్లకా గేవ(యావ) లేదు. కొద్దిగ తెల్సిన లింగమ్మ కండ్ల నీళ్ళను దాచుకుంది. అమ్మ ఒరుపున పడేదాంక యాల్లకింత వండేసింది.

***

మూడొద్దుల పిట్టకేస్తుంటే లింగమ్మ రెండోటి అయింది. నేనొస్తనని లింగమ్మ ఎడ్సింది. "రావొద్దు బిడ్డా"ని అమ్మలక్కలంద్రు. కార్యం అయిన్దనిపిచ్చింద్రు. "పిల్లకెగనాయకుడుందని సంబంధం వద్దనుకుంద్రక్కా" దినాలకు మావ అసలు ముచ్చట చెప్పింద్రు.

అమ్మమొకాన నెత్తురుజుక్క లేదు. ఇయ్యపురాలు మాట నిజమయ్యిందని అమ్మ నమ్మిందా... ! లింగమ్మకు తెల్వలే. "రేపొద్దున ఈ ముచ్చట బయటకు తెలిస్తే, వచ్చేటోడు గడప తొక్కడు. నల్గురికి తెల్వకముందే దాని నెత్తిన నాలుగిత్తులేయాలని" తొందరపడ్డదమ్మ.

***

మావ ముంగలబడ్డడు. నెలెల్లకతోలిగ పదిదినాలల్ల వల్లభాపురం కాంచి సంబంధం చూడొచ్చింద్రు. ముగ్గురొస్తమని ఇద్దరే వచ్చింద్రు. ఈసారి ఆడోల్లు రాలేదు. పిలగాడి తల్లి పడనీయదని తీసుకురాలే. ఒప్పుకుంటే ఈ ఊల్లెనే పెండ్లి జేసుకొని ఇంటికి తీసుకుబోతన్నడు. మంచిగ సాదుకుంటని చెప్పిండు. పిలగాడు మరీ ముదురని

ఇంటిపక్కల ముసలోల్లు మూతిరిసింద్రు.” ఇద్దరుపెండ్లాలు పోయింద్రు. వయసు ముదరక లేతగుంటదా” అన్నరు. ఈసారి లింగమ్మనెగాదిగ జూడలే. ముందే చెప్పినట్టుండు మావ, పిలగాడు మాత్రం లింగమ్మ ఎగనాకుడు చూసిండు.

‘ఎగనాయకుడుకు.. దిగనాయకుడు’ సంబంధమన్నారంత. జంటను జూసిన జనం ఈసారి మెుకమిరిసింద్రు. ‘‘చిన్నపోరిని మూడోసంబంధ మెందుకిస్తంద్రని,ఆడపెత్తనమని” అమ్మను నల్గురు నానామాటలంద్రు. అమ్మ మాటలల్ల బలంపోయింది. లింగమ్మకు భరోసాపోయింది. తనెనుకింకా నల్గురాడోల్లు,ఇద్దరు తమ్ముండ్లు. అమ్మ లింగమ్మను అల్కగ ఒప్పించింది. అమ్మ తిప్పలచూసి లింగమ్మకు తలవంచక తప్పలేదు. కట్నం ఐదొందలు. పిలగానికి గడియారం. ఈడనే లగ్గం జేసుకొని పిల్లను తీసుకుబోతని చెప్పిండు.”

***

ఎల్లమ్మగుడి కాడ తూ..తూ..మంత్రంగ లగ్గమైందనిపించింద్రు. మొగడు జచ్చిన బాధలున్న కుటుంబం. కులబంతివద్దని కులపెద్దలు పెద్దిరికం జూపింద్రు. ఎడ్లబండెక్కుతుంటే అమ్మకల్లల్ల బలిచ్చె గొర్రెను జూసినట్టు జూసింది. అంతకు మించేంజేస్తది. ఇచ్చినకాడ రెక్కలు బారేసుకొని బతుకతనని లింగమ్మనుకుంది. అయినోల్లందరికి దండంబెట్టి అత్తగారింటికి తోవదీసింది. దోస్తులు, చెల్లెండ్ల,తమ్ముండ్ల కండ్లల్ల నీళ్ళు చిప్పిల్నయి.

***

లింగమ్మ మొగనితో ఊరుజేరింది. మొగనిదోస్తులు ఏర్పాట్లు జేసి ఊరిబయట తమ కోసమెదురు జూస్తుంద్రు. “ముందు రెండు పెండ్లిల్లకి మేనా పెట్టి,ఈ పెండ్లికి పల్లకి ఎందుకు పెట్టలేదని” ఆయనను దోస్తు అడిగిండు. “మనకు పల్లకి ఐ రాలేదు. వద్దు బిడ్డా !” అమ్మన్నదని దోస్తులకు జెప్తుండాయన.

లింగమ్మ ఇంటికాడదించిన తలయెత్తలేదు. సిగ్గుతో కాదు. తెగని ఆలోచనలతోటి. బజార్లపంటి నడిపిచ్చుకుంట ఊరేగి హన్మాండ్లకాడకు తీసుకబోయింద్రు. బాటెంట

“గీ చిన్నపోరిని యాడ తోలుకొచ్చిండ్రని” జనాలు ముక్కునేలేసుకుండ్రు. బాటెంట సూపు ఆనని ముసలోల్లు అరచేయినుదుటన బెట్టి చూసిండ్రు. పోరికి నెత్తిన అరజేయంత ఎగనాకుడుందని అంటున్నరు. దాన్ని బాసింగాలు కూడా దాచ లేకపోయినై. ఇంటికి జేరిండ్రు. దేవునింట్ల దీపం ఎలిగించమన్నరు. నల్గురి పెద్దలకాళ్ళు మొక్కించిండ్రు. మొగని మురిపేన్ని దగ్గరోల్లు ఎతేశికం జేస్తుండ్రు. లింగమ్మను సాపేసి కూసోబెట్టిండ్రు. లింగమ్మను చుట్టుపక్కలాడోల్లు జూడొచ్చిండ్రు. వరసయినోల్లు పరాసికపు మాటలన్నరు. పిల్ల మూగనోము పట్టిందన్నరు. లింగమ్మకు భయం, దైర్నం రెండూ లేవు. అత్త తనపని తను చేసుకపోతుంది. మాట్లాడలేదు.

***

చుట్టుపక్కలమ్మలక్కలొచ్చిండ్రు. అత్తనర్సమ్మ అజ్జకార్దన్నరు. ఏగలేవన్నరు. అత్త గయ్యాల్దన్నరు. పెనిమిటే ఇంటికి పెద్దకొడుకు. మావ లేడు. అత్తదాటికి ఏనాడో పోయిండు. అత్త మొగనికి మూడో మనువొచ్చింది. అత్త అజ్జకారితనానికి, తనకంటే ముందొచ్చిన యిద్దరు కోడండ్లు నిలవలేదని చుట్టుపక్కలోల్లు చెప్పిండ్రు. అత్త దాటికి వచ్చినోల్లు వచ్చినట్టు పోయిండ్రు. అత్తకు వయసేం పోలేదు. ఈడేరిన ఇద్దరాడపిల్లలు, తరువాత ఇద్దరు మగపిల్లలుండ్రు. వాళ్ళను సాకడానికి స్వార్ధంతో కొడుకు సంసారంల నిప్పులుబోసింది. వచ్చినోల్లను వచ్చినట్టు పంపింది. ఆయన ‘నోట్ల నాలుక లేనోడు’. లింగమ్మకర్ధమైంది. తనకిష్టం లేకుండా తెచ్చిన పిల్లమీద అత్త మొటికలిరుస్తుంది.

***

ఏగిలిబారనేలేదు. అత్త సెగ తాకింది. బయటరుస్తుంది. “నెలెల్లక తోలిగ అయ్యను మింగింది. ముదనాష్టపుదీ కొంపల కాలుబెట్టింది. ఈడ ఎవలికి మూడిందో. నెత్తిమీద అరచేయి మందమెగనాకుడున్న దాన్ని తెచ్చిండు. సంసారం లత్త కొడుతదని జెప్తే ఇన్పించుకోలేదు. ఎవల్లనేం లాభం. నా బంగారం మంచిదైతే కదా ! ఈనికి యాడ పిల్ల దొరకలేదని ఇసుంటి దాన్ని తోలుకొచ్చిండు. బారెడు పొద్దెక్కింది. ఆ ..ఇగ మొగనిపక్కల పంతే సంసారం జేసినట్టే”నని నోరుపారేసుకుంటుంది.

ఆయనింకా లేవలే. లింగమ్మ మది చివుక్కుమంది. నిప్పుల మీద కూసున్నట్టుంది.

ఎంటనే అయ్య గుర్తొచ్చిండు. కండ్లల్లనీళ్ళు తిరిగినై. సెల్లెండ్లు తమ్ముండ్లు పసి కూనలు. కండ్లల్ల మెదిలింగ్రు. కందిరీగల్లా ముసిరిన ఆజ్ఞన. చటుక్కున మంచంమీంచి కిందకు దుమికింది.

***

అత్త అయిందానికీ కాందానికీ రాచిరంపాన పెట్టేది. యాదగిరి నరసన్న దయవల్ల ఏడాది తిరక్కముందే లింగమ్మ నీళ్ళుబోసుకుంది. అత్తగుణం మారింది. లింగమ్మ అత్తగుణమెరిగి నడ్సుకుంది. "పిల్లకల్సిపోయింది. సంసారం మనదని చేసుకుంటుంది. కడుపుమాడ్సుకొని తన పిల్లలకుకూడా పెడ్తుంది. అంత మీదేసుకొని చేస్తుంది"అని చుట్టుమట్ల అడోల్లకు చెబుతుంటే విన్నది. చెప్పుడు మాటలు చెప్పే ఆడోళ్ళను దగ్గరకు రానియలె. అత్త కోడండ్ల మద్య గాలి కూడా దూరలేదు. ఇన్నాలున్నట్టు నర్సమ్మ లేదు. మారింది. నోరు దగ్గర పెట్టుకుంది. తల్లి బిడ్డల్లా కల్సిపోయింగ్రు. నర్సమ్మకు భయం పోయింది. లింగమ్మకు దైర్నం దొరికింది.

***

లింగమ్మ అడుగుపెట్టిన కాంచి "బిడ్డొచ్చినవేళ,గొడ్డొచ్చిన వేళన్నట్టు" సంసారం బాగుపడ్డది. పుట్టిన కొడుకుతో బాటు అది ఎదిగింది. పుట్టినింట తోడబుట్టిన వాళ్ళ పెల్లిల్లయినై.లింగమ్మ పిల్లలెదిగింగ్రు. కొడుకాసరయిండు. బిడ్డలకు తిరిగాశపడకుండా మంచిసంబందాలు దొరికినై. అల్లుళ్ళు మంచోల్లు. అత్తగారిసొమ్ముకు ఆశ పడేటోల్లు కారు. బిడ్డల సంసారం సంబురంగా సాగుతుంది. కొడుకు పెండ్లయి ఇగరంతెల్సిన కోడలు దొరికినందుకు ఏ రంది లేకుండా వుంది.

***

అన్నంపెడతనని పెద్దదర్వాజకాడికిపోయిన లింగమ్మకు కండ్లు పెద్దగయినై. తనకొచ్చిన మొదటి సంబంధం పెండ్లిపిలగాడు మల్లయ్య. ఎగనాకుడు ఉందని వద్దనుకున్న సంబంధం. మల్లయ్య గడ్డంమాసిపోయి,జుట్టు పెరిగిపోయి, బట్టసోయి లేకుండ ఉండు.పెదాలెంబడి సొల్లుకారుతుంది. మన మతిల లేదు. ఆలోచన్లనే ఉ

న్న లింగమ్మ జేతిల బువ్వగిన్నె లాక్కొని గబగబా తింటుండు. లింగమ్మకు జాలేసింది. ఇంతట్లనే కోడలొచ్చింది. లింగమ్మ ముచ్చటంత చెప్పింది. మాటల్ల మొగడు కొడుకొచ్చింండ్రు. మతిచెడొచ్చిన మల్లయ్య ఊరికి మనిషిని పంపిచ్చింండ్రు. మల్లయ్యకు నా అన్నవాళ్లు ఎవరూ లేరు. పెండ్లాం ఎవనికో ఇంకో మనువు పోయింది. మతిల లేక కాలిపట్టి ఊరూర తిరుగుతుండని తెల్సింది. మనసున్నలింగమ్మ దంపతులు చేరదీసింండ్రు. కడుపుల బెట్టుకొని జూసుకుండ్రు. దీపాళిపండుగనాడు ఇంటిల్లిపాది టపాకాయలు కాలుస్తుండ్రు. వాటి ఎలుగులు భరించలేక భయపడి,లోపల చీకట్ల దాసుకుండు మల్లయ్య. పిల్లలు కాల్చినభూచక్రాలు కాలంలాగే గిర్రున తిరిగినై.

మరుసటేడాది దీపాళిపండుగనాడు మల్లయ్య పటాసులు సొంతంగ కాల్సిండు. మల్లయ్యకు ఆ ఎలుగులల్ల లింగమ్మ మొకంల ఎగనాకుడు తేటగా కన్పడుతుంది. అది ఆమె నొష్టరాత మార్చిందో లేదో కాని తన నొష్టగీత మార్చింది. అందరికీ నమస్కారం పెట్టి ఆ ఎలుతురులో ముందుకు నడిసిండు.

– 9 జూలై 2021, సినీవాలి అంతర్జాల సాహిత్య వార పత్రిక

మాయబారి

"వో... పెదీరన్నా! రజాకార్లు ముత్తయ్యను గొరీలకాడికీడ్సుకబోయింద్రా...!" వాళ్ళ కడుపుకాల..వాళ్ళ బొందమీద మన్ను బొయ్య. తమ్ముణ్ని ఇడిపిచ్చుక రారా.. బిడ్డా..", "వాని కాలం మూడిందిరా... నా పేగు తెంపుతద్రా కొడకా ... వాళ్ళ కడుపుడకా...." అవ్వ సాయమ్మ ఏడ్సుకుంట, శాపనార్థాలు పెట్టుకుంట పెదీరన్న గుడిసె తానకొచ్చింది.

తాటి పీసుబట్టి బర్లను కడుగుతున్న ఈరన్న,అవ్వ రోదనిని కాసెబోసి గోశికట్టిండు. తమ్ముండ్ల నల్గురిని కూతేసి సేతిల రోకలిబండనందుకుండు. బొడ్లె కొడవలి దోపిండు. పెండ్లాన్ని పిలిసి, "ఉరుకు... గూడేన నీ తమ్ముండ్లకు చెప్పిరమ్మన్నడు. గట్టిగ రెక్కలు పట్టుకొని శోకండం పెడుతున్న అవ్వను, ''నువ్వు సైసెహే'',''తమ్మున్ని తెత్తగని..రెక్కొదులనుకుంట ఇడిపించుకుండు. తమ్ముండ్లతో కలిసి కాసనగోడు వూరిబయట గోరిల కాడికురికిండు.

***

సాయమ్మకారుగురు కొడుకులిద్దరు బిడ్డలు.అందరి పెండ్లిల్లయినై. మొగడు రైతాంగ పోరాటంల ఒళ్లంతా జల్లెడ పడ్డ తూటా దెబ్బలకు వూపిరిడిసిండు. అయ్యబోయినంక పొత్తులున్న కొడుకులు ఏరుబడ్డరు. ఎవ్వల్దాల్లు పంచుకొని తల్లికి చెర్వు కిందెరం మాయబరిస్తమంటే వద్దన్నది."ఎట్టా బత్తవే.." అని పెదీరన్నఅంటే" మీరుండగ నాకేంది బిడ్డా..మీరుండగా."అంటది.

సాయమ్మ చిన్నకోడలు తానుంటది. కురాడు ,బువ్వకుండలేరైనా అన్నదమ్ముల గుడిసెలన్ని పక్కపక్కనుంటయి. అన్నదమ్ములు పాలు ఎన్నోలిగ కలిసుంటరు. అపదిసంపత్కి, పండగ పబ్బాలకు ఒక్క పొయ్యి పెడ్తరు.

ముత్తయ్య అందరి కంటే చిన్నోడు.అన్నేయాన్ని అస్సలు సైసడు."వద్దురా అయ్యా! జనాన్ని నమ్మి నీ అయ్య గట్లనే పోయిండని" అవ్వ మొత్తుకున్నా ఇన్పించుకోడు.

పెండ్లాం పిల్లల్నొదిలి పెట్టి సంఘంల తిరుగుతడు. "ఇంటిపట్టునుండి పటేల్ తాన గింత భూమి తీసుకొని కౌల్జేసుకో బిడ్డా"ని అవ్వ బతిలాడి చెప్పింది. మాట చెవినబెట్టలే."నీ అయ్య లెక్కనే నువ్వు జెప్తినే బాపతు కాదని" చెప్పి చెప్పి వదిలేసింది.

***

రజాకార్లు గోరీల కాడ ముత్తయ్య పెడరెక్కలిర్సి కట్టింద్రు. కాళ్ళకు చేతులకు పల్పులను గట్టిగ బిగిస్చింద్రు. అప్పటికే ముత్తయ్యను సావ సావ గొట్టింద్రు. మంచి అజముండే ముత్తయ్యను పదిమంది కూడి కుల్లబోడుస్తుంద్రు. సంఘం మన్సుల జాడ చెప్పమని సూదులతో అరచేతులల్ల, ఏళ్ల సిగుర్లల్ల పొడుస్తుంద్రు. కండ్లల్ల కారం మంటతో ముత్తయ్య గగ్గోలు పెడ్తుండు. అయినా ముత్తయ్య నోరిప్పలే. రజాకార్ల నాయకుడికి నాదానయింది.

“నమ్మక్ హరాం ..” అనుకుంట బందూకు మొదలు తోటి ముత్తయ్య మూతిమీద బలంగా పొడిసిండు. దాంతో బుక్కెడు నెత్తురు కక్కిండు. దాంతో బాటు నంజు కూడా బయటపడ్డది. కానీ ఒక్క మాట బయటకు రాలేదు. " మాదర్ చోత్ …సాలె …హరామీ..కుత్తా " అని రజాకారు నాయకుడు అమ్మనా బూతులు తిట్టుకుంట, ముత్తయ్యను బట్టలిప్పిచ్చి బరిబాతల కాళ్ళ మీద కూసుండబెట్టిండు. పెడరెక్కలిరిసి ఎనుకకు తాళ్ళతో కట్టింద్రు.

***

నల్గురి తమ్ముండ్లతో పెదీరయ్య గౌరీల కాడికి ఉరుకుత అందుకుండు. చెట్ల సాటుకు దాసుకొని అదును చూసుకొని ఎగబడదామని తమ్ముండ్లకు చెప్పిండు. తమ్ముని నెత్తురు జూసిన అన్నల పానం ఆగలే. వాళ్ళ కడుపుడికింది. ఎదురుంగ బోతే రజాకార్ల చేతిల సచ్చుడు కాయం. వాళ్ళ చేతుల్ల బందూకులున్నై. ఒక్కన్ని కాపాడటాన్కి అందర్నీ బలిపెట్టొద్దని ఆలోచన్లపడ్డడు పెదీరయ్య. తమ్ముండ్లనాగబడ్తుండు. "తలోదిక్కు ఎగబడదం…ఓపిక బట్టండి. నేను చెప్పేదాంక ముందుకు ఎవలూ పోవద్దు" తమ్ముండ్లకు సైసమని జెప్తుండు. వాళ్ళ కండ్లల్ల నిప్పులు కురుస్తున్నై. తమ్ముని గోస చూసుకుంట ఆగపట్టలేకపోతుంద్రు. ముత్తయ్య దెబ్బ దెబ్బకు

"అమ్మ..మ్మ..మ్మ...మ్మా..ని" తట్టుకోలేక అరుస్తుంటే, సినీరయ్య అన్నను తోసుకొని ముందుకురికిండు. వానెనుక ఆగబట్టలేక మిగిల్న తమ్ముండ్లు గుత్పలందుకొని ఎగబడ్డరు. ఆడోల్లు వల్లె పోసుకున్న కారాన్ని చేతుల్లకు తీసుకుంౘ్రు. ఎడమ చేత జొన్నకంకులు నరికే కొడవళ్ళు పిడికిలి బిగిన్చింౘ్రు. ఒక్కసారిగా ఎగబడ్డ వాళ్ళను జూసి రజాకార్లు బందూకులు ముత్తయ్య మీంచి ఇటు తిప్పింౘ్రు. తుపాకులు కనికరం లేకుండా డాం...డాం...పేల్నాయి.

***

పెలినయి రజాకార్ల చేతుల్లో కాదు. డాం....డాం..మ్మని లొట్టతుపాకులు సమాదు లెనుక నుండి పేల్నాయి. ముత్తయ్యనొదిలేసి, ఈపిన తుపాకులు తగిలించుకుని, చస్తమన్నఅదురుతో రజాకార్లు గుఱ్రాలెక్కి తోకముడిసింౘ్రు. సమాదులెనక నుండి ఇరవైమంది సంఘం సభ్యులు బయటకొచ్చింౘ్రు. పెదీరయ్య వూపిరి పీల్సుకుండు. "పులి తోలు కప్పుకున్న గాడిద కొడుకులు..." అనుకుంట బామ్మర్దులతో బాటు ముత్తయ్యను తీసుకొని ఇంటికి జేరిండు. ముత్తయ్య రజాకార్ల దెబ్బలకు అప్పటికే కండ్లు తేలేసిండు. రెంౘ్రోజులైనంక గాని ముత్తయ్య కండ్లు తెరవలె.

***

వారం దినాలైంది. ముత్తయ్య దెబ్బలింకా మానలే. ఒళ్ళు పచ్చిపుండయింది. పచ్చిపోక మునుపే ముత్తయ్య సంఘం బాట పట్టిండు. "వద్దురా.. అయ్యా" అని సాయమ్మ మొత్తుకుంది. ఇన్పించుకోలేదు.'కాళ్ళు మొక్కుతయ్య జర పట్టిడువు..' అని దారికి అడ్డంపడింది సాయమ్మ."ఈ ఒక్కపాలి పోత, అటంక పోను నీ మీదొట్టు. అవ్వా ....దారిడుసు ..నీ కాల్మొక్త " అని మాటిచ్చి ముత్తయ్య బయటపడ్డడు.

***

అద్దనేౘ్రికాడ ముత్తయ్య గుడిసె తలుపు సప్పుడైతంది. కోడలుది పిల్లలు మంచి నిౘ్రలుంౘ్రు. సాయమ్మ ఆ సప్పుడుకు లేసింది."ఎవరు బిడ్డా!" అన్నది."సంఘం నాయకున్నన్నదవతలి గొంతు" బదులుగా. అబద్దాన్ని నమ్మి బెడం తీసింది. "దాగ బోయిన చోట దయ్యాలు ఎదురైనట్టు" ఎనమండుగురు రజాకార్లు ఇంట్ల జొచ్చి

ముత్తయ్య పెండ్లాన్ని చేబట్టింద్రు. ఆకలి తీరినంక ఆయువు తీసింద్రు. అడ్డం వచ్చిన సాయమ్మ గొంతుల అరుపు బయటపడకుండా కసిగా ఆయుధం దింపింద్రు. పిల్లలని కూడా కనికరం చూపలే. కోళ్ళను కోసినట్టు మెడకాయలు కోసింద్రు. పోత పోత గుంజకు కట్టిన లేగదూడ ఎత్తుకొని పోయింద్రు. అది గిలాగిలా కొట్టుకుంది. తురకంల తిట్టుకుంట గుడిసెపైన వాళ్ళ కసిని తీర్చుకుంద్రు. గుడిసె నేలగూల్చింద్రు.

***

ఊపిరిబోయిన సాయమ్మతోబాటు ముత్తయ్య పెండ్లాం పిల్లల నల్గురిని వరుసగా ఇంటిముంగల జొన్న సొప్పేసి పీనిగలను పండబెట్టింద్రు."ముత్తయ్య ఆజ్ఞనతోని పోతదనుకున్నం. ముసల్ది ముందే పోయింది". అయిన జనం సాయమ్మ మంచిని తల్సుకొని ఏడుస్తుంద్రు. పెదీరన్న తమ్ముండ్ల పట్టుకొని సిన్నపోరనిలెక్క నోట్లే తువాల కుక్కుకొని ఏడుస్తుండు. కోడండ్లు యాదికొచ్చిన గుర్తులన్నీ చెప్పుకుంట ఏడుస్తుంద్రు. పెదీరన్న పెండ్లాంకు చెప్పి,బామ్మర్దుల తోటి సంఘానికి, ముత్తయ్యకు మత్లబు పంపింద్రు. తలగోరి పెట్టాల్సిన ముత్తయ్య చివరిచూపుకు సుత రాలెదు. అవ్వ బతుకుకు మాయబరి కింద తీసిన, చెరువెనుకున్న భుమిల సీమచింత చెట్టు ఉంది. అవ్వకు అయంటే శానా ఇష్టం. ఆ చెట్టు కింద బొందబెట్టింద్రు.

***

ముత్తయ్యను ఇడ్సిబెట్టిపోయిన రజాకార్లు కసితో వచ్చింద్రు. ఆరాత్రి కాడ ముత్తయ్య ఇంటిమీదకు ఇర్సుకబడ్డరు. ముత్తయ్య దొరకకపోయే సరికి ఆ అక్కసుతో సాయమ్మను ముత్తయ్య పెండ్లాం పిల్లల్ని కిరాతకంగ చంపింద్రు. ఆ ముచ్చట ముత్తయ్యకు సంఘం మనిషి ద్వారా ఎరుకయింది. ముత్తయ్య కోపం కట్టలు తెంచుకుంది.

***

ఓ రాత్రి కాడ ముత్తయ్య తన బామ్మర్ది యింట్లే సంఘం సభ్యులందరినీ కూడగట్టిండు. ఈ మత్లబు అందుకున్నరజాకార్లు ఆడికి చేరింద్రు. దొంగదెబ్బ కొట్టింద్రు. వాళ్ళందర్నీ బలితీసుకుంద్రు. ఒక్క ముత్తయ్య మాత్రం తప్పించుకుని ఊరివైపుకు ఉ

రికిండు. ముత్తయ్యను ఎంటబడుకుంట రజాకార్లు ఊరిమీదకు మల్లింగ్రు. ముత్తయ్య పెదీరన్న గుడిసె తానకొచ్చి "అన్నా..ఓ అన్నా.." అని తలుపు గొళ్ళెం కొట్టిండు. తమ్ముడు ఒచ్చిండని గ్రహించి,అవ్వ పోయినకాంచి తమ్ముడు ఉన్నడో పోయిండో మత్లబు తెల్వని పెదీరన్న తమ్మున్ని పట్టుకొని ఏడ్పందుకొండు. ముత్తయ్య కండ్లు కూడా కాల్వలైనయి.

నిమ్మలమయినంక అనుమానమొచ్చి "ఏమైంది ముత్తన్నా ?" అడిగిండు పెదీరయ్య."రజాకార్లు ఎంట బడ్డరని " చెప్పి ముత్తయ్య, "ఈడ నుంచి ఎంటనే మనం పోవాలె అన్నా" అన్నడు. ఎంటనే అన్నదమ్ములందరిని కలుపుకొని ఇంటెనకాలకు దారితీసింగ్రు. అన్నదమ్ములంతా ఊరిబయటకు జేరింగ్రు. ఎనుకకు చూసిన అన్నదమ్ములకు వాళ్ళ గుడిసెలు తగలబడిపోవడం కనబడ్తుంది. బాలెంల కాడున్న సుట్టాల తాన పిల్లలను వదిలింగ్రు. ఆడోల్ల తోలుకొని అడివిబాట పట్టింగ్రు. వనవాసం మొదలైంది. సంఘం బలం తోడైంది. వనవాసంలోనే ఆయుధాల వాడకాన్ని నేర్సుకుంగ్రు. కన్నతల్లి జీవితీసిన రజాకార్ల అంతు చూద్దామని పంతం పూనింగ్రు. ప్రతి సావుకు లెక్కజెప్పాలనుకుంగ్రు.

***

కసి బట్టిన రజాకార్లు కాసనగోడు వదల్లేదు. మానిన పుండు తిరిగి చీముబోసినట్టు జనం గాయాలు తగ్గలేదు. రజాకార్లు దినాం గుడిసెల మీదబడి జనం రక్తం తాగుతుంగ్రు. పసిబోరగాల్ల కాంచి పండుముసలి దాంక వణికి జస్తుంగ్రు. దొంగలకు చీకటి తోడయ్యింది. నూరుమందికి పైనున్న రజాకార్లు ఆ వూరిని వల్లకాడు చేస్తుంగ్రు. పెదీరన్న యాడబోయిండని చిత్రహింసలు జేస్తుంగ్రు."రెండు దినాలల్ల వాళ్ళ జాడ చెప్పకబోతే ఊరు మిగలదు, కబర్దార్" అని పోయింగ్రు. గీ ముచ్చట తెల్సి పెదీరన్న తమ్ముండ్ల తోలుకొని వూరు జేరిండు. నడిజామైంది. సవాట్లకాడికి రాంగానే ఊరంత పోగయ్యింగ్రు. అందరిదీ ఒకటే గోస. అంతకు ముందు పెద్దమనిషిగున్న పెదీరన్న నాయకుడయిండు. జనాలకు దైర్నం జెప్పిండు. జనాలు పెదీరన్నమాటన ,బాటన నడిశింగ్రు. తమ్మున్ని రజాకార్ల బారి నుండి కాపాడిన

కాంచి జనానికి పెదీరన్నపై నమ్మకం పెరిగింది.

***

పెదీరన్న తమ్ముండ్లతో కలిసి రజాకార్ల మెడలకు ఉచ్చు పేనిండు. వందకు పైనున్న రజాకార్లు రాక్షసుల్లా ఊరిపైకి దూసుకొస్తుంద్రు. పండు ఎన్నెల కాస్తుంది. గుర్రాల డెక్కల సప్పుడుకే జనం బెదిరింద్రు. పెదీరన్న దైర్యం చెప్పిండు." పొలాల్ల ఇస పురుగుల సంపినట్టు సంపాలి.." అని పిలుపిచ్చిండు. రజాకార్లు పొలిమర్రి దాటింద్రు. జనాల దారంతా పిడకల పోగేసింద్రు. పెదీరన్న ఊరందరితో కలిపి వల పన్నిండు. ఒక్కపాలిగ బర్లను, గొర్లను, దున్నపోతులను, పందులను గుర్రాలకు అడ్డంగా తోలింద్రు. ఎడ్ల బండ్ల కాని బట్టి చుట్టూ గోడ కట్టింద్రు. సీకట్లే బర్లసందుల బడి ఒక్కోలు ఒక్కో జొన్నసొప్ప మోపందుకుంద్రు. వాటిని అడ్డంగ పెట్టుకుని ముందుకురికింద్రు. నడుంకు చెక్కిన కొడవళ్ళతో ఒక్కసారి రజాకార్ల మీదకు దుంకింద్రు. గాలి లేని తుఫాను లేపింద్రు.

బెదిరిపోయిన రజాకార్లు చీకట్ల తుపాకులు పేలుస్తుంద్రు. కత్తుల తీసి సుట్టూ తిప్పుతుంద్రు. ఈలోగా కొందరు సొప్ప తడిపి కాలబెట్టుడు సురూ జేసింద్రు. పొగకు రజాకార్లతో బాటు జనాలకు కూడా ఊపిరి ఆడతం లేదు. గుర్రాలు రజాకార్లను వదిలేసి పారిపోయినై. మనుసుల మద్య కురుక్షేత్రం జరుగుతుంది. రక్తం వరదై పారుతుంది. చివరికి పెదీరన్న తమ్ముండ్లతో కలిసి, నెత్తుటి దెబ్బల మద్య రజాకార్ల నాయకుణ్ణి, ఇంకో నల్గురిని కలిపి బందించింద్రు. పెదీరన్న రజాకార్ల కాళ్ళు, చేతులను ఈతనార తాళ్ళతో కట్టిపడేసిండు. ముత్తయ్య ప్రతీకారంతో వాళ్ళను తాళ్ళతో బర్లకు కట్టి, మట్టి మీద సాయమ్మకు మాయబరి కింద ఇద్దామనుకున్న ఎకరం కాడికి ఈడ్సుక బోయింద్రు. కొనవూపిరితో కొట్టుకుంటున్న రజాకార్ల ప్రాణాలను వాళ్ళ ఆధిపత్యాన్ని మనుండంగనే సాయమ్మ కాళ్ళకాడ బొంద బెట్టింద్రు. దాంతో సాయమ్మకు మాయబారి ముట్టిందని లోకమంతా అనుకుంది.

అగ్గువ బతుకులు

"తూ... నీయమ్మ. చెప్తే ఇనకపోతివి. ఇగ నీ సావు గీడనే రాసిపెట్టినట్టుందే రాములా...?. అవ్వనాడు లేదు అయ్యనాడు లేదు గీ.. పట్నంల మన బతుకు తెల్లారేటట్టుంది. లింగవ్వ చెబితే ఇనకపోతివి. నీ మాట పట్టుకొని ఉన్నందుకు, నన్ను నేను చెప్పుతీసుకోని కొట్టుకోవాలె. నీ తల్లి ....ఏం చేయను నేను?" నిప్పుల పడ్డ ఉప్పుతీర్గ రాములమ్మమీద ఎగిరిపడుతుండు రాములు.

"అట్ల గాదయ్యా!... సైసు.., నేను చెప్పేది సుతవిన్రాదు"... మద్దెనేత్రికాడొచ్చిన పురిటినొప్పులను భరిస్తూ....రాములమ్మ మొగనికి నచ్చచెప్పాలని చూస్తుంది."నీ యవ్వ ఒక్క మాట, మాట్లాడితే నిన్ను సంపి, నేను చస్త, ఏమనుకున్నవో... ఆ...." ."గిప్పుడు యాడ బోయి సావాలి. నీ అవ్వొచ్చి ఆపద్కి అడ్డం పడతదా...గీ పట్నం జంగిల్ల ఎవలున్నరు? ఎట్టయిద్దో.. ఏం కతనో.. పో.." రాములమ్మ కాన్పు గురించి రాములు ఆజ్జనపడుతుండు.

***

రాములు కొండకింది గూడేన గొర్లను కాసుకుంట బతికేటోడు. పుట్టంగనే అయ్య సచ్చిండు. నాయనమ్మ లింగవ్వ తాన పెరిగిండు. రాములు చిన్నతనంల అత్తచేతిల పసిగుడ్డునుబెట్టి రాములుతల్లి మారుమనువు పోయింది. పగలనక రాత్రనక రెక్కలమ్ముకొని, దేవుని మీద భారమేసి ఎట్లనో గట్ల కాలంఎల్లదీసింది లింగమ్మ. రాములు చెయికిందకు నిక్కంగనే రెండు మేకలనప్పజెప్పింది. రాములు ముసల్దాన్నిగోస చూసి పెరిగినోడు. ఆ రెండు మేకలను కొన్ని దినాలనే ఒడుపుగా పెంచి ఇరవైజేసిండు.

మేకలమేపడానికి గంటేడు భూమిజాగ కూడా లేదు . ఏ పని చెప్పినా రాములు తొలగడని నల్గురితాన మంచి పేరుతెచ్చుకుండు. ఏనాడు రాములు తిండికి, మేకల మేతకు కొదువకాలేదు. బిడ్డల సాకినట్టు మేకల సాదిండు రాములు.

లింగమ్మ పాణం ఆయేపాయెనని జేసుకుంట ఓనాడు, "బిడ్డా నేను ఉంటనో.. పోతనో..." మనుండగ నీ లగ్గం జేస్త బిడ్డా! అనుకుంట రాములును ఒప్పిచ్చింది." "నాకెందుకే అవ్వా లగ్గం, ఏం జూసి వత్తది పిల్ల" అని రాములు వద్దన్నా, కొన్నాళ్ళకు పేదింటి పిల్ల రాములమ్మను జూసి చేసింది. రాములమ్మకు మారుతల్లి కాంచి రాములు తానకు వచ్చినంక కష్టం మర్సిపోయింది. ఇద్దరికీ ప్రేమ తెల్సింది. "చిలకా గోరింకల్లా" కలిసుండ్రు. ఈ మద్యనే రాములమ్మ నీళ్ళు బోసుకుంది. ఒకనాడు రాములమ్మ పొద్దుగుంజాల మొగనితో అంది. "ఏమయ్యా ! మనం ఎన్నాళ్ళు ఈ మేకల కాసుకొని బతుకుతాం. గట్ట పట్నం దిక్కుపోయి ఏదన్నా పనిజేసుకొని బద్దామా, నాలుగు రాళ్ళు ఎనకబడతై" ఇగురం చెప్పింది .

అంతెత్తున లేసిండు. "తాసీలు మొకందానా, అవ్వను నన్ను ఏరు జెయ్యడానికి వచ్చినవా? గిట్టయితే ఇడుపుకాయితం ఇస్తా! నీ అవ్వగారింటికి పంపిత్త పో.." అన్నడు. గంతే రాములమ్మ మళ్ళా ఆ మాటన్లే. ఆ ముచ్చట రాములు ద్వారానే ముసలమ్మ సెవిన పడ్డది. "బిడ్డా! నేను అయిపోయే కతను. నన్ను బట్టుకొని ఏలాడితే ఏమొస్తది. రాములమ్మ మాట ఇను" అన్నది లింగమ్మ. అవ్వ మాటలను ఆలోచన జేసిండు. అవ్వ మాట రాములుకు గురి. కాదనలేక పట్నందారి పట్టిండు. ఉన్న ఇరవై మేకలలో పంతొమ్మిది మేకలను కట్టంగూరు అంగడికాడ "అడ్డికి పావుశేరు" అగ్గువకు అమ్ముకొచ్చిండు. మిగిలినది మేక గంగవ్వ. దాన్ని పావురంగా సాదుకుండు. అమ్మబుద్ధి కాలేదు. అవ్వకు తోడుగా ఉంచి, మేకలమ్మిన పైసలుతో పట్నంజేరిండు.

***

"చేయితిరిగిందాక రోడ్డుపక్కన ఇంతగుడిసేసుకొని కాలం ఎల్లదీద్దామని" రాములమ్మ ఆలోచనచెప్పింది. రాములు కాదనలేక పోయిండు. ఎంత పనిలున్నా అప్పుడప్పుడూ పెండ్లాన్నితోలుకబోయి ప్రభుత్వాసుపత్రిల చూపిస్తుండు. రాములు పట్నంచేరంగనే మొదలు ఒక షాపుల పనికి కుదిరిండు. రోజుబత్తెం. గయి తిండికి కూడా ఆన్తల్లేవు. "ఇద్దరికీ తోడు ముగ్గురయితే గయి సరిపోవనే కదా పట్నం

ఒచ్చింది. గిట్లయితే లాభంలేదని రాములమ్మ" అనేసరికి, తెచ్చిన పైసలు పెట్టి బేరం మొదలుపెట్టిండు. రోడ్డు పక్కన పండ్లబేరం. యాపారం జోరుగనే మొదలైంది. పట్నంల జనాల కాడ గన్నిగనం పైసలు ఏడ నుంచొస్తున్నాయో అర్థం కాకపోయేది.

ధర ఎంతన్నా ఎగబడి మరీ కొనేటోళ్ళు. చేతిల పైసలు నిండుగ కనబడ్తుంటే రాములమ్మ మాట నిజమైనందుకు సంబురపడ్డడు. కడుపుతోని ఉన్న రాములమ్మకు కావాల్సిందల్లా నోటికి ఇంపుగ అందిచ్చిండు. ఎన్నడూ కనని తినని రుసులను నాలికన చూసింది రాములమ్మ.

పెండ్లాం రాములమ్మకు నెలలు నిండినై. "ఒక గది చూసుకొని, దానిలోకి మారుదామని.." రాములంటే, "నాల్దినాలు ఆగయ్యా.."అంటూ ఆపుతూ వచ్చింది రాములమ్మ ఇన్నాళ్ళు. యాపారం జోరుమీద పడి రాములు కూడా ఆమాట గట్టిగ అననేలేదు. గీముచ్చట తెల్సిన అవ్వ "రాములమ్మ ఇంటికాడ నీళ్ళాడుతది. తోలిపొమ్మని చెప్పింది". మొగనికి ఉడుకబెట్టేసే దిక్కులేదని రాములమ్మగా మాటలు సెవిన పెట్టలేదు. రాములమ్మ సంసారం ఎదిగింది చూసి అవ్వగారింట గౌరవం పెరిగింది.మొదటి కాన్పు రమ్మన్నరు. మొగన్ని వదిలి పోబుద్ధికాలేదు.

"అన్నీ వదిలేసిపోదాం.."అన్నడు రాములు. "ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నం. గిప్పుడుపొతే ఈడ యాపారం ఇంకోలు జేస్తరు. వద్దులే వయ్యా, భగవంతుడు సల్లగ జూస్తే ఈడ్నే నీల్లాడుతా!" అని అడ్డు చెప్పింది.

***

"ఇదేమిచ్చంత్రమో రాములా? ఏదో మాయదారి కరోనా రోగమొచ్చి లోకమంతా కట్టడి జేస్తంద్రంట. బయటడుగు పెడ్తే పోలీసులు గొడ్డును బాదినట్టు బాదుతున్నారని నర్సక్క మొగడు చెప్పిండు" అని పొద్దుగుంజాల చెబుతుండు రాములు .

"అయ్యో భగవంతుడా! యాపారం కుదురుకుంటున్నప్పుడే గిది రావాల్నా" అని రాములమ్మ దిగాలుపడ్డది. రాములమ్మ అసలే వట్టిమనిషి కాదాయె. బాధపడ్తుంటే చూడలేక, "ఏం కాదు లేవే! నాల్గుదినాలు ఇండ్లల్ల ఉండాల్నంట, అంతే" అన్నడు. "అంతగ నీకు ఉండబుద్ధికాకపొతే మనంమన ఊరికి పోదాం. వచ్చినకాన్నించి ఊరుమొకం కూడా చూడకపోతిమి. వో నాల్గుదినాలు ఇంటికిపోయి ముసల్దానికాడ

ఉండివద్దాం. ముసల్దానికి కూడా బాగాలేదని మొన్న కబురుతెల్సింది. ఏమంటవు?" అడిగిండు రాములు.

"ఎందుకు లేయ్య! నాల్గుదినాలకు ఊరికి పోవడం. నా ఎవ్వారం ఈడకు ఆడికి తిరిగేటట్టు ఉందా? ఇయ్యాల్నో రేపో బిడ్డ బయటపడేట్టు ఉంది. నాల్గు దినాలైతే ఈరోగం పోద్ది అంటున్నావుగా. ఈలోపు నీల్లాడితే.. మీ అవ్వతానకు పిలగాడ్ని తీసుకుని, ఎట్టాగు పోవాల్సిందేనాయె" అంది.

"బిడ్డ పుడితే, దరేశిపురంకాడ మేకపోతు కోస్తమని మొక్కుగూడా వుందాయే" అన్నది. రాములుకు ఇంటికాడ వదిలొచ్చిన మేక గంగవ్వ గుర్తోచ్చింది. ఊరు వదిలొస్తుంటే అది చంటిబిడ్డ తగిల్నట్టు కాల్లల్లనే అడ్డం తిరిగింది. ఈమద్యే నాలుగు పిల్లల్ని ఈనిందని మత్లబు అందింది.

***

మూడ్రోజులు దాటింది. కరోనా రోగం పోలేదు. ఆ మహమ్మారి ఇంకా పెరిగింది. గరీబు అమీను తేడా లేకుండా అందరినీ చుట్టుకబోతుంది. పదిహేనురోజులు ఇల్లు కదులొద్దని మైకుల్ల చెప్పింద్రు. చేతిలున్న పైకం కాస్తా పండ్లబేరగానికి బయానాగా ఇచ్చిండు. యాపారం కుంటుపడ్డది. నాలుగో దినం అద్దరాత్రి రావులమ్మకు తేలిక నొప్పులు మొదలయినై. బయట బండ్లు తిరగడం ఆగినై. రాములుకు కాళ్ళు జేతులు ఆడతల్లేవు. దావఖానాలు దుఖానాలు బందైనయని రేడియో వార్తల్ల చెబుతుంద్రు. చుట్టుపక్కలున్న గుడిసెల తానాకుపోయి నర్సక్కను పిల్సుకొచ్చిండు. నర్సక్క వచ్చి చూసింది. రెండోతాప నొప్పులకు పిలువమని చెప్పిపోయింది.

పెండ్లాం బాధని చూడలేక ప్రేమతో రాములమ్మను తిడుతుండు. అవ్వ చెప్పినట్టు "పసిద్దకు ఇంటికి పోతే ముసల్ది చూసుకునేదని అనుకుంటుండు." చెప్తే ఇనని పెండ్లాం బట్టుకొని ఏంజేస్తనని," మాటిమాటికి లోపల గునుగుతుండు. లోపలికి బయటకు తిరుగుతుండు. గది జూసి రాములమ్మ అంత నొప్పులల్ల కూడా మొగన్ని సముదాయిస్తుంది.

***

దేవునిదయవల్ల పాలుపిండేటాల్లకు రాములమ్మ నిమ్మలంగ పసిద్దయింది. మగపిలగాడు పుట్టిండు. యాదాద్రి నరసింహసామికి పుట్టేంటికలకు గుట్టకొస్తనని మొక్కిండు. పుట్టిన పిలగాడు కాసేపటికి ఏడ్పుందుకుండు. తల్లి దండ్రి మోకాల్లో సంబురం మెరిసింది. "గిన్నిపాలు పుట్టిచ్చుక రాపో .."అని నర్సక్క అనంగనే, "పాలు తెస్తనని" రాములు బయటకుర్కిండు. కాసేపటికి ఒళ్ళంతా దెబ్బలు. చొక్కా ఇప్పిన రాములు ఈపినంతా వాతలు. "ఏమయిందయ్యా.." అని రాములమ్మ అడిగితె, బయట తిరిగితే పోలీసులు కొడుతుండ్రని" చెప్పిండు. "పాలకని చెప్పకబోయినవా" అంది రాములమ్మ. అది పట్టించుకోలేదు రాములు. రాములు మదినిండా సంబురమే. దెబ్బల బాధ ముఖంల ఈసమెత్తు కూడా లేదు.

***

రాములు పిలగాన్ని తీసుకొని ఇంటికి వస్తున్నని నాయనమ్మకు కబురిచ్చిండు. కొడుకును ముసల్దానికి చూపించాలని ఆరాటపడుతుండు రాములు. చిన్నప్పటినుండి కడుపుకాసుకొని సాకిన అవ్వను ఏనాడు వదిలి లేడు. అందుకే నాయనమ్మకాడికి పోవాల్నని మనసు తొందరపడుతుంది. రాములమ్మను, పిలగాడిని తీసుకొని ఊరికి అద్దరాత్రిపూట పయనమైండు. పొద్దుందాక పోలీసులు పోనిస్తలేరు. వాళ్లకు దొరికినమంటే పెండ్లాం ముంగల దెబ్బలు కొడ్తరు, నాదానయితది. అప్పటికే "దారంతా కాపుగాసి వీపులు పగలగొడుతుండ్రని" అందరు అనుకుటుండ్రు. దుఖానం మూసి, నర్సక్కకు చెప్పి బయల్దేరిండ్రు. "పైలం .."అని నర్సక్క జాగ్రత్త జెప్పి, వద్దన్నా రాములమ్మ చేతిల యాబైరూపాయలు బెట్టింది. పైసలెక్కువిస్తనని చెప్పి పండ్ల బేరం జేసే మస్తాను బాయిని బతిలాడి, ఊరికి పోతనని ఆటోను కిరాయికి తీసుకుండు. రాములే ఆటోతోలుకుంట ఇంటిదారిపట్టిండు.

పోలీసులు పోనిస్తల్లేరని ఆటోను అడ్డదారి పట్టిచ్చిండు. రాములయ్య మనసునిండా నాయనమ్మ కళ్ళల్లో ఉండే సంబురం గుర్తుకొస్తుంది. చిన్నతనం నుండి కష్టపడి పెంచి ఒకింటోన్ని జేసిన నాయనమ్మంటే రాములుకు ప్రాణం. ఇన్నాళ్ళు నాయనమ్మను ఇడిసి ఉన్నందుకు వెలితిగా ఉంది. ఆటో చెర్వుకట్టమీంచి పోతుంది. వండేసే దిక్కు లేక, చేసుకునే ఓపికలేక మంచానపడ్డ నాయనమ్మను తలుసుకోంగనే కండ్లల్ల నీళ్ళుకమ్మినై. దారిమబ్బు కమ్మింది.

***

రాములుకు పుట్టినబిడ్డ చూడడానికి కండ్లల్ల వత్తులేసుకొని, నిద్దర పోకుండా లింగమ్మ కడుపుల, కండ్లల్ల ఆకలితో ఎదురుజూస్తుంది. కరోనా భయానికి ఊర్లె మనిషి కనపడ్తల్లేదు. కొడుకే మళ్ళిపుట్టిండని సంబురపడుతుంది. తెల్లారింది. ఇంకా రాములు జాడ లేదు. పొద్దువంగుతుంది. లింగమ్మకు ఆశ చావలేదు. చీకట్లు కమ్ముకున్నె. సైరను సప్పుడయితుంది. ఊల్లె సార అమ్మేటోల్లను పోలీసులు పట్టుకబోతున్నట్టుంది. మదిలనుకుంది లింగమ్మ. అప్పుడప్పుడూ పోలీసోళ్ళు వస్తరు. సార బట్టీలు పెట్టినోళ్లను, సార అమ్మేటోళ్ళను పట్టుకుబోతరు. కాసేపట్లో ఆ సైరను సప్పుడు లింగమ్మ ఇంటిముందాగింది.

***

తెల్లబట్టలు ఏసుకోనున్న ఇద్దరు మనుషులు అంబులెన్సులో నుండి దిగిండ్రు. మూతులకు తెల్లగుడ్డలున్నాయి. లింగమ్మకు మసక మసకగ కనబడ్తున్నరు. మంచం కోడుకాడ ఉంచిన కండ్లద్దాలు పెట్టింది. వాళ్ళు మాట్లాడకుండా రెండు పీనిగలు తెచ్చి ఇంటి ముందేసింద్రు. చిన్న పిలగాడ్ని లింగమ్మ చేతిలబెట్టి పోయింద్రు. కాళ్ళమంచంలనుండి లేసె బలమే లేని లింగమ్మకు వాళ్ళపీనిగల దానం చేసే ఓపిక ఎక్కడిది. గుంజకున్న మేక గంగవ్వ మది గుంజుతుంది. పల్లు తెంపుకుంది. పిలగాడి ఆకలి తీర్చింది. చాలాసేపటికి లింగమ్మ కండ్లల్ల నిండిన నీళ్ళు ఇంకినై. ఇంటిముంగల రాములు, రాములమ్మలు పాశిపీనిగలయింద్రు. కరోనా భయం ఊరిజనాల మానవత్వంను మింగింది. లింగమ్మ ఆశను, పసిగుడ్డు తల్లిదండ్రుల ఊరిచెరువు మింగింది. పీనిగలకాడ మనిషి కరువయ్యిండు. గుంజకు కట్టేసిన మేక గంగవ్వ ఒక్కటే కన్నీరు పెడుతుంది. ముసల్ది కూడా కన్ను మూసినందుకు. చెరువుల పడ్డ ఆటో అనాధయ్యింది.

నవతెలంగాణ – సోపతి

22 నవంబరు 2020

ఖూనీ

ఆకాశం దళసరి దుప్పటిలా మేఘాలను కప్పుకుంది. సాయంత్రం ఐదుదాటింది. తోడుగా చీకటిని తెచ్చుకుంది. డ్యూటీ ముగించుకొని ఇంటికి తిరుగుప్రయాణంలో రిక్వెస్ట్ బస్టాప్ దగ్గర బస్సుకోసం ఎదురుజూస్తున్నాను. సమయానికి రావాల్సిన బస్సు ఇంకా రాలేదు. సహజంగానే ఇలాంటప్పుడు ఆరుద్రగారన్నమాట గుర్తుకొస్తుంది. నిజమే కదా! 'మనమెక్కాల్సిన బస్సుజీవితకాలం లేటు'.

బస్సుఆగే స్టాపుకు దగ్గరిలో డబ్బాకొట్టుంది. అక్కడ ఎర్రగా దోరగా కాలుస్తున్న ఉల్లిపాయపకోడీ వాసన ముక్కుపుటాలకు కమ్మగా తగుల్తుంది. ఎట్టకేలకు నానిరీక్షణ ఫలించింది. బస్సునెమ్మదిగా నిండు గర్భిణిలా రానే వచ్చింది. బస్సునుండి అందరికంటే ముందు దిగిన యువకుడు పకోడీ తీసుకొని,తిరిగి బస్సెక్కడానికి నావెనుకే నిలబడ్డాడు. బస్సునుండి దిగాల్సిన వాళ్ళలో చివరివ్యక్తి పూర్తిగా దిగకముందే ఎక్కడం అలవాటు. సీటుసాధించాలనే తొందరలో బస్సెక్కబోతుంటే, ఫుట్ బోర్డుపై కాలు జారింది. వెనక్కి తుళ్ళి పడబోయాను. నా వెనుకేవున్నఆ యువకుడు అమాంతం నన్ను రెండుచేతులా పట్టుకుండు. లేకపోయుంటే, కిందున్న కిలోమీటరురాయిపై పడి తలతగిలి చనిపోయేవాడిని.

నా ప్రాణం కాపాడిన దేవుడతడు. ఆ మాట చాలా చిన్నదే. అయినా కృతజ్ఞతలు చెప్పాను. నావల్ల అతని చేతిలో వున్న ఉల్లిపాయపకోడీ పొట్లం కిందపడింది. మట్టిలో కలిసింది. అద్దంలో చూసుకున్న డ్రైవరు గేరు మార్చాడు. బస్సు కదిలింది. అతనికివి

మామూలే కావొచ్చు. తరువాత యువకుడికి "క్షమాపణలు" చెప్పాను. "పర్లేదు అంకుల్ ..". "హృదయ వైశాల్యం ఎంత గొప్పది" అనుకున్నాను. నావల్ల అతని నోటికాడి పకోడీ మట్టిపాలయింది. ఎంత ఆకలితో ఉన్నాడో పాపం. పశ్చాత్తాపంతో అతని కళ్ళల్లోకి చూడలేకపోయాను.

బస్సెక్కగానే నాకళ్ళు బస్సులో ప్రతిమూలలను ఆశతో వేగంగా వెతుకుతున్నాయి. హమ్మయ్య.. చిట్టచివరన ఎడమవైపున ఒకసీటు ఖాళీగా కనపడుతుంది. గబాగబా అటు నడిచాను. కిటికీ పక్కన ఒక యువతి కూర్చుంది. ఆమె కిటికీలోంచి బయటకుచూస్తూ,నారాకను గమనించలేదు. నేను కూర్చోవాలంటే కూర్చోగలను. కానీ ఎందుకో సభ్యత అన్పించక, ఆ అమ్మాయిని కూర్చోడానికి అనుమతి అడిగాను. తలతిప్పి చూసింది. నా వెనుకే ఆ యువకుడు కూడా నిలబడ్డాడు. ఆల్చిప్పల్లాంటి కళ్ళు. చందమామ లాంటి మోము. నిండుగా అమాయాకత్వం ఉట్టిపడుతుంది. అప్పటిదాక అక్కడున్న యువకులు బహుశా అమ్మాయి పక్కన కూర్చోడానికి సిగ్గుపడ్డట్టున్నారు. కడ్డీపట్టుకొని గబ్బిలాల్ల వేల్లాడుతున్నారు. ఒక్కక్షణం అమ్మాయి కళ్ళల్లో వెలుగుకనపడి మాయమైంది. భరోసా అయి ఉంటుంది అనుకున్నాను. "కూర్చోండి ..అన్నట్టు సైగజేసింది". అప్రయత్నంగా నోటినుంచి వచ్చే ఆంగ్లభాషలో "కృతజ్ఞతలు" చెప్పాను.

నాప్రయాణం దాదాపు ముప్పయి కిలోమీటర్ల దూరం. నకిరేకల్లు నుండి నల్గొండ దాక నలభై నిముషాలు. అలవాటయిపోయింది బస్సుప్రయాణం. రోజులాగే మొబైలు తీసి ఏవో కాలక్షేపానికి ప్రసంగాలు వింటున్నాను. అప్పుడప్పుడూ అప్రయత్నంగా బయటకు చూస్తున్నప్పుడు, పక్కన వున్న అమ్మాయిలో ప్రస్ఫుటంగా కంగారు కన్పడుతుంది. బస్సు ఆగినప్పుడల్లా "అంకుల్ ఇది ఏ ఊరు.." అని పదేపదే అడుగుతుంది. మొబైల్లో ఎవరికో ఆగకుండా ఫోన్ చేస్తుంది. అప్పుడప్పుడూ తన బ్యాగ్‌ను కూడా తడుముకుంటుంది. అవతల మనిషి ఫోను ఎత్తడం లేదన్నది సులభంగానే అర్ధమవుతుంది.

చికాకు భయం, బెదురూ అమ్మాయిలో కనపడుతున్నాయి. అంతే! ఇప్పటి

యువతలో భావోద్వేగాలు పసిగట్టడం సులభమే. "నువ్వెక్కడకు పోవాలమ్మా.." అని అడిగితే అనుమానంగా జూస్తూ మిన్నకుండి పోయుంది. అప్పటికీ రెండుసార్లు అడిగిచూశాను. లాభం లేదు. మౌనమే సమాధానం.

***

నామనసంతా సందేహాలతో కుతూహలం కలిగింది. అమ్మాయి ఇంటికాడ చెప్పాపెట్టకుండా అన్నీ సర్దేసుకొని బయల్దేరినట్టు కన్పిస్తుంది. అమ్మాయి భాష చూస్తే విజయవాడ కావొచ్చు అన్పించింది. ఆమెలో ఖరీదైన జీవనపోలికలు సైతం ఉన్నాయి. ఉన్నతచదువు చదివినట్టు కన్పిస్తుంది. చేతిలో మొబైలుఫోను చూస్తే గొప్పింటిబిడ్డని తెల్సిపోతుంది. ఆఅమ్మాయిని చూడగానే బిడ్డ శాలినే గుర్తొచ్చింది. తాను చదువయిపోయి డిల్లీలో సాఫ్ట్వేర్ కంపెనీలో ఇంజనీరు వుద్యోగం జేస్తుంది. నేను తోటి ప్రయాణికులను ఏనాడు పట్టించుకోలేదు. దాదాపుగా ఆరేళ్లుగా ఈదారిన ప్రయాణం జేస్తున్నా. ఏనాడు మనసుల యింత అలజడి లేదు. ఈఅమ్మాయి సంగతేందో తెలుసుకోవాలనే తపన మొదలైంది.అసలే ఈమద్య అమ్మాయిలపై ఆకృత్యాలు ఎక్కువయ్యాయనే వార్తలు టివీల్లో చూస్తున్నా. ఆ ప్రభావం కూడా కావొచ్చు.

మెల్లగా అమ్మాయిని మాటల్లో దింపాలనుకున్నాను. "అమ్మా ఏ వూరు మనది" సౌమ్యంగా పెద్దరికంతో అడిగాను. ఒకచూపు చూసి, అదే మౌనం.... నాకో సందేహం వచ్చింది.నేనే అనవసరంగా కంగారు పడుతున్నాననిపించింది.

ఈలోగా కట్టంగూరు వచ్చింది. ఆర్డినరి బస్సు. చెయ్యెత్తిన కాడల్లా డ్రైవరు ఆపుతుండు. "ఏ ఊరు అంకుల్ ఇది." ఈసారి అసహనంగానే.."నే... చెబుతాగానీ మనదెక్కడో చెప్పుదూ.." ఈసారి గట్టిగానే అడిగాను. చెప్పక తప్పదన్నట్టు "కోదాడ.." అన్నది. "ఏంపేరు తల్లీ, ఎక్కడికి పోతున్నావు.." ప్రేమగాఅడిగా.." ఇసుంట రమ్మంటే ఇల్లంతనాదనే బాపతు అనుకుంది అనుకుంటా! మొబైల్ తీసి గూగుల్ మ్యాపు చూస్తుంది. రోడ్డుపై ఉన్న నామఫలకాలు ఆత్రుతగా చూస్తుంది. సమాధానం చెప్పలేదు, అడగలేదు, అవసరం లేదన్నట్టు ముఖం తిప్పుకుంది.

నాలో కుతూహలం పోయి ఆవేశం ఆవహించింది. ఈపిల్లకు ఎంత పొగరు అనుకుని మిన్నకుండిపోయాను. ఈలోగా బస్సు నల్గొండ దగ్గరికి వచ్చింది. పట్టణంలో బస్టాపుకు ముందే దిగేవాళ్ళు దిగుతున్నారు. రైల్వే స్టేషన్ దగ్గర నా యిల్లు. అది కూడా దగ్గరికొచ్చింది. దిగే సమయ మాసన్నమవడంతో లంచ్‌బాక్స్ తీసుకుని బస్సు ద్వారంవైపు కదిలాను. నా వెనుకే ఆ అమ్మాయి దిగింది. నేను పట్టించుకోకుండా ముందుకు నడిచాను. నావెనుక ఆ అమ్మాయి ఆటో అని పిలిచినట్టు వినపడింది. తిరిగి చూడలేదు. ఆలోచనల్లో దిగిన నాకు కండక్టర్ ఇవ్వాల్సిన చిల్లర కూడా మర్చిపోయాను. మనసంతా ఏదో వెలితిగా అన్పించింది.

***

ప్రయాణబడలికతో ఇంటికి చేరిన నాకు, శ్రీమతి కరుణ చిరునవ్వుతో ఎగిరిపోయింది. కాళ్ళుచేతులు కడుక్కొని, టవల్తో ముఖం తుడుచుకుంటూ, లుంగీకట్టి వాలుకుర్చీలోకి వాలాను. కరుణ ఒక చేతిలో మంచినీళ్ళు, మరోచేతిలో కాఫీకప్పును చేతికందించింది. దూరంగా టీ.వీ రిమోటున్న టీపాయిని దగ్గరికి జరిపింది. అన్యమనస్కంగా రిమోట్ తీసుకొని వార్తాచానల్ మారుస్తూ చూస్తున్నాను. ఛానల్లో దిశ సంఘటన తాలూకు విశ్లేషణ నడుస్తుంది. పక్క రూములో అబ్బాయి నిశాంత్ సివిల్స్ చదువుకుంటున్నాడు. “వాల్యూం తగ్గించు డాడి..” అని వాడు రీడింగ్ రూమునుండి అరుస్తుండు. వాని మాటలు నాకు సరిగా వినబడలేదు. నా మనసులో ఆ అమ్మాయే మెదుల్తుంది. “పాపం ఆ అమ్మాయి ఏ ఆపదలో ఉందో? ఆపద లేకపోతె తనకొచ్చే నష్టం ఏముంది. కాస్త చొరవ చూపాల్సింది.” ఈలోగా కరుణ వచ్చి రిమోట్ తీసుకొని “ఏవిటండీ ? ఆ పరధ్యానం, పిలగాడు చదువుకుంటుండు. వాడు పరీక్షకు రేపు డిల్లీకి పోవాలి కదా” అని టివి స్విచ్ ఆఫ్ చేసింది.కరుణ తెలివైనది. నా మనసులో అలజడి కనిపెట్టింది. “ఏమైందండీ....అలా ఉన్నారు” అడిగింది. విషయమంతా చెప్పాను.

***

మర్నాడు ఆదివారం. ఆఫీసుకు సెలవు. ఉదయాన్నే అబ్బాయి డిల్లీకి వెళ్ళాడు. నిదానంగా లేచాను. రోజులాగే ఉదయం నడకకు రైల్వేస్టేషనుకు బయలుదేరాను.

సెలవురోజు కావడంతో ఆలస్యం అయింది. అక్కడ దూరంగా జనం గుమికూడారు. దగ్గరికి వెళ్లి చూశాను. నా కళ్ళు పెద్దవయ్యాయి. ఆశ్చర్యం. మనసు భారమయింది. నిన్నరాత్రి సెకల్లో బస్సెక్కుతుండగా నన్నుకాపాడిన యువకుడు నెత్తుటి మడుగులోపడి ఉన్నాడు.

రోడ్డుపక్కనున్న చెట్లపొదల్లో శవమై ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి కోసం అందరూ ఎదురుజూస్తున్నారు. ఆ యువకుడి కడుపులో విచక్షణారహితంగా పొడిచినట్టు చాలాచోట్ల కత్తిపోట్లున్నాయి. పోలీసులు వచ్చారు. అంబులెన్సులో శవాన్ని తరలించారు. అన్యమనస్కంగా నడక పూర్తయిందనిపించాను. నడకలో కలిసిన మిత్రులకు ఆ యువకునితో నిన్న జరిగిన అనుభవాన్ని పంచుకున్నాను.

మధ్యాహ్ననికి టీవీల ద్వార పూర్తి వివరాలు తెలిశాయి. చనిపోయిన ఆ యువకుడు పేరు ప్రణయ్. అతని స్వస్థలం కోదాడ అని స్క్రోలింగ్లో వేశారు. నా మనసంతా ఆలోచనలు, బెల్లానికి ఈగలు ముసిరినట్టు ముసిరాయి. నిన్న తనపక్కన కూర్చున్న అమ్మాయికి, ఈచనిపోయిన యువకునికి ఏదైనా సంబంధం ఉండే అవకాశం గురించి, మనసు పరిపరివిధాల పోతుంది. ఆయువకుడు దిగేంతవరకు సీటుపక్కనే నిలబడ్డాడు. కలత నిద్రతోనే తెల్లారింది. యువకుని పూర్తి వివరాలు మర్నాడు వార్తాపత్రికల్లో వచ్చాయి. యువకుడికి తండ్రి లేడు. తల్లి నరాలసంబంధ వ్యాధితో మంచంపట్టింది. ప్రణయ్ ఆటోనడుపుకుంటూ అమ్మను చూసుకునేవాడు. ఇప్పుడు ఆ తల్లికి ఆసరా దూరమయింది. ఆ తల్లి కడుపుకోత తలుచుకుంటే గుండెబరువెక్కింది.

***

ఆఫీసులో ఉండగా, ఇంటిదగ్గరనుండి కరుణ ఫోను చేసింది. తను ఎంతో అవసరమైతే తప్ప, ఎప్పుడూ పనివేళల్లో ఫోను చేయదు. వెంటనే ఫోనెత్తాను. కరుణ మాటల్లో ఆదుర్దా. “హలో..ఏవండి...ఇంటికి పోలీసులు వచ్చారండి” అంది. “దేనికన్నాను”. “నిన్నజరిగిన యువకుని ఖూనీ కేసులో.. విచారించ డానికట...” అన్నది. మెదడు మొద్దుబారింది. “మిమ్మల్ని స్టేషనుకు రమ్మంటున్నారు...మిమ్మల్నే” అంది “హా..హా..” అన్నాను. వెంటనే తేరుకొని “నేను బయల్దేరుతున్నా.. గాబరాపడకు”

అనిచెప్పి, వచ్చిన పోలీసుకు ఫోనులోనే స్టేషనుకొచ్చి కలుస్తానని చెప్పి బ్రతిమిలాడాను. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నా మాటకు ఒప్పుకొని, "తొందరగా రాకపోతే ఇబ్బందవుతుంది సార్" అని తన బాధ చెప్పాడు. వెంటనే ఆఫీసుకు సెలవుపెట్టి, మిత్రుడి సహాయంతో కారులో వేగంగా ఇంటికి చేరుకున్నాను. మార్గమధ్యలో ధైర్యం కోసం వేరే జిల్లాలో పోలీసు ఇన్స్పెక్టరుగా పనిచేస్తున్న నా మిత్రునికి విషయం చెప్పి, మాట్లాడమని చెప్పాను.

***

పోలీసుస్టేషన్కు చేరుకున్నాక అక్కడ ఇన్స్పెక్టరుగారు లేరు. కాసేపు కూర్చోమనిచెప్పి, బయట వేప చెట్టుకిందున్న సిమెంటుబల్లను చూపారు. మనసంతా ఒకటే ఆలోచనలు. నన్నెందుకు రమ్మంటారు. అర్థం కాని ప్రశ్నలు. మనసులో మెదుల్తున్నాయి. నాతో బాటు వచ్చిన మిత్రునికి ఆరోజు జరిగిన విషయంతా పదిసార్లకుపైగా చెప్పి వుంటాను. "ఏం కాదులే మాట్లాడుదామని" ధైర్యం నూరిపోస్తుండు. అరగంట వేచి చూశాక ఇన్స్పెక్టరుగారు హడావుడిగా వచ్చి తనరూములో కూర్చున్నారు. నేను ఆత్రుతతో గుమ్మం దగ్గరకు వెళ్లి,"లోనికి రావొచ్చా సార్..." అని అడిగాను. వారు "కూర్చోండి ..." అని కుర్చీలు చూపించారు. అప్పటికే కానిస్టేబుల్ చెప్పినట్టున్నారు. మా మిత్రుడు కూడా ఫోను చేశాడనుకుంటాను. వారి మాటల్లో కరుకుదనం లేదు. గౌరవం తోణికిసలాడడంతో కాస్త మనసు స్థిమితపడింది. "టీ తాగుతారా" అడిగాడు. సౌమ్యంగా తిరస్కరించాను. అయినా ఆర్డరిచ్చాడు.

"మీరు ఎక్కడ పనిజేస్తారని అడిగారు." చెప్పాను. "మీ పిల్లలు ఏం జేస్తారని అడిగారు." ఇద్దరు పిల్లలు. అమ్మాయి పెద్దది. డిల్లీలో సాఫ్ట్వేర్ ఇంజనీరు. అబ్బాయి సివిల్స్ ప్రిపేర్ అవుతున్నాడని చెప్పాను." మీఅబ్బాయి శనివారం ఎక్కడ ఉన్నాడని అడిగారు. పిల్లల ప్రస్తావన వచ్చేసరికి సహజంగానే భయపడ్డాను. ఇంటివద్దనే చదువుకుంటాడని చెప్పి, ఎందుకలా అడుగుతున్నారని వినయంతో అడిగాను. వారు సహజమైన దర్పంతో "నిన్న జరిగిన యువకుని హత్యలో కొన్ని కొత్తవిషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని నిర్ధారించుకోవాలంటే మీ అబ్బాయి విచారణకు హాజరవ్వాలి" అని చెప్పాడు. "ఇంకాస్త వివరంగా చెప్పండని" బ్రతిమిలాడాను.

“నిన్న జరిగిన ప్రణయ్ హత్యకేసులో దొరికిన మొబైలులో డయలడ్ నెంబర్లలో మీ అబ్బాయి ఫోన్ నంబరుకూడా దొరికింది. హత్యకు ముందు అనేకసార్లు మీఅబ్బాయి ఫోనుకు మాట్లాడాలని ప్రయత్నించినట్టుంది. మా ఎంక్వయిరీలో మీ అబ్బాయి ఫోను తీయలేదు అని తెలిసింది. మీరూ మీ అబ్బాయి సహకరిస్తే ఈ కేసును త్వరగా ఛేదిస్తామని” మర్యాదపూర్వకంగానే చెప్పాడు. అంతేకాక “మీ ఇంటికి ఉదయం కానిస్టేబుల్‌ను పంపిస్తే, మీ అబ్బాయి సివిల్స్ పరీక్ష రాయటానికి ఢిల్లీకి వెళ్ళాడని తెలిసింది. మీ అబ్బాయి రాగానే మీరు వెంటబెట్టుకొనివస్తే సాధారణ విచారణ చేస్తాము. భయపడాల్సిన అవసరం లేదని” హామీ ఇచ్చాడు. సరేనని వారికి “కృతజ్ఞతలు” చెప్పి అక్కడనుంచి ఇంటికి నడిచాను. మనసులో జవాబులు లేని చిక్కుముడిలాంటి ప్రశ్నలతో నిండి తలపోటు పెరిగింది. సమాధానం కోసం మెదడు వేగంగా ఆలోచించడం మొదలుపెట్టింది.

***

ఢిల్లీనుండి కొడుకు రాగానే కరుణ కొడుకును గట్టిగా నిలదీసింది. నీళ్ళు నమిలిండు. తరువాత నిజాయితీగా పూసగుచ్చినట్టు చెప్పిండు. “అమ్మా ఆ అమ్మాయి పేరు ధరణి. వాళ్ళ నాన్న పెద్ద రియల్ ఎస్టేటు వ్యాపారి. నాతో బాటు ఐఐటి మద్రాసులో ఇంజనీరింగు పూర్తిచేసింది. తెలివైనది. కాలేజీలో వుండగా నాతో పెళ్లి ప్రస్తావన తెచ్చింది. స్థిర పడ్డాక చూద్దాం”అని చెప్పాను. ఈలోపు ఆ అమ్మాయికి ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని,” శనివారం నాడు ఢిల్లీకి లేచిపోదామని” ప్రపోజల్ తెచ్చింది. “నాకు పరీక్ష వుంది చదువుకోవాలని, కుదరదని చెప్పి నా ఫోను స్విచ్చాఫ్ చేశాను. కానీ నాన్న మాటలను బట్టి నేను వద్దని చెప్పినా వినకుండా ధరణి అన్నీ సర్దుకొని శనివారంనాడు నల్గొండకు వచ్చేసిందని తెలిసింది.”

అదే బస్సులో నాన్నను కలిసిన ధరణికి నాన్న తెలుసు. కాని నాన్నకు ధరణి ఎవరో తెలియదు. నాన్న మాటల తరువాత నాఫోను ఆన్ చేశాను. ధరణి పంపిన మెసేజ్ లను బట్టి నిర్ధారించుకున్నాను. ఆ వెంటనే వాళ్ళ నాన్నకు ఫోను చేసి,నా పేరు చెప్పకుండా “ఎవరో మీ అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి, ఢిల్లీ తీసుకుపోతున్నారని” చెప్పాను. నేను ఆ అమ్మాయిని కాపాడాలనే ఉద్దేశ్యంతోనే

అలా చెప్పాను. అంతే కాని, తరువాత ఏం జరిగిందో నాకు తెలియదని" చెప్పాడు.

అదేవిషయంను పోలీసులకుకూడా చెప్పాడు. పోలీసులు తీగ లాగితేడొంక కదిలింది. పోలీసులు కోదాడలో ఉన్న ధరణి ఇంటికి వెళ్లి ఆ అమ్మాయిని విచారించారు. ధరణి ఇంటికి సమీపంలోనే ప్రణయ్ ఇల్లుంది. చిన్నప్పటి నుండి పరిచయం. ఆ చనువుతో సహాయం కోసం తోడుగా ప్రణయ్‌ని తెచ్చుకుంది. రైల్వే స్టేషన్‌లో ప్రణయ్‌ను తనతో చూశాక తన తండ్రి విచక్షణ కోల్పోయాడు. చెప్పినా విన్పించుకోలేదు. అనాలోచితంగా అతన్ని ఖూనీ చేశాడని నిజాన్ని చెప్పింది. తన తండ్రి చేసిన దారుణం వెలుగులోకి రాకుండా, తనను చీకటిగదిలో వారంరోజులు బంధించాడని వాంగ్మూలం ఇచ్చింది.

ఆ రోజురాత్రి ఆగంతుకుని సమాచారం పట్టుకొని రైల్వేస్టేషన్ చేరిన ధరణి తండ్రికి, కూతురు చేతిలో రెండు పెద్ద బ్యాగులతో ఉన్నది. ఇంటికి దగ్గరలో వుండే ఆటో తోలుకునే అబ్బాయి బిడ్డ పక్కన ఉన్నాడు. దాంతో అతను వివేకం కోల్పోయాడు. తక్కువ కులంవానితో బిడ్డ లేచిపోతుందనే అనుమానం, అవమానంతో తొందరపడి పరువుహత్యకు పాల్పడ్డాడు. తరువాత ధరణితండ్రి పోలీసు మర్యాదలకు చేసిన తప్పును అంగీకరించాడు.

***

మర్నాడు దినపత్రికలో ఆ వార్త చదువుతుంటే అప్రయత్నంగా నా కళ్ళ నుండి కన్నీళ్ళు కారుతున్నాయి. నాతోబాటు కరుణకూడా దుఖాన్ని ఆగబట్టలేక ఏడ్చేసింది. నవ్వుతున్న ఆ యువకుడి చిత్రం మా కన్నీటితో తడిసింది. ఒక అమ్మాయికి తండ్రిగా ఆవేశం ఉన్న నాకు, కొడుకును కన్న తండ్రిగా ఆలోచిస్తే మనసు బరువెక్కింది. రెండు కళ్ళతో చూసే అలవాటున్న మనిషికి రెండు కోణాల్లో ఆలోచించే శక్తి వుంటే బాగుండనిపించింది.

వెలుగు – దర్వాజ, 14.03.2021

శూర్పణఖ

సమయం ఉదయం పదకొండు గంటలు. మీనాక్షి యింట్లో పెద్దగా అరుపులు వినపడుతున్నాయి. "మీనాక్షి మంటల్లో కాలిపోతుంది" బయటఎవరో అరిచారు. ఆ అరుపులకు చుట్టుపక్కల వాళ్ళంతా తమ ఇళ్ళనుండి బయటికొచ్చారు. కాపాడుదామని వాళ్ళు మీనాక్షి ఇంటి తలుపులు బద్దలుకొడుతున్నారు. లోపల గడియవేసి ఉంది. ఇంటివెనకాలకుపోయి చూస్తే తాళం బిగించి ఉంది. ముందువైపున తలుపులు పురాతన నల్లమద్ది తలుపులు. అవి తెరచుకోవడం లేదు. లోపలివైపున బెడాలు బిగించున్నాయి. తలుపులు తెరచుకోక పోవడంతో ఆందోళనతో ఉన్న మహిళలు బకెట్లు, బిందెలతో నీళ్ళను తెచ్చి కిటికీల నుండి లోపలికి కుమ్మరిస్తున్నారు. గదంతా కిరోసిన్ వాసన గుప్పుమంటుంది. కిటికీకి దూరంగా, మంటల్లో కాలుతున్న మీనాక్షిని చల్లుతున్న నీళ్ళు కాపాడలేకపోయాయి. కొద్ది క్షణాల్లోనే మీనాక్షిని కాపాడాలన్న ప్రయత్నాలు అగ్నికి ఆహూతి అయ్యాయి. గదిలో గోడకు దండతో వేలాడుతున్న నాయనమ్మ ఫోటో మూగగా రోదిస్తుంది.

***

"నాయనమ్మా ! శూర్పణఖ అంటే ఎవరు.." ఆసక్తిగా, కళ్ళుపెద్దవి చేసి పదేళ్ళ మీనాక్షి అడిగింది. సాయంత్రం బడినుండి ఇంటికి రాగానే ఆత్రుతగా అడిగిన మనుమరాలుతో, "ఎందుకమ్మా... ఇప్పుడామె గురించి" ప్రశ్నించింది నాయనమ్మ. "మాపాఠశాలలో వేసే నాటకాల పోటీలో నాకు ఆ వేషమిచ్చారు నాన్నమ్మా.."

జవాబు చెప్పింది. మీనాక్షితోబాటు కథ వినడానికి స్నేహితుడు రామారావు కూడా వచ్చాడు. రోజూ నాయనమ్మ చెప్పే కథలంటే ఆ పిల్లలు చెవికోసుకుంటారు.

"నాయనమ్మా ...చెప్తావా లేదా.." అని పాప బుంగమూతి పెట్టేసరికి, ప్రారంభించక తప్పలేదు. "శూర్పణఖ బ్రహ్మ మనువడి కుమార్తె, రావణబ్రహ్మ సోదరి. రాముడిపై వ్యామోహంతో సీతపై అసూయ పడింది. ఫలితంగా లక్ష్మణుడి చేతిలో అవమానాన్ని చవిచూసింద"ని కథను వివరించింది. "ఇంతకూ... శూర్పణఖ మంచిదా లేక చెడ్డదా.." ఆసక్తితో అడిగింది మీనాక్షి.

"మంచితనం కంటే ఆమె అందరిచేతిలో అవమానం పొందిందన్నదే అందరికీ తెల్సిన విషయం..." ఆగి, కొన్ని మంచినీళ్ళు తాగింది నాయనమ్మ. కొనసాగింపుగా "సోదరుడు రావణాసురుడు తన భర్తను చంపినా, కోరుకున్న రాముడు తిరస్కారం చూపినా, లక్ష్మణుడు అవమానపరిచి, గాయపరిచినా అన్నీటిని భరించింది." కానీ ప్రతీకారం తీర్చుకోవాలనే ఒకే కోరికతో చరిత్రలో మీనాక్షి కాస్త శూర్పణఖగా మిగిలిపోయింది. అంతే కాదు....ఆమె సీతారాముల అనుబంధాల మధ్యలోకి పోయి, ఆడదానికి ఆడదే శత్రువన్నట్లు సీత అందానికి అసూయ చెంది ఆమెను దూషించింది. ఫలితంగా పుట్టుకతో అందగత్తె అయిన శూర్పణఖ(మీనాక్షి)ని పరిస్థితులు కురూపిగా మార్చాయి." అని ముగించింది.

"ఇంకా వివరంగా చెప్పు.. నాయనమ్మా" అంటున్న మీనాక్షి కుతూహలానికి ముచ్చటేసి కథను కొనసాగించింది నాయనమ్మ.

"పుట్టగానే వాళ్ళ నాన్న ఆమెకు "మీనాక్షి" అని పేరు పెట్టాడు. అదే ఆమె అసలైన పేరు. నీపేరుకూడా అదే కదా.." అని ముగించింది. దాంతో మీనాక్షి కళ్ళు పెద్దవి చేసి, ముసి ముసి నవ్వులు నవ్వుతూ, అక్కడి నుంచి రామారావుతో కలిసి ఆడుకోడానికి బయలుదేరింది. నాయనమ్మ చెప్పిన కథలో శూర్పణఖ అందంగా ఉన్నదన్న అంశమే మీనాక్షికి నచ్చింది. మరునాడు పాఠశాలలో తాను ప్రదర్శించే నాటకం కోసం, శూర్పణఖ పాత్రను తలచుకుంటూ నిద్రలోకి జారుకుంది. నిద్రలో శూర్పణఖ అందమైన రాకుమారిలాగా మీనాక్షి కలలోకొచ్చింది.

మరునాడు పాఠశాలలో "శూర్పణఖ నాటకం" మొదలైంది. తెర ఎత్తారు. శూర్పణఖ బాల్యం నుండి యవ్వనం వరకు జీవితాన్ని నేపథ్య గాత్రంలో వివరించారు. తరువాత సన్నివేశంలో "మీనాక్షి (శూర్పణఖ) పంచవటికి చేరి రాముడినికలిసిన సన్నివేశాన్ని" ప్రదర్శించారు. లక్ష్మణుడు ముక్కుచెవులు కోస్తున్నప్పుడు శూర్పణఖ పడ్డ శారీరక, మానసిక బాధను, మీనాక్షి తన నటనతో రక్తికట్టించింది. కరుణరస ప్రధానంగా సాగిన పిల్లల ప్రదర్శనకు ప్రతి కన్నూ వర్షించింది. వారందరి ప్రశంసలు, బహుమతి శూర్పణఖ నాటకం ప్రధాన పాత్రధారి మీనాక్షికే దక్కాయి.

***

మీనాక్షి పుట్టగానే కన్నులు చేపల్లాగ అందంగా ఉన్నాయని నాయనమ్మ "మీనాక్షి" అని పేరు పెట్టింది. మీనాక్షి చురుకైన పిల్ల. ఆమె తల్లిదండ్రులు శంకరయ్య, గంగమ్మలు రంగారావు దగ్గర పనిచేస్తారు. రంగారావు, అనుమాయమ్మలకు ఒక్కగానొక్క కొడుకు రామారావు. కొడుకంటే వారికి వల్లమాలిన ప్రేమ. బంగారుపళ్ళెంలో భోజనంచేసే రామారావుకు, గుడిసెల్లో పెరిగే మీనాక్షి చిన్నప్పటినుండి స్నేహంగా ఉండేది.

మీనాక్షి, రామారావు చిన్నప్పటినుండి పోటీపడి మరీ చదువుకున్నారు. వయసుతో బాటు కాలం మారింది. చదువులు పూర్తయ్యాయి. వాళ్ళ కులాలు వేరు. కాని ఆలోచన ఒక్కటే. మిత్రులంతా వాళ్ళు చదువులయ్యాక పెళ్లిచేసుకుంటారని భావించారు. మనమొకటి తలిస్తే దైవమొకటి తలిచినట్టు, రామారావు తల్లిదండ్రులు మాత్రం అభ్యంతర పెట్టారు. ఇన్నాళ్ళు వాళ్ళు కలిసి తిరగడానికి అడ్డురాని అంతస్తు, కులపట్టింపులు వివాహానికి అడ్డొచ్చాయి. పిల్లలు తట్టుకోలేకపోయారు. రామారావు తల్లిదండ్రులను ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు. రంగారావు మెత్తబడ్డా, అనుమాయమ్మ ససేమిరా ఒప్పుకోలేదు. రామారావుకు గొప్ప గొప్ప పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. కానీ రామారావు అవేవి లక్ష్యపెట్టడం లేదు. రామారావు మనసులో మీనాక్షి ఉందని తెలుసుకొన్న అనుమాయమ్మ తీవ్ర అసంతృప్తిగా ఉంది. మీనాక్షి తనకు కోడలుగా రావడం ఇష్టం లేదు.

***

అనుమాయమ్మ ఉదయమే భర్తకు టీ అందిస్తూ "ఏంటండి.. ఎక్కడ దాపురించిందీ..శూర్పనఖ..అదే ఆ మీనాక్షి....దాని మాయదారి అందంతో మన రామారావుని వలలో వేసుకుంది ". రంగారావు మాట్లాడడంలేదు. పేపరు చదువుతున్నాడు. "ఎంత మొత్తుకున్నా, మీరు ఉలకరు, పలుకరు.... దానితండ్రి శంకరయ్యను పిలిచి మాట్లాడుతారా లేదా .." అని పట్టుపట్టింది. టీ తాగి,కప్పు టీపాయి మీద పెట్టి, పేపరందుకుని, "సరేనని" తలవూపాడు రంగారావు.

ఈలోగా రామారావు అక్కడకి వచ్చాడు. తండ్రి ఎదురుగా సోఫాలో కూర్చొని, టీ పాయి మీద ఉన్న పత్రికలను అందుకున్నాడు. పెండ్లివిషయం మాట్లాడమని భర్తకు "సైగ" జేసింది. "అడకత్తెరలో పోకచెక్కలాగయింది నా బ్రతుకు. కొడుకు విన్పించుకోడు. భార్య చెప్పినా వినదు". అని మనసులో రంగారావు అనుకుంటుండగా, అనుమాయమ్మ "తీక్షణచూపులు" తట్టుకోలేక, ఒరే.. రామారావు.. నీకు నెల్లిబండ సంబంధం వచ్చింది" చెప్పడం ప్రారంభించాడు. "ఒక్కతే అమ్మాయి. పేరు రమ. యాభై ఎకరాల పొలం. తోటలు ఉన్నాయి. మనకు సరితూగే అంతస్తు. నువ్వు వూ..అంటే చాలు. రేపే వాళ్ళకు కబురుపంపుతా" నని అమ్మాయి ఫోటో రామారావు ముందు పెట్టాడు.

రామారావు తననుకాదన్నట్టు పత్రిక చదవడంలో మునిగిపోయాడు. ఇదంతా చూస్తున్న తల్లికి ఒళ్ళుమండి, వేగంగావచ్చి కొడుకుచేతిలో ఉన్న పేపరును విసుగ్గా లాగింది. పేపరు కూడా వాళ్ళ అనుబంధంలాగే నిట్టనిలువునా చిరిగింది. తల్లి రామారావుని గట్టిగా నిలదీసింది. "పెళ్లి సంగతి తేల్చు. మేము చెప్పిన సంబంధం చేసుకుంటావా? చేసుకోవా?'' హుంకరించింది. రామారావు తీవ్రంగానే ప్రతిస్పందించాడు. "నాకు మీనాక్షి అంటేనే ఇష్టం. ఆమెనే చేసుకుంటానని" తెగేసి చెప్పాడు. అమ్మ రుసరుసలు తట్టుకోలేక అక్కడి నుండి విసురుగా వెళ్ళిపోయాడు. అనుమాయమ్మ తన అసహనాన్ని రంగారావుపై వెళ్లగక్కడంతో, అతను కూడా మెల్లగా అక్కడనుండి జారుకున్నాడు. ఇక లాభం లేదనుకొని, అనుమాయమ్మ మీనాక్షి తల్లిదండ్రులను ఇంటికి పిలిపించింది.

***

మీనాక్షి తల్లిదండ్రులు శంకరయ్య, గంగమ్మ అక్కడకు వచ్చారు. యజమానురాలు దాపరికం లేకుండా అసలువిషయం మొత్తం చెప్పింది. “శంకరయ్య ! నువ్వు మాదగ్గర చాలాకాలం నుండి నమ్మకస్తుడిగా పనిచేస్తున్నావు. మన పిల్ల అని ఇన్నాళ్ళు దగ్గరకు రానిస్తే, నా కొడుకును నా మాట వినకుండా జేస్తుందా? వాడు.. మీనాక్షిని తప్ప ఎవర్నీ పెళ్లి చేసుకోనని అంటున్నాడు. నీ బిడ్డను అదుపులో ఉంచుకుంటావా లేదా” అడిగింది అనుమాయమ్మ. దాంతో వారు మీనాక్షికి సర్దిచెబుతామని హామీయిచ్చి, నమస్కరించి వెనుదిరిగారు.

ఇంటికిపోయాక శంకరయ్య బిడ్డతో “బిడ్డా ...! మన తాహతు మించి ఆశపడొద్దు ”, “తిన్నింటి వాసాలు లెక్కపెట్టే ద్రోహం చేయొద్దు. రంగారావు ఉప్పు తిన్నందుకు మనం విశ్వాసం చూపాలి ” అని, బిడ్డకు పలు విధాలుగా నచ్చచెప్పి మీనాక్షి మనసును మార్చాడు.

ఆ తరువాత అనేకమార్లు తల్లితో వాదులాడి, ఓడిపోయి, విధిలేని పరిస్థితులలో రామారావు కూడా తల్లి కోరికకు తలవంచక తప్పలేదు. రమతో పెళ్లి వైభవంగా జరిగింది. మీనాక్షి కంటే రమ అందంలో తక్కువే. రామారావుతో రమ పెళ్లి వైభవంగా జరిగింది. ఉన్న వాళ్ళింట్లో పెళ్లికి ఊరంతా హాజరయ్యారు. ఒక్క మీనాక్షి తప్ప.

***

జరిగిన పెళ్లికి రామారావు ఇష్టంతో పనిలేదు. రామారావుకి రమతో పనిలేదు. కానీ సమాజానికి అవే ప్రధానం అయ్యాయి. కొన్నాళ్ళకు మారతాడని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశ ఎదురైంది. లక్షల కట్నం పోసినా కూడా, తనబిడ్డ జీవితం బాగాలేదని రమ తల్లిదండ్రులు బాధపడ్డారు. రామారావు తల్లిదండ్రులతో పోరుపడ్డారు. అవేవి రామారావు మనసును గెలవలేక పోయాయి. రామారావు తల్లిదండ్రులలో అసహనం రోజురోజుకి పెరిగింది. లాభం లేదని అనుమాయమ్మ ఒకరోజు శంకరయ్యను పిలిచి ఆఘమేఘాల మీద మీనాక్షికి ఒక సంబంధం కుదిర్చి, బలవంతంగా వివాహం చేయించారు.

ఒక్కచోటపడ్డ చిక్కుముడి విప్పలేక, రెండోసారి అదే తప్పు చేయడంతో, సమస్య మరింత జఠిలం అయింది. పెళ్లి చేయాలనే తొందరలో అయోగ్యునికి ఇచ్చి చేయడం

వలన, మీనాక్షి జీవితం కూడా తలకిందులైంది. వ్యసనాలకు అలవాటయిన మీనాక్షి భర్త, పెళ్ళయిన రెండేళ్ళలోనే అర్ధాంతరంగా తనువు చాలించాడు. మీనాక్షి తిరిగి తల్లిగారింటికి చేరింది.

***

పిల్లల మనసు తెలుసుకోలేని పెద్దల తొందరపాటుకు నల్గురి జీవితాలు నరకం అయ్యాయి. కాలం గడుస్తున్నా కొద్దీ, పెద్దల్లో పంతం తగ్గడానికి బదులు పెరిగింది. పిల్లల్లో ఒక్కటవ్వాలన్న కోరిక పెరిగింది. రామారావు మీనాక్షిని రహస్యంగా కలుస్తున్నాడు. వారి అనుబంధాన్ని కాలం ఓర్చుకొలేకపోయింది. ఏకాంతానికి కన్నుకుట్టింది. జనాల నోటిలో రహస్యం దాగలేదు. ఊరంతా వేగంగా పాకింది. వారు రహస్యంగా సమావేశమవడం ఆ నోటా ఈ నోటా మెల్లగా రమ చెవిన పడింది. రమ అత్తమామల చెవిన వేసింది. అప్పటి దాకా రామారావుకి రమపై ఏ భావం లేదు. మొదటిసారి రమపై కోపం వచ్చింది. రామారావుని నిలదీసిన రమ చెంప చెల్లుమంది. రమ కోపంతో తల్లిదండ్రులను పిలిపించింది. ఇదంతా నచ్చని రామారావు మనశ్శాంతి కోసం హైదరాబాదులో ఉండే అక్కయ్య ఇంటికి వెళ్ళాడు.

***

విషయం తెలిసిన రమ తల్లిదండ్రులు ఆవేశంతో వచ్చారు. వారితో బాటు అనుమాయమ్మ, రంగారావులు కలిసి కుట్ర పన్నారు. మీనాక్షిని “మీ నాన్న రమ్మన్నారని” మనిషిని పంపి అబద్ధం చెప్పి పిలిపించారు. బలవంతంగా గదిలో బంధించారు. అనుమాయమ్మకు మీనాక్షి అందంపై అక్కసుతో బాటు అసూయ ఉంది. కొడుకు తన కోడలును పట్టించుకోక పోవడానికి కారణం మీనాక్షి అందమేనని ఆమె నమ్మకం. అనుమాయమ్మ మీనాక్షిపట్ల రాక్షసత్వం చూపింది. విచక్షణారహితంగా కొట్టింది. సాటి ఆడదని కూడా చూడకుండా కొట్టడానికి తగని సున్నితమైన భాగాల్లో బలంగా తన్నింది. అనుమాయమ్మ రాక్షసత్వం పరాకాష్టకు చేరింది. మీనాక్షి సొమ్మసిల్లి పడిపోయింది.

***

మీనాక్షిని రహస్యంగా వాళ్ళింటికి చేర్చారు. మీద కిరోసిన్ పోశారు. అయినా మీనాక్షికి తెలివిరాలేదు. లోపల నుండి గడియవేశారు. ఇంటివెనుక గుమ్మం దారిన బయటకొచ్చి తలుపుకు తాళం వేశారు. "చావవే. శూర్పణఖ ...చావు..." అని తిట్టుకుంటూ, అనుమాయమ్మ అగ్గిపుల్ల గీసి కిటికీలో నుండి మీనాక్షి బతుకు మీదకు విసిరింది. మంటలకు స్పృహ వచ్చిన మీనాక్షి కేకలు వేయడానికి ముందే, రంగారావు "మీనాక్షి తగలబడుతుంది. కాపాడండి." అని మీనాక్షి అరుపులు వినబడకుండా పెద్దగా అరిచాడు. నిప్పుల్లో మీనాక్షి అందమైన ముఖం అక్కడున్న వ్యక్తుల అతర్ముఖాల్లాగా క్షణాల్లో వికారంగా మారింది. మంటల్లో మంచితనం అందం కాలిపోయింది. దానికి బదులు కనబడని వికారం మిగిలింది .

అనుమాయమ్మ దృష్టిలో మీనాక్షి శూర్పణఖ. కానీ నిజమైన శూర్పణఖను కాలం పట్టించింది. అనుమాయమ్మ కటకటాల వెనక్కి పోయింది. మీనాక్షి మరణవార్త తెలిసిన రామారావు వాస్తవం గ్రహించాడు. రమను మానవారణ్యానికి వదిలి, మీనాక్షి లోకానికి చేరుకున్నాడు.

సాక్షి – ఆదివారం, 18.04.2021

–ఈ కథ ప్రసిద్ధ అనువాదకులు డా. మంతెన దామోదరాచారి, విశ్రాంత రీజినల్ పర్యవేక్షణాధికారి, ఇంటర్ బోర్డు గారిచే ఆంగ్లానువాదం జరిగింది.

గమనిక : ఈ పుస్తకంపై ప్రముఖుల వ్యాసాలను తరువాత అనుబంధ పేజీలలో చదవండి.



సామాజిక పరిణామాల ప్రతిబింబాలు లొట్టపీసు పూలు..

"ససంత్ర మొచ్చి ఇన్నేల్లయింది. అయినా ఈ గూడానికి ఈ మదుషులకి తెల్వి రాకపాయె. ఇంకా ససంత్రం ఎక్కడిది? తెల్లోడు పోయిండన్న మాటే గని, తెల్వైన మనోడే మనల్ని బానిసల చేసి ఆడిస్తుండు. హు... కష్టమొకడిది సుఖమొకడిది. ఛా..కాలం మారినా మదుషులు మారక పాయ గదరా? " ససంత్రం తెచ్చిన నెహ్రూనే గీళ్ళను మార్సలేకపాయె. గిప్పుడు గాయన బిడ్డోచ్చిందంట. ఆడబిడ్డ. గామె జేస్తదా! (ఇసపురుగు కథలో ఇస్తారి పెద్దయ్య)

"లొట్టపీసు పూలు" కథల రచయిత శీలం భద్రయ్య 41 ఏళ్ల తెలంగాణ రచయిత. ఈ కథాసంపుటిలో 15 కథలున్నాయి. ఈ కథలన్నీ అక్టోబరు 2020 నుండి మే 2021 వరకు ఎనిమిది నెలల లోపల్నే వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. జూలై 2021 లో పుస్తకంగా తీసుకువచ్చారు. ఈ కథా సంపుటి ఇప్పుడే ఒక కథారైతు పండించిన తాజాపంట. సరికొత్త పంట. ఈ సంపుటిలోని కథలకు ఆ కథలలోని వస్తువులను బట్టి చారిత్రక ప్రాధాన్యం ఉంది. వర్తమాన ప్రాధాన్యత కూడా ఉంది. ఈ కథలు రజాకార్ల కాలం నుండి, తెలంగాణ రైతాంగ పోరాట కాలం నుండి ఇప్పటి కరోనా సెకండ్ వేవు కాలం దాకా జరుగుతాయి. ఈ కథలు రచయితకు వర్తమానం పట్ల ఎంత ఆసక్తి ఉ ందో, చరిత్ర పట్ల కూడా అంతే ఆసక్తి ఉందని తెలియజేస్తాయి. చరిత్రను వర్తమానంతో అనుసంధానం చేసి, చరిత్ర కొనసాగింపును మనకు తెలియజేయాలన్న స్పృహ కథా రచయితకుంది. చరిత్రతోనే కాదు పురాణ వాస్తవికతను కూడా, వర్తమానంతో అనుసంధానం చేసే ప్రయత్నం చేశారు భద్రయ్య.

ఈ కథలన్నీ ఒకేసారి చదివితే, పాఠకులకు ఒక వివేకాన్ని కలిగిస్తాయి. ఒక చింతనను రేకెత్తిస్తాయి. ఈ కథలు పాఠకులను అద్వాన్నపుటెడారులలో వదిలేసి వెళ్లిపోవు. ఒక యువరచయిత మనం నివసించే సమాజాన్ని ఎలా అర్థం చేసుకున్నాడో చెప్పి, మనల్ని కూడా ఆలోచించమంటాడు. ఈ కథలు నల్లగొండ జిల్లా గూడెం ప్రజల జీవిత వాస్తవికతను కథనం చేస్తున్నాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నల్గొండ ప్రాంతంలోనే ఉధృతంగా కొనసాగింది. ఆ ఉద్యమం 1951 అక్టోబరులో నిలిచిపోయినా , ఆ ఉద్యమకాలంలో పసివాళ్ళుగానో, యువకులుగానో ఉన్నవాళ్ళు ఆ ఉద్యమాన్ని తరువాత ఆ తరాల వారికి మౌఖికంగా చెబుతూ వస్తున్నారు. అందుకే తెలంగాణ రైతాంగ ఉద్యమ స్పృహ నేటికి తెలంగాణాలో

ప్రజలలో సజీవంగా ఉంది.

భద్రయ్య రాసిన పదిహేను కథల్లో ఐదు కథలు రజాకార్ల ఆగడాలను చిత్రించాయి లేదా ప్రస్తావించాయి. అంటే ఆ ఉద్యమ ప్రభావం ఇంకా ప్రజలలో బలంగా ఉందన్న వాస్తవం తెలుస్తుంది. ఉత్తరాంధ్ర సాహిత్యంలో కూడా 1967–70 ల నాటి నక్సల్బరి ఉద్యమ స్ఫూర్తి ఆ తరువాత కాలంలోనూ ప్రతిబింబిస్తుంది.

భద్రయ్య "ఇసపురుగు", "కేంపు చెర్వు", "బంచెర్రాయి", "కోదండం", "మాయబారీ"– కథలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్ల ఆగడాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చిత్రించారు. ఈ చారిత్రక సందర్భం భద్రయ్య కథలకు గొప్ప ప్రాముఖ్యతను తీసుకువచ్చాయి.

"ఇసపురుగు" కథలో ఇస్త్రారి పెద్దయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. రజాకార్లను ఎదిరించి పోరాడాడు. ఆయన పెద్దకొడుకు పోరులోనే మరణించాడు. ఆయన భార్య, కూతురు రకరకాల కారణాలతో చనిపోవడంతో ఏకాకి అయ్యాడు. ఊర్లో బతకలేక ఊరిబయట రాంబాయి పటేల్ బాయికాడ జీతగాడిగా కుదురుకున్నాడు. రజాకార్లతో అజ్ఞాత పోరాటం జేసే కాలంలో పెద్దయ్య నేర్చుకున్న ప్రకృతి వైద్యంతో నర్సమ్మ ఆపదను తొలగిస్తాడు. ఈ కథలో పెద్దయ్యకు స్వాతంత్ర్యానంతర భారతదేశ స్థితిగతుల పట్ల విమర్శనా దృష్టి ఉండడంలో అసహజత్వమేమి లేదు. ఒకవైపు రాష్ట్ర పాలకులు, వాళ్ళ ప్రైవేటు సైన్యంతోనూ, మరొకవైపు స్థానిక పటేల్, పట్వారిలతోనూ పోరాడిన పెద్దయ్య ఒక పటేల్ దగ్గర పనిజేసుకొని బతకవలిసి రావడం విషాదం.

స్వాతంత్ర్యం వచ్చి శ్రీమతి ఇందిరాగాంధీ పాలన వచ్చినా, గూడెం ప్రజలకు రోడ్డు, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ఆయన గట్టి విమర్శే పెట్టారు. ఈ కథలో నర్సమ్మ భర్త ఒక కొడుకు పుట్టినాక మస్కట్ వెళతాడు. అక్కడ దొంగతనం కేసులో అరెస్టవుతాడు. ఆయనను విడిపించాలంటే డబ్బు కావాలి. డబ్బు ప్రజల దగ్గర లేదు. నారాయణ పటేల్ దగ్గర ఉంది. అతడు పరమ దుర్మార్గుడు. మొగుడి ముందే పెళ్ళాన్ని చెరబట్టే దుర్మార్గుడు. పెద్దయ్య కూతురును నాశనం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైనవాడు. నర్సమ్మ స్థితి పట్ల సానుభూతి గల గంగమ్మకు కూడా అతని మీద కోపం ఉంది. అతని భార్యనే అనుమానంతో చంపేశాడు. అలాంటి వాని దగ్గరకు నర్సమ్మ అప్పు అడగటానికి వెళుతుంది. సాయంకాలం బావి దగ్గరకు వస్తే అప్పు ఇస్తానని నర్సమ్మను లోబరుచుకునే ప్రయత్నం జేస్తాడు నారాయణ పటేల్. పెద్దయ్య సాయంతో "ఇసముష్టి" మూలికా విషాన్ని నారాయణ పటేల్ కు ఇచ్చి ఆపద నుండి గట్టెక్కుతుంది

నర్సమ్మ. గంగమ్మతో బాటుగా గ్రామ ప్రజలంతా నారాయణ పటేల్ ఇసపురుగు కాటుకు చనిపోయాడనుకుంటారు. నారాయణ పటేల్ చావు గురించి గంగమ్మ కసిగా అనుకోడానికి కారణం చెబితే మరొక కథ అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామాల్లో పటేల్ ల ఆగడాలు ఆగని పరిస్థితిపై తిరుగుబాటు ఈ కథ.

"కేంపు చెర్వు" కథలో రచయిత తెలంగాణ సాయుధ పోరాట కాలానికి, నక్సల్బరీ ఉద్యమ కాలానికి ముడిపెట్టారు. ఈ కథలో నర్సమ్మ కొడుకులిద్దరిలో ఒకడు రజాకార్ల చేతిలో చనిపోయాడు. రెండోవాడు శివుడు. అతను అడవిలోకి వెళ్ళిపోయాడన్నారు. ఆరోజుల్లో రజాకార్లు ఊర్లో కొస్తే మారణ, అత్యాచారకాండలే. "రజాకార్ల వల్ల ఆ ఊర్లొ గాయపడని ఇల్లు లేదు. దెబ్బతినని మనిషి లేడు" అన్న వాక్యం పాఠకుల గుండెలను పిండుతుంది. ఆ పోరాటం పోయింది. స్వాతంత్ర్యం వచ్చింది. స్వపరిపాలన వచ్చింది. దాని వైఫల్యం నుండి నక్సల్భరి ఉద్యమం పుట్టుకొచ్చింది.అయినా ప్రజలలో రైతాంగ పోరాటస్ఫృహ నశించిపోలేదు. కథలో ఈ పరిణామక్రమాన్ని గమనించవచ్చు. ఈ నేపథ్యంలో చాకలి రామక్క ఆయాసపడుతూ వచ్చి నర్సమ్మతో "ఊరవతల కేంపు ఏసింద్రని చెబుతుంది" క్యాంపు అంటే ఆమె దృష్టిలో రజాకార్ల క్యాంపే. "ఆ ముదనష్టపోళ్లు మల్లోచ్చింద్రా" అంది నర్సమ్మ. ఆ క్యాంపు రాజాకార్లదా? కమ్యునిస్టులదా? అని ప్రజలు చర్చించుకుంటారు. చివరికి అది మూసీ జలాశయం నిర్మాణానికి సంభందించిన క్యాంపు అని తెలుస్తుంది. స్వతంత్రం వచ్చిన తరువాత కూడా దొరల ప్రభావం కొనసాగుతున్నదనడానికి ఈ క్యాంపే నిదర్శనం. అక్కడ ప్రాజెక్టు వస్తుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఊరొదిలి వెళ్లిపోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దొర హుకుం జారీ జేస్తే ప్రజలు కన్నతల్లి వంటి ఊరునొదిలిపెట్టడానికి భారంగా కదులుతారు. వలసబాట పడుతారు. అప్పుడు శివుడు అనే ఉద్యమ నాయకుడు వచ్చి దొర కుట్రను బయటపెట్టి, నష్టపరిహారం కోసం పోరాటం చేయమని వారిని చైతన్యపరుస్తాడు. దాంతో ప్రజలు దొర మీద తిరుగుబాటు చేస్తారు. దొర గడీ వదిలి పట్నం వెళ్ళిపోతాడు. ఈ కథలో దొరతనం, పెత్తనం గ్రామాలను వదిలి పట్నాలకు చేరే పరిణామాన్ని వివరిస్తుంది.

"బంచెర్రాయి" పూర్తిగా రజాకార్ల కాలంనాటి కథ. పెండ్లి జరిగినాక కొత్త పెండ్లి కూతురు లక్ష్మమ్మ ఆమె భర్త నర్సిరెడ్డి బంధువులతో కలిసి అత్తగారింటికి పోతుంటే, వాళ్ళ బండ్ల మీద రజాకార్లు దౌర్జన్యం చేస్తారు. బహుశా ఈ కథ 1947-48 మధ్య కాలంలో జరిగి ఉండవచ్చు. రజాకార్లు తమ రాజ్యం పోతుందని తెల్సి గ్రామాల మీద దౌర్జన్యాలకు దిగే క్రమంలో పెండ్లి బండ్ల మీద పడి విధ్వంసం సృష్టించారు. అదే సమయంలో యూనియన్

సైన్యాలు వచ్చి అక్కడ గాయపడ్డ ప్రజలను కలుసుకున్నారు. రజాకార్లను తరిమికొట్టారు. ఇలాంటి ఇతివృత్తాలను రచయిత తన పూర్వీకులు, గ్రామ వృద్ధుల నుండి తెలుసుకుని రాసి ఉండవచ్చు. ఏడున్నర దశాబ్దాల చరిత్రను రచయిత ఈ కథ ద్వారా మనకు గుర్తు చేశారు.

"కోదండం" కథ కూడా తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటిదే. చింత గూడెంలో కూలీలు పొలం పనులు చేస్తూ ఉంటారు. సాయమ్మ కూలి పెంచమంటుంది. అక్కమ్మ పాటలో ఆమెకు సమాధానం చెబుతుంది. పనులు ముగించుకొని సాయంకాలం అందరూ ఇళ్ళకు బయలుదేరుతుంటే 15 మంది రజాకార్లు వారిపై విరుచుక పడ్డారు. అక్కమ్మ పైట లాగారు. అక్కమ్మ పాడిన పాట వామపక్ష పాట కావడం వల్ల, వాళ్ళు ఆమెను హింసించి చంపేశారు. మళ్ళీ గూడెం మీద పడి కమ్యూనిస్టులను గురించి విచారించారు. సాయమ్మను నాశనం చేశారు. ఆ సమయంలో బహుశా అజ్ఞాత వామపక్ష వాదులు జరిపిన కాల్పుల్లో రజాకార్లు మరణించారు. ఆ గ్రామంలో అంజయ్య అనే విద్యార్థి నాయకత్వంలో చిన్న పిల్లలు చింత చెట్లు ఎక్కి, వడిసెల రాళ్ళు విసిరారు. అదే సమయంలో యునియన్ సైన్యం వచ్చింది.

దీనికి కొనసాగింపు వంటి కథ "మాయబారి". సాయమ్మ భర్త తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో మరణించాడు. సాయమ్మ కొడుకులలో ముత్తయ్య చిన్నవాడు. తండ్రి మార్గంలో నడుస్తాడు. ముత్తయ్యను రజాకార్లు పట్టుకుపోయి సంఘ నాయకుల ఆచూకి చెప్పమని భయంకరంగా హింసిస్తారు. అదే సమయంలో సంఘ నాయకులు అక్కడకు వచ్చి రజాకార్లను తరిమికొడతారు. దాంతో ముత్తయ్య సంఘంలో కలిసిపోయాడు. రజాకార్లు మళ్ళీ అర్ధరాత్రి వచ్చి సాయమ్మను, ముత్తయ్య భార్యా పిల్లలను ఊచకోత కోస్తారు. అది తెలిసి ముత్తయ్య ఊర్లో సంఘ సమావేశం పెడుతుండగా సాయుధ రజాకార్లు వచ్చిపడ్డారు. ముత్తయ్య తప్పించుకున్నాడు. అయినా రజాకార్లు వదిలిపెట్టలేదు. అతన్ని వెంటాడారు. దీంతో ముత్తయ్య పెద్దన్న వీరన్న నాయకుడవుతాడు. తరువాత గ్రామప్రజల సాయంతో దేశీయ విధానాలు, ప్రాంతీయ వ్యూహాలతో రజాకార్లను మట్టుబెట్టారు.

ఈ అయిదు కథలలో తెలంగాణ ఏవిధంగా దొరలు, భూస్వాముల పాలనలో సతమతమైనదో చెప్పి, ప్రజాచైతన్యాన్ని చిత్రించారు రచయిత. పాలకవర్గ నిరంకుశత్వం, దౌర్జన్యాలను ప్రజలు, ప్రజాసంఘాలు సంఘటితంగా ఎదుర్కోవడమే మార్గమని ఈ కథలు చెబుతూ వచ్చాయి.

ఈ కథా సంపుటిలో "కొత్త దొర" అన్నది చాలా విశిష్టమైన కథ. దొరతనం మారకుండా దొరలు మారితే ప్రయోజనం శూన్యమని, వ్యవస్థను మార్చకుండా వ్యక్తులు మారితే లాభం లేదని ఈ కథ చెబుతుంది. ఎవరు పాలిస్తున్నారన్నది కాదు. ఎలాంటి పాలన సాగుతున్నది అనేదే ప్రధానమని ఈ కథ చెబుతుంది. ఈ కథ భుజాలు మార్చుకొని చేసే రాజకీయాల దోపిడీ స్వభావాన్ని కన్నులకు కడుతుంది.

స్వతంత్రం రాకముందు నిజాం పాలనలో దొర దగ్గర బంటుగా పనిజేసిన పెంటయ్య, తానే దొరయితే ఎలా ఉంటాడో భద్రయ్య ఈ కథలో చిత్రించారు. స్వాతంత్ర్యం రాకముందు దొర దగ్గర పాలేరుగా ఉండేవాడు పెంటయ్య. దొర చెప్పిన పనులన్నీ చేశాడు. ఆ దొర పరమ దుర్మార్గుడు. స్త్రీ లోలుడు. ఒకరోజు పెంటయ్య దొర దగ్గరికి వచ్చి దొర భూములు ప్రజలు స్వాదీనం చేసుకుంటున్నారని యూనియన్ సైన్యాలొస్తాయని తెలిసి ఊరి జనానికి ముల్లు పెరిగిందని, వాళ్లకు కమ్యూనిస్టులు తోడయ్యారని , చెప్పు కింద తేళ్ళులాగ ఉన్న జనం దొరను దొర భూములను లెక్కజేయడం లేదని వ్యాఖ్యనించాడు.

అప్పుడు దొర సూర్యాపేటకు పోయి అక్కడి నుంచి కిరాయి గుండాలని తీసుకురమ్మని చీటీ రాసి అతనిని పంపాడు. పెంటయ్య భార్య మీద దొర మనసుపడిందనే విషయం పెంటయ్య తెలుసుకుంటాడు. ఆమెను అతని బారిన పడకుండా జాగ్రత్తగా కాపాడుకున్నాడు. అందువల్ల సూర్యాపేట పోవడానికి పెంటయ్య తటపటాయించాడు. అయినా వెళ్లక తప్పలేదు. తెల్లారేసరికి సూర్యాపేట నుండి రెండు వందల మంది కిరాయి గుండాలు వచ్చి దొర భూముల్లో దిగారు. విధ్వంసం సృష్టించారు. ఆ భూముల్లోకి ఊరిజనం వస్తే హింసించారు. వెంకయ్యని చంపారు. యాదయ్య గొర్లను ఎత్తుకుపోయారు. ఆరోజు " ఏ ఇంట్లో విన్నా మూలుగులే". ఇది తెలిసి కమ్యూనిస్టులు వచ్చారు. ఆటపాటలతో జనాల్ని చైతన్య పరిచారు. ఆ సమయంలోనే పెంటయ్య వచ్చి. తన భార్యను దొర చెరిచేసి, గొంతు పిసికి బావిలో వేశాడని ఏడుస్తూ చెబుతాడు. దాంతో జనం ఆవేశం కట్టలు తెంచుకుంది. పెంటయ్య కూడా ప్రజల తిరుగుబాటులో కలిశాడు. ప్రజాగ్రహాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. 17 గ్రామాల ప్రజలు దొరపై తిరుగుబాటు చేయడంతో కిరాయి గుండాలు తోక ముడిచారు. జనం దొర గడీని కోపంతో కూల్చివేశారు. అప్పటికే దొరను, భార్యను తుదముట్టించిన పెంటయ్య తన భార్య చావును జనాల వద్ద సానుభూతికి సాకుగా చూపి తరువాత కాలంలో వారి అండతో అధికారంలోకి వస్తాడు.

ఆ తర్వాత ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది. దొర పోయిందు, దొరతనం పోయిందని

భావించిన పేదప్రజలు పెంటయ్యను నాయకుడిగా చేసుకున్నారు. పెంటయ్య రెండోసారి పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్యగా వచ్చింది దొర కూతురే. పెంటయ్య దొర గడీని అనుకూలంగా నవీకరించుకుంటాడు. "కొత్త గడీల కూసున్న పెంటయ్య నాయకుడికి గడీల దొరతనం, కరుకుదనం చేరింది." కొన్నాళ్ళు కోటలో, కొన్నాళ్ళు పట్నంలో ఉంటున్నాడు. ప్రజల సమస్యలు సమస్యలుగానే మిగిలిపోయాయి. ప్రజలకు భూమి దక్కలేదు. వృత్తులు పోయాయి. వ్యాపార వృత్తులు పెరిగాయి. వృత్తులు కోల్పోయిన వారు భూమిని కోరుకున్నారు. ప్రజల అసంతృప్తిని గమనించిన పెంటయ్య కోట గడీకొచ్చాడు. తెలివిగా కులవృత్తులను కట్టుబాట్లను పునరుద్ధరించే ప్రయత్నం చేశాడు. లేకపోతే జనం భూమి కావాలంటారని, తన మీద దళితులు తిరగబడతారని గ్రహించాడు. చివరికి జనం పెంటయ్య మీద తిరగబడతారు. ఈ కథ ఒక చారిత్రక పరిణామ కథ. చాలా నర్మగర్భంగా ఇది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలాన్ని ఆతర్వాత కాలాన్ని చిత్రించినట్లు కన్పించినా, జాగ్రత్తగా ఆలోచిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందటి పాలనను, తెలంగాణ రాష్ట్ర అవతరణ తరువాత పాలనను చిత్రించినట్టు అర్థమవుతుంది. ఈ కథలో స్వతంత్రం అంటే రాష్ట్ర అవతరణ అని అర్థం చేసుకుంటే, దొర పాలన ఆంధ్ర నాయకుల పాలన అని, పెంటయ్య పాలన రాష్ట్ర ఏర్పాటు తర్వాత పాలన అని అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, తెలంగాణలో స్వపరిపాలన వచ్చినా, సామాజిక న్యాయ తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పడలేదని, అందువల్ల ఇంకా ఉద్యమాలు రావాల్సిన అవసరం ఉందని ఈ "కొత్త దొర" కథ చెబుతున్నది అనిపిస్తుంది. ఇప్పటికే తెలంగాణలో ఏర్పడి ఉన్న తెలివికి ఈ కథ అక్షర రూపమని చెప్పవచ్చు.

ఈ సంపుటిలో గురుశిష్య సంబంధాలను చిత్రించే రెండు కథలున్నాయి. ఒకటి "కర్తవ్యం". రెండు "టముకు". మొదటిది ఉద్యోగుల కథ. రెండవది కళాకారుల కథ. "కర్తవ్యం"లో పాఠశాలలో మర్రి ఊడలు పట్టుకొని ఉయ్యాలూగే రాముడు జారి రాయి మీద పడి తల పగలడంతో ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ కట్టుకట్టి పెద్ద ఆస్పత్రికి తీసుకుపొమ్మంటాడు. పెద్దాసుపత్రిలో వైద్యానికి లక్ష రూపాయలవుతుందని డాక్టరు చెబుతాడు. ఆపరేషన్ తర్వాత ఏమైందో తెలియదు. రాము చదువుకొని ఉద్యోగం సంపాదించి తన గురువు రాఘవయ్య సారు ఆశీర్వాదం తీసుకుందామని అతని వద్దకు వచ్చాడు. వచ్చేసరికి రాఘవయ్య సారు పాడె మీదున్నారు. అంత్యక్రియలయ్యాక రామునికి రాఘవయ్య డైరీ ఇస్తాడు రాఘవయ్య నౌకరు వెంకయ్య. ఆ డైరీ లో రాఘవయ్య రాముని గురించి

గొప్పగా రాసి ఉంటాడు. అందులో "నా జీవితంలో గెలిచిన జ్ఞాపకం రాముడు" అని రాసి ఉంటుంది. ముగ్గురు అనాధ పిల్లలను చేరదీసి ఆదరించినట్లు, వాళ్ళ పోషణకు పెన్షన్ ఖర్చుపెట్టి తన ఆరోగ్యాన్ని లెక్కచేయనట్టుగా రాసి ఉంటుంది. అప్పుడు గతంలో రామునికి రాఘవయ్య సారు చేసిన మేలు గుర్తుకు వస్తుంది. తను ఆసుపత్రిలో ఉన్నాడు. నానమ్మ శవమైపోయింది. రాఘవయ్య రోడ్డు ప్రమాదంలో భార్య పిల్లల్ని పోగొట్టుకుని, గాయాలతో ఆసుపత్రికి వస్తాడు. విషయం తెలుసుకుని తన దగ్గరున్న డబ్బు ఇచ్చి వైద్యం చేయిస్తాడు. ఇది జ్ఞాపకం వచ్చి రాఘవయ్య సారు ఆదరించిన ఆ ముగ్గురు పిల్లలను తాను ఆదరిస్తారు. వాస్తవానికి ప్రచారానికి మధ్య ఉండే దూరాన్ని గురు–శిష్య సంబంధం ద్వారా భద్రయ్య రాసిన కథ "టముకు". గ్రామ విషయాలను ప్రజలను తెలియపరిచేటప్పుడు ఉపయోగించే వాయిద్య సాధనం టముకు. ప్రచారానికి ప్రతీక. ఈ కథలో బుచ్చయ్య పంతులు, సర్వడు చిడ్తల కళలో గురుశిష్యులు. సర్వడు మంగలి పని చేసుకొని జీవనం గడిపే, చిడ్తల కళాకారుడు. మంచి అందగాడు. ఆయనను ఒక రోజు తన చెల్లెలు ఇందిరను బలాత్కరించాడని అపోహపడి చెట్టుకు కట్టేసి కొడతాడు వీరారెడ్డి. బుచ్చయ్య పంతులు వెళ్లి ప్రాధేయపడి వినిపించుకుని వస్తాడు. దాంతో ఊళ్ళో మంచి పేరున్నసర్వడికి చెడ్డ పేరు వస్తుంది. ఆ అవమానం భరించలేక సర్వడు తన భార్యను తీసుకొని వేరే ఊరుకు వెళ్ళిపోతాడు. ఇందిర ఇంట్లో చెప్పకుండా ఎవరితోనో లేచిపోతుంది. ఇందిర అన్న వీరారెడ్డి సర్వడిపై అనుమానంతో కేశపురం సర్వని ఇంటికి వెళ్లి చూస్తాడు. సర్వడి భార్య మాత్రమే ఉంటుంది. అవమానం భరించలేక వీరారెడ్డి ఉరేసుకుంటాడు. దాంతో కేశపురంలో కూడా సర్వయ్య మీద దుష్ప్రచారం జరుగుతుంది. నిజానికి ఇందిర ఇంకో కళాకారుడైన మల్లయ్యతో వెళ్ళిపోతుంది. కానీ ఈలోపు ఆ గ్రామంలో కూడా సర్వడిపై దుష్ప్రచారం పాకిపోతుంది. లాభం లేదని సర్వడు ఆ ఊరును వదిలి మరోచోటుకు జీవనాన్ని మారుస్తాడు. మంచి చిడ్తల కళాకారున్ని కోల్పోవడంతో గ్రామంలో బుచ్చయ్య పంతులు ప్రదర్శించాలనుకున్న ప్రదర్శన ఆగిపోతుంది. చాలా కాలం తరువాత బుచ్చయ్య పంతులు తన మనుమరాలును చూడడానికి రాంపురం పోతున్నప్పుడు దారిలో యాదృచ్ఛికంగా అక్కడ చిడుతల రామాయణం ప్రదర్శన చూస్తాడు. అది తనవల్ల కాని పద్మవ్యూహాన్ని సర్వడు ప్రదర్శిస్తుంటాడు. దుష్ప్రచారం మానవ సంబంధాలను ఎంతగా అస్థిరపరుస్తుందో ఈ కథ చెబుతుంది. స్నేహం గొప్పదనం, ఆనాటి కళలు, వైభవం, అమాయకత్వం అవన్నీ ఈకథలో ఉంటాయి.

ఈ సంపుటిలో రెండు పరువు హత్య కథలు ఉన్నాయి. ఒకటి ఖూని. రెండవది శూర్పనఖ. గత పదేళ్లుగా తెలుగునాట పరువుహత్యలు, దుర్మార్గాలు పెరిగిపోయాయి. వీటికి ప్రధాన కారణం యువతీ యువకులలో స్వాతంత్ర్య ప్రకటన. కులాంతర ప్రేమ వివాహాలు. వీటిని సహించలేని ఆధిపత్య కులాల వాళ్ళు, నిరంకుశ వాదులు హత్యలకు పూనుకుంటున్నారు. శూర్పణఖ కథ రామాయణ శూర్పణఖ కథ నేపథ్యంగా రాశారు భద్రయ్య. రంగారావు అనసూయమ్మల కుమారుడు రామారావు. వాళ్ళ దగ్గర పనిచేసే గంగమ్మ, శంకరయ్యలకు కుమార్తె మీనాక్షి. బాల్యం నుండి రామారావు, మీనాక్షి కలిసి చదువుకున్నారు. వాళ్ల కులాలు, ఆర్థిక స్థితిగతులు వేరైనా, వాళ్ల హృదయాలు మాత్రం ఒక్కటయ్యాయి. కానీ రంగారావు తల్లిదండ్రులు అతడికి రమతో బలవంతంగా పెళ్లి చేశారు. విధిలేని పరిస్థితుల్లో ఆమె అమ్మానాన్నలు మీనాక్షికి ఒక దురలవాట్లున్న వ్యక్తితో పెళ్లి చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అనసూయమ్మది నిరంకుశ పాత్ర ఉంది. రంగారావు రమతో సంసారం చేయలేదు. మీనాక్షి భర్త మరణించాడు. ఆమె ఒంటరిదయింది. రంగారావు మీనాక్షిలు రహస్యంగా కలుస్తున్నారు. ఇది బయట పొక్కింది. ఇది తట్టుకోలేని అనసూయమ్మ మీనాక్షిని కారణంగా భావించి, ఆమె ఉంటున్న ఇంట్లోనే అగ్నికి ఆహుతి చేస్తుంది. శూర్పనఖగా మిగిలిపోతుంది.

"ఖూనీ"లో ధరణికి ఇష్టం లేని పెళ్లి చెయ్యబోతె రైల్వేస్టేషన్ లో ఆమెను పెళ్లి చేసుకోబోతున్నారనుకుని అనుమానంతో ధరణి తండ్రి చంపేస్తాడు. ఈ కథా నిర్మాణం కొంత సంక్లిష్టంగా ఉన్నా సారాంశం ఇది. ఈ కథ పరువు హత్యలపైన ఈ తరం యొక్క నిరసనే.

మూఢనమ్మకాల వల్ల బతుకులు ఎలా నాశనమవుతాయో చెప్పిన కథ "లత్తే". లింగమ్మకు నుదిటిమీద ఎగనాకుడు ఉందని, మల్లయ్య తల్లి ఆ సంబంధాన్ని ఒప్పుకోదు. అందరి ఒత్తిడితో ఒప్పుకుంటుంది. వెయ్యి రూపాయల కట్నం, రెండువేల రూపాయలకు పెరిగిపోతుంది. అనేక రకాల ఆశ చూపించాక చివరికి ఒప్పుకుంటుంది. తీరా పెళ్లి దగ్గరకు వచ్చేసరికి లింగమ్మ తండ్రి మరణిస్తాడు. దాంతో మల్లయ్య తల్లి నమ్మకం బలపడడంతో వెనక్కి తగ్గుతారు. పెండ్లి రద్దయిపోతుంది. చివరికి లింగమ్మకు ఇద్దరు భార్యలు మరణించిన వ్యక్తితో పెళ్లి జరుగుతుంది. లింగమ్మను చేసుకోవాల్సిన మల్లయ్య చివరికి బిక్షగాడు అవుతాడు. మానసిక స్వస్తత చేకూరే వరకు లింగమ్మ దంపతులు అతనికి ఆశ్రయం కల్పించి ఆదరిస్తారు.

"తోడు" కథ ఇప్పటి వైద్యరంగంలోని అమానుషత్వాన్ని వాస్తవికంగా

చిత్రించింది. పల్లెలో బతకలేక పట్నం వెళ్ళిన విజయమ్మ రామలింగంలు ఉపాధి కోల్పోవడం వలన, కూతుర్ల ధన దాహం వలన నిరాశ్రయులైన ఆ దంపతులు వృద్ధాప్యంలో వైద్యం చేయించుకోలేక జంటగా కన్ను మూసిన వాస్తవాన్ని ఈ కథ చెబుతుంది. అలాగే పల్లె నుండి పట్నం వచ్చి కరోనా కారణంగా ఉపాధి కోల్పోయి మళ్ళీ పల్లెకు చేరే క్రమంలో ప్రమాదానికి గురైన రాములమ్మ, రాములు విషాద గాథ "అగ్గువ బతుకులు". "వెలుగు చుక్క" సైనిక నేపథ్యంలోఉన్న కథ. ఆనందరావు, కిరణ్ ల సాహస గాథ. ఆనందరావు కుమారుడిని , ఆయుధాలను ఎత్తుకెళ్ళిన తీవ్రవాదులనుండి సాహాసం చేసి కిరణ్ కొన్ని గంటలలోనే తిరిగి తీసుకొస్తాడు. "లొట్టపీసు పూలు" చెరువులో పూస్తాయి. శివుడు ఆ లొట్టపీసు పూల చెట్లను నరికి వాటితో తడికల అల్లి జీవనం సాగిస్తాడు. అనుకోకుండా అతనిపై ఎల్లయ్య పంతులు అనే పెద్దమనిషిని చంపాడనే హత్యనేరం పడుతుంది. అంతకు ముందు తాతతో చెరువు దగ్గర యమున "లొట్టపీసు పూలు" ఇష్టపడి వెంట తెచ్చుకుంటుంది. ఆ పూలు బతుకమ్మను పేర్చడంలో ఉపయోగపడవని, వాటిని ముట్టరాదని సలువమ్మ తన బిడ్డ యమునకు చెబుతుంది. చివరికి ఆ హత్యోదంతాన్ని, నేరస్తుడిని పట్టివ్వడంలో ఆ "లొట్టపీసు పూలే" ఉపయోగపడతాయి. గ్రామాల్లో లొట్టపీసు చెట్లు చెరువుల్లో పెరిగినపుడు, అవి పెరగకుండా వాటిని అడుగుకు తొక్కి వేస్తారు. కొంత కాలం తరువాత లొట్టపీసు చెట్లు తిరిగి లేస్తాయి. ఈ క్రమంలో వాటినే నమ్ముకున్న కొన్ని వృత్తుల వాళ్ళు కొంతకాలం ఉపాధి కోల్పోతారు. ఈ కథల్లో అణిచివేత, చిన్నచూపుకు గురైన జీవితాల తిరుగుబాటు ప్రధానంగా ఉండడంతో ఈ పుస్తకానికి శీర్షికగా "లొట్టపీసు పూలు" అని నిర్ణయించారు రచయిత.

ఈ కథలన్నీ కలిసి సారాంశంలో స్వాతంత్ర్యానంతర ఆర్థిక సాంఘిక రాజకీయ వాస్తవాలపై రచయిత చేసిన వ్యాఖ్యలు. స్వాతంత్ర వచ్చినా, సాధించవలసినంత అభివృద్ధిని, మార్పును సాధించలేకపోవడం వల్ల, దోపిడీని నిర్మూలించలేకపోవడం వల్ల, బలవంతుల దౌర్జన్యాలు అలాగే కొనసాగుతున్నాయని ఈ కథలు చెబుతాయి. ప్రజలలో సాంఘీక చైతన్యం కల్గించడంలో పాలకులకు శ్రద్ధ లేకపోవడం వలన కుల వివక్ష కొనసాగుతూ, పరువు హత్యలు జరుగుతున్నాయి. మూఢనమ్మకాల నిర్మూలనలో పాలకులు విఫలం కావడం వల్ల వివాహ సంబంధాలు దెబ్బతింటున్నాయని ఒక కథ చెబుతుంది. పేదరిక నిర్మూలన జరిగకపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. చేరదీసిన వాళ్ళను చంపేయడం, పల్లెలను వదిలి పట్నాలకు పోయి కష్టాల పాలవ్వడం వంటి అనర్థాలు జరుగుతున్నాయని కొన్ని కథలు చెబుతాయి. "సమాజంలో ఎన్ని లోపాలున్నా,

మానవత్వం పూర్తిగా చావదు" అని చాటి చెప్పే ధోరణి చాలా కథలలో కనిపిస్తుంది.

భద్రయ్యకు వస్తువు మీద మంచి శ్రద్ధ ఉంది. వస్తువుని కథగా మలచడంలో పరిణతిని సాధించవలసి ఉంది. సామాజిక సంబంధాలను, పరిణామాలను భద్రయ్య జాగ్రత్తగా చిత్రిస్తాడు. కొన్ని సార్లు కాకతాళీయతను నమ్ముకుంటాడు. కొన్నిచోట్ల అనూహ్యా మలుపులు తిప్పాలనుకుంటారు. సీరియస్ రచయితగా ఉన్న భద్రయ్య కమర్షియల్ కోణాన్ని ఆయన పరిహరించుకోవాల్సి ఉంది. చక్కని తెలంగాణ భాష ఆయన సొంతం. ఈ కథలలోని పాత్రలు చాలా వరకు బడుగుల జీవితాలు. తల్లి లేని పిల్లలు, తండ్రి లేని పిల్లలు, ఇద్దరూ లేని పిల్లలు, నానమ్మ తాతయ్య పోషణలో పెరిగిన వాళ్ళు, భర్తల నిరాదరణకు గురైన స్త్రీలు, భర్త చనిపోతే మరొకరితో వెళ్లిపోయిన స్త్రీలు. ఈ కథల్లో వీళ్లంతా సామాన్యులు. భద్రయ్య తన పరిమితమైన జీవితానుభవంలో గొప్ప వైవిధ్యభరిత కథలే రాశాడు.

అనంతపురం **ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

07.09.2021

గతానికీ... వర్తమానానికీ వంతెన కట్టిన కథలు

'లొట్టపీసు పూలు' అనే పేరుతో చాలా మంచి కథలు రాసి తెలంగాణ కథా చరిత్రలో తనకంటూ ఒక పేజీని నిర్మించుకున్న శీలం భద్రయ్యకు హృదయపూర్వక అభినందనలు. ఈ కథకునిలో మంచి ప్రతిభ ఉంది. ఈ కథల్లో వస్తు వైశిష్ట్యాన్ని జీవన మూలాలనుంచి చూపే ప్రయత్నం జరిగింది. దీనికి తోడు ఈ కథల్లో వస్తు వైవిధ్యం ఉంది.

ఈ కథలు కథలుగా మారడంలోని కళ ఎన్నదగినది. కథలు రాసే ధోరణి చూస్తే రచయితకు కథ పట్ల చచ్చేంత ప్రేమ ఉన్నట్టుగా తోస్తుంది. కథా కళ పట్ల తగిన నేర్పరితనం వున్నట్లుంది. రాసే వీలున్న ప్రతి ఒక్కరూ కవిత్వం రాస్తుంటే, ఈ రచయిత తన శక్తి యుక్తులను, జీవన పరిశీలనా వైశిష్ట్యాన్ని, కథన కళను చక్కగా కథా రంగంలో ఉపయోగించడం అభినందనీయం.

కథ చెప్పే విధానంలో తన సొంత గొంతును విన్పించాడు. ఈ రోజుల్లో కథలు రాసే చాలా మంది రచయితల కథలను చదువుతుంటే ఎక్కడో అంతకు ముందు కథను చదువుతున్నట్టు అన్పిస్తుంది. ఈ కథల్లో అది లేదు. ఆయన తెలంగాణ చరిత్రకు చెందిన జ్ఞాపకాలను, తెలంగాణ గ్రామీణ వర్తమాన జీవితాన్ని చక్కగా పరిశీలించి, అర్థం చేసుకుని వంతెనగా మారాడు.

కథను రాయడంగా కాకుండా పక్కన కూర్చొని ముచ్చట చెప్పినట్టుగా ఉంటుంది అతని సరళి. తద్వార పాఠకుడు విసుగుకు గురి కాడు. కథల్లో నన్ను బాగా ఆకర్షించిన విషయం కథల్లో ఉన్న ఆత్మీయత. ఇది తెలంగాణ గ్రామీణ ఇంటి భాష. నిఘంటువుల్లోకి ఎక్కని మాటలు, పదాలు, నుడికారం, సామెతలు, జాతీయతలు, రకరకాల సరసాలు సన్నివేశానికి తగినట్టు అతికేటట్టు ఉన్నాయి. ఈ పుస్తకంలో వాక్యం చాలా ఆత్మీయంగా ఉంటుంది. దీనివలన పాఠకులను తనలోకి సులువుగా లాక్కొంటుంది పుస్తకం. శాలింగర్ అనే అమెరికా కథకుడు ఉండేవాడు. ఒకటి రెండు పుస్తకాలకే తనకే విసుగు పుట్టించేంతగా విపరీతమైన పేరు తెచ్చుకున్నాడు. అంత ప్రసిద్ధి పొందటానికి కారణం రచయిత కథన స్వరం. అతని కథల్లో మధ్యతరగతి యాంగ్రీ వాయిస్ వినపడుతుతుంది. శీలం భద్రయ్య కథల్లో యాంగ్రీ కోణం బదులు ఇంటిమసీ, ఆత్మీయత కనబడుతాయి. సన్నిహిత కంఠ స్వరం అల్లుకుపోయి ఉంటుంది.

కథల్లో దృశ్యాలు, సన్నివేశాలు చూసినపుడు ఎక్కడా సుదీర్ఘంగా ఉండవు. చాలా క్లుప్తంగా, అవసరం మేరకే చెప్పినట్టు ఉంటుంది. శిల్ప చాతుర్యం చూపాలన్న ధోరణి లేదు.

వీధుల్లో సాధారణ మనుషులు మాట్లాడుకునే భాష ఉపయోగించి హృదయానికి హత్తుకునే కథలు ఇతను రాశాడు.

ఆధునికతను అందిపుచ్చుకోవడం కథకుడిగా ఇతను సాధించిన మరో ఘనత. కథను వేగంగా నడిపించడానికి సినిమాల్లో సీన్ షిఫ్టింగ్ ఉన్నట్టు కథల్లో సీన్ షిఫ్టింగ్ ఉంటుంది. దీనివలన సన్నివేశం వేగంగా కదులుతుంది. ఒక దృశ్యం నుంచి ఒక దృశ్యం వేగంగా మారడం వల్ల కథల్లో ఎక్కడా విసుగు అన్పించదు. ఇది ఈనాటి తరం చదవగలిగేట్లుగా దోహదపడుతుంది. వాస్తవికతను అందరూ కథల్లో రాస్తారు.

పాఠకత్వాన్ని, చదివించే గుణాన్ని సాధించిన కథలు ఇవి. ఈ కథల్లోని అనూహ్యత ఇందుకొక ఉదాహరణ. పాఠకులు ఊహించినట్టు ఎక్కడా జరగదు. పాఠకుడిని ఒకవైపు ఆలోచింపజేసి రచయిత మరొకవైపు ముగింపు ఇస్తాడు.

మొదటి కథ ఇసపురుగు కథలో నారాయణపటేల్ క్రూరుడు. స్త్రీ లోలుడు. అతని బోనులోకి నర్సమ్మ పోతుంది. అతని బారిన పడిన నర్సమ్మ చనిపోతుందని పాఠకుడు ఉద్వేగంతో ఉంటాడు. కానీ నారాయణ పటేల్ చనిపోతాడు. అక్కడ పెద్దయ్య సాయాన్ని పొంది అతన్ని అంతం చేయడం అనే గొప్ప అనూహ్యత ఎదురవుతుంది. ఇది గొప్ప కళ. పెద్ద పెద్ద రచయితల కథల్లో ఈ లక్షణం కన్పిస్తుంది.

'టముకు ' కథలో మల్లయ్య నేరస్తుడయితే, బాధితుడు సర్వడు పాత్ర. పుస్తక శీర్షిక కథ "లొట్టపీసు పూలు" కథలో కూడా పాఠకునికి ఎక్కడా నేరస్తుడైన పాపయ్య మీద అనుమానం రాదు. ఇలాంటి అనూహ్యత ఈనాటి పాఠకులను చదివించడంలో అవసరమైన లక్షణం. మినిమలిజం (క్లుప్తత), కథన శైలి, ఆత్మీయ సంభాషణలు వాడడం అందులోనూ గ్రామీణ జీవద్భాష వాడడం అభినందనీయం. ఇందుకొక ఉదాహరణ.

"లింగమ్మ కష్టం తెలిసిన మనిషి. ముసలాయన ఆకలి గోస లింగమ్మ మదికి తగుల్తుంది. నిద్రకొచ్చిన పిలగాడు కెవ్వుమన్నడు. కొడుకేడ్పు విని కోడలు ఉరుక్కొంటొచ్చింది. లింగమ్మ పిలగాడ్ని కోడలుకిచ్చి వంటింట్లకు నడిసింది. కోడలు పిలగాడిని ఎత్తుకొని తానానికి జాలారుకాడికి నడిసింది. ముసలాయన సంగతి జూసి పొయ్యి మీద ఏడి నీళ్ళను తెస్తనని కోడలుకు చెప్పి, వంటింట్లకు నడిసింది. గిన్నెలున్న బువ్వ తీసుకొని ముసలాయనకేద్దామని బయటదర్వాజ వైపుకు అడుగులేసింది. అతన్ని చూడంగనే గతం కండ్లల్ల మెదిలింది"

ఇది తెలంగాణ గ్రామీణ ఇంటి భాష. వీధి భాష. రచయిత తన భాష ప్రత్యేకంగా ఉండాలని అనుకోలేదు. తనకు తెలిసిన జ్ఞాపకాలనూ విషయాలను ముచ్చట పెట్టినట్టు ఉంటుంది ఇతని కథనం. సంభాషణలు ఆత్మీయంగా ఉంటాయి. "అగ్గువ బతుకులు"

కథలో "తూ...నీయమ్మ. చెప్తే ఇనకపోతివి. ఇగ నీ సావు గీడనే రాసి పెట్టినట్టుందే రాములా..? " వంటి తిట్టులో ఆత్మీయత కనబడుతుంది. నిజమైన వాడుక భాష తెలంగాణాలో ఉంది. దానిని ఇంకా బలోపేతం చేశాడు. ఈ కథల్లో జీవద్భాష ప్రధాన ఇతివృత్తం.

కథల్లో చరిత్ర ఉంది. దానికి సంబంధించిన జ్ఞాపకాలు ఉన్నాయి. వాటిలో రజాకార్లు, కమ్యూనిస్టులు, ప్రజా పోరాటాలు ఉన్నాయి. వాటికి సంబంధించి స్ఫూర్తి ఉంది. ఆనాటి సామాజిక రాజకీయ చిత్రణ ఉంది. గతంతో పోల్చినపుడు వర్తమానానికి పెద్ద తేడా లేదు. ఇంత సంక్లిష్ట విషయాలను వీలైనంతగా కథనీకరించాడు. కథల్లో సాంకేతిక పదజాలం వాడడానికి వీలు లేదు. అందుకే ఆత్మీయ భాషలో అనంతమైన సంక్లిష్టతను తేలికగా పలికించాడు.

అక్కడక్కడా కట్టె, కొట్టే, తెచ్చే అన్నట్టు ఒక జీవిత కాలపు వ్యవహారాల్ని మొత్తం ఒక పేరాలో చెప్పిన విధం ఉంది. 'లత్త' కథలో ఇది ఉంది. మినిమలిజం అక్కడక్కడా ఉ ంది. అయితే ఈ సందర్భాల్లో అంతకంటే ఎక్కువ చెప్పడానికి వీలు లేదు అనికూడా అనిపించే సన్నివేశాలూ లేకపోలేదు.

శీలం భద్రయ్య గట్టి కథకుడుగా నిలబడే అవకాశం ఉన్న రచయిత. గ్రామీణ సంస్కృతిని, ఆచారాలను సంప్రదాయాలనూ, పండుగలనూ, పెళ్ళిళ్ళు సమయంలో జరిగే తంతులనూ లోతైన సమాచారం ఇస్తూ జీవితం మీద పట్టున్న రచయిత అనిపిస్తాడు. జీవితమనే తాను నుంచి కత్తిరించిన చిన్న ముక్క కథ. ఏ ముక్క తీసుకుంటే తానెరిగిన చెప్పదలుచుకున్న జీవితాన్ని ప్రతిఫలిస్తుందో దానిని తెలుసుకొని కథ రాయాలి. జీవితంలో అన్ని వస్తువులనూ కథగా రాయలేరని "థామస్ హార్డీ" అంటాడు. జీవితంలో ఉన్న భావోద్వేగ ప్రాధాన్యతలను గ్రహించి కథగా మలిచే మెరుగైన కథకుడుగా భద్రయ్య నాకు కన్పిస్తున్నాడు. తెలంగాణ కథకు శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసు పూలు" నికార్సయిన చేర్పు. ప్రచార పటాటోపాల పట్ల ఉన్న మక్కువను కాస్త అదుపులో పెట్టుకుని రచనను సీరియస్‌గా సాధన చేస్తూపోతే తెలంగాణ కథా చరిత్రలో ఈ కథకునికీ ఒక పేజీ మిగులుతుందని భావిస్తూ అభినందనలు తెలియజేస్తున్నాను.

జి. లక్ష్మీనరసయ్య

కవి, సాహిత్య విమర్శకుడు

అస్తిత్వ పతాకలు – 'లొట్టపీసు పూలు' కథలు

కథాప్రస్తావన : ఆధునిక వచన రచనా ప్రక్రియలో కథానిక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. కథానిక చిన్న కథ అనీ, కథ అనీ నేడు వ్యవహారంలో ఉంది. తెలుగు సాహిత్యంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొంది దిన దిన ప్రవర్ధమానమవుతున్న సాహిత్య ప్రక్రియ కథానిక. 'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు ఆలంకారికులు. కానీ ప్రస్తుత సమకాలీన సాహితీ ప్రక్రియల్ని చూస్తే 'కావ్యేషు కథా రమ్యం' అని అనక తప్పదు. తెలుగు సాహిత్యంలో కథ ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది. బండారు అచ్చమాంబ మొదలు ఎందరో రచయితలు కథలను రాసి కథాసాహిత్యాన్ని పరిపుష్టం గావించారు. ఈనేలలో చాలామంది రచయితలు అస్తిత్వ స్పృహతో కథలను రాశారు, రాస్తున్నారు. కాలానుగుణంగా వచ్చిన ఆయా ఉద్యమాలకు స్పందించి కథలు రాసిన వారు కూడా ఉన్నారు. జాతీయోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం మొదలు దళితవాదం, స్త్రీవాదం, బిసి వాదం, ముస్లిం మైనార్టీ వాదం ఉద్యమాలకు సంబంధించి అనేక కథలు వస్తున్నాయి. ఈ పరంపరలో తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంతో పాటు అట్టడుగు వర్గాల జీవితాన్ని ప్రతిబింబింపజేస్తూ శీలం భద్రయ్య కథలను రాస్తున్నాడు. ఈయన రాసిన తాజా కథా సంపుటియే 'లొట్టపీసు పూలు'.

నామౌచిత్యం: "లొట్టపీసు పూలు" అను శీర్షికయే అద్భుతంగా ఉంది. నిరాదరణకు గురవుతున్న పూలకు కావ్య గౌరవాన్ని కల్పించడం ఎంతో సమంజసంగా ఉంది. అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో ఇలాంటి రచనలు చేసిన కవులు, రచయితలు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో చాలామంది ఉన్నారు. వారిలో దాశరథి రంగాచార్య రాసిన 'మోదుగు పూలు'నవల, ఆచార్య ఎన్. గోపి రాసిన 'తంగేడు పూలు' కవితా సంపుటి ఎంతో సుప్రసిద్ధమైనవి. మట్టి పరిమళాలతో కూడిన సహజ సౌందర్యానికి ప్రతీకగా ప్రకృతిలో లభించేవి మోదుగు పూలు, తంగేడు పూలు, లొట్టపీసుపూలు. ఇవి నిరాడంబరత్వమునకు నిలువెత్తు నిదర్శనం. శీలం భద్రయ్య తాను రాసిన కథాసంపుటికి 'లొట్టపీసుపూలు' అని పేరు పెట్టడంలోనే మట్టి బతుకుల వెతలను, కథావస్తువులుగా స్వీకరించాడన్న విషయం అర్థమవుతుంది. ఆధిపత్యవర్గాలవారిచే అట్టడుగు వర్గాల వారు ఏవిధంగా పీడింపబడుతున్నారో, ఎలా చులకనగావింపబడుతున్నారో ఈ కథల ద్వారా మనకు తెలుస్తుంది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో జరిగిన దొరల దోపిడీ పీడనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ప్రధాన వస్తువుగా చేసుకొని రాయబడిన కథలు ఇందులో ఆరున్నాయి. అట్టడుగున పడి కనిపించని ఎన్నో సత్యాలను వెలికితీసి

ప్రపంచానికి చాటిచెప్పడమే రచయిత పరమోద్దేశం. కావున సమాజంలో నిరాదరణకు గురి కాబడ్డ వ్యక్తుల జీవితాలను తలకెత్తుకుని, వాటిని తన కథల్లో వస్తువుగా చేసుకొని ఆసక్తిగా చెప్పడం జరిగింది. కల్మషం లేని వివక్షకు గురైన జీవితాలకు ప్రతీకగా 'లొట్టపీసు పూలను' స్వీకరించడం జరిగింది.

ఇతివృత్తం: ఈ కథాసంపుటిలో మొత్తం 15 కథలు ఉన్నాయి. 'ఇసపురుగు' మొదటి కథ. 'శూర్పణఖ' చివరి కథ. ఇందులోని ఆరు కథలు ప్రపంచ చరిత్రలోనే మహోన్నత స్థానాన్ని సంపాదించుకున్న తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించినవి. సాయుధ పోరాట కాలంలో ఎందరో కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశారు. 'మావూళ్ళో కూడానా' కథ రాసిన కాంచనపల్లి చినవెంకట రామారావు, 'ఊరేగింపులు' కథ రాసిన ఆవుల పిచ్చయ్య, ' జైలు లోపల' కథ రాసిన వట్టికోట ఆళ్వారుస్వామి మొదలగువారి రచనలు తెలంగాణ సాయుధ పోరాటానికి అద్దం పడుతాయి. 'బాంచన్ దొరా కాల్మొక్త' అన్న బడుగు జీవులే బంధూకులను చేతబట్టి వీరోచిత పోరాటం చేసిన చారిత్రక ఘట్టాలను భద్రయ్య కూడా కథలుగా మలిచి ఆద్యంతం పాఠకులను ఉత్కంఠతో చదివేట్టుగా రాశాడు.

'ఇసపురుగు' కథలో నర్సమ్మ భర్త సైదులు బతుకు తెరువు కోసం మస్కట్కు వెళ్లి దొంగతనం నేరం మీద జైలుకెళ్తాడు. తన భర్తను జైలు నుంచి విడిపించడానికి నర్సమ్మ అప్పు కోసం నారాయణ పటేల్ దగ్గరికి వెళ్తుంది. ఆమె మీద కన్నుబడ్డ నారాయణ పటేల్ సాయంత్రం బాయి కాడికి వస్తే అప్పు ఇస్తానని చెప్తాడు. నాటువైద్యం తెలిసిన పెద్దయ్య సాయంతో నరసమ్మ ఆ గండం నుండి గట్టెక్కుతుంది. విషపురుగు వంటి నారాయణ పటేల్ కు విషముష్టి చెట్టు వేరును ఉపాయంతో విరుగుడుగా ఇవ్వడంతో నారాయణ పటేల్ పీడ నర్సమ్మతో బాటు ఆ ఊరి ఆడబిడ్డలకు తొలగిపోతుంది. నారాయణ పటేల్ వంటి చీడపురుగులు సమాజంలో అక్కడక్కడా ఉన్నారని ఈ కథ ద్వారా తెలియజేశాడు. 'కేంపుచెర్వు' కథలో, కొత్తగా కట్టే మూసీ జలాశయం కొరకు ప్రజలందరూ ఊరిని ఖాళీ చేయాలని దొర హుకుం జారీ చేయడం, ఆ వెంటనే మోసపూరితంగా వారందరి దగ్గరా తెల్ల కాయితం మీద సంతకాలు తీసుకొంటాడు. వాళ్ల భూములకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని కాజేయాలని దొర ప్రణాళిక వేయడం జరుగుతుంది. ప్రజాపోరాటాల్లో అజ్ఞాతంగా ఉన్న శివుడు ఆ విషయం తెలిసి, ఊరందరిని కూడగట్టి వారికి చైతన్యం కలిగిస్తాడు. నిజం గ్రహించిన ఊరిజనం దొర మీద తిరుగుబాటు చేయడంతో, దొర భయంతో పట్నం పారిపోవడంతో కథ ముగుస్తుంది. మూసీ ప్రాజెక్టు గర్భంలో తరాల జ్ఞాపకాలతో పాటు బానిసత్వాన్ని కూడా దాచుకున్న "కేంపు చెరువు (మూసీ జలాశయం)" నిర్మాణవృత్తాంతాన్ని ఈ కథలో చెప్పాడు. ఈ కథ ఒక అభ్యుదయ

కథా నిర్మాణానికి ఉదాహరణగా నిలుస్తుంది. మూసీ జలాశయాన్ని ఇప్పటికీ ఆ పరిసర ప్రాంతాల్లో 'కేంపు చెర్వు' అని పిలవడం పరిపాటి.

'లొట్టపీసు పూలు' కథలో బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగల సందర్భాల్లో గ్రామీణ వాతావరణం ఎలా ఉంటుందో సవివరంగా తెలియజేశాడు. ఈ పండుగల సమయంలోనే ఊరి పెద్దమనిషి ఎల్లయ్య పంతులు హత్యకు గురికావడం, ఆ హత్యా నేరాన్ని అమాయకుడు శివుని మీద వేయడం, దాంతో అతడు కటకటాల పాలవుతాడు. శివుడు అమాయకుడు. కాని నిజంగా హత్య చేసిన పాపయ్య పాపాన్ని "లొట్టపీసు పూలే" బయటపెట్టినవి. శివుడి జీవనానికి ఉపయోగపడే "లొట్టపీసు చెట్లు" , బతుకమ్మను పేర్చడానికి పనికిరాని 'లొట్టపీసు పూలు', ఆ ఊరిపెద్ద హత్యవెనుక ఉన్న అతి రహస్యాన్ని బయటపెట్టి నిర్దోషిని రక్షించి, దోషికి శిక్ష పడేటట్లు చేసినవని చెప్పడంలోనే ఒక అద్భుతమైన సందేశం దాగి ఉంది. ఆధిపత్య వర్గాల వారి దృష్టిలో ఏమాత్రం పనికిరాని వారుగా, అనామకులుగా భావింపబడుతున్న అట్టడుగు వర్గాల వారే సమాజాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలిచారన్న విషయం ఈ కథ ద్వారా భద్రయ్య తెలియజేశాడు. దేశభక్తి ప్రబోధాత్మకమైన కథ 'వెలుగు చుక్క'. ఈనాడు డాలర్ల వ్యామోహంలో విదేశీ ఉద్యోగాల కోసం ఎగబడుతున్న యువతకు ఒక చక్కని సందేశాన్ని అందించే కథ ఇది. ఈ కథలో మేజర్ కిరణ్ దేశ రక్షణలో భాగంగా సర్జికల్ స్ట్రైక్ తో శత్రువుల ఆట కట్టించి, మానవత్వంతో ఆపద నుండి బాలుడిని, ఆయుధాలను కాపాడి ఉన్నతాధికారులతో భేష్ అనిపించుకుంటాడు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగ అవకాశాలున్నా తండ్రికున్న దేశభక్తితో తండ్రి మాట జవదాటని సైనికుడిగా దేశ రక్షణకు తన వంతు పాత్ర పోషిస్తాడు కిరణ్. చెడు ఎప్పుడూ మంచికి శత్రువైతది. చివరికి మంచే నిలబడుతుందన్న సందేశాన్ని ఈ కథ ద్వారా రచయిత చెప్పిన విధానం బాగుంది.

'టముకు'కథ చిరుతల రామాయణం కళారూపం ప్రదర్శన వైవిధ్యాన్ని మన కళ్ళ ముందు ఉంచుతుంది. బుచ్చయ్య పంతులు చిరుతల రామాయణంలో తన జీవితకాలంలో ప్రదర్శన చేయలేని అసాధ్యమైన ప్రదర్శన శిష్యుడు సర్వయ్య సాధించడం జరుగుతుంది. ఈ క్రమంలో స్నేహితుని రహస్యాన్ని దాచి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న సర్వయ్య, చివరికి సొంత ఊరిని వదిలిపెట్టి అటుపై ఊర్లు మారాల్సి రావడం జరుగుతుంది. గురువుకుదగ్గ శిష్యుడుగా సర్వడు ఎదగడం ఇందులోని ప్రధాన వస్తువు. రజాకార్ల అరాచకాలను తెలియజేసే కథ 'కోదండం'. దోపిడీలు, హత్యలు, మానభంగాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రజాకార్లను దళనాయకుడు అంజయ్య జనాన్ని చైతన్యపరిచి, రజాకార్ల తుపాకులకు ఎదురొడ్డి వారిని తరిమేసి చింతలగూడెంకు

స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టడం ఈ కథలోని ప్రధానాంశం. గడీల పాలనలో దొరతనం గడీలకు బందీ అయిన నేపథ్యాన్ని 'కొత్తదొర'లో చెప్పాడు. మూఢనమ్మకాలను పూర్తిగా తూర్పారబట్టిన కథ 'లత్త'. లింగమ్మ నుదుట ఎగనాకుడు ఉండడం వల్ల లత్త (దరిద్రం) కొడుతుందని, ఆమెను ఎవరు పెళ్ళాడడానికి ముందుకు రాకపోగా చివరికి తనకన్నా వయసులో ఎంతో పెద్దవాడైన వ్యక్తికి మూడో సంబంధంగా పెళ్లి చేసుకుంటుంది. ఎగనాకుడు ఉన్నంత మాత్రాన ఎలాంటి అరిష్టం కలగదన్న విషయాన్ని ఈ కథ ద్వారా తెలియజేశాడు. ఇప్పటికీ గ్రామాల్లో ఈ దురాచారం అక్కడక్కడా ఇంకా కనబడుతుంది. సాయుధ పోరాటకాలంలో రజాకార్లకు వ్యతిరేఖంగా పోరాడిన సంఘం సభ్యులుగా ఉన్న కుటుంబాన్ని రజాకార్లు చిత్రహింసలకు గురిచేయడం, చివరికి వారు మాతృభూమికి చెల్లించిన విధానం మాయబారి కథలో ఉంటుంది. పరువు హత్యలకు బయోస్కోపులో చెప్పబడిన కథ 'ఖూని'. కులాలు, మతాల అడ్డుగోడలను కూల్చలేక, తమ ప్రేమను మరచిపోలేక ఎంతోమంది యువత ఎలా బలైపోతున్నారు. కులాల పట్టింపు, ప్రేమికుల ప్రేమ వ్యవహారంలో అమాయకుడైన ప్రణయ్ అనే యువకుడు కులం కారణంగా బలి కావడం ఈ కథలో ప్రధాన వస్తువు. ఈకథలో ఉత్కంఠ ప్రశంసనీయంగా ఉంటుంది. కరోనా నేపథ్యంలో రాయబడ్డ కథ 'అగ్గువ బతుకులు'. బతుకుదెరువు కోసం పట్నం పోయిన రాములు దంపతులు లాక్ డౌన్ వల్ల ఉపాధినికోల్పోవడం, సరైన రవాణావసతులు లేని ఆసమయంలో ప్రసవానికి భార్యను ఇంటికి తీసుకొస్తూ ఆ దంపతులు ప్రమాదవశాత్తు మరణించడం, కనీసం ఆ దంపతుల అంతిమ సంస్కారాలకు గ్రామంలో ఎవరూ రాకపోవడం కరోనా కల్లోల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా రచయిత చూపించాడు. పురాణ పాత్రలతో పోలిక చేస్తూ ఆధునిక సామాజిక సమస్యను కొత్త ప్రయోగం చేస్తూ రాసిన కథ 'శూర్పణఖ'.

ఈ విధంగా లొట్టపీసు పూలు కథా సంపుటిలోని కథలన్నీ కూడా నిజాం నిరంకుశ పాలన, దొరల దౌర్జన్యాలు, రజాకార్ల దురాగతాలు, ప్రజల తిరుగుబాట్లను చెప్పడమే కాకుండా అట్టడుగు వర్గాల ప్రజల బ్రతుకులను, రాజకీయ, సాంఘిక పరిణామాలను, దోపిడీకి గురైనటువంటి వారి వేదనను, నాటి సాంస్కృతిక జీవనవైభవాన్ని కళ్ళకు కట్టినట్టు ఈ కథల ద్వారా చెప్పడం జరిగింది.

సమున్నత కథా లక్షణాలు: శీలం భద్రయ్య రాసిన కథలన్నీ ఒక కథకు ఉండవలసిన లక్షణాలను పరిపూర్ణంగా కలిగి ఉండి, ఉత్తమ కథలుగా గుర్తింపు పొందాయి. కథానిక లక్షణాలైన సంక్షిప్తత, ఏకాంశ వ్యగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, ప్రతిపాద్యప్రవణత, సంవాదచాతుర్యం వంటి లక్షణాలు ఈ కథలో ఉండడం వల్ల కథలకు మరింత పరిపుష్టి

చేకూరింది. సంక్షిప్తంగా ఉండడం కథానిక ప్రధాన లక్షణం. వస్తువులోనూ, సంఘటనలోనూ, పాత్రల్లోనూ, సంవాదాల్లోనూ విస్తృతి లేకుండా సాధ్యమైనంత తక్కువగా కథను తీర్చిదిద్దే నేర్పు, ఓర్పు శీలం భద్రయ్యకు పుష్కలంగా ఉంది. పాఠకులకు విసుగు కలిగించకుండా, సంక్షిప్తంగా కథను ముగించడంలో రచయిత అందెవేసిన చేయి. తెలివైన పాఠకుడిని గౌరవించి ముగింపు ఇస్తాడు. ఆలోచన రేకెత్తించడం ద్వారా కథ పాఠకులను చాలా కాలంపాటు వెంటాడుతుంది. రెండవ లక్షణమైన 'ఏకాంశ వ్యగ్రత' అనగా వస్తువైక్యత. కథకుడు ఏ విషయం మీద ప్రధానంగా దృష్టి పెడతాడో అదే విషయాన్ని ముగింపు వరకు తీసుకొని వెళ్ళగలిగేలక్షణం భద్రయ్య కథల్లో కనబడుతుంది. కథను చదివేటప్పుడు రెప్పపాటు కానీ, రాసేటప్పుడు మనసుకు ఏమరుపాటు కానీ, లేనటువంటి ఈ లక్షణమే 'నిర్భరత'. ముఖ్యంగా పాఠకునికి విసుగు కలిగించకుండా హాయిగా చదివించే నేర్పు భద్రయ్య కథా నిర్మాణంలో భాగమే. నాలుగోలక్షణమైన ' స్వయం సమగ్రత' అనగా కథలోని వస్తువు దేనికదే సమగ్రంగా ఉండాలి. అవసరమైనటువంటిది కొరవడి, అనవసరమైనది ఎక్కువగా చెప్పినట్లు ఉండకూడదు. కథానిక పరిమాణంలో నవల కన్నా చిన్నదై దాని స్వయం సమగ్రతకు దోహదపడే విధంగా ఉండే లక్షణం శీలం భద్రయ్య కథల్లో కనబడుతుంది. ఐదవ లక్షణమైన 'ప్రతిపాద్య ప్రవణత'. తాను తెలుసుకున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకొని దాని వికాసానికి అనుగుణంగా రచన సాగించే నేర్పరి భద్రయ్య. ఇక చివరి లక్షణమైన 'సంవాద చాతుర్యం'సంభాషణ రూపంలో సాగే వాక్యాలు ఒకానొక ప్రధానమైన అంశాన్ని ఆవిష్కరించే టట్లుగా, ఒక పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రదర్శించేటట్లుగాఉండాలి. ప్రతి సంభాషణ కథకు ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలి. ఈ ప్రతిభ ఈ కథల్లో స్పష్టంగా కనబడుతుంది. ఇలా ఒక కథకు ఉండవలసిన లక్షణాలన్నీ భద్రయ్య కథల్లో ఉండడంవల్ల వాటికి మరింత పరిపుష్టి కలిగిందని చెప్పవచ్చు.

కథాకథనం: 'కథంటే కథన రూపంలో చెప్పబడే చిన్న నాటకం' అంటాడు హెన్రీథామస్. కథను ప్రారంభించే విధానంతో పాటు సంభాషణలతో కూడి, ఆద్యంతం పాఠకులకు ఆసక్తిని కలిగించే విధంగా కథను కొనసాగిస్తూ చక్కని ముగింపును కలిగియున్నప్పుడే ఆ కథ మరింత ఆదరణ పొందుతుంది. శీలం భద్రయ్య రాసిన కథల్లో ఒక ప్రత్యేకత కనబడుతుంది. అదేమిటంటే కథా ప్రారంభంలో చెప్పవలసిన విషయాన్ని ఎక్కడో మధ్యలో చెప్పి, మధ్యలో జరిగే కథను ప్రారంభంలో చెప్పి, ఆద్యంతం పాఠకులకు ఉత్కంఠతను రేకెత్తించే విధంగా కథను నడిపించడం. ఉదాహరణకు 'ఇసపురుగు' కథలో, కథ మధ్యలో చెప్పాల్సిన విషయాన్ని ప్రారంభంలోకి తీసుకువచ్చి, ఇలా రచనను ప్రారంభిస్తాడు. 'పొద్దుగూకాల నుంచి కుండపోతగా ఇద్వని ఆన కురుస్తుంది. అర్ధరాత్రి. వానకు తెరిపిలేదు.

నర్సమ్మ పసిబిడ్డను ఎత్తుకుని, దబ్బ దబ్బ ఇంట్ల నుండి బయటికి నడిసింది. బిడ్డ తడవకుండా నెత్తినకొప్పెరపెట్టింది. ఒళ్ళుతడుస్తున్నా లెక్కజేయక, వడిగా అడుగులేసుకుంట దవాఖానకు బయల్దేరింది.' (పుట సంఖ్య–01) ఇలా ఆరంభంలోనే పాఠకులకు కథ పట్ల ఆసక్తి కలిగి, విషయాన్ని తెలుసుకోవాలన్న కుతూహలంతో కథను చదవడానికి పూనుకుంటారు. కథా ప్రారంభం ఎంత ఆలోచనాత్మకంగా ఉంటుందో ముగింపు కూడా అంతే ఆలోచనాత్మకంగా, సందేశాత్మకంగా ఉంటుంది. మచ్చుకు 'అగ్గువ బతుకులు'కథలో ముగింపు ఇలా ఉంటుంది–'గుంజకున్న మేక గంగవ్వ మదిగుంజుతుంది. పల్పుతెంపుకుంది. పిలగాడి ఆకలి తీర్చింది. చాలాసేపటికి లింగమ్మ కండ్లల్ల నిండిన నీళ్లు ఇంకినై. ఇంటి ముంగలరాములు, రాములమ్మలు పాశిపీనిగలయింద్రు. కరోనా భయం ఊరి జనాల మానవత్వాన్ని మింగింది. లింగమ్మ ఆశను, పసిగుడ్డు తల్లిదండ్రుల ఊరి చెరువు మింగింది. గుంజకు కట్టేసిన మేక గంగవ్వ ఒక్కటే కన్నీరు పెడుతుంది. చెరువుల పడ్డ ఆటో అనాధయ్యింది '. (పుట సంఖ్య–89). కథ మరింత రక్తికట్టించడం కోసం కాల్పనికతను చేర్చడం కూడా రచనా నైపుణ్యంలో ముఖ్య భాగమే. 'కథకి గొప్పతనం కల్పించాలంటే కథ చిత్రించే జీవితం, భూమి నుంచి పైకి లేవాలి' అంటాడు చలం. ఈ కథల్లో కూడా శీలం భద్రయ్య వాస్తవికతకు కొంత పైకి కథను నడిపించి పాఠకుల హృదయాలను తనవైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యాడు.

భాషా ప్రయోగం: ఇందులో రెండుకథలు మినహా మిగతా కథలన్నీ అచ్చమైన తెలంగాణ జీవద్భాషలో రాయబడ్డాయి. ఈ కథలన్నీ చదివినప్పుడు నిఘంటువుల్లో కూడా చేరని సజీవ పదాలు వీటిలో కనబడతాయి. కతువ, తక్కు, తమసం, ఇగి, మంగులం, పుర్రచేయి లాంటి పదాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చక్కని వస్తువుతో పాటు శిల్పం కూడా ఈ కథల్లో ఉండి వాటికి మరింత పరిపుష్టిని కలిగించడం జరిగింది. సామాన్యం ప్రజలు మాట్లాడే భాషలోనే ఈ కథలు రాయబడ్డాయి. ఉదాహరణకు– 'రామలింగానిది నల్గొండ జిల్లా వల్లాల పక్కన జాలవారి గూడెం. అమ్మకు సొమ్ములు లేకున్నా అయ్యకుసొమ్మఉంది. అది చిన్నతనాన అయ్యను కాటికి తోలుకబోయింది. అమ్మ కూలినాలికి పోయి సదివిస్తే తొమ్మిదిదాంక సదివిండు. ఆ తర్వాత అమ్మ కూలినాలి చేయలేక పోయింది. 'ఉంటనో సస్తనో బిడ్డా! ఇగ మనుండంగ నీ పెళ్లి చూసి పోత'నుకుంట మేనమామ బిడ్డ విజయమ్మతో లగ్గం చేసింది. (పుట సంఖ్య–49). ఇలా స్వచ్ఛమైన ప్రజల భాషలో రాయబడం వల్ల కథలకు మరింత సహజత్వంకలిగింది.

అలంకార ప్రయోగం: కవిత్వమైనా, కథయైనా, నవలయైనా, కావ్యమైనా అలంకార ప్రయోగం ఉన్నప్పుడే మరింత సోయగాన్ని సంతరించుకొని పాఠకుల హృదయాలకి

హత్తుకుంటుంది. అలంకార ప్రయోగం లేకుండా ఏ రచన కూడా పది కాలాల పాటు మనుగడ కొనసాగించలేదు. ఈ కథల్లో భద్రయ్య అనేక అలంకారాలను ప్రయోగించి కథలకు మరింత రసపుష్టిని కలిగించాడు. మచ్చుకు కొన్ని అలంకారాలు

1. తోడేలు కలలకొచ్చిన మేక పిల్లోలె గజగజ వణికింది. (పుట సంఖ్య-6)
2. ఆడు చూపులకు ముల్లేసుకునిసూస్తడు (పుట సంఖ్య-7)
3. ఆకలున్న పెద్దపులికి అలిసిపోయిన జింక దొరికినట్టు (పుట సంఖ్య-7)
4. నిప్పుల మీద కూసున్నట్టనిపించింది. (పుట సంఖ్య-7)
5. చెట్టుకిసిరిన రాయికి పిట్టలోలిగ (పుట సంఖ్య-13)
6. అహంకారంతో ఉన్న వాళ్ల తుపాకులు మోగినై (పుట సంఖ్య-17)
7. బంచెరాయిపై కన్నీటానకురిసింది. (పుట సంఖ్య -18)
8. ఆ దీపపు కాంతిలో రాఘవయ్య సారు నవ్వులలో నిస్వార్ధపు అడుగుల ఎలుగులున్నట్టనిపించింది. (పుట సంఖ్య-26)
9. అయికూడా యమునలాగే గాలికి అందంగా నవ్వుతున్నై (పుట సంఖ్య-29)
10. వాటి తలలు గాలికి ఊగుతూ పిలుస్తున్నట్టనిపించింది. (పుట సంఖ్య -29)
11. గాబుల నీళ్లల్ల ఎర్రసంచి పాపని పాపంలా తేలుతూ కనిపించింది. (పుట-34)
12. మీనాక్షి అందమైన ముఖం అక్కడున్న వ్యక్తుల అంతర్ముఖాల్లాగా క్షణాల్లో వికారంగా మారింది. (పుట సంఖ్య-104)

ఇలా రచయిత సందర్భోచితంగా ప్రయోగించిన అలంకారాలు రచనాశైలికి మరింత సౌందర్యాన్ని తెచ్చిపెట్టాయి.

ముగింపు: 'లొట్టపీసు పూలు' కథా సంపుటిలోని కథలన్ని, ఆయా సమస్యలకు అద్దం పడుతూ, పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. అట్టడుగు వర్గాల అస్తిత్వాన్ని నిలబెట్టడం కోసం, వారిని మరింత చైతన్యపరిచేటట్లుగా ఉన్నాయి. కథ పరమోద్ధేశ్యాలైన మానసికానందంతో పాటు, చక్కని సందేశాన్ని కలిగిన కథల్ని కథాసాహిత్యంలో అస్తిత్వ పతాకలుగా ఎగిరేసిన మిత్రుడు శీలం భద్రయ్యకు హృదయపూర్వక అభినందనలు.

-డా. తండు కృష్ణ కౌండిన్య

సహాయాచార్యులు,

నాగార్జున ప్రభుత్వ కళాశాల,

నల్లగొండ, సెల్ : 9704731346

తెలంగాణ మట్టి మీది వేలిముద్రలు

తెలంగాణ నేలమాళిగను మనసుపెట్టి తవ్వుకుంటూ పోతే ఎన్నో నెత్తుటేర్ల కెరటాలు గుండె గోడలకు తాకి కూలిపోతుంటాయి. మనముందు తరాల బతుకు చిత్రాలు ప్రతి పొరలో చేతికి తాకి మన వారసత్వ మూలాలు నరాలకు చేరి దేహమంతా పౌరుషాగ్నితో ఉప్పొంగుతుంది. ఈ మట్టి మీద జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం (1946–1951) నుంచి నిన్న మొన్నటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం (2001–2014) దాకా అనేక పోరాటాల సెగ మన హృదయాన్ని కంపింపజేస్తుంది. తెలంగాణ గడ్డ మీద జరిగిన ప్రతి మూలమలుపునే కాదు ఎన్నో సామాజిక మార్పులను ఇక్కడి కథకులు తమదైన శైలీ, శిల్పాలతో చాలా బాధ్యతతో కథీకరిస్తూ వస్తున్నారు. అట్లా రాసిన ఎన్నో కథలు తెలుగు కథా సాహిత్యానికి జోడింపబడ్డాయి.

జీవితం నిరంతర ప్రవాహిని. అందులోని అనేక జ్ఞాపకాల, అనుభవాల, అనుభూతుల శకలాలను కథలుగా మలిస్తే అవి శీలం భద్రయ్య కథలు. భద్రయ్య నల్గొండ జిల్లా వాసి కావడం వలన సహజంగానే అక్కడి నేల స్వభావం ఆయన కథల్లో తొంగి చూస్తుంది. నల్గొండ అనగానే అనేక ఉద్యమాలతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గుర్తుకువస్తుంది. ఎంతో రక్త చరిత్ర యాదికొచ్చి శరీరమంతా ఒకరకమైన శీతోష్ణస్థితికి గురవుతుంది. గడిచిపోయిన చరిత్రను చరిత్ర పుస్తకాల్లో చదువుతున్నప్పుడు కాసింత బోర్ ఫీలవుతుంటాం. దాన్నే మిత్రునిలాగా కథలుగా కూర్చి చెప్తే ఇప్పటి తరాలు కాస్త ఆసక్తిగా వింటాయి. ఆ గుణాన్ని సొంతం గర్భీకరించున్న కథలు శీలం భద్రయ్య కథలు. ఏ మనిషికైనా తను నివసిస్తున్న నేల మీద మాటల్లో చెప్పరానంత ఆత్మీయత, మమకారం దాగి ఉంటుంది. అది అప్రయత్నంగానే అతని మాటల్లో, రచనల్లో, మూర్తిమత్వంలో వ్యక్తమవుతుంటుంది. అందుకు నిదర్శనం శీలం భద్రయ్య రాసిన ఈ కథా సంపుటి. ఇందులోని 15 కథల్లో ఆరు కథలు ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయదగ్గ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంగా ఉన్న కథలే.

నరరూప రాక్షసులైన రజాకార్ల దాడుల్లో తెలంగాణ కన్నీటి సంద్రమైంది. నెత్తుటి ఉప్పెనయింది. చాలా గ్రామాల్లో అమాయక ప్రజలెంతో మంది బలైపోయారు. 'సంగం' ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో నైనా ప్రజలు తిరుగబడ్డారు. "జనం ఎర్రబారింద్రు. కాశె

కట్టి, గోశి బిగించిండ్రు. బుసకొడుతున్న రజాకార్ల పడగల కొట్టి సంపిండ్రు.” ఎంతో సాహసోపేతంగా పోరాడి తెలంగాణ నేలకు స్వాతంత్ర్యం తీసుకొచ్చిండ్రు. (బంచెరాయి) రజాకార్లు గ్రామాలను విధ్వంసం చేస్తూ పోతున్నప్పుడు ప్రజలు ఎవరికి తోచిన రీతిలో వాళ్లు ప్రతిఘటించారు. పిల్లలు కూడా ఆ పోరాటంలో పాలు పంచుకోవడం ప్రజల ఉద్యమ నిమగ్నతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఆనాటి పోరాట స్వరూపాన్ని కళ్లకు కట్టిన కథ ‘కోదండం’.

రాత్రికి రాత్రి రజాకార్లు గ్రామాలనన్నింటికీ నిప్పుపెట్టి స్మశానంగా మారుస్తూ వస్తుంటే ప్రజలు ‘సంగం’తో చేతులు కలిపి రజాకార్లను మట్టుబెట్టడానికి అనేక

ఉచ్చులు బిగించారు. దెబ్బకు దెబ్బతీసి తమ తడాఖా ఏంటో నిరూపించారు. అట్లా కలిసి కట్టుగా రజాకార్లను ఎదుర్కోబట్టే కొన్ని ప్రాణాలైనా మిగిలాయి. లేదంటే తెలంగాణ యావత్తు బూడిదగా మారిపోయేది. (మాయబారి)

నిజాం ప్రభువుల పీడను, స్థానికంగా దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, పటేలు, పట్వారీల చెరనుండి ఎన్నో విప్లవాత్మక పోరాటాలు చేసి స్వేచ్ఛను పీల్చుకున్న తెలంగాణ ప్రజలు అధికారాన్ని మళ్లీ ఓ ‘కొత్తదొర’కు అప్పగించారు. ఆ దొర “గడీల కూసోని తిరిగి కుల వృత్తులను, కట్టుబాట్లను తేవాలని ప్రయత్నం జేస్తుండు. లేకపోతే జనం భూములు కావాలంటరు. నాడు దొరకు తిరగబడ్డట్టు గిప్పుడు భూములకు తన మీద తిరుగబడుతరు. ఇట్లా ఎత్తులకు తెగబడిన కొత్తదొర ముందు జనం ఇంకా చిత్తవుతూనే వుండ్రు. దొరబోయినా దొరతనాన్ని పోగొట్టుకోలేకపోయిండ్రు.” అని తెలంగాణ విమోచన తరువాతి పరిస్థితిని చిత్రించాడు.

భద్రయ్య కథల్లో వస్తువైవిధ్యం అపారంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతంలోని అన్ని పొరల్ని, తెలంగాణ సంస్కృతిని తనదైన కోణంలో ఆవిష్కరించిన కథలివి. అవసరాన్ని ఆసరాగా తీసుకొని ఆడదాన్ని లోబర్చుకునే ‘ఇసప్పురుగు’లు అనాదిగా ఉన్నాయి సమాజంలో. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అయినా ఆ ఇసప్పురుగులకు తగిన శిక్ష విధించాల్సిందే. ముంపు గ్రామాల దు:ఖం అక్షరాలకు అందనిది. ఇంటి కిందికి నీళ్ళు నిశ్శబ్దంగా వస్తుంటే ఊరంతా పుట్ట బెదిరినట్టు తలోదిక్కు పొట్టచేత పట్టుకొని పోవుడే. “ఈడనే పుట్టినం, ఈడనే చస్తమనుకున్నం. ఈడ ముందు చచ్చినోళ్లే భాగ్యమంతులు. పుట్టినకాడనే సచ్చే అదృష్టం మాకు లేదాయె. మనుండి చేసేదేముంది.

సర్కారుకి ఎదురు బోతమా? పోలేం. ఇగ మన రెక్కల కష్టం గంగపాలయినట్టే. మన బిడ్డల నోట్లె మన్నుబడ్డట్టే" అని ఏడ్వని మనిషుండడు ముంపు గ్రామాల్లో. (కేంపుచెర్వు)

దేవుని సృష్టిలో అన్ని పూలు సమానమే. కాని మనిషి కొన్ని పూలను అంటరానివిగా భావించి వాటిని అంటడు. ముట్టడు. అలాంటివే 'లొట్టపీసుపూలు'. ఈ కథ కొంత క్రైం స్టోరీలా అనిపించినా కథకుడు పాటించిన గూఢత (సస్పెన్స్) ఆకట్టుకుంటుంది. ఇందులో బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగల్ని ప్రస్తావించి వాటి చుట్టు అల్లుకున్న సాంస్కృతిక వైభవాన్ని చెప్పడం సందర్భోచితంగా తోస్తుంది.

నట్టింట్లో రంగులపెట్టె వచ్చి తిష్ట వేసిన తరువాత మన జానపద కళలన్నీ కనుమరుగైపోయాయి. అందులో చిరుతల రామాయణం కూడా ఒకటి. పాత రోజుల్లో ప్రతి నాలుగైదు ఊర్లకొకటైనా మ్యాల్లం ఉండేది. ఎన్నో వీధి బాగోతాలను సాధన చేసి జానపదులకు విజ్ఞాన, వినోదాల్ని అందించేవి. అవన్నీ ఇప్పుడు అటకెక్కిపోయాయి. అలాంటి ఎన్నో జానపద సంగతుల్ని గుర్తుకు తెచ్చే ఊహించని మలుపులతో సాగిపోయే కథ 'టముకు'. సినిమాటిక్‌గా సాగిపోయి మానవత్వమే గొప్పదని చెప్పే మరో మరిచిపోని కథ 'వెలుగు చుక్క'.

జీవితాంతం చెమటోడ్చి సంపాదించినదంతా కన్నపేగులకే ధారపోసిన తల్లిదండ్రులు చివరికి ఖాళీ చేతులతో బతుకు వాకిట్లో నిలబడితే ఏదైనా రోగమొస్తే ఎవరాదుకుంటారు? ఆ రోగమేదో ఒక జీవిని పూర్తిగా నమిలిపారేస్తే మిగిలిన జీవి మాత్రం ఇక్కడ ఒంటరిగా ఉండగలుగుతుందా? ఆఖరుకు ఎవరు గెల్చినట్టు జీవితమా? మృత్యువా? ఇలా ఎన్నో ప్రశ్నలను రేకెత్తించే కథ 'తోడు'.

కరోనా దెబ్బకు సామాన్యుల బతుకులన్నీ 'అగ్గువబతుకులు' అయిపోయాయి. ఎప్పుడెవరు మృత్యువాత పడుతారో చెప్పలేని పరిస్థితి. ఇంటికాడ ముసలి ప్రాణాలు ఎట్లా ఉన్నాయో! ఏం తిన్నదో! తిన్లేదో! అసలు బ్రతికి ఉందో లేదోనని బెంగపెట్టుకొని వలస కూలీలు, నగర కార్మికులు ఎంతో మంది కాలినడకన రోడ్లపైన నెత్తుటి పాదముద్రలు వేస్తూ, ప్రయివేటు రవాణా మార్గాల ద్వారా ఇల్లు చేరిన దృశ్యాలన్నీ టీవీల్లో చూశాం. ఆదేశ్ రవి పాట కూడా ఎన్నో దు:ఖపు తెరల్ని గుండెకందించి 'కార్జాల'ను కదిలించింది. ఇద్దరు వలస జీవుల, ఒక ముసలి ప్రాణం ధైన్య స్థితిని వాస్తవికంగా చిత్రించిన కథ ఇది. గత కొన్ని రోజులుగా దేశంలో పరువు హత్యల రుతువు కొనసాగుతోంది.

నవలంతటి విశాలమైన వస్తువుని క్లుప్తీకరించి చెప్పిన కథ 'ఖూనీ'. తల్లిదండ్రులు వాళ్ల వైపు నుంచి మాత్రమే ఆలోచించి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కాని ప్రేమికుల వైపు నుంచి కూడా ఆలోచిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావేమోననిపిస్తుంది ఈ కథ చదివిన తరువాత.

పిల్లల మనస్తత్వాలను తెల్సుకోకుండా పెద్దలు వాళ్ల వివాహ విషయంలో తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తే ఫలితాలు ఏ విధంగా ఉంటాయో సింబాలిక్‌గా చూపెట్టిన కథ 'శూర్పనఖ'.

ఈ కథా సంపుటిలోని పాత్రలన్ని మన నిత్య జీవితంలో ఎక్కడో చోట తారసపడే పాత్రలు. 'ఇసపురుగు' కథలోని నర్సమ్మ శివసాగర్ సృష్టించిన 'చెల్లి చెంద్రమ్మ' పాత్రను మరిపిస్తుంది. రాజిరెడ్డి, రాఘవయ్య సారు, రాముడు, ఎల్లయ్య పంతులు, సలువమ్మ, బుచ్చయ్యపంతులు, సర్వన్న, రామలింగం, అంజయ్య, పెంటయ్య, లింగమ్మ, ముత్తయ్య, రాములు, రాములమ్మ, మీనాక్షి మొదలైన పాత్రలు కథను మరిచిపోయినా చాలా కాలం పాటు మనల్ని వెంటాడే పాత్రలు.

ఈ సంపుటిలోని 'ఖూనీ', 'శూర్పనఖ' మినహా మిగతా కథలన్నీ తెలంగాణ తెలుగులో అదీ నల్గొండ జిల్లా తెలుగు భాషలో రాసిన స్వచ్ఛమైన, కల్మషం లేని కథలు. ప్రజా జీవితమున్న కథకుల కథలు మిగతా కథలకన్నా విభిన్నంగా ఉంటాయి. అందుకు శీలం భద్రయ్య కథలు ఒక ఉదాహరణ. 'అంగట్లో అరువు తల మీద బరువు', 'చెట్టులేని చేను, చుట్టం లేని వూరు', 'ఉంటె తినాలి లేకుంటే ఎండాలి', 'అయినోనికి ఆకుల్ల, కానోనికి కంచాల్ల', 'రాళ్ల చేనుకు గుంటుకకు పోయినట్టు', 'ఎంచబోయినోనికి మంచమంతా కంతలు దొరికినట్టు','నరంలేని నాలుక ఎటైనా మల్తది', 'ఉరికేటోన్ని జూస్తే తరిమేటోనికి లోకువ', 'మతిలేని మాట, శ్రుతిలేని పాట', 'తండ్రి తవ్వినాడని గొయ్యి దుంకితే మున్గవా?', 'తల్లిగండం పిల్ల గండం ఉంటదిగని మంత్రసాని గండముంటదా?', 'తలారి పగ తలతో మాత్రమే తీరుతది', 'అయ్య దాసండ్లకు పెడితే అమ్మ జంగాలకు పెట్టేది', 'తాదూర సందులేదంటే మెడకో డోలన్నట్లు', 'ఏరెంత పారినా కుక్కకు గతికినకాడికే నీళ్ళు', 'అలవి మీరితే అదృష్టం విషమైనట్లు', 'నిప్పులబడ్డ ఉప్పుతీర్గ', 'పులి ఎడ్డిదైతే ఎలుక కూడా ఎక్కిరిస్తదట', లాంటి సామెతలు భద్రయ్య లోకానుభవాన్ని, నిశిత పరిశీలనను, గ్రామాలతో రచయితకున్న మమేకత్వాన్ని పట్టి చూపుతాయి. కవులైన వాళ్లు కథలు రాస్తే వాళ్ల కథలు ఒక ప్రత్యేక గాఢతతో నగిషీ

చెక్కినట్లుగా రూపొందుతాయి. ఎన్నో కొత్త కొత్త పదచిత్రాలు పాఠకుల మదిని దోచేస్తాయి. ఈ కథల్లో కూడా ఆయా సందర్భాలలో భద్రయ్య కవితా శక్తి బయటపడి కథ గాఢతను పెంచాయి. 'దర్వాజ పచ్చనాకులు తొడుక్కుంది', మల్లెపూలు ముఖం మాడ్చినై', 'గుడిసెలన్నీ గుబులు పట్టినై', 'బంచెరాయిపై కన్నీటి వాన కురిసింది', 'ఏడ్పు బజారంతా పర్చుకుంటూ..', 'అగ్గిబుక్కినట్లు', 'చెర్వుకు నోరుంటే', 'ఊపిరి కూడా బర్వయితుంది', 'రెక్కలమ్ముకొని'లాంటి కవితాత్మక వాక్యాలు ఎంతో సాధారణ వచనాన్ని, లోతును కడుపులో దాచుకున్నాయి.

శీలం భద్రయ్య కథలు ఆసాంతం చదివితే మనం నిర్మించుకున్న నిఘంటువుల వెలుతురు గ్రామీణ జీవితంలోకి చొరబడలేకపోయిందని అర్థం అవుతుంది.'కతువ', 'కుడుగ్గు', 'తక్తు', 'తమసం', 'కోదండం', 'పుర్రచేయి', 'మంగులం', 'ఇగి','లగ్గంకోటు', 'మాయబారి' లాంటి పదాలు అందుకు ఉదాహరణగా నిలుస్తాయి.

భద్రయ్య తన కథల్లో శిల్పపరంగా కొత్త ప్రయోగాలేమీ చేయకున్నా ఇవన్నీ ఒక సరళ శిల్పంలో సాగిపోయే కథలు. కథాకథనం, శైలీ పరంగా ప్రత్యేక ముద్రను కల్గిన కథలుగా కనిపిస్తాయి. గత డెబ్బయి అయిదేళ్లుగా ఎన్నో మలుపులను, సామాజిక మార్పులను, సంక్షోభాలను, సంఘర్షణలను, విధ్వంసాలను ఒరుసుకుంటూ ప్రయాణిస్తున్న తెలంగాణ సమాజ నదిలో దిగి తనను ఉక్కిరి బిక్కిరి చేసిన కొన్ని జీవిత శకలాలకు కథా రూపమిస్తూ కొంత దూరం ప్రయాణించిన శీలం భద్రయ్య భాషోపాధ్యాయుడిగా తరగతి గదిలో నిరంతరం విద్యార్థులకు సాహిత్య పాఠాలు బోధిస్తున్నవాడు. అందుకే అతని కథలకు ఎవరి 'యోగ్యతా పత్రం' అవసరం లేదు. భవిష్యత్తులో తన కథల స్థాయిని తానే మదింపు చేసుకోగలడు. అయినా తొలిపంట మాధుర్యం మాటల్లో చెప్పలేనిది. భద్రయ్య రాబోయే కాలంలో మరిన్ని మంచి కథల్ని రాసి తెలుగు కథా సాహిత్యాన్ని మరింత పరిపుష్టం చేస్తాడని ఆశిస్తూ నా గాఢమైన ఆలింగనంతో తెలుగు కథా ప్రపంచంలోని స్వాగతం పలుకుతున్నాను.

తేది: 6 డిసెంబర్ 2020

డా|| వెల్దండి శ్రీధర్

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్– జిల్లా : రంగారెడ్డి – తెలంగాణ రాష్ట్రం.

తెలంగాణ భాషా వారసత్వ కథా వారధి

"జీవద్భాష జీవనదిలాంటిది. జీవనది తన ప్రవాహంలో చిన్నచిన్న పిల్లకాలువలను కలుపుకుని జీవనదిగా గమిస్తుంది. అలాగే జీవద్భాష కూడా ఇతరభాషా పదాలను సమూచితంగా తనలో కలిపేసుకుంటూ తన జీవలక్షణాలను కాపాడుకొంటూ ఉండాలి. ఏ భాషకైనా మార్పు సర్వసాధారణం" – రవీంద్రనాథ్ ఠాగూర్

తెలంగాణ కథల్లో జీవద్భాష వైవిధ్యం గొప్పది. కథాసాహిత్య వారసత్వం ప్రాచీనమైనది. తెలుగుకథ పుట్టుకకు వందని, వెయ్యేండ్లని తీర్మానించడం సబబు కాదు. ఆదిమకాలంనుండే తెలుగుకథ మనుగడలో ఉంది. మానవనాగరికతకు ముందే,మాట పుట్టాక మానవసంబంధాలలో భాగంగా కథపుట్టింది. వేదాలకంటే ముందే ఆదిమ అస్థిత్వ కులపురాణం, జాంబవపురాణంరూపంలో కథపుట్టుక తెలంగాణలో ఉంది. ఇది సబ్బండజాతుల సమాహారంగా వర్ధిల్లిన సాహిత్యం. గ్రీకు పురాణగాధలుగా ఇలియట్ చెప్పినట్లు, తెలంగాణాలో ఒక్కొక్క కులానికి ఒక్కో కులపురాణగాధ ఉంది. అవి చిన్నచిన్న కథలుగా ఉన్నాయి. వీటిని ఆశ్రితకులాలగాయకులు ఆయా జాతుల కులగాధలు, వాళ్ళ యుద్ధాలు, పోరాటాలు, జీవన సంఘర్షణలకు ప్రతిబింబంగా కథలుగా చెప్పారు. అవి "విభిన్నశైలీ అల్లికతో వారసత్వం"గా ఈనాటికి ప్రజలనాలుకలపై మౌఖికంగా సజీవంగా ఉన్నాయి.

ముచుకుందానదీ పరివాహప్రాంతం అచ్చమైన తెలంగాణ తెలుగుభాషా నుడికారానికి, జీవద్భాష వైవిధ్యానికి సాహిత్య వైభవానికి ముఖ్యమైన చిరునామా. కేంపుచెరువు(మూసిప్రాజెక్టు) కేంద్రంగా శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసుపూలు" కథాసంపుటిలో కథలు అట్టి జీవద్భాషా వారసత్వంను, వైవిధ్యాన్ని అందిపుచ్చుకున్నాయి. ఈ కథలద్వారా నల్గొండజిల్లా భాషానుడికారాన్ని మూసికథావైభవాన్ని తెలంగాణ పాఠకలోకానికి కానుకగా ఇచ్చాడు.

"లొట్టపీసుపూలు" శీర్షికలోనే నిగూఢ అంతరార్ధం దాగుంది. తెలంగాణ మట్టిమీద పూలను కొలిచే సాంప్రదాయమున్నా నిరాదరణకు గురైన పూలెన్నో ఉన్నాయి. సాహితీవేత్తలు సైతం విస్మరించిన పూలల్లో లొట్టపీసుపూలు ఒకటి. వీటికి కావ్యగౌరవం కల్పించడం, రచయితపై గౌరవం రెండింతలైంది.

ఈ పుస్తకంలోని పదిహేనుకథలలో ఇతివృత్తం,వస్తువు,నేపథ్యం విభిన్నంగా ఉ

న్నాయి. కథలలో సాధారణపాఠకునికి ఆసక్తికరమైన కథనం ఉంటుంది. విమర్శకునికి విస్తృతచర్చకు అవకాశం ఉంటుంది. కథలు పాత కాలానివి. కథనం కొత్తది. వాడిన భాష మధురమైనది, సహజమైనది. ప్రతికథలో నాటికాలానికిచెందిన పాత్రల బానిసత్వపు సంకెల్లున్నాయి. అవి తెంచుకోడానికెత్తిన పురుటినొప్పుల పిడికిళ్ళున్నాయి. పాత్రల గొప్పతనాన్ని అల్లడంలో రచయిత తన లోకజ్ఞానాన్ని వినియోగించి కథలను అందించాడు. కథలు ఎలారాయాలనే సందేహానికి సమాధానంగా "అందొచ్చిన చేయికి పొందిక కుదిరినట్టు" ఈతరం కథకులుగా శీలం భద్రయ్య నిలబడతాడు.

"ఇసపురుగు"కథలో గ్రామాల్లో తక్కువ జాతిమహిళలపై ఆకృత్యాలకు ఒడికట్టినపుడు వాటిని తెలివిగా ఎలా తిప్పికొట్టారో ఉంటుంది."కేంపుచెర్వు"కథలో ముంపుబాధితులుగా సబ్బండ వర్గాల ఆర్తనాదాలు, దొరతనం ఆకృత్యం ఇతివృత్తంతో ఉంటుంది. "బంచెర్రాయి" కథలో తెలంగాణమట్టిలో రజాకార్ల ఆకృత్యాలకు బలయిన గొడ్డు గోదా,రాజిరెడ్డి తిరుగుబాటు కనబడుతుంది. "కర్తవ్యం" కథలో కాలువకిందికి పోయి ప్రాణాలు పోగొట్టుకున్న రాముడి తల్లిదండ్రుల ఆత్మఘోష వినబడుతుంది."లొట్టపీసుపూలు" కథలో గిరిజనుడు శివుడిపై పడిన హత్యానేరానికి,అతని గుడిసె తగలబెట్టడం,కేసులపాలు చేయడం కన్నీరు తెప్పిస్తుంది."టముకు"కథలో చేయనితప్పుకు వీరారెడ్డి చేతులలో చావుదెబ్బలుతిన్న మంగలి సర్వయ్యలాంటి వాళ్ళు ఊరొదిలిపెట్టి పోవడం సమాజంలో కనబడే దృశ్యాలు సహజంగా కన్పిస్తాయి. బేగరి కులానికి చెందిన ఆనందరావు బాల్యంలో చదువుకోసం పడిన ఆరాటం "వెలుగుచుక్క"కథ ద్వారా తెలుస్తుంది. "తోడు" కథలో ప్రపంచీకరణ ఫలితంగాచెప్పుల కార్కానా మూతపడి వృద్ధాప్యంలో వైద్యం లభించక విజయమ్మ,రామలింగంలు బతుకుదెరువుతోబాటు ప్రాణాలు పోగొట్టుకొంటారు. "కోదండం" కథలో రజాకార్లకు ఎదురునిలబడ్డ అణగారినవర్గాలకు చెందిన మహిళలు అక్కమ్మ,సాయమ్మలు,వారి పిల్లలు అంజయ్య నాటి తరం తిరుగుబాటుకు ప్రతినిధులు. "కొత్తదొర"లో దొరపోయినా దొరతనంకోటను ఇడిచిపెట్టకుండా పెంటయ్య నాయకునిలా రూపం మార్చుకోవడం అనేది ఇతివృత్తం. కొత్తదొర అధిక్షేపక ఉత్తమ కథ. కోటగోడపై చనిపోయిన గబ్బిలం చైతన్యం కోల్పోయిన అణగారినవర్గాల ప్రతీక. "లత్త" కథలో లింగమ్మ తలమీదున్న ఎగనాకుడు దరిద్రమనే అపోహను ఈనాటికి అక్కడక్కడ సమాజంలో ఉన్న మూఢవిశ్వాసాన్ని కళ్ళకు కట్టారు. "మాయబారి" కథలో రజాకార్లను ఎదురొడ్డి గెలిచిన అన్నదమ్ములు ముత్తయ్య,పెదీరన్నలు. పుట్టిన గడ్డకు స్వాతంత్ర్యం

సాధించడం ద్వారా కన్నతల్లికి, కన్న భూమికి మాయబారి చెల్లించారు. కరోనా నేపథ్యంలో రాసిన "అగ్గువబతుకులు"కథలో మేకలు కాసే రాములు,రాములమ్మ బతుకులు ఈకాలంలో ఎంత అగ్గువగా మారాయో చెప్పాడు. పరువుహత్య నేపథ్యంగా విధికి బలైన ప్రణయ్ లాంటి యువకుల జీవితాలు అగ్రవర్ణ దురహంకారంలో "ఖూనీ" కావడం హృద్యంగా మలిచాడు."శూర్పణఖ" కథలో మీనాక్షిపాత్రపై సానుభూతి కలిగించేదిగా, ప్రేమకు అడ్డు పేదరికం నిలవడం కొత్తగా పురాణపాత్రలతో పోలిక చేసి కొత్తప్రయోగం చేశాడు.ఇలా కథల్లో వస్తువు నవ్యతతో ప్రతికథ వైవిధ్యంగా ఉంది.

లొట్టపీసుపూలు రచయిత చిన్నకథల నుండి పెద్దకథల వరకు,నాటి నుండి నేటివరకు అర్ధవంతంగా రాశాడు. యావత్ తెలంగాణ మెచ్చుకోదగ్గ "కథా శైలీరహో" అనేవిదంగా శైలీ అల్లిక వారసత్వంగా అందిపుచ్చుకుని, చేయితిరిగిన రచయితగా ఎదిగొచ్చిన శీలం భద్రయ్యను ప్రతిఒక్కరూ మరీమరీ మతిల తెలుసుకొని సాహితీ ఆలింగనం చేసుకోవలసిందే.

ఇప్పటివరకు వస్తువునే శిల్పమని ఆంధ్రప్రాంత రచయితలు భావించారు. తెలంగాణలో కథ లేదని, భాష లేదని శిల్పంలేదని ఇంకా బుకాయించటం వందేండ్ల కథా తీర్మానం చెయ్యటం తెలివితక్కువతనం. తెలంగాణరాష్ట్రం సిద్ధించినా ఇంకా అక్కడక్కడా ఆ సన్నాయి నొక్కులున్నాయి. సారవంతమైన తెలంగాణసాహితీ సంపదను వలసవాద పాలనలో స్పృహతో మర్చినారు. సాంస్కృతిక రూపాన్ని బలవంతంగా మార్చినారు. వీళ్ళను గల్లావట్టి బోనులో నిలబెట్టే తెలంగాణ కొత్తతరం రచయితల రంగప్రవేశం ఒక సంచలనం. శీలం భద్రయ్య "లొట్టపీసుపూలు" కథలు తెలంగాణ జీవద్భాష నిజానిర్ధానకు, అసలు సిసలు భాషానిర్మాణ నిరూపణకు ఒక సవాల్గా నిరూపిస్తాయి. అవి తెలంగాణ భాషా వారసత్వ కథావారధిగా భాషాసారధిగా నిలబెడుతాయి.శీలం భద్రయ్య తెలంగాణభాషా మట్టికథలు వర్ధిల్లు....కొత్తవస్తు శిల్పమై వర్ధిల్లు దేశాన..వర్ధిల్లు .

22 డిశంబరు 2020

వేముల ఎల్లయ్య

తెలంగాణ నిఘంటువు, నల్గొండ

తెలంగాణ పల్లె బతుకుల సజీవ చిత్రాలు..

"లొట్టపీసు పూలు" కథలు

విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా. ఎన్నో ఉద్యమాలకు పుట్టిల్లు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిరంకుశ నిజాంపాలన వ్యతిరేక పోరాటానికి, ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమాల ద్వారా సాహితీ చైతన్యం వెల్లివిరిసింది. పై సంఘటనలు ఎంతో మంది రచయితలకు స్ఫూర్తినిచ్చాయి. నల్లగొండజిల్లాకు చెందిన తెలంగాణ తొలికథకురాలు బండారు అచ్చమాంబ మొదలు నేటివరకు నల్లగొండ కథ ఎన్నో మలుపులు తిరిగింది.

కథ పూర్వకాలంనుండి ఎన్నో మలుపులు చెందింది. లిపి లేని రోజుల నుండి అమ్మమ్మ తాతయ్యల కథలు, రైతు కూలీలు, జానపదులు చెప్పుకునే కథలు, హరికథలు, బుర్రకథలు, విద్యార్థులకు టీచర్లు చెప్పే కథల వరకు ఇలా ఎన్నోరకాల కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

కథకు వస్తువు, శైలి, శిల్పం ముఖ్యమైనవి. అయినా కథారచనకు వస్తువే ప్రధానమైనది. శిల్పం తరువాత అంశమే. కథకునికి కథ ఎందుకు రాయాలి, ఎవరి కోసం రాయాలి అనే ఆలోచన రావాలి. కథకు ముగింపు ముఖ్యం. ముగింపు ఆసక్తికరంగా ఆలోచించేదిగా ఉండాలి. పాత్రల చిత్రీకరణ చాలా ముఖ్యం. కథ చదివితే కలకాలం మదిలో నిలిచేలా ఉండాలి. చెప్పదలిచినదానికన్నా ఎక్కువగా చెబితే కథ పేలవంగా తయారవుతుంది. శైలి ఒక్కో రచయితది ఒక్కోరకంగా ఉంటుంది. ప్రసిద్దకథకులు రావిశాస్త్రిది ఒకరకం, కొడవటి కుటుంబరావుది ఇంకోరకం. కథారచనలో పాత్రపోషణ పాత్రకుదగ్గ సంభాషణలు కథకు విలువను పెంచుతాయి.

గతంలో నల్లగొండజిల్లాలో 1967 ప్రాంతంలో ధరణికోట సమీర్ కుమార్ మాండలికంలోరాసిన కథలు "యువ రచయితల సమితి" కథల పుస్తకాల్లో ప్రచురించబడ్డాయి. కథకుడు ఎలికట్టె శంకరరావు మన మాండలికంలో చాలా కథలు రాశాడు. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తరువాత చాలామంది రచయితలు కథలు, కవిత్వం మాండలికంలో రాస్తున్నారు. ఆవిధంగా కాళోజీ కళను సాకారం చేస్తున్నారు. "రెండున్నర జిల్లాల భాష మన మీద రుద్దుతున్నారని" కాళోజి ఆవేదన చెందేవారు.

శీలం భద్రయ్య "లొట్టపీసు పూలు" రెండు మినహా పదమూడుకథలు మాండలికంలో రాసి మన ముందుంచారు. ఇది గొప్ప ప్రయత్నం. తెలంగాణ ఆవిర్భావం తరువాత

విపరీతంగా కవిత్వం వచ్చింది. కానీ ఆ వరుసలో కథలు రాలేదు. మన జిల్లాలో కూడా కథలురాసే వారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఇప్పుడిప్పుడే కథలు రాస్తున్న శీలం భద్రయ్య, సాగర్ల సత్తయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి మాండలికంలో కథలు రాస్తునారు. శుభపరిణామం.

శీలం భద్రయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ఉద్యమ కుటుంబం నుండి వచ్చినవాడు. పల్లెల్లో పుట్టిపెరిగి పల్లెవాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. పల్లె జనం జీవితాలతో మమేకమయినవాడు కనుకనే పూర్తి గ్రామీణ వాతావరణాన్ని కండ్లకు కట్టినట్టు మనముందు ఉంచగలిగాడు. దాదాపు డెబ్బై అయిదు సంవత్సరాల కిందటి నిజాంపాలనలో జనం బతుకుచిత్రాలు శీలం భద్రయ్య "లొట్టపీసు కథలు". ఈ కథలలో శీలం భద్రయ్య పరకాయప్రవేశం చేసి కథలను పండించాడు. ముఖ్యంగా నిజాం నిరంకుశపాలన, దొరలు, జాగీర్దాల దౌర్జన్యాలు, రజాకార్ల ఆకృత్యాలు, వాళ్ళు చేసే ఆగడాలు, కమ్యునిస్టుల పోరాటాలు, నిజాం వ్యతిరేకపోరాటాలు తన కథలలో ప్రతిబింబించాడు. ఈ కథలు మనలను తెలంగాణ సాయుధపోరాట కాలానికి తీసుకెళ్తాయి. ఆరోజుల్లో అరాచక పాలన, అమాయక ప్రజల హత్యలు, మానబంగాలు, దోపిడీలు, వెట్టిచాకిరీ నిత్యకృత్యంగా జరిగేవి. నాటి మట్టి మనుషుల పోరాటాలు ఈ కథలలో చూస్తాము.

నిజాం వ్యతిరేక పోరాటకాలంలో ఎంతో పోరాట సాహిత్యం వచ్చింది. కథలు, కవితలు, గేయాలు, పాటల రూపంలో ప్రజలను చైతన్యపరిచారు నాటి రచయితలు. "మావూళ్ళో కూడానా" కథ రాసిన కాంచనపల్లి చినవెంకటరామారావు, "ఊరేగింపులు" కథ రాసిన ఆవుల పిచ్చయ్య, "జైలులోపల" కథ రాసిన వట్టికోట, బి.ఎన్.రెడ్డి పోరాట కథలు రాసి ప్రజలను చైతన్యపరిచారు.

శీలం భద్రయ్యరాసిన "లొట్టపీసుపూలు" కథల సంపుటిలో మొత్తం పదిహేను కథలున్నాయి."ఇసపురుగు" మొదటి కథ,"శూర్పణఖ" చివరి కథ. మొదటికథ "ఇసపురుగు"లో నర్సమ్మ భర్త సైదులు బతుకుదెరువుకోసం మస్కట్ వెళ్లి దొంగతనం నేరంమీద జైలుకెళ్తాడు. జైలునుంచి భర్తను విడిపించాలని అప్పుకొరకు నారాయణపటేల్ దగ్గరకు వెళ్తుంది నర్సమ్మ . "అతని కండ్లబడ్డ ఏ ఆడకూతురు తప్పించుకోలేదు, సాయంత్రం బాయికాడికి రా, పైసలిస్త" అన్న విషయాన్ని ఊరిలో పోరాటయోధుడు పెద్దయ్యకు చెబుతుంది. తెల్లారేవరకు పెద్దయ్య ఉపాయంతోగండం గట్టెక్కుతుంది. ఇసపురుగుకాటుతో నారాయణపటేల్ చస్తాడు. ఈ కథ ముగింపు ఆసక్తికరంగా ఉంది.

"కేంపుచెర్వు" కథలో పంటచేతికొచ్చిన దశలో కొత్తపెట్టుకోవడం తెలంగాణ పల్లెల్లో ఆనవాయితీ. రోళ్ళు రోకండ్లు పుదించి వడ్లు దంచడం, "కొత్తొడ్ల బియ్యమ్మొ,

కోడిమాంసమ్ము..పాతొడ్ల బియ్యమ్ము–మా ఇంట్లె ఇందు" వడ్లు దంచుతూ ఆడవాళ్ళు పాడే పాట. ఈ కథలో కొత్తగా కట్టే జలాశయం (రిజర్వాయర్) కొరకు ప్రజలందరూ ఊరును ఖాళీచేయాలని దొరవారి హుకుం. ఊరందరి సంతకాలు తెల్లకాగితంమీద తీసుకొని వాళ్ళభూములు కాజేయాలని దొర ప్లాను. పోరాట యోధుడు శివుడు ఊరంతటిని కూడగట్టి, దొర మీద తిరుగుబాటుచేస్తే, భయంతో దొర పట్నం పారిపోవడంతో కథ ముగుస్తుంది. "గడీల గుండెలు పగులకొట్టడానికి గడ్డపారలు, గొడ్డళ్ళు పదునెక్కాయి. ఆకాశం ఎర్రబడ్డది" లాంటి వాక్యాలతో కథకు నిండుతనం వచ్చింది.

"లొట్టపీసుపూలు" కథలో బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో వాటి సంబరాలగురించి బాగా చెప్పబడింది. ఈ కథలో ఎల్లయ్య పంతులు ఊరిలో పెద్దమనిషి. ఊల్లో ఎంత పెద్ద దావా అయినా చిటికెలో పరిష్కారం చూపగల నేర్పరి. శివుని భార్య అడివమ్మ. ఇద్దరి మధ్య పంచాయితీ. శివునికి నచ్చజెప్పి ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చుతాడు ఎల్లయ్య పంతులు. అకస్మాత్తుగా ఒకరోజు ఎల్లయ్య పంతులు చెర్వులో శవమై తేలుతాడు. ఆ చెర్వు నిండా లొట్టపీసుపూలు. వాటిని కొట్టి తడకలు అల్లే శివుని చెప్పులు, రుమాలు అక్కడ దొరకడంతో నేరం అతనిపై పడుతుంది. దుర్వ్యసనాలకు అలవాటయిన పాపిగాడికి హత్యకు మధ్య సంబంధాన్ని రచయిత ముగింపును ఉత్కంఠతో అనూహ్యంగా మలుపులు తిప్పి చాకచక్యంగా మలిచి మనముందుంచాడు.

"వెలుగు చుక్క" కథ దేశభక్తికి సంబంధించిన కథ. ఈ కథలో మేజర్ కిరణ్ దేశరక్షణలో భాగంగా సర్జికల్ స్ట్రైక్‌తో శత్రువుల ఆటకట్టించి ఉన్నతాధికారులతో భేష్ అనిపించుకుంటాడు. ఉన్నతచదువులు చదివి పెద్ద ఉద్యోగావకాశాలున్నా తండ్రికున్న దేశభక్తితో తండ్రిమాట జవదాటక సైనికుడిగా దేశరక్షణకు తనవంతు పాత్ర పోషిస్తాడు. మేజర్ కిరణ్ తండ్రి సర్పంచ్ వెంకట్రామిరెడ్డిని నలుగురు ప్రత్యర్థులు హత్యజేస్తారు. చీమకయినా హానితలపెట్టని మంచిమనిషిగా ఆయనకు పేరుంది.ప్రత్యర్థులు విధి విధించిన శిక్షలో భాగంగా యాక్సిడెంట్‌లో చనిపోతారు. రచయిత ఈ కథలో మంచిని గెలిపించారు.

"టముకు" కథ చిన్ననాటి చిడతల రామాయణంను గుర్తుకు తెచ్చింది. "కోదండం" కథ మొత్తం రజాకార్లు, పోరాట యోధుల మధ్య జరుగుతుంది. చింతలగూడెం గ్రామం మీద రజాకార్లు దాడి చేసి దోపిడీలు, హత్యలు, మానభంగాలుజేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పారిపోయేటట్టు చేస్తారు. అదే సమయంలో కమ్యూనిస్టు

దళనాయకుడు అంజయ్య జనాన్ని పోగుజేసి గులేరు, వడిశేల ఉపయోగించి రజాకార్ల తుపాకులకు ఎదురొడ్డి వారిని తరిమేయడం ఈ కథలో ముఖ్యాంశం. "చింతల గూడేనికి తెలంగాణకంటే ముందే స్వాతంత్ర్యం వచ్చింది. దసరాకు జమ్మిచెట్టుకాడ తుపాకి పేల్చే అధికారం అంజయ్యగుంపు చేతికొచ్చింది". ఇది ప్రజలవిజయంగా రచయిత చూపించాడు.

"లత్త"కథ మూఢనమ్మకాలను ఎండగట్టిన కథ. "లింగమ్మ నొసట ఎగనాకుడు ఉంటుంది. లత్త కొడతది. చేసుకున్నోడు నడమంత్రాన పోతడని" పెండ్లిపిలగాని తల్లి అంటుంది. పెండ్లి ఎత్తిపోతుంది. ఇంకొకరిని పెండ్లి చేసుకొని లింగమ్మ హాయిగా కాపురం చేస్తుంది. మొదటగా సంబంధానికి వచ్చిపోయినతని బతుకే ఆగమయిపోతుంది.

"ఖూని" కథ వ్యవహారిక భాషలో రాయబడ్డ కథ. ఈ మధ్య జరుగుతున్న పరువు హత్యలకు ఈ కథ మచ్చుతునక. ప్రేమ వ్యవహారం కులాల పట్టింపులు ,పెద్దల జోక్యంతో "ప్రణయ్" అనే అమాయక యువకుడు బలవడం ఈ కథలో మనకు గోచరిస్తుంది.

"అగ్గువ బతుకులు" కథ కరోనా నేపథ్యంలో రాయబడ్డ కథ. బతుకుదెరువు కోసం పట్నంపోయిన రాములు దంపతులు లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోతారు. ప్రసవానికి భార్యను ఇంటికి తీసుకువస్తున్న రాములు దంపతులు ప్రమాదవశాత్తు మరణిస్తారు. కరోనా భయంతో ఆ దంపతుల శవదహనానికి ఎవరూ రాకపోవడం ఇప్పటి కరోనా పరిస్థితులను కండ్లకు కట్టినట్టు చూపించాడు రచయిత.

ఏతావాతా ఈ "లొట్టపీసుపూలు" కథల సంపుటిలోని కథలు ఒక్కొక్కటి ఒక్కో కోణంలో రాయబడ్డాయి. అప్పటి నిజాం నిరంకుశ పాలన, దొరల దౌర్జన్యాలు , రజాకార్ల దురాగతాలు, ప్రజల తిరుగుబాట్లు ఈ కథలలో మనకు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఆనాటి ప్రజల బతుకులు, రాజకీయ, సాంఘిక పరిణామాలు ఈ కథలలో మనకు గోచరిస్తాయి. ఇందులో వాడబడిన మాండలికాలతో తెలంగాణ పల్లెలో ఆనాటి బంధాలు, అనుబంధాలు తెలియజేస్తాయి. మొత్తంగా మన మాండలికంలో రాయబడ్డ శీలం భద్రయ్య కథలు కథా ప్రపంచంలో ఓ మెరుపు మెరుస్తాయనడంలో సందేహం లేదు. ఈ కథారచన పరంపరలో శీలం భద్రయ్య తన కథారచనా శైలిని ఇంకా మెరుగుపరుచుకొని మరిన్ని మంచికథలను అందిస్తాడని ఆశిస్తూ అభినందనలు తెలియజేద్దాం.

25 డిశంబరు 2020

మేరెడ్డి యాదగిరి రెడ్డి, కథారచయిత
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత

జన భాషకున్న గౌరవాన్ని గుర్తుజేసిన కథలు ...“లొట్టపీసు పూలు”

శీలం భద్రయ్య రాసిన “లొట్టపీసు పూలు” వస్తుపరంగా వైవిధ్యం ఉన్న కథలు. ఇందులో చారిత్రక తెలంగాణ సాయుధపోరాట నేపథ్యంతో “ఇస పురుగు”, “కేంపు చెరువు”, “బంచెర్రాయి”, “కోదండం”, “కొత్తదొర”, “మాయబారి” కథలు మరియు నాటి, నేటి సామాజిక రుగ్మతల నేపథ్యంలో రాసిన “టముకు, “లత్త”, “లొట్టపీసు పూలు”, “అగ్గువబతుకులు”, “ఖూని”, “శూర్పణఖ” కథలు మరియు సామాజిక బాధ్యతను గుర్తుజేసే “కర్తవ్యం”, “తోడు”, “వెలుగు చుక్క” కథలు ఉన్నాయి.

తెలుగు కథాసాహిత్యానికి ఈ కథలు చక్కని జోడింపు మరియు మైలు రాయిగా నిలుస్తాయి. మంచి కథలకు ప్రాంతీయత, సరిహద్దులు, మాండలిక భాషాబేధాలు ఉండవనేది “లొట్టపీసు పూలు” కథల సంపుటి నిజం చేసింది. చెరువులో “లొట్టపీసు చెట్లు” వేగంగా విస్తరించినట్టు, తెలుగువారున్న ప్రతిచోటుకు ఈ కథలు పరివ్యాప్తమయ్యాయి. విమర్శవ్యాసాలపై కేంద్రసాహిత్య అకాడమి అవార్డు పొందిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు, జి. లక్ష్మీనర్సయ్య గారి వంటి ప్రసిద్ధ విమర్శకుల మన్ననను పొందింది. తెలంగాణ భాషాభిమానులకైతే ఈ కథలు చక్కని విందు. కథల్లో రచయిత భాషతో బాటు పాత్రల భాష కూడా ఇంపైన ఇంటి పలుకుబడి ఉంటుంది. ఈ కథల్లో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను చూపుతూ, అవసరమైన చోట సామెతలు, జాతీయాలను ఒడుపుతో ఉపయోగించాడు. గ్రామీణ నేపథ్యం లేని ఈ తరం పాఠకులకు అర్థం కాని మాండలిక పదాలు కూడా కథాగమనంలో అర్థమయ్యే విధంగా కథను మలచడం మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు. “లొట్టపీసు పూలు” శీర్షికను బెట్టిన రచయిత భాష, భావ దృక్పథాన్ని మరింత పరిశీలనగా చూడాల్సిన అవసరముంది. అట్టడుగు, సామాన్య వర్గాల భాష, వస్తువును ఎంపిక జేసుకుని జన సామాన్య భాషకున్న గౌరవాన్ని గుర్తుజేసిన రచయిత శీలం భద్రయ్య. కవితాత్మక వాక్యనిర్మాణం, కథానిర్మాణ శైలి, శిల్ప నైపుణ్యం రచయితను అరుదైన రచయితల సరసన నిలబెడుతుంది. ఈ తరానికి ఈ కథలు ఒక కొత్త రచనా ఒరవడికి దిక్సూచి.

ఈరోజుల్లో ఎంతో మంది కథలు రాస్తున్నారు. ఎక్కువగా తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకోలేకపోతున్నారు. శీలం భద్రయ్య తన మొదటి కథా సంపుటికే తన “శైలి, భాష, వస్తు నేపథ్యాన్ని” స్థిరబరుచుకున్నాడు. ఈ సందర్భంగా వీరి నుండి భవిష్యత్తులో మరిన్ని చారిత్రక, సామాజిక స్పృహతో కూడిన మరియు సందేశాత్మక కథలు రావాలని ఆశిస్తున్నాను. హృదయపూర్వక అభినందనలు.

– **మాదగాని శంకరయ్య,** రచయిత, విమర్శకులు

ఆత్మన్యూనత నుంచి ఆధిపత్యం దాక

తెలంగాణ కథ ఎప్పుడూ నేల విడిచి సాము చేయలేదు. తెలంగాణ కథలో అవాస్తవిక కథనాలు, వ్యాపార ప్రలోభాలకు చోటు లేదు. సంస్కరణ దృక్పథం, స్వాతంత్ర్య కాంక్ష, రాజకీయ, తెలంగాణ కథ సామాజిక జీవన చిత్రణతోపాటు చారిత్రక సంఘటనలు నమోదు చేస్తూ వచ్చింది.

ఇలా సాఫీగా సాగుతూ వస్తోన్న తెలంగాణ కథకు కొత్తబాటను చూపుతున్నాయి శీలం భద్రయ్య "లొట్టపీసు పూలు" కథలు. ఈనాడు సాహిత్యంలో కూడా ఆ కొత్తబాటకు స్వాగతం పలకాల్సిన పరిస్థితులు, అవసరం నెలకొని ఉన్నాయి.

ముదిగంటి సుజాతారెడ్డిగారు ఒక సభలో మాట్లాడుతూ... వట్టికోట ఆళ్వార్ స్వామి ప్రజల మనిషి నవల రాసిన తర్వాత ఐదేండ్లకు ప్రచురించారని, తన భాషను ఎగతాళి చేస్తారేమోనన్న భయమే అందుకు కారణమని చెప్పారు. అలాంటి ఒక న్యూనతాభావం ఆనాడు నెలకొని ఉండేది. ఆ దశలో కూడా రచయితలు భయంభయంగానో, ధైర్యంగానో తెలంగాణ భాషకు పట్టంకట్టారు. తమ భాషలోనే తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. ఆ ప్రయాణంలో నేడు, తెలంగాణ భాషలో రాయడం ఘనతగా భావించే స్థితికి మనం చేరుకున్నాం.

ఇక చలనచిత్ర రంగానికి వస్తే మొదట అసలు తెలంగాణ భాషకే స్థానం లేదు. తర్వాత రౌడీ పాత్రలకు, కామెడీ పాత్రలకు తెలంగాణ భాషను ఉపయోగించేవారు. అది సహజమైన తెలంగాణ భాష కాదని, హైదరాబాద్ గల్లీ భాషను ఉపయోగిస్తున్నారని సాహితీవేత్తలు ఆక్షేపించేవారు. తెలంగాణ అస్థిత్వ ఉద్యమాలు ఈ ధోరణిలో పెనుమార్పులు తీసుకొచ్చాయి. నేడు, రౌడీ పాత్రలే కాదు, హీరో, హీరోయిన్లు కూడా తెలంగాణ భాషలో మాట్లాడుతున్నారు. సంభాషణలకే పరిమితం కాకుండా, తెలంగాణ నేపథ్యంతోనే సినిమాలు వస్తున్నాయి. ఇంకా ఒక మెట్టు ఎక్కి, టీవీ సీరియళ్ళలో కూడా తెలంగాణ భాష తప్పనిసరి అయింది. సీరియళ్ళలో, కొన్ని వార్తా ఛానళ్ళలో తెలంగాణ భాష బలంగా వినిపిస్తున్నది. ఈ విధంగా సాహిత్య కళారంగాలలో ఆత్మన్యూనత నుంచి

ఫోటోగ్రఫిక్ శిల్పంతో రచనలు రావాలి ! :

తెలంగాణ రచయితలు రాసిన నవలలు, కథలు సినిమాలుగా ఎందుకు రాలేదు అన్నది ప్రశ్న. గతంలో తెలంగాణ పాత్రోచిత భాషలో వచ్చిన "చిల్లరదేవుళ్ళు" నవల సినిమాగా వచ్చింది. ఆ తర్వాత ఒకటి అరా వచ్చినా చెప్పుకోదగ్గ స్థాయిలో తెలంగాణ నవలలు, కథలు సినిమాలుగా రాలేదన్నది వాస్తవం. విమర్శకులు, పరిశోధకులు ఈ విషయంలో స్పష్టత తేవాల్సిన అవసరం ఉంది. అయితే ఇక్కడ ఒక విషయం గమనార్హం. చిల్లరదేవుళ్ళు నవలలో "ఫోటోగ్రఫిక్ శిల్పం" ఉందని వ్యాఖ్యానిస్తారు ముదిగంటి సుజాతరెడ్డిగారు. నవల ముగింపు సినిమా ముగింపులా ఉందని విమర్శకుల అభిప్రాయం. సినిమా కథలాగా కథను నడపడాన్నే "ఫోటోగ్రఫిక్ శిల్పం" అంటారు ముదిగంటి సుజాతరెడ్డిగారు. ఈ నేపథ్యంతో చూసినప్పుడు నేటి రచయితలు ఫోటోగ్రఫిక్ శిల్పంతో రచనలు చేయాల్సిన అవసరం ఉంది అనిపిస్తుంది.

నేడు సినిమాలు, సీరియళ్ళలో తెలంగాణ భాష వాడకం పెరిగింది. దీనికితోడు షార్ట్ ఫిల్మ్స్ తీసే యువకులు పెరిగారు. ఇలాంటి వారికి 'ఇన్‌స్టంట్ కాఫీ' లాగా తెలంగాణ కథలను అందించాల్సిన బాధ్యత రచయితలపై ఉంది. అభూతకల్పనలకు చోటు లేకుండా తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, సహజమైన తెలంగాణ భాషను పరిచయం చేస్తూ దృశ్యమాధ్యమానికి అవసరమైన 'ఫోటోగ్రఫిక్ శిల్పం'తో రచనలు రావాల్సిన అవసరం ఉంది.

ఈ వరుసలో ముందున్నారు శీలం భద్రయ్య. తెలంగాణతనం కలిగిన సహజమైన తెలంగాణ భాష భద్రయ్య సొంతం. ఆయన కథల్లో ఫోటోగ్రఫిక్ శిల్పం కనిపిస్తుంది. సస్పెన్స్ థ్రిల్లర్ ఉంటుంది. కథకుడు పక్కన కూర్చొని చెప్పినట్లుగా కథ ఆసక్తికరంగా సాగుతుంది. చాలా చోట్ల కమర్షియల్ కథకుడిగా కనిపిస్తాడు. ఇన్ని మంచి లక్షణాలతో కథాప్రపంచంలోకి అడుగిడుతున్న భద్రయ్య, రావడమే కొత్తబాటలో వస్తున్నాడు. ఆ బాట అందరి బాట కావాలని, ఈ కొత్తబాటలో తెలంగాణ కథ కమర్షియల్ కథగా కూడా ఆధిపత్యం ప్రదర్శించాలని అకాంక్షిస్తున్నాను.

- డాక్టర్ వి. జయప్రకాష్, రచయిత, సాహిత్య విమర్శకుడు

డయాస్పోరిక్ కథలు.... "లొట్టపీసు పూలు"

–చేకూరి శ్రీనివాస్ రావు, 9949340559

కవులు, రచయితలకు క్రాంతదర్శనం, తాత్విక స్వేచ్ఛ, ఆధునిక పోకడలు, ప్రపంచీకరణ దృష్టి, విశాలత అవసరం. బోన్సాయ్ రచనలు పాఠకునిపై పెద్దగా ప్రభావం చూపవు. రచయితలు 'ఇన్స్కేపిజం' (అంతర్ముఖీనం)తో తమ లోపలి సంఘర్షణలు మాత్రమే రాస్తున్నారు. అది సరిపోదు. సామాజిక సంఘర్షణ, బాధలను వెతికిపట్టి చూపాలి. రచయిత అనుభవం, సంఘర్శణ స్థాయిని బట్టి రచనకు ప్రదీప్తి, శాశ్వత కీర్తి కలుగుతుంది. వైయక్తిక, సామాజిక విజయం సాధించడంలో సమ్మిళితమై ఉన్న పోరాటాన్ని శీలం భద్రయ్య "లొట్టపీసు పూలు" కథల్లో ప్రతిఫలించాడు. ఈ కథల్లో రచయిత యొక్క 'డయాస్పోరిక్ దృక్పథం' ప్రధానంగా ఉంటుంది.

'మాతృభూమినుండి చెల్లాచెదురుగా దూరంగా నెట్టబడిన జీవితాలను "డయాస్పోరిక్ జీవితాలు' అంటారు. డయాస్పోర అనేది గ్రీకు పదం. అనగా"విత్తడం" అని అర్థం. 'డయాస్పోరిక్ సాహిత్యం'లో రచయితలు తమ పూర్వికుల అనూహ్య స్థానభ్రంశం, నోస్టాల్జియా జ్ఞాపకాలు, అస్తిత్వ మూలాలను వెతుక్కోవడం, వారి గుర్తింపు, అన్వేషణతో ప్రారంభమై వారి చరిత్రను రికార్డు చేయడం జరుగుతుంది. రచయిత యొక్క పూర్వికుల అనూహ్య స్థానభ్రంశం లేదా వలసలు నిర్భందమైనవి కావొచ్చు. స్వచ్ఛందమైనవి కావొచ్చు. దేశీయ, విదేశీయంగా కూడా ఈ వలసలుంటాయి. భారతీయ ప్రవాస డయస్పోరిక్ సమూహాల సాహిత్యానికి ప్రసిద్దులైన రచయితలు వి.యస్. నైపాల్, సల్మాన్ రష్దీ, కిరణ్ దేశాయి, భారతీ ముఖర్జీ, జంపాలహరి వంటివారున్నారు. దేశీయ వలసల గురించిన సాహిత్యాన్ని డయాస్పోరా సాహిత్యమని, దేశాంతర వలసల సాహిత్యంను 'ట్రాన్స్ నేషనల్ సాహిత్యం' అనొచ్చని 'రేగడి విత్తులు' నవలా రచయిత్రి చంద్రలత ఒక వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

"లొట్టపీసు పూలు" కథల్లో రచయిత శీలం భద్రయ్య తమ పూర్వికుల మూలాలను వెతుక్కునే డయాస్పోరిక్ కథకుడిగా కన్పిస్తారు. 'ఇసపురుగు, కేంపుచెర్వు, బంచెర్రాయి, కర్తవ్యం, టముకు, వెలుగుచుక్క, తోడు, అగ్గువ బతుకులు" వంటి కథలు రచయిత పూర్వికుల 'వలస జీవిత ప్రభావం' గురించి తెలియజేస్తే, 'కోదండం, మాయబారి, కొత్తదొర' వంటి కథలలో రచయిత పూర్వికుల నిజాంవ్యతిరేక సాయుధపోరాట వారసత్వం కనబడుతుంది. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమయి 75 సంవత్సరాల

సమయంలో శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసు పూలు" కథలు చర్చించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి.

ఈ కథా సంపుటిలో వలస నేపథ్యంలో అత్యంత మానవీయంగా మలిచిన ఉత్తమ కథ "అగ్గువ బతుకులు". పేదజన పక్షపాతిగా ఉన్న ప్రతీఒక్కరూ ఈ కథ చదివాక కన్నీళ్లు కార్చకుండా ఉండలేరు. ఈకథ ప్రపంచ భావి ఆర్థిక, సామాజిక పరిణామాలను హెచ్చరించే కథ. గ్రామాలకు అభివృద్ధి డీ సెంట్రలైజేషన్ జరగాలనే ఆవశ్యకతను తెలియజేస్తుంది. వేగవంత పట్టణీకరణకు ప్రపంచీకరణ, జిగేల్ మనిపించే వసతులు, ఉపాధి వంటివి కొన్ని ప్రధానకారణాలు. ఈ కథలో ఉపాధి కోసం పట్టణాలకు మారిన వలస కార్మికుల 'సారూప్య సంక్షోభం' (ఐడెంటిటీ క్రైసిస్)ను బాగా చూపించారు.

2050 నాటికి పల్లెలు డీ పాపులేట్ అవుతాయి. 70 శాతం జనాభా పట్టణాలకు చేరిపోతుంది. దాంతో పట్టణాల్లో అధిక జనసాంద్రత, ఐడెంటిటీ క్రైసిస్, పలు రకాల కాలుష్యం, భారీ ట్రాఫిక్, క్రిమినలైజేషన్, జనాభా ఒత్తిడి ఉంటుంది. పరదేశాన ఇమడలేక, స్వదేశ ఆపేక్షను విడవలేక సంఘర్షణ పడుతూ, స్వ,పర భావనల అంచున నిలబడ్డ సరిహద్దు మనుషుల గురించి "మిడ్ నైట్ చిల్డ్రన్" లో సల్మాన్ రష్దీ రాశారు. విప్లవ, దిగంబర కవిగా ప్రసిద్ధుడైన చెరబండరాజు 'మందు' కథలో చాలీచాలని జీతంతో విసిగిపోయి, పల్లెకు మారాలనుకునే పరమేశ్వరం పాత్రను పరిచయం చేశారు. శీలం భద్రయ్య "అగ్గువ బతుకులు" కథలో ఉపాధి కోసం గ్రామాన్ని వదిలిపెట్టి "పట్నం" చేరిన రాములు, రాములమ్మ కరోనా సమయంలో పట్నంలో ఉండలేక, తిరిగి గ్రామానికి పయనమవుతారు. కన్నీళ్లు పెట్టించే కథనం, ముగింపుతో కథ ముగుస్తుంది.

అన్ని డయస్పోరిక్ కమ్యూనిటీలు తమదైన సాంస్కృతిక స్పృహతో సాంఘిక వ్యక్తిత్వం కోసం తహతహలాడతాయి. భాష, మతం, సంస్కృతులతో ముడిపడ్డ తమ పూర్వికుల జీవితాలు రచయితలకు ప్రధాన ప్రేరణగా నిలుస్తుంది. శీలం భద్రయ్య అచ్చయిన మొదటి కథ "కేంపు చెర్వు" కథ చదివినపుడు పాఠకులకు అర్థమవుతుంది. ఈ కథ రచయిత మూలాలను పట్టి చూపించే కథ. ఈ కథకు దాశరథి రంగాచార్య "చిల్లర దేవుళ్ళు' నవలకు పోలిక ఉంది. దీనిని పర్యావరణ పరంగా విశ్లేషించాల్సిన కథ. జలాశయాల నిర్మాణంలో భూములు పోగొట్టుకున్న నిర్వాసితులది చాలినంత నష్టపరిహారం లభించకపోవడం, అనూహ్యంగా ఆ చోటు వదిలిపెట్టి వెళ్ళాల్సి రావడం తీరని బాధకు గురిచేస్తుంది. అయితే జలాశయాల పరీవాహక ప్రాంతంలోనున్న రైతుల

గోస 'గోరు చుట్టుపై రోకటి పోటు' లాంటిది. ఆనకట్టలకు సరైన లైనింగు నిర్మాణం చేపట్టక పోవడంతో సీపెజ్(ఊట దిగటం) సమస్య మొదలవుతుంది. దాంతో ఆ భూములు పంటలు పండక నిరుపయోగంగా మారుతాయి. ప్రభుత్వ సాయం ఉండదు. భూములకు విలువ కూడా ఉండదు. నిర్వాసితులకు ప్రభుత్వ సాయం ఎంతో కొంత అందినా, వీరికి అది కూడా దక్కదు. కొల్లాటరల్ డ్యామేజీ గురించి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉండి. నర్మదానదిపై భారీ ఆనకట్ట నిర్మాణం గురించి పునరాలోచించాలని మేథాపాట్కర్, బాబా ఆమ్టే లాంటి వాళ్ళు జాతీయస్థాయిలో పోరాడారు. ఉత్తరాఖండ్ లోని జోషిమఠ్ పట్టణంలో కాలువలు తవ్వి లైనింగ్ మరిచారు. దాంతోఅదిప్పుడు సీపెజ్ సమస్య వలన రోజు రోజుకు భూమి కుంగిపోతుంది. ఈ కథలో శివుడుపాత్ర ఆధునిక భావాలున్న పాత్ర అంటాను. అతని తిరుగుబాటు కేవలం గ్రామ ప్రజలయొక్క నష్టపరిహారాన్ని కాజేయాలనుకున్న దొరపై మాత్రమే కాదు, పర్యావరణ ప్రభావంపై కూడా అని నా అభిప్రాయం.

బతుకు తెరువుకు మస్కట్కు వలస వెళ్లి దొంగతనం నెపంపై అక్కడే చిక్కుకున్న యువకుడు సైదులు భార్య నర్సమ్మ కథ "ఇసపురుగు". వలస జీవితం ఇద్దరినీ విడదీస్తుంది. భర్త ఎన్నటికీ తిరిగిరాడనే శోకంతోనున్న నర్సమ్మ, భర్తను రప్పించడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని పటేల్ దగ్గర కోరుతుంది. అతని కోరికపై తన శీలాన్ని సైతం తాకట్టు పెట్టడానికి సిద్ధపడుతుంది. వి.ఎస్. నైపాల్ రాసిన 'ఎ హౌస్ ఫర్ మిస్టర్ బిశ్వాస్' లో 'ఎన్నటికీ తిరిగి వెళ్ళలేని స్వదేశీ భావోద్వేగం' ఉంటుంది. వీటిని చదివినపుడు ఈ పాత్రలు పడే సంఘర్షణ, భావోద్వేగం పాఠకుని గుండెలోతులకు తప్పక చేరుతుంది. ఈ కథలో రెండు విషయాలున్నాయి. ఒకటి మహిళాభ్యుదయం, రెండవది నిజాం కాలంనాటి ప్రజల దుస్థితి, పటేల్ దోపిడీని తెలియజేస్తాయి. జాగీర్దార్లు, వారి తాబేదార్లు మహిళలను బలవంతంగా చెరబట్టడం, ఉంపుడుగత్తెలుగా ఉంచుకోవడం సామాజిక హోదాగా భావించేవారు. మహిళల అవసరాలు, బలహీనతలను ఎరగా చూపి లోబరుచుకోవడం, వేధించడం జరిగేది. నేటికీ ఈ దుస్థితి వివిధ రూపాల్లో ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు, సామాజిక, రాజకీయ వ్యవస్థలు సమిష్టిగా వారికి అండగా ఉండి మహిళల రక్షణను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. నేడు ప్రచారంలో ఉన్న 'క్షీణ సంస్కృతి' స్త్రీ రక్షణకు మరో అతిపెద్ద సవాలు. దేశంలో షేర్ షా సూరి 'పట్వారీ వ్యవస్థ'ను ప్రవేశపెట్టగా అక్బర్ మరింత మెరుగుపరిచాడు. బ్రిటిష్ ప్రభుత్వం 1814

లో సవరణలు చేసినా, మౌళిక స్వరూపంలో మార్పు లేదు. యాజమాన్య రికార్డులు, పంటల ఉత్పత్తి రికార్డు, వ్యవసాయ సంబంధ పన్నులు వసూలు చేయడం వీరి ప్రధాన బాధ్యతలు. దేశమంతటా వివిధ పేర్లతో ఉన్న ఈ వ్యవస్థ రాను రాను గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య దోపిడీదారు వ్యవస్థగా మారింది. నిజాం రాజ్యంలో పటేల్, పట్వారీ వ్యవస్థ నిరంకుశ బూర్జువా వర్గంగా మారడంతో, ఈ దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1983 లో 'పటేల్, పట్వారీదారీ విధానం' రద్దు చేశారు. అయితే ఈ కథ చారిత్రక నేపథ్యంలో పరిశీలించినపుడు క్రోనాలజికల్ సింక్రనైజేషన్ (కాలమాన సమన్వయం) లోపం జరిగినట్టుగా ఉంది. ఉపాధికోసం వలసలు సమీప గ్రామాలకే ఉండేవి. మస్కట్ వంటి దూరప్రాంతాలకు తక్కువగా ఉండేవి.

వలస నేపథ్యంలో మరో కథ "తోడు". ఈ కథ కూడా ఎండిన హృదయాలను కూడా నిండుగా కన్నీళ్లను కురిపించే కథ. "బాధలు సైన్యంలా వాహినిలా వస్తాయి" (When sorrows come they come not in single spies but in battalion. Claudius world is collapsing around him)అని షేక్స్పియర్ అన్నట్టు ఈ కథలో రామలింగం పాత్ర మలచబడింది. "నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానాకు...అని ఒక సినిమాపాటలో పాడినట్టు వైద్యం పట్ల నేటికి ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని గుర్తుచేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అమానవీయతను ఈ కథలో చెప్పారు. అంతే కాకుండా కథలో ప్లాస్టిక్ రావడంతో తోలు చెప్పులు, ఆ వృత్తి మూలనపడుతుంది. మార్పు నిరంతర ప్రక్రియ. సాంకేతిక యుగంలో ఈ మార్పు ఇంకా వేగంగా ఉంది. పేదలు సాంకేతిక అనివార్యపు మార్పును గ్రహించకపోతే వారి ఉపాధిపోయి వాళ్ళు ఇంకా పేదవాళ్ళుగా మారే అవకాశం ఉంది. రచయితలు ముందుగానే గమనించి హెచ్చరిస్తే అట్టడుగువర్గాలకు లాభదాయకంగా ఉంటుంది. కథా రచయితగా శీలం భద్రయ్య ఈ కథ ద్వారా సామాజిక బాధ్యతను తీసుకోవడం ఆనందంగా ఉంది.

సమాజంలో అధిక సంఖ్యాకులు శ్రామికులు. వీరు పోరాడి విప్లవాన్ని సాధిస్తారు. ఆ విజయాన్ని బూర్జువా శక్తులు ఆక్రమించుకుంటాయి. రైతాంగ సాయుధపోరాటం, నిజాం వ్యతిరేకోద్యమ కాలం పాలనాధికారం మార్పుచెందే కాలం. ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వంతో తలపడుతున్న సమయం. సాంప్రదాయ రాచరికవ్యవస్థ అంతమై, నూతన రాజకీయవ్యవస్థ ఏర్పడినా నేటికీ అట్టడుగుప్రజలకు న్యాయం జరగలేదనే

యితోపియన్ రియాలిజం(Utopian realism) తో ఈ సంపుటిలో కథలున్నాయి. జపాన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేఖంగా, చైనా ప్రజలు నిర్వహించిన పోరాటంలో ఏ జాతి విముక్తి పోరాట లక్షణాలున్నాయో నిజాం వ్యతిరేకపోరాటానికి అవే ఉన్నాయి. నిరంకుశ వ్యవసాయ విధానాలు, భూమంతా ఒక్కరి చేతుల్లోకి వెళ్ళడం ద్వారా గ్రామీణ ఆర్థిక, సామాజికపరమైన మార్పులు తీవ్రంగా సంభవించాయి. 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' ప్రజలు నడుంబిగించారు. "దున్నేవానిదే భూమి" అనే నినాదంతో కమ్యునిస్టులు ప్రజలను ఐక్యపరిచి భూపోరాటం నడిపారు. కానీ తరువాత కాలంలో ఈ ఉద్యమాన్ని హఠాత్తుగా నిలిపేశారు. దీనిపై విమర్శను కూడా ఎదుర్కున్నారు. తరువాత ప్రభుత్వాలు జోక్యం కలుగజేసుకోవడంతో ఆ ఉద్యమాలు చల్లారాయి. దాంతో భూస్వామ్య వర్గాలు రూపం మార్చుకొని భూమిని పేదలకు దక్కకుండా చేశాయి. ప్రజల ఉద్యమ పంథా మారింది. హింసామార్గం పట్టింది. నవీన వలసవాద, ఉదారవాద విధానాలు, ప్రపంచీకరణ ఈ ఉద్యమంపై ప్రభావం చూపడంతో చైతన్యం చల్లారిపోయింది. ఉదారవాద సిద్ధాంతాలు ప్రజలకు మేలు చేసేవిగా కనిపిస్తాయి. అలాంటి లోపపూరిత విధానాలను "కొత్తదొర" కథలో రచయిత ఎండగట్టారు. ఈ కథలో పెంటయ్య పాత్ర 'లంపెన్' పాత్ర. (ఉద్యమాన్ని నీరుగార్చే పాత్ర). భూస్వామ్య దొరకు ఎదురు తిరిగిన ప్రజలకు నాయకుడు పెంటయ్య. తరువాత ఉద్యమాన్ని వ్యక్తిగత స్వార్థానికి, ఉద్యమాన్ని నీరుగార్చి నిర్వీర్యం చేస్తాడు. ఈ కథలో ప్రజలంటే శ్రామికులు. ఉద్యమ ఫలితం దక్కని మోసానికి గురైన ప్రజలకు ప్రతీకలు. నాటికాలానికి నేటికాలాన్ని ప్రతీకగా తీసుకొని చెప్పడం ఈ కథ ప్రత్యేకత.

తెలంగాణ పోరాట నేపథ్యంలో రాసిన మరో కథ "కోదండం". ఈ కథ చదివినపుడు అంజయ్య పాత్ర నా చిన్ననాటి సంగతుల(నోస్టాల్జియా)ను గుర్తుచేసింది. రచయిత ఈ కథను సోషలిస్టు రియాలిజంతో మలిచాడు. తెలంగాణలో కమ్యునిస్టులు, స్టేట్ కాంగ్రెస్ కార్యకర్తలు నిజాం వ్యతిరేకపోరాటం చేశారు. ముఖ్యంగా ప్రజాపోరాటాన్ని రికార్డు చేసిన రచయితలు తక్కువ. ఈ కథలో ప్రజాపోరాటం ఉంటుంది. పిల్లలు సైతం పిడుగుల్లా మారి రజాకార్లతో వీరోచితంగా పోరాడారని తెలియజేస్తుంది. "బంచెర్రాయి" కథ చదువుతున్నప్పుడు నా బాల్యంలో చవిచూసిన తెలంగాణ పోరాట సామాజిక చైతన్య పరిస్థితులను జ్ఞాపకం చేసింది. "టముకు" కథలో దొర వీరారెడ్డి మనస్తత్వాన్ని ప్రత్యేకంగా చర్చించాల్సిన పాత్ర అని నా అభిప్రాయం. 'మాయబారి' కథ

తెలంగాణ సాయుధపోరాట కథనే. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కథా నాయకుడు ముత్తయ్య. రజాకార్ల నేపథ్యంలో ఉన్న 'కొత్తదొర' కథను చదివాక, ఈ కథను చదవడంతో పాఠకులు 'సూపర్ ఫ్లూయస్' (Superfluous)కు గుర్రై, 'మొనాటని' కలుగుతుంది. అనగా రెండు కథల్లో ఒకే రకమైన కథా నిర్మాణం, పోరాటం, సన్నివేశాలు ఉంటాయి.

"లత్త" కథ చదివితే, ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో బాలికలపై గల వివక్షను గుర్తుచేస్తుంది. గురజాడ 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'లా బాల్యవివాహాలు ఇంకా పోలేదనే వెనుకబాటుతనాన్ని సూచిస్తుంది. వివాహ సంబంధాలకు పోయేటపుడు బేసి సంఖ్యలో పోవాలనే సాంప్రదాయాన్ని మర్చిపోకుండా చెప్పడం రచయిత సమగ్ర దృష్టికి నిదర్శనం. ఈ కథలో మహిళకు 'ఎగనాకుడు' ఉండడమనేది మహిళా చైతన్యానికి అడ్డుగోడగా నిలిచింది. అబ్బాయి పాత్రకు 'ఎగనాకుడు'ను కల్పించి, అమ్మాయితో వివాహం జరిపించి ఉంటే, కథ ఇంకా ఆధునికతను, అభ్యుదయాన్ని సంతరించుకుని ఉండేదని నా అభిప్రాయం. ఈ కథ చదివితే సమాజంలో పురుషాధిక్యానికి ఇంకా చోటుందేమోననిపిస్తుంది. ఆధునిక తల్లితండ్రులు సంప్రదాయ విధానాలను విడిచిపెట్టకపోవడం వలన పిల్లలు పడే బాధను 'శూర్పణఖ' కథలో ఉంటుంది. కథ ముగింపులో రామారావు పాత్ర శూర్పణఖను పెళ్లి చేసుకుని ఉంటే అభ్యుదయ కోణంలో ఇంకా బాగుండేది. 'ఖూనీ' కథలో నేను అనే పాత్ర పేరును రచయిత ఎక్కడా ప్రస్తావించకుండా రహస్యంగా దాచిపెట్టాడు. కథలో 'నేను' అనే పాత్ర సృష్టి విచిత్రంగా ఉంటుంది. చివరిదాకా చెప్పకుండా ఉన్నప్పటికీ తెలివైన పాఠకుడు ఊహించగలడు. ఈ కథలో 'నేను'అనే పాత్ర రచయితనే.

శీలం భద్రయ్య కథనం ప్రత్యేక నైపుణ్యంగా ఉంది. సమ్మిళిత వర్గపు (Inclusive) ప్రతినిధిగా కనబడుతాడు. కథనం ప్రత్యక్షంగా పాఠకులతో ముచ్చటించినట్టు ఉన్నాయి. భాషపరంగా విశ్లేశించినపుడు, అచ్చమైన తెలంగాణ భాష, సంస్కృతిని ఆకళింపు చేసుకొని రాసిన రచయిత అని చెప్పాల్సిందే. ఈ కథల్లో రచయిత భాష, సంస్కృతి పరంగా తెలంగాణ నేటివిటిని కాపాడారు. రచయితకు భాష సహజసిద్దంగా వచ్చినట్టు కన్పిస్తుంది. ఈ కథల్లో ఎక్కువగా నవలా శైలిని అనుసరించాడు.

ప్రజా సాహితి'- సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక, మార్చి 2023 సంచికలో అచ్చయింది

-0-

కీ॥శే॥ కొమ్మూరి వెంకట్రామిరెడ్డిగారి యాదిలో...



మీరు భౌతికంగా మా మధ్య లేకున్నా, నిత్యం సమాజ శ్రేయస్సు కాంక్షించే మీ ఆశయాలు, సిద్ధాంతాలు, స్వర్గలోకం నుండి అందించే మీ ఆశీస్సులు సదా మా వెన్నంటి ఉండి మమ్మల్ని ముందుకు నడిపిస్తాయని ఆశిస్తూ, మీ జ్ఞాపకాలను ఈ విధంగా అక్షర రూపంలో పదలిపరుచుకుంటున్నాం.

మీ కుమారులు :

శ్రీ కొమ్మూరి క్రాంతికుమార్ రెడ్డి
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆస్ట్రేలియా

శ్రీ కొమ్మూరి కిరణ్ కుమార్ రెడ్డి
లెఫ్టినెంట్ కల్నల్, ఇండియన్ ఆర్మీ

మీ కుమార్తె:

శ్రీమతి కొమ్మూరి కీర్తి ప్రియ
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆస్ట్రేలియా

రచయిత గురించి



శీలం భద్రయ్య

శీలంభద్రయ్య తెలంగాణ సాయుధ పోరాట కుటుంబంలో జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తెలంగాణ పోరాట నేపథ్యాన్ని, ఆధునిక కాలంలోని సంఘటనల్ని సహజమైన తెలంగాణ భాషలో కథలుగా మలిచాడు. ఆయన కథల్లో ఫోటోగ్రాఫిక్ శిల్పం కనిపిస్తుంది. సస్పెన్స్ థ్రిల్లర్ ఉంటుంది. చాలా చోట్ల కమర్షియల్ కథకుడిగా కనిపిస్తాడు. కథకుడు పక్కన కూర్చొని చెబుతున్నట్లుగా కథ ఆసక్తిగా సాగుతుంది.

– డాక్టర్ వి.జయప్రకాష్

ISBN 978-93-5426-350-7

శీలం ప్రచురణలు